వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 19 సంచిక : 3 హైదరాబాద్ 233 మార్చ్ 2021 పేజీలు : 68 రు. 25

- కేంద్ర బడ్జెట్ 2021పై రెండు వ్యాసాలు
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ
- రైతు ఉద్యమంపై దమనకాండ
- తెలంగాణ ఉపాధ్యాయులపై అపనిందలు
- భీమా కోరేగాం 'సాక్ష్యాల' గుట్టు రట్టు
- ఎల్గార్ పరిషత్‌లో అరుంధతీ రాయ్ ఉపన్యాసం
- మరోసారి సైన్యం చేతికి మయన్మార్

వీక్షణం ఆగిపోకుండా నిలబడడానికి మీరేం చేయవచ్చు?

ఆగిపోకుండా నడవవలసిన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా
సామాజిక కార్యకర్తలకూ, బుద్ధిజీవులకూ అత్యవసరమైన మేధో వనరుగా
తెలుగు సమాజంలో ఇవాళ వినబడుతున్న అతి తక్కువ ప్రజానుకూల గళాలలో ఒకటిగా
వీక్షణంను మీరు గుర్తిస్తే,
వీక్షణంను నిలబెట్టడానికి మీ వ్యక్తిగత బాధ్యతను మీరు అంగీకరిస్తే

మీలో ప్రతిఒక్కరూ

- తమ బాధ్యతగా చందాదారుగా చేరవచ్చు.
- కనీసం మరొక చందా చేర్పించవచ్చు.
- మీకు పరిచయం ఉన్న విద్యాసంస్థలకు, గ్రంథాలయాలకు చందాలు చేర్పించవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో పత్రికలు అమ్మే దుకాణంలో వీక్షణం కూడ అమ్మేలా చూసే, వారి నుంచి క్రమబద్ధంగా వీక్షణంకు అమ్మకాల డబ్బు అందే ఏర్పాట్లు చేయవచ్చు.
- ఒక్కొక్కరు కనీసం వెయ్యి రూపాయల విరాళం ఇవ్వడానికి, ఇప్పించడానికి ప్రయత్నించవచ్చు.
- పెద్ద స్థాయిలో విరాళాలు గాని, వ్యాపార ప్రకటనలు గాని ఇవ్వగల దాతల కోసం అన్వేషించి, వారి గురించి వీక్షణం నిర్వాహకులకు తెలపవచ్చు.
- మీ అంతట మీరే చొరవ తీసుకుని వారి దగ్గర విరాళం సంపాదించి పంపవచ్చు.

సామాజికులను ఒంటరులుగా మారుస్తున్న కొవిడ్ చీకటిలో
ఆలోచనల, ఆశయాల దృఢదీక్షకు పునరంకితం చేసే
చిరు మేధో దీపం **వీక్షణం**
రెండు చేతులూ అడ్డుపెట్టి ఈ దీపం ఆరిపోకుండా కాపాడుకుందాం.
భవిష్యత్తు కోసం ఈ చూపు వెలుగును విస్తరించుకుందాం.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ - **013911011002175**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి **UBIN0801399**

233

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మార్చ్ 2021
సంపుటి : 19
సంచిక : 03

‘వీక్షణం’ పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **‘VEEKSHANAM’** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన పి. శివరంజని, వేములవాడ - రు. 2,000; కాకి భాస్కర్, స్పర్శ హాస్పిటల్స్, ఖమ్మం - రు. 5,000 ; ఎం. విజయ, హైదరాబాద్ - రు. 5,000 మిత్రులకు కృతజ్ఞతలు - సం.

'**జ**డలు విప్పుకుంటున్న ట్రంపిజం' వ్యాసంలో వాషింగ్టన్ కాపిటల్ హిల్ పై అప్పటి అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగంతో రెచ్చిపోయిన ఆయన అనుచరులు చేసిన దాడిని, వాజపాయి ప్రధానిగా ఉన్నప్పుడు (ఎల్‌కె అద్వానీ ఉప ప్రధానిగా, హోం మంత్రిగా ఉన్నప్పుడు), భారత పార్లమెంటు భవనంపై దాడితో పోల్చడం సమంజసంగా లేదు. కాపిటల్ హిల్ పై దాడి చాల పారదర్శకంగా ఉన్నది. భారత పార్లమెంటుపై దాడిపై ఎన్నో అనుమానాలున్నాయి. రచయితగానీ, వీక్షణం సంపాదకవర్గం గానీ వివరిస్తే తప్ప ఆ దాడిని లష్కర్-ఎ-తోయిబా గానీ జైష్-ఎ-మహమ్మద్ గానీ తామే చేసినట్లు ప్రకటించారని నేను అనుకోవడం లేదు. ఈ దాడిపై చాలకాలం క్రితమే అరుంధతీ రాయ్ రాసిన పుస్తకం చదవమని రచయితకు, వీక్షణం పాఠకులకు కూడ సూచించడం కన్న ఎక్కువ చెప్పదలచుకోలేదు.

'అయితే ఈ దాడికి ప్రణాళిక రచించాడన్న నేరంపై అఫ్జల్ గురును ఉరి తీసింది భారత ప్రభుత్వం' అని ఒక వార్త వలె కాకుండా 'ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతుంటాయ'ని తన అభిప్రాయంగా (ఆమోదంగా?) కూడ రాసాడు రచయిత. ఎస్ ఆర్ గిలానీ ఫోన్ కాల్ ఆధారంగా ఆయనను కూడ ఈ దాడి కుట్రదారుడని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, నందితా హక్సర్ ఉద్యమం వల్ల, కోర్టు తీర్పు వల్ల విడుదలయ్యాడని తెలుసనుకుంటాను. గిలానీ జాకీర్ హుస్సేన్ కాలేజిలో ప్రొఫెసర్. నిర్దోషిగా సుప్రీం కోర్టు విడుదల చేసిన తర్వాత చాల కాలానికి రాజకీయ ఖైదీల విడుదల కమిటీ (సిఆర్ పిపి) అధ్యక్షుడై 2019లో మరణించాడు.

అఫ్జల్ గురుకు చేగువేరా ఆదర్శం. అందుకే మెడిసిన్ చదివి తాను కశ్మీర్ స్వయం నిర్ణయాధికారంలో విశ్వాసమున్నవాడు గనుక, అక్కడ డాక్టర్‌గా ప్రాక్టీసు చేసే పరిస్థితి లేక శ్రీనగర్ నుంచి ఢిల్లీకి మారి సర్జికల్ పరికరాలు అమ్ముకునే వృత్తి చేపట్టాడు. చేగువేరా దేశాలను, సమాజాలను అర్థం చేసుకోవడానికి మోటర్ సైకిల్ ప్రయాణాలు చేసినట్లు, శ్రీనగర్ - ఢిల్లీ సంబంధాలపై ప్రజల అభిప్రాయాలు అట్లా అధ్యయనం చేయాలనుకున్నాడు. భారత మిలిటరీ మరో విధంగా అనుకున్నది. తరచు శ్రీనగర్ ఢిల్లీలకు తిరుగుతున్న ఈ మనిషిని నిర్బంధించి, చిత్రహింసలు పెట్టి అప్రూవర్‌గా మార్చుకోవాలనుకున్నది. అది సాధ్యం కాలేదు. కనుక ఆజాద్ కశ్మీర్ భావజాలం ఉన్న అఫ్జల్ గురుకు పార్లమెంటుపై దాడి చేసిన కుట్ర పథకంలో పాత్ర ఉన్నట్లు చిత్రించి ఉరితీసింది.

తీహార్ జైల్లో ఆయనతో పాటు ఇద్దరు పూర్తి భిన్నమైన విశ్వాసాలు ఉన్న వ్యక్తులు ఉన్నారు. ఒకరు ఎల్ కె అద్వానీకి భావజాల సలహాదారు, మేధావి సుధీంద్ర కులకర్ణి. మరొకరు మావోయిస్టు పార్టీ నాయకుడు కోబడ్ గాంధీ. కాని విచిత్రంగా ఈ ముగ్గురే రెగ్యులర్ గా తీహార్ జైలు లైబ్రరీలో కలుస్తుండేవారు. సుధీంద్ర కులకర్ణి కోబడ్ పై, అఫ్జల్ గురుపై ఎంతో ప్రశంసాపూర్వకంగా రాసిన వ్యాసం ఉరిశిక్ష కన్నా ముందే ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చింది. అఫ్జల్ గురుపై కోబడ్ రాసిన జ్ఞాపకాలుకూడ ఉన్నాయి. అతడు చాల రిలిజియస్ (మతనిష్ఠ కలవాడు) అని, ఖురాన్ నిర్దేశించినట్లు నమాజు చేసేవాడని, పుస్తకాలు విరివిగా చదివేవాడని. అధ్యయనపరుడు, ఆలోచనాపరుడు అని ఇద్దరూ రాసారు. విచిత్రమేమంటే సుప్రసిద్ధ సూఫీ కవి రూమీ (జలాలుద్దీన్ రూమీ)ని, అతని సూఫీ ప్రేమ కవిత్వాన్ని, తత్వాన్ని తనకు అఫ్జల్ గురుయే పరిచయం చేసాడని కోబడ్ రాసాడు. ఆ తర్వాతనే రూమీ కవితను ఉటంకిస్తూ కోబడ్ గాంధీ సహచరి అనురాధ గాంధీపై రాసిన స్మృతి గీతం తెలుగు అనువాదం అరుణతారలో వచ్చింది.

రచయిత (లు), పాఠకులు వాస్తవాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

- షాగిర్ద్
హైదరాబాద్

***వీ**క్షణం ఫిబ్రవరి సంచికలో వచ్చిన ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాలపై దాడులు జరుగుతున్న పరిణామంలో అసలు ఆ దాడులకు గల కారణాల గురించి, ఆ దాడుల ముఖ్య ఉద్దేశాల గురించి బర్నబాస్ గారు తన వ్యాసంలో చక్కగా వివరించారు. ప్రస్తుతం ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనల గురించి, వారు చేస్తున్న న్యాయమైన పోరాటాల గురించి వీక్షణంలో ఎప్పటికప్పుడు మంచి వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు కృతజ్ఞతలు.*

- కృష్ణహరి
మహబూబ్‌నగర్

Statement about ownership and other particulars of periodical **Veekshanam** as required to be published in the first issue of every year after the last day of February

Form IV (See Rule 8)

1. Place of publication	:	Hyderabad
2. Periodicity of its publication	:	Monthly
3. Printer's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
4. Publisher's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
5. Editor's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
6. Name and addresses of individuals who own the newspaper	:	N. Venugopal Rao

I, N. Venugopal Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

(N. Venugopal Rao)

Date : 1st March, 2021 Signature of the Publisher

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ - సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం - సి.ఎచ్. గిరిజ; మెదక్ - ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ - మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ - ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ - కె. నాగేశ్వరాచారి; చిత్తూరు - పలమనేరు బాలాజి; కడప - కొండ్రాయుడు; కర్నూలు - జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి - కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం - ఆర్. శ్రీలత; విశాఖపట్నం - పి.వి. రమణ

ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న సంఘ్ పాలన

వీక్షణం

భారత రాజ్యాంగం ఆమోదం పొందినప్పటి నుంచీ దాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్న సంఘ్ పరివార్ శక్తులకు నరేంద్ర మోడీ పాలనలో తమ ఎజెండాను పట్టపగ్గాలు లేకుండా అమలు చేసే అవకాశం వచ్చింది. ప్రజలవైపు నుంచి చూసినప్పుడు ఈ రాజ్యాంగం బేషరతుగా అంగీకరించదగ్గదేమీ కాదు. రాజ్యాంగ నిర్ణయసభలో భూస్వామ్య పాలకవర్గాల ప్రతినిధులు, వలసవాదానికి దళారీలు, సంస్థానాధీశులు నిండి ఉండడం వల్ల చివరికి తయారైన రాజ్యాంగంలో వర్గ సమాజ నిర్వహణ, రాష్ట్రాల అధికారాల కుదింపు, కేంద్ర ప్రభుత్వానికి మితిమీరిన అధికారాలు, రాష్ట్రపతి పాలన, ఎమర్జెన్సీ విధింపు వంటి అప్రజాస్వామిక, గుత్తాధిపత్య అంశాలు ఎన్నో చేరాయి. కాని భారత ప్రజానీకం దశాబ్దాలుగా సాగించిన వలస వ్యతిరేక ఉద్యమ స్ఫూర్తిని అంగీకరించక తప్పనందువల్ల, రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడిగా డా. బి ఆర్ అంబేద్కర్ ప్రయత్నాల వల్ల ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు అనే మూడు మౌలికంగా ప్రజానుకూలమైన, ఆమోద యోగ్యమైన ప్రజాస్వామిక, సమానత్వ సంప్రదాయాలు కూడ రాజ్యాంగంలో చేరాయి. రాజ్యాంగం పట్ల సంఘ్ పరివార్ వ్యతిరేకతకు కారణం ఈ ప్రగతిశీల అంశాలే. ఆదేశిక సూత్రాలలో సమసమాజ ఆదర్శాల వంటి ఉదాత్త అంశాలు రాసినప్పటికీ, అవి అమలు చేయవలసిన అవసరం లేకుండా, అమలు చేయాలని న్యాయస్థానాలను ఆశ్రయించకుండా మెలిక వేసి, ఆదేశిక సూత్రాల ప్రయోజనాన్ని మొగ్గలోనే తుంచేశారు. ఇక పాలకవర్గాల దాడికి మిగిలినవి ప్రవేశిక, ప్రాథమిక హక్కులు. పాలకవర్గ ముఠాలన్నిటిలోకీ దుర్మార్గమైన సంఘ్ పరివార్ నమ్మే హిందుత్వ బ్రాహ్మణీయ భావజాలం ప్రజాస్వామ్యానికీ సమానత్వానికీ వ్యతిరేకం. అంటే ప్రవేశికకూ, ప్రాథమిక హక్కులకూ వ్యతిరేకం. అసలు మనుస్మృతి వంటి ధర్మశాస్త్రాలు తప్ప రాజ్యాంగం వంటి ఆధునిక పాలనా నియమావళి ఉండగూడదని సంఘ్ పరివార్ కోరిక.

నరేంద్ర మోడీ మొదటి పాలనా కాలం నుంచీ కూడ ప్రాథమిక హక్కుల అధ్యాయానికి తూట్లు పొడిచే పని విస్తృతంగా సాగుతున్నది. నిజానికి రాజ్యాంగం ఆమోదం పొందిన మూడు నెలలకే భావ ప్రకటనా స్వేచ్ఛ మీద ఆంక్షలు మొదలయ్యాయి. రాజ్యాంగానికి మొదటి సవరణ భావప్రకటనా స్వేచ్ఛ మీద ఆంక్షలు విధించడానికి ఉద్దేశించినదే. ఈ ఏడు దశాబ్దాలలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలించిన అన్ని పార్లమెంటరీ పార్టీలూ ప్రజల ప్రాథమిక హక్కులకు భంగకరంగా ప్రవర్తించినవే. ఆ పార్లమెంటరీ పార్టీలన్నిటి చరిత్రను మించినది ప్రస్తుతం సంఘ్ పరివార్ మార్గదర్శకత్వంలో సాగు తున్న భాజపా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాథమిక హక్కుల హననం. ఈ తాజా ఉక్కుపాదానికి రాజ్యాంగం ఆమోదించిన పరిమితులు, గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన దుర్మార్గ చట్టాలు మాత్రమే కాక, సంఘ్ పరివార్ భావజాలం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనే రెండు కొత్త కోరలు కూడ ఉన్నాయి.

వలసవాద ప్రభుత్వం రూపొందించిన భారత శిక్షా స్మృతి, ప్రత్యేకించి రాజద్రోహ నేరం, తన కంటె ముందరి యుపిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుఎపిఎ వంటి దుర్మార్గ చట్టాలు, ఎన్ఐఎ వంటి హంతక సంస్థలు సంఘ్ పరివార్ పాలకుల చేతికి అందివచ్చాయి. ఆ చట్టాలనూ హిందుత్వ విషవిద్వేష భావజాలాన్నీ కలిపితే అత్యంత దుర్మార్గమైన దమననీతికి అవకాశం దొరికింది. ఎవరి ప్రాథమిక హక్కులైనా ధ్వంసం చేసే అధికారం వచ్చింది. అంతతో అయిపోలేదు. సంఘ్ పరివార్ పాలకులకు మరొక కొత్త ఆయుధం అందుబాటులోకి వచ్చింది. దాని పేరు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. ప్రజా జీవితాన్ని ప్రజలకు తెలియని సంస్కృత భాషలో శాసించే అలవాటు ఉన్న హిందుత్వకు, ఇప్పుడు దానితో సమానమైన నిగూఢమైన సాంకేతిక పరిజ్ఞానం దక్కింది. ఎవరి వ్యక్తిగత జీవితంలోకైనా, ఎవరి సొంత పరికరాల్లోకైనా చొరబడి నేరారోపణకు అనువైన "సాక్ష్యాధారాలను" జొప్పించగల అవకాశం దొరికింది. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్నే తమ భావప్రకటనా స్వేచ్ఛ కోసం, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించేవారిని వేధించడానికి కూడ అవకాశం దొరికింది.

భీమా కోరేగాం కేసులో నిందితుల కంప్యూటర్లలోకి జొరబడి తప్పుడు సాక్ష్యాధారాలు ఎలా కల్పించారో నిస్సందేహంగా బైటపడింది. గత నాలుగైదు సంవత్సరాలలో ఎన్ఐఎ నేతృత్వంలో, యుఎపిఎ కింద పెట్టిన అన్ని కేసులలోనూ ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలనే వాడుతున్నారు. గత సంవత్సరం ఈశాన్య ఢిల్లీలో జరిగిన హింసాకాండ కేసులో సంబంధంలేని వ్యక్తులను కేసులలో ఇరికించడానికి, తీవ్రమైన నేరారోపణలు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్నే ఉపయోగించారు. ప్రస్తుతం రైతు ఉద్యమం మీద సాగుతున్న దమనకాండలో సాంకేతిక పరిజ్ఞానాన్నే ఉపయోగిస్తున్నారు. రైతు ఉద్యమానికి అంతర్జాతీయ సంఘీభావం సాధించే సహజమైన, అవసరమైన పని చేసినందుకు "టూల్ కిట్" బూచి తయారు చేసి, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించారని యువకుల మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారు. జైలు నిర్బంధంతో సహా అనేక వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ అణచివేత చర్యలన్నిటికీ మించి గురువారం నాడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (గైడ్‌లైన్స్ ఫర్ ఇంటర్మీడియరీస్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ 2012 ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛ మీద అత్యంత దుర్మార్గమైన ఆంక్షలు విధించబోతున్నది. ఇప్పటికే ప్రధానస్రవంతి ప్రచార సాధనాలన్నిటినీ నయానో భయానో లొంగదీసుకున్న పాలకులు, ఇప్పటిదాకా కొంతైనా స్వతంత్రంగా నడుస్తున్న సోషల్ మీడియా, డిజిటల్ వేదికల మీద కూడ భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడానికి ఈ కొత్త నిబంధనలను వాడుకోదలచారు. ప్రజలకు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడానికీ, మాట్లాడడానికీ, రాయడానికీ వేదికలు లేవు, ఉన్న వేదికలను లొంగదీసుకున్నారు, కొత్త వేదికల మీద ముళ్ల కంచెలు నిర్మిస్తున్నారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన మాత్రమే కాదు, మానవత్వ ఉల్లంఘన. "రాజ్యాంగం ఇచ్చినందువల్ల నాకు హక్కులు రాలేదు. మనిషిని గనుక నాకు మాట్లాడే, ఆలోచించే, రాసే, ఇతరులతో భావాలు పంచుకునే మానవ లక్షణాలు వచ్చాయి. వాటిని ప్రభుత్వం గౌరవిస్తుంది, కొల్లగొట్టదు అని హామీ ఇవ్వడం మాత్రమే రాజ్యాంగం చేసింది' అని కాళోజీ పదేపదే చెప్పిన మాటను బుద్ధిజీవులందరూ ప్రతిక్షణం గుర్తు పెట్టుకోవలసిన అవసరం మరింత పెరుగుతున్నది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

గన్ని కొలువులొస్తె గింత పర్షానెందుకు?

చిన్న దొరను జూస్తాంటె మస్తు సంబురమైతది. అవ్వల్దర్జ సీన్మ వీరో పేరు తోని ఉన్నడాయె. ఆంధ్రోల్ల బళ్లల్లనె సదువుకునె. అమెరికాల కొలువు జేసె. నా అసొంటి తెలంగాణ అంబాదలకు సమజ్ గాని బాసల్ల మాట్లాడ్తడాయె. ఇయాల గాకపోతె రేపు పగ్గాలు గాయినె చేతికే అందుతయని అందరు అనుకోనెవట్టిరి. అయినా అసలు పగ్గాలు గిప్పుడు గుడ గాయినె చేతుల్నె ఉన్నయని కొందరు చెవులు కొరుక్కోనేవట్టిరి. అయ్యను మించిన కొడుకన్నట్టు తండ్రి కన్న పెద్ద అబద్దాలు రెప్పవాల్చకుండ అవలీలగ జెప్తడాయె. గందుకే చిన్నదొరను మస్తు తారీఫ్ జెయ్యబుద్ధయితాంది. నివద్దె. తెలంగాణ వచ్చినంక ఎన్ని వేల కొలువులు ఇచ్చిండ్రో చిన్నదొర నిన్న జెప్తాంటె అబ్బ పచ్చి అబద్ధమైన గిట్ల దటాయించి, ఎదుటోడు నోరెత్తకుండ జెప్పాలె గద అనిపిచ్చింది. అసలు తెలంగాణల కొలువుల కత జయశంకర్ సారన్నట్టు ఒడ్వని ముచ్చట గద. మేం ఒడగొట్టినం, వేల కొలువులు, లచ్చల కొలువులు ఇచ్చినం అని దొరవారే అంటె బాగుంటదా అని ఒగ సవాలు ఉండనే ఉండె. అసలు ఒడగొట్టిన మాట నిజమేనా అని ఇంకో రంది. తెలంగాణ వచ్చినాంక ఏడేండ్లల్ల ఒక లచ్చా ముప్పై వేల కొలువులు భర్తీ జేశినం, బాజాప్తా జెప్తాన, బస్తీమే సవాల్ అని చిన్నదొర తొడగొట్టిండు. బాగున్నది. చిన్నదొర జెప్పింది అచ్చురాల నిజమే అనుకుందం. గని రెండు మూడు ముచ్చట్లు అడిగెడిదున్నది. తెలంగాణ రాంగనె అసెంబ్లిల నిలబడి పెద్ద దొర రెండేండ్లల్ల ఒగ లచ్చా పదివేల కొలువులు భర్తీ జేత్తం అన్నడు. ఆ రెండేండ్లు బొయ్యి ఆపైన ఇంకో ఐదేండ్లాయె. మరి పెద్ద దొర మాటకు ఇంకో ఇరువై వేలే కల్పితివి. పెద్ద దొర మాట నిలబెట్టుకోలేదా, తర్వాత ఐదేండ్లల్ల ఎక్కువ కొలువులు భర్తీ గాలేదా, అసలు ఈ లెక్క అబద్ధమా, ఆ లెక్క అబద్ధమా, సమజైత లేదు. ఏడేడ ఎన్ని కొలువులు భర్తీ జేసిండ్రో లెక్క గుడ మస్తుగున్నది, అదే నివద్దె అనుకుందం గని తెలంగాణ ఒచ్చినాక పోలీసు కొలువులే బగ్గ నిండినట్టున్నయి. పొల్లగాండ్లకు సదువులు జెప్పె పంతుల్ల కొలువులు లేవు, పానం బాగుండెటట్టు జూసె దవాఖాన్లల్ల కొలువులు లేవు, రాజ్జెం మంది బాగు కోసం నడుత్తాందా, దొరలను అర్సుకునె పోలీసుల కోసం నడుత్తాందా సమజైత లేదు. మరి గదేదో కొలువులు ఇచ్చే ఆపీసుల ముప్పై లచ్చల మంది తెలంగాణ పడుసు పోరలు కొలువు గావాలె నాయినా అని దరఖాస్తులు పెట్టుకున్నరట గద, గంతమంది కొలువు గావల్సినోల్లుంటె, భర్తీ అయిన కొలువులెన్ని? ముప్పై మందిల ఒక్కనికిస్తివా, అబ్బ ఎంత అవ్వల్ దర్జ సాదనాసూరునివి తండ్రీ. గా మొన్న ఏదో సర్కారు కొలువుల్ల ఉన్నోల్లకు జీతాలు ఎట్ల బెంచాలె అని ఒగ సారు ఏదో పెద్ద ఏలాన్ జేసిండట గద. దాంట్ల ఇంక రెండు లచ్చల కొలువులు భర్తీ గాకుండ ఖాళీగ ఉన్నయని గుడ రాసిండట గద. గిన్ని ముచ్చెట్లు జెప్తివి గని, గా ఖాళీలు ఎప్పుడు భర్తీ జేస్తివో జెప్పకపోతివి. అచ్చా ఇంతకు ఇది ఎమ్మెల్సి వోట్ల కోసం ఇడిశిన బాణమా, నేనేదో సత్య అరిచ్చంద్రుని పజ్జెం అనుకుంటి. పొరపాటు. సరె తియి, దేంట్ల దేంట్లనో బొంకితే తప్పులేదని గదేదో శాత్రం జెప్పినట్టు వోట్ల కోసమైతె ఎన్ని అబద్దాలైన ఆడొచ్చు. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

పంచాయత్ ఎన్నికల్లో విజయం ఎవరిది?


ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ స్థానిక స్వపరిపాలనా సంస్థలకు ఏడాది కింద జరగవలసిన ఎన్నికలు అనేక వివాదాలకు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూ ప్రభుత్వానికీ మధ్య ఘర్షణకు గురై, చివరికి హైకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 9, 13, 17, 21తేదీల్లో జరిగాయి. గత ఏడాదిగా ఏర్పడిన ఘర్షణా వాతావరణం వల్ల ఈ ఎన్నికల్లో అధికార వైఎస్ఆర్‌సిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పోటాపోటీ సాగుతుందని, భారతీయ జనతా పార్టీ – జనసేన పార్టీల కలయిక పెద్ద ప్రభావం చూపలేకపోవచ్చునని ఊహాగానాలు సాగాయి. నాలుగు విడతల్లోనూ కలిసి 81 శాతం పోలింగ్ జరిగి, గ్రామీణ స్వపరిపాలనా సంస్థల ఎన్నికల పట్ల ప్రజలలో ఆసక్తి ఉన్నదని చూపాయి. మొత్తం మీద అన్ని విడతల ఎన్నికలూ అయిపోయాక, రాష్ట్రంలోని 13,097 గ్రామ పంచాయతీల్లో, 10,382 గ్రామపంచాయతీలు వైఎస్ ఆర్‌సిపికి దక్కాయని, తెలుగు దేశం పార్టీ 2,062 గ్రామ పంచాయతీలు దక్కించుకుందని, భాజపా–జనసేన కూటమి, ఇతరులు 475 గ్రామ పంచాయతీలు గెలుచుకున్నారని వార్తలు చెపుతున్నాయి. ఈ ఫలితాలు వైఎస్ఆర్‌సిపి అఖండ విజయాన్ని, ప్రజల్లో ఆదరణను చూపుతున్నాయని కొందరు పరిశీలకులు అంటున్నారు. అయితే చట్టబద్ధంగానే ఈ గ్రామ పంచాయతీల ఎన్నికలు రాజకీయ పార్టీల ప్రాతిపదిక మీద జరగడానికి వీలు లేదు గనుక విజయం సాధించామని ఏ పార్టీ చెప్పుకున్నా అది పాక్షికమే అవుతుంది. విజయం సాధించినవారు ప్రతిపక్ష పార్టీ అభిమానులు ఐనప్పటికీ, అధికారపక్షంతో పనులుంటాయి గనుక తాము అధికార పక్ష అభిమానులమే అని చెప్పుకోవచ్చు. అలాగే ఏకగ్రీవ విజయం గురించి ఎన్నికల కమిషన్ ఎన్ని అభ్యంతరాలు చెప్పినప్పటికీ గణనీయమైన గ్రామాల్లో ఏకగ్రీవ విజయాలే జరిగాయి. మొత్తం మీద ఎన్నికల ఫలితాన్ని విశ్లేషించినప్పుడు గుర్తించవలసిన అంశాలు మూడున్నాయి: ఒకటి, గ్రామ స్థాయి ఎన్నికలలో రాజకీయ పార్టీ విధేయతల కన్న ఎక్కువగా గ్రామీణ సమస్యలు, కుల విధేయతలు పాత్ర వహిస్తాయి. ఆయా గ్రామ పంచాయతీలలో ఎన్నికలు ఏ స్థానిక సమస్యల మీద జరిగాయో, ఎన్నికైన అభ్యర్థుల కులాలు ఏమిటో పూర్తి వివరాలు తెలియకుండా పార్టీల గెలుపు ఓటముల గురించి మాట్లాడడానికి వీలు లేదు. రెండు, ఎన్నికల సమయంలోనే డబ్బు ఎర చూపి వోట్లు దండుకునే గత ఎన్నికల సరళిలో కాకుండా ఇటీవలి కాలంలో అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల పేరు మీద ప్రజాధనంతో నిరంతరంగా తమ పట్ల విధేయంగా ఉండే వోట్ బ్యాంక్ ను తయారు చేసుకునే కొత్త పద్ధతి ఉనికిలోకి వచ్చింది. అందువల్ల అధికారంలో ఉండే పార్టీకి విజయావకాశాలు పెరుగుతున్నాయి. మూడు, అధికార పార్టీ పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ, ప్రతిపక్షాలు కూడ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పరిస్థితి ఏమీ ఉండడం లేదు. తమ ఇష్టపూర్వకంగా సమ్మతిని గాని, అసమ్మతిని గాని తెలియజేయడానికి ప్రజలకు అవకాశమే లేని స్థితి, ఒకరిని కాదంటే మరొక ప్రత్యామ్నాయం లేని స్థితి పార్లమెంటరీ రాజకీయాల్లో నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో జరిగే ఏ ఎన్నికలైనా నిజమైన ప్రజాభిప్రాయాన్ని కనిపెట్టజాలవు. ఏ ఎన్నికల ఫలితాలైనా నిజమైన ప్రజాభిమతాన్ని సూచిస్తున్నాయని విశ్లేషించడం వృథా ప్రయాసే అవుతుంది. ఎవరు గెలిచి, ఎవరు ఓడినా ప్రజస్వామ్యానికి మూల్యమైన నిరంతర జాగరూకత వహించి ఉండడం, ప్రతి రాజకీయ పక్షాన్నీ పరీక్షకు గురి చేయడం, నిత్యమూ తమ హక్కుల కోసం పోరాడుతూ ఉండడం తప్ప ప్రజలకు గత్యంతరం లేని స్థితి రాజ్యం చేస్తున్నది. వీ

రష్యాలో ఆందోళనలు

- వంగాల సంపత్ రెడ్డి

చరిత్రలో పాలకవర్గాలు ప్రజాస్వామికంగా ప్రవర్తించిన సందర్భాలు చాలా తక్కువ. అంతేకాదు అసమ్మతిని ఏ పాలకవర్గం అంగీకరిచదు. ఇవాళ రష్యాలో జరుగుతున్నది కూడా ఇదే. ఫ్రెంచి విప్లవ తదనంతర పరిణామాలు నెపోలియన్‌ను సృష్టించినట్లు రష్యాలో కుప్పకూలిన సోషల్ సామ్రాజ్యవాదం పుతిన్ అనే నియంతను సృష్టించింది. ఆ నియంత తాను బతికి ఉన్నంత వరకు అధికారంలో ఉండాలనుకుంటున్నాడు. ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టాడు. ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా అలెక్సీ నవాల్నీ మాట్లాడాడు. నిజానికి రష్యా విపక్ష నేత అలెక్సీ నవాల్నీ ప్రశ్నిస్తున్నది పుతిన్‌ని, పుతిన్ అధికారాన్ని, పుతిన్ అవినీతిని. నవాల్నీ అడుగుతున్నది కేవలం సంస్కరణలు మాత్రమే. అతను మాట్లాడుతున్నది కేవలం అధికార మార్పిడి కోసమే తప్ప మరొకటి కాదు. తనను, తన అధికారాన్ని ప్రశ్నిస్తున్న నవాల్నీని పుతిన్ సహించలేదు. తనకు కొరకరాని కొయ్యగా మారిన నవాల్నీని వీలైతే విష ప్రయోగం ద్వారా తొలగించుకోవాలి అనుకున్నాడు. విషప్రయోగం విఫలం అయింది. విష ప్రయోగం తరువాత కోలుకున్న నవాల్నీ జర్మనీ నుండి రష్యాలోకి అడుగుపెట్టిన క్షణం రష్యా ప్రభుత్వం అరెస్టు చేసి, పాత కేసులు తిరుగదోడి రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. నవాల్నీకి అనుకూలంగా దేశవ్యాప్తంగా మధ్యతరగతి యువకులు ఆందోళన చేపడితే నిర్దాక్షిణ్యంగా అణిచి వేసింది. చాలా మందిని అరెస్ట్ చేసింది. గుర్తు తెలియని ప్రాంతానికి వాళ్లని తరలించింది. సోషల్ మీడియా మీద ఆంక్షలు విధించింది. నవాల్నీకి మద్దతుగా ఉన్న వారిపై ప్రభుత్వం దాడులు చేసింది. తద్వారా పుతిన్ ప్రపంచ ప్రజల ముందు దోషిగా నిలబడవలసి వచ్చింది. మరొక పక్క ఈ విష ప్రయోగం వల్ల నవాల్నీకి పుతిన్‌ను ఎదుర్కొనే హీరోగా విస్తృత ప్రచారం వచ్చింది. ఆ ప్రచారం వల్లనే ప్రపంచవ్యాప్తంగా నవాల్నీకి మద్దతు, సానుభూతి దొరికింది. ఈ మద్దతు ద్వారా పుతిన్ అధికారం పోవడమో, నవాల్నీ అధికారంలోకి రావడమో జరుగదు కాని, రష్యాలో జరుగుతున్న పరిణామాలను ప్రపంచం ఆసక్తిగా చూడడాన్ని గమనించవచ్చు. రష్యా గత చరిత్ర ఆ ఆసక్తిని పెంచిందేమో! ప్రజాస్వామ్యం అంటే లెక్కలేని అమెరికా, యూరప్ దేశాలు సహజంగానే రష్యా మీద ఉన్న కోపాన్ని, పుతిన్ మీద ఉన్న ఆగ్రహాన్ని వెళ్లగక్కాయి తప్ప రష్యా ప్రజానీకం మీద వాటికి ఎలాంటి ప్రేమ లేదు. నిజానికి ఇవ్వాళ రష్యాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఆందోళనలను అక్కడి కార్మికవర్గం, రైతాంగం ఏకమై నాయకత్వం వహించి ఉధృతం చేయగలిగితే రష్యన్ ప్రజానీకానికి కొంత మేలు కలుగుతుంది. సోషల్ సామ్రాజ్యవాదం కుప్పకూలి పూర్తిస్థాయి పెట్టుబడిదారీ దేశంగా, సామ్రాజ్యవాద దేశంగా ఎదిగిన రష్యాలో మార్కెట్ కోసం అమెరికా, యూరప్ లాంటి దేశాలు కాచుకొని కూర్చున్నాయి. అయితే తన మార్కెట్‌ను విస్తరించుకునే క్రమంలో రష్యా అంతర్జాతీయంగా ఇటీవలి కాలంలో విరివిగా జోక్యం చేసుకోవడం మొదలు పెట్టింది. అది సిరియాలో కావచ్చు, ఇరాన్‌లో కావచ్చు. ఇలా రష్యా తన మార్కెట్‌ను పెంచుకునే కార్యక్రమాలు అమెరికా, యూరప్ దేశాలకు చికాకును కలిగిస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే అమెరికా, యూరప్‌ల మార్కెట్ ప్రయోజనాలకు పుతిన్ ఏమైనా అడ్డుగా నిలిచినాడేమోనని భావించినాయేమో! నవాల్నీ వాళ్ల ఆశలకు ఊత కర్రగా దొరికినాడేమో! అందుకే పుతిన్‌కి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు అమెరికా, యూరప్ సమాజం మద్దతు ఇస్తున్నదేమో! – గమనించాల్సి ఉంది.

వీ



సత్యనారాయణ మూర్తి మృతి


ప్రముఖ చరిత్ర అధ్యయనకారుడు, విశ్రాంత అధ్యాపకుడు, రచయిత తల్లాప్రగడ సత్యనారాయణ మూర్తి (91) ఇకలేరు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మూర్తి జనవరి 28న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో మరణించారు. మూర్తి పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరులో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల చరిత్ర అధ్యాపకుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, 1989లో పదవీ విరమణ పొందారు. అనంతరం జర్నలిస్టులకు చరిత్ర, రాజనీతిశాస్త్రంలో పాఠాలు బోధించారు. తెలుగు చరిత్రపై అనేక పుస్తకాలు రాశారు. జిల్లాల వారీగా స్థానిక చరిత్రపై సాధికారత కలిగిన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ నేతల్లో ఒకరు. విద్యార్థి దశలోనే వామపక్ష రాజకీయాల పట్ల ఆకర్షితుడై 1947లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగానూ పని చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధాలు కొనసాగిన కాలంలో ఆర్డినెన్స్ కింద అరెస్టు అయ్యారు. సుమారు నాలుగేళ్ల జైలుశిక్ష అనుభవించారు. తర్వాత విశాలాంధ్ర ఉద్యమం లోనూ క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించారు.

అన్నపూర్ణ మృతి


విశ్రాంత ఉపాధ్యాయురాలు, పౌరహక్కుల సంఘం కార్యకర్త అన్నపూర్ణ ప్రకాశం జిల్లాలోని పరుచూరు గ్రామంలో ఫిబ్రవరి 4న మరణించారు. విప్లవ రచయితల సంఘం, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వంటి అనేక సంస్థలలో పనిచేసిన ఆమె అన్ని ప్రజా సంఘాల సభలకు వెళుతుండేవారు. అన్నపూర్ణ పౌరహక్కుల సంఘం సభ్యుడు కనకయ్య గారి సహచరి. ఆయన న్యాయవాద వృత్తి కొనసాగిస్తూ పౌరహక్కుల సంఘంలో పనిచేశారు.

జాకబ్ మృతి


ప్రజానాట్యమండలి జాతీయ నాయకుడు, ప్రముఖ కళాకారుడు సాహెబ్ జాకబ్(62) మృతిచెందారు. హైదరాబాద్‌లోని బాలనగర్‌లోని ఆయన ఇంట్లోనే ఫిబ్రవరి 6న గుండెపోటుతో మృతిచెందారు. 1959లో గోదావరిఖనిలో జన్మించారు. 1977లో సింగరేణి బొగ్గు గని కార్మికుడిగా పనిచేశారు. విద్యార్థిగా ఉన్నప్పుడు అఖిల భారత విద్యార్థి సమాఖ్యలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ తరువాత యువజన సమాఖ్యలో పనిచేశారు. అనంతరం ప్రజానాట్య మండలిలో నిర్మాణ బాధ్యతలు చేపట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్యదర్శిగా వ్యవహరించారు. ఆయన గజల్స్ రాయడమే కాకుండా, వాటిని జనంలోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన రాసిన 'కాలేరోళ్లు' నాటకం బొగ్గు గని కార్మికుల్లో చైతన్యానికి ఎంతో దోహదపడింది.




❖ **టూకీగా ప్రపంచ చరిత్ర –** నాల్గవ భాగం – ఎం.వి. రమణారెడ్డి – కవిత పబ్లికేషన్స్ ప్రచురణ – 368 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: కవిత పబ్లికేషన్స్, ఇ.నెం. 3/75, ఖాదరాబాద్ (పి.ఒ), ప్రొద్దుటూరు – 516362, కడప జిల్లా, ఫోన్ : 9063077367




❖ **రాష్ట్రంలో నదీ జలాల లభ్యత – పంపిణీలో తెలంగాణ పట్ల వివక్ష –** ఇ.ఆర్. దొంతుల లక్ష్మీనారాయణ – తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం ప్రచురణ – 160 పేజీలు, 1/4 క్రౌన్, రు. 250, ప్రతులకు: ఇ.ఆర్. దొంతుల లక్ష్మీనారాయణ, ఇ.నెం. 2-1-292/102, నల్లకుంట, కూరగాయల మార్కెట్, హైదరాబాద్ – 500 044, ఫోన్ : 9912219193




❖ **హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం –** అనుభవాలు – జ్ఞాపకాలు – ఆంగ్లం స్వామి రామానందతీర్థ – తెలుగు హరి ఆదిశేషువు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 347 పేజీలు, 1/8 డెమీ, రు. 130, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040–29703142



❖ **నేమిషిస్ –** కవిత్వం – సర్వమంగళ – మధు మాస్ మీడియా ప్రచురణలు – 98 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : సర్వమంగళ, ఫ్లాట్ నెం. 3/బి, రచన అపార్ట్‌మెంట్, 7/1, కె.ఎన్. ముఖర్జీ రోడ్, తల్పుకూర్ పోస్ట్, కలకత్తా – 700123, ఫోన్ : 8961626848




❖ **ఎత్తు పెరిగిన తాత –** (బాలల కథా సంపుటి – బొమ్మలతో) – విద్వాన్ చొప్ప వీరభద్రప్ప – పాలపిట్ట బుక్స్ ప్రచురణలు – 80 పేజీలు, 1/4 క్రౌన్, రు. 100,



❖ **అసఫ్‌జాహీ సంస్థానం విలీనగాథ –** వి.పి. మీనన్ – అనువాదం డా. ఏనుగు నరసింహారెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణలు – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 100,



❖ **మనిషి అలికిడిలేక... –** కవిత – చిత్తలూరి సత్యనారాయణ – పాలపిట్ట బుక్స్ ప్రచురణలు – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16-11-20/6/6/1/1, 403, విజయ సాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036, ఫోన్ : 040-27678430



❖ **దృశ్యం నుండి దృశ్యానికి –** కవిత్వం – వి.ఆర్. విద్యార్థి – ప్రత్యూష ప్రచురణలు – 84 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: శ్రీమతి వేలూరి రత్నమాల, ఇ.నెం. 2-7-1083, కనకదుర్గ కాలనీ, వడ్డేపల్లి, వరంగల్ – 506370, ఫోన్ : 90002 83672

కార్పొరేట్ అనుకూల.. ప్రజావ్యతిరేక బడ్జెట్

దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ గుత్తపెట్టుబడిదారులకు కట్టబెట్టాలనే ప్రభుత్వ పట్టుదల ఈ బడ్జెట్‌లో బాహాటంగానే తెలిసిందని అంటున్నారు **సంతోష్**

తీవ్ర ఆర్థిక సంక్షోభం, ఆపై కొవిడ్-19 స్వైర విహారం, లాక్‌డౌన్ నేపథ్యంలో పెరిగిన నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న సందర్భంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2021-22 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టబోయే బడ్జెట్ కని విని ఎరుగని రీతిలో మహత్తరంగా ఉంటుందని బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రకటించారు. దీంతో ఉపాధి కల్పన, సామాజిక, సంక్షేమ రంగాలకు కేటాయింపులు పెరుగుతాయని వివిధ తరగతుల ప్రజలు ఎదురు చూశారు. అయితే ఫిబ్రవరి ఒకటిన ఆర్థికమంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు నిరాశ కలిగించింది. కుబేరులను సంతోష పరిచింది. పారిశ్రామిక, వాణిజ్య వేత్తలను సంతృప్తి చేసింది. అందుకు బడ్జెట్‌పై వారు చేసిన వ్యాఖ్యలు, నింగికెగిసిన సెన్సెక్స్ మెరుపులే నిదర్శనం. ఈసారి బడ్జెట్ అసత్యాలతో, అంకెల గారడీతో నిండి ఉంది. ఈ బడ్జెట్లో సామాజిక, సంక్షేమ రంగాలకు నిధులు తగ్గాయి.

మోడీ ప్రభుత్వం గత ఆరేళ్లుగా ప్రవేశపెడుతున్న ప్రతి బడ్జెట్ పేదలను బాదటమే పనిగా పెట్టుకుంది. అదే రీతిలో ఈ సారి బడ్జెట్ కూడ సామాన్య, మధ్యతరగతికి షరా మామూలుగానే భారాలు మోపింది. బడ్జెట్‌ను గమనిస్తే కార్పొరేట్లకు ఏవిధంగా ప్రయోజనం కలిగించగలమన్న తీరులో కేంద్ర బడ్జెట్ పద్దులు ఉన్నాయని అర్థమవుతుంది. ప్రజల స్వేదంతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థల్ని ఎంత తొందరగా అమ్మేద్దామా..! ఈ రంగాన్ని ఎంతగా నష్టపరిచి, ప్రైవేట్ కు సమర్పిద్దామన్న తీరులో ఈ బడ్జెట్ ఉంది. ఈ బడ్జెట్‌తో 'స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ' (ఆత్మనిర్భర్ భారత్), 'అందరికోసం అందరి వికాసం' (సబ్ కీ సాత్, సబ్ కీ వికాస్) అన్న పాలకుల నినాదాల వెనుక అసలు రహస్యం ఏమిటో తేటతెల్లమై పోయింది. పబ్లిక్ రంగ సంస్థల్ని ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థ నుంచి తప్పించి ప్రైవేట్‌రంగ బడా గుత్త పెట్టుబడి వర్గాలకే ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ నిశ్చితాభిప్రాయాన్ని తాజా బడ్జెట్ బాహాటంగానే ప్రకటించింది. దేశ నిర్మాణంలో ప్రభుత్వ రంగం కీలకమైన పాత్ర నిర్వహించింది. ప్రభుత్వ రంగాన్ని పటిష్టం చేయడానికి బదులుగా మోడీ ప్రభుత్వం దాన్ని ధ్వంసం చేసేందుకు పట్టుదలగా ఉన్నట్లు బడ్జెట్ స్పష్టం చేసింది.

కరోనా వైరస్ ప్రజల ఆరోగ్యాలతోనూ దేశ ఆర్థిక వ్యవస్థతోనూ చెలగాటమాడుతున్న గడ్డు పరిస్థితుల్లో, లక్షలాది రైతులు తమ గోస పట్టించుకొమ్మని ఉద్యమిస్తున్న సమయంలో, నిరుద్యోగం యువత శ్రమశక్తిని నిర్వీర్యం చేస్తున్న తరుణంలో 'నెవర్ బిఫోర్' బడ్జెట్ అంటూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తనకు తానే ప్రశంసించుకున్నారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 'ఎవర్ ఆఫ్టర్' అని కూడ అనిపించుకున్నారు. ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే కార్పొరేట్ల సేవలో మునిగి తేలిన నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వారికి మరింత దాసోహం అంటోందని స్పష్టమవుతుంది. బడ్జెట్ కార్పొరేట్ రంగానికి భారీ నజరానాలు ప్రకటించింది. సామాన్యులపై భారాలు మోపింది. ప్రజాధనంతో నిర్మితమైన ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు... ఎల్ఐసిలోనూ చౌకబేరం! ప్రైవేటు రైళ్లు... ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి)తో రోడ్లు, పోర్టులు ఇలా ఎన్నో. 2020-21 బడ్జెట్‌తో పోలిస్తే తగ్గిన కార్పొరేట్ ఆదాయ పన్ను వసూళ్ల లక్ష్యాలు చాలవన్నట్టు భారీగా పెరగనున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు! అదే సమయంలో ఉపాధి హామీ నుండి అన్ని సంక్షేమ పథకాల్లో కోతలతో పాటు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సామాన్యులపై భారాల మోత!! కనీస మద్దతు ధరకోసం అన్నదాతలు చేస్తున్న ఆందోళనను ఏమాత్రం పట్టించుకోని మోడీ ప్రభుత్వం వ్యవసాయం పేరిట సెస్ విధించడానికి బరితెగించింది! ఆ సెస్‌లోనూ అన్నదాతల కన్నా కార్పొరేట్లకే అధిక వాటాను కట్టబెట్టింది. కేంద్రం, ఆ పేరుతోనే రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లోనూ కోత విధించే కుట్ర చేసింది. భారీగా అంకెలు చూపి, నామమాత్రపు కేటాయింపులతో సరిపెట్టే విన్యాసాలు ఎన్నో! జాతీయ ఆస్తులను అమ్ముకోవడమే ఆత్మనిర్భరత అనే విచిత్రమైన విరోధాభాసని కేంద్ర ప్రభుత్వం ఆచరణలో పెడుతున్నది. స్వావలంబన అంటే పరాధీనత అన్నచందంగా మోడీ చర్యలు కన్పిస్తున్నాయి. ఫలితంగా దేశంలో విస్తృత ప్రజా సమూహాలు మరింత పేదరికంలోకి జారుకుంటాయి.

2021-22 బడ్జెట్ స్వరూపం(అంకెలు కోట్లలో)			
వివరాలు	2019-20 అసలు	2020-21 ఆర్ఇ	2021-22 బిఇ
రెవెన్యూ వసూళ్లు	16,84,059	15,55,153	17,88,424
మూలధన వసూళ్లు	10,02,271	18,95,152	16,94,812
మొత్తం వసూళ్లు	26,86,330	34,50,305	34,83,236
పథకాల వ్యయం	23,50,604	30,11,142	29,29,000
పథకేతర వ్యయం	3,35,726	4,39,163	5,54,236
మొత్తం వ్యయం	26,86,330	34,50,305	34,83,236
ఆదాయ లోటు	6,66,545	14,55,989	11,40,576
నికర లోటు	4,80,904	12,25,613	9,21,464
ద్రవ్య లోటు	9,33,651	18,48,655	15,06,812
ప్రాథమిక లోటు	3,21,581	11,55,755	6,97,111

(ఆర్ఇ - సవరించిన అంచనా, బిఇ- బడ్జెట్ అంచనా)

మూడేళ్లుగా కునారిల్లుతున్న ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదటానికి గొప్పగా చెప్పుకున్న ఆరు పిల్లర్లు.. ఆరోగ్య రంగం, మౌలిక వసతులు, సమగ్రాభివృద్ధి, మూలధనం పెంపుదల, సృజన పరిశోధన అభివృద్ధి, కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలనలతో సగటు జీవికి ఒరిగిందేమి లేదు. ఈ ఆరూ మూలస్తంభాలుగా బడ్జెట్‌ను రూపుదిద్దామని గొప్పగా చెప్పుకున్న బడ్జెట్ పరిమాణం రు. 34,83,236 కోట్లు. ఇది ప్రస్తుత సంవత్సర

బడ్జెట్ రు. 34,50,305 కోట్ల కంటే రు. 33 వేల కోట్లు అధికం. పరిమాణంలో 33 వేలు ఎక్కువగా కన్పించినా పెరిగిన ధరల దృష్టితో చూస్తే గత సంవత్సరం కంటే తక్కువేనని భావించాలి. ఆమాత్రం బడ్జెట్ కూడ ఆర్థిక అవసరాల నిమిత్తం రు. 12 లక్షల కోట్లు అప్పులు చేయక తప్పదని ఆర్థిక మంత్రి ప్రసంగంలోనే తేటతెల్లమయింది. ఇప్పటికే వడ్డీ చెల్లింపుల పద్దు రు. 8,09,701 కోట్ల (రాబడిలో అయిదో వంతుకు) ఎగబాకింది. 2014 జూన్ నాటికి దేశ అప్పు రు. 52 లక్షల కోట్లు ఉండగా 2020 జూన్ నాటికి రు. 101 లక్షల కోట్లకు చేరింది. అంటే మోడీ ఆరేండ్ల పాలనలో దేశ అప్పులు దాదాపు రెట్టింపు అయ్యాయి. 2024 నాటికి రు. 150 లక్షల కోట్లకు అప్పు చేరుతుందని స్టాటిస్టా డాట్‌కామ్ అంచనా వేసింది.

ద్రవ్యలోటు స్థూల దేశీయోత్పత్తిలో 9.5 శాతానికి (15.07 లక్షల కోట్లు) విస్తరించిందని, ఇది కరోనా కాలంలో ప్రభుత్వ వ్యయాన్ని భారీగా పెంచడంతో జరిగిందన్నారు. ఐతే ఆ లక్షల కోట్ల అదనపు వ్యయంలో శ్రామిక ప్రజలకు, రైతాంగానికి అందినది పిసరంత లేదన్నది చేదు నిజం! యువతను కలవరపెడుతున్న నిరుద్యోగ సమస్య గురించి నామమాత్ర ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. 34.8 లక్షల కోట్ల రూపాయల తాజా బడ్జెట్లో సామాన్యులకు విదిల్చింది గోరంత. ఇక ద్రవ్యలోటు వచ్చే సంవత్సరం 9.6 శాతం నుండి 6.8 శాతానికి తగ్గుతుందని ఆర్థికమంత్రి ఆశాభావం వ్యక్తీకరించారంటే సంక్షేమ కార్యక్రమాలకు కోత తప్పదని చెప్పకనే చెప్పినట్లయింది. ఈ బడ్జెట్ ప్రజల కోసం కాదని స్పష్టంగా అర్థమవుతుంది. ఇక ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న 'వి' ఆకారపు రికవరీ కోసం కాకుండా 'కె' ఆకారపు రికవరీలా ఉంది. దీనివల్ల ధనవంతులు మరింత ధనవంతులుగా, పేదలు మరింత పేదలుగా మారతారు. ఆత్మనిర్భర్‌గా చెప్పుకుంటున్న బడ్జెట్ దేశ ఆస్తుల దోపిడీ, పెద్దయెత్తున ప్రయివేటీకరణ ద్వారా కార్పొరేట్ లాభాలకు దోహదపడుతుంది. కానీ ఆకలితో ఉన్న అన్నార్థులకు బడ్జెట్‌లో ఏలాంటి ప్రతిపాదనలు లేవు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 27.5 శాతం మంది పేదరికానికి దిగువన ఉన్నారని తెలుస్తోంది.

న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలే ఆదర్శాలుగా భారత రాజ్యాంగాన్ని రూపొందించుకుని ఏడు దశాబ్దాలు గడిచిపోయింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయానికి, సమానత్వానికి భారత రాజ్యాంగం పూచీ పడింది. పాలకులపై నైతిక బాధ్యత ఉంచింది. ఇవ్వాల్టి పరిస్థితి గమనిస్తే పెరుగుతున్న స్థూల ఉత్పత్తిలో 10 శాతంగా ఉన్న సంపన్నులు 66 శాతం సంపదను పొందుతున్నారు. 30 శాతంగా ఉన్న మధ్యతరగతి 23 శాతం సంపదను పొందుతుంది. 60 శాతంగా ఉన్న ప్రజలు కేవలం 11 శాతం సంపదను పొందుతున్నారని పలు నివేదికలు తెలియచేస్తున్నాయి. భారత రాజ్యాంగం 37, 25, 39వ అధికరణలల్లో పౌరుల సంక్షేమాన్ని స్పష్టంగా పేర్కొంది. పౌరులు హుందాగా బతికే ఆర్థిక స్వాతంత్ర్యంపై హామీపడ్డాయని మరచిపోరాదు. ఈ ప్రకటిత సూత్రాల లక్ష్యమే సంక్షేమ రాజ్య స్థాపన. ఆ సంక్షేమాన్ని పేదసాదలకు ఆచరణలో దక్కేలా చూసే నైతిక బాధ్యతను ప్రభుత్వాలపై పెట్టింది.

సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం విధిగా పొందడానికి పౌరులు అర్హులని ఆదేశిక సూత్రాలు విస్పష్టంగానే పేర్కొన్నాయి. ఆదాయాల్లో అసమానతలను కనిష్ట స్థాయికి తగ్గించి వేయాలని, హోదాలో అసమానతలు తొలగించి, ప్రతిపత్తిలో తగిన సానుకూల సౌకర్యాలు, అవకాశాలు కల్పించాలని ఆదేశిక సూత్రాల స్పష్టమైన ఆదేశం. అంతేగాదు, స్త్రీ పురుషుల మధ్య వివక్షత లేకుండా జీవించడానికి తగిన అవకాశాలను, భృతిని కల్పించి తీరాలని, ప్రజలందరి ప్రయోజనాలకు విరుద్ధంగా ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది వద్ద పోగుపడరాదనీ 39వ అధికరణ హెచ్చరించింది. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అందరికి ఓటు హక్కును సమానంగా గుర్తించిందే కానీ, సమానత్వ సాధనను స్వేచ్ఛను మరిచిపోయింది. అయితే అతి త్వరలో ఆర్థిక, సాంఘీక సమానత్వాన్ని సాధించకపోతే సమాజంలో అరాచకత్వానికి, తిరుగుబాటుకు దారితీస్తుంది' అని అంబేద్కర్ హెచ్చరించారు. ఇవాళ మన సమాజం పాలక పార్టీ అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక విధానాలతో, కార్పొరేటు కనుసన్నల్లో అమలుచేస్తున్న ఫాసిస్టు పాలనతో కుతకుత ఉడికిపోతుంది.

ఇవాళ మన దేశ ఆర్థిక వృద్ధి రేట్ 70 సంవత్సరాలలో లేనంత కనిష్టానికి పడిపోయింది. మన జిడిపి ఏడేళ్ల నాటి కనిష్టానికి పడిపోయింది. గతంలో జిడిపి పెరిగితే చాలు దేశంలో పేదరికం పోతుతందని నమ్మేవారు. ఇప్పుడు ఇదంతా కూడా గుడ్డి భావనగా మిగిలిపోయింది. ఎందువల్లనంటే జిడిపి తగ్గినా సంపన్నుల ఆస్తులు, ఆదాయాలు పెరుగుతూనే ఉన్నాయి. నిరుద్యోగం గత 45 ఏళ్లలో లేనంత తీవ్రంగా ఉంది. నిత్యావసర వస్తువుల ధరలు, ముఖ్యంగా ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం రెండంకెలు చేరింది. ఆర్థిక అంతరాలు తీవ్రమయ్యాయి. మన దేశంలోని ఒక శాతం సంపన్నుల దగ్గరున్న సంపద 95 కోట్ల ప్రజల దగ్గరున్న సంపద కంటే నాలుగు రెట్లు ఎక్కువని తాజా ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. అంతేకాదు 100 మంది కార్పొరేట్ల దగ్గరున్న సంపద మన దేశ బడ్జెట్ కంటే నాలుగు రెట్లు ఎక్కువని అదే నివేదిక తెలిపింది. విద్య, ఆరోగ్యం, ఆహారభద్రత, పౌష్టికాహారంపై చేసే వ్యయాలు ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే చాల తక్కువ. ప్రజాస్వామ్య పాలనలో ప్రపంచ సూచీలో 167 దేశాల్లో 2014లో నమోదైన 27వ స్థానం నుంచి మోడీ పాలనలో 2020 నాటికి 53వ స్థానానికి పడిపోయింది. మానవాభివృద్ధి సూచీలో కూడ అట్టడుగున ఉన్నాం. దేశంలో నేడు జరుగుతున్న అభివృద్ధి ఎవరి కోసం, ఈ బడ్జెట్లు ఎవరిని లూటీ చేసి ఎవరి జేబులు నింపుతున్నదో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆరోగ్యం – కుటుంబ సంరక్షణ :

బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆరు కీలక స్తంభాల్లో ఆరోగ్యం మొదటిది. ఆరోగ్య రంగం విషయానికి వస్తే ఆర్థిక మంత్రి తన తెలివితేటల్లో తన నమ్మకాన్ని చాటుకున్నారు. ఈ రంగానికి కేటాయింపులను 137 శాతం అంటే 2020–21లో సవరించిన అంచనా రు. 94,452 కోట్లు నుంచి 2021–22లో రు. 2,23,846 కోట్లకు పెంచినట్టు నిర్మల సీతారామన్ ప్రకటించారు. ఆరోగ్యం విభాగంతో పాటు తాగునీరు, పరిశుభ్రత, పౌష్టికాహారం, కొవిడ్ టీకా పద్దులను కలిపి గొప్పగా పెంచినట్లు పేర్కొనడం ఎంత బుకాయింపు! ఆమె ప్రకటన మోసపూరితమైనదని బడ్జెట్ ప్రసంగం ముగిసిన కొద్దిగంటలకే ఆర్థిక మంత్రిత్వశాఖ బడ్జెట్ విభాగం వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేశాయి. వాటి ప్రకారం ఆరోగ్య రంగానికి వాస్తవంగా జరిగిన కేటాయింపులు. ఆరోగ్యానికి రు. 71,269 కోట్లు, కొవిడ్ టీకా రు. 35,000 కోట్లు, తాగునీరు–పరిశుభ్రత రు. 60,030 కోట్లు, పౌష్టికాహారానికి రు. 2700 కోట్లు, ఆర్థిక సంఘం ఇచ్చే గ్రాంటు రు. 49,214 కోట్లు. ఈ పద్దులన్నింటిని కలిపి తెలివిగా ఆరోగ్య రంగానికి కేటాయింపులు పెరిగినట్లు పేర్కొంది. నిజానికి నిర్మల సగర్వంగా చెప్పుకున్నట్లు ఆరోగ్య శాఖకు కేటాయింపులు పెరగకపోగా గణనీయంగా తగ్గిపోయాయి! నిర్మల అంకెల గారడీ చేశారు.

ఒకసారి టీకాలు వేయడానికి అయిన వ్యయాన్ని, తాగునీరు, పారిశుద్యం

విభాగానికి కేటాయింపులను, మంచినీరు, పారిశుద్యం, ఆరోగ్య రంగాలలో ఖర్చు పెట్టడం కోసం రాష్ట్రాలకు ఆర్థిక సంఘం మంజూరు చేసిన నిధులను ఆరోగ్య శాఖ పద్దులో కలిపి వేశారు! మన జిడిపిలో ప్రస్తుతం ఆరోగ్య రంగం వాటా 1 శాతం కన్నా తక్కువ. ప్రస్తుతం ఆరోగ్య వ్యయం 60 శాతం ప్రజలే భరిస్తున్నారు. ఆరోగ్యానికి జిడిపిలో 3 శాతానికి పెంచితే తప్ప ప్రజలపై భారం తగ్గదు. 2017 నాటి జాతీయ ఆరోగ్య విధానం కూడా ఈ మాటే చెప్పింది. మెరుగైన ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రపంచంలోని 180 దేశాల్లో మన స్థానం 145వ స్థానంలో ఉంది. 'ఆత్మ నిర్భర్ స్వస్థ్ భారత్' పేరిట కొత్త పథకానికి రూపకల్పన చేశారు. ఇందుకు రాబోయే ఆరేళ్లలో రు. 64,180 కోట్లను ఖర్చు చేయాలని సంకల్పంగా చెప్పుకున్నారు. కాని 2021-22 బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. అదే సమయంలో, కరోనా సమయంలో సవాల్‌గా నిలిచిన వైద్య పరిశోధనలను విస్మరించింది. ప్రజలంతా ఎదురు చూస్తున్న ఆరోగ్య బీమాను పట్టించుకోలేదు. నిజానికి ఆరోగ్యానికి కేటాయించింది జిడిపిలో 0.34 శాతం మాత్రమే.

ఆరోగ్యం - సంక్షేమం కొరకు కేటాయింపులు (కోట్లలో)

విభాగాలు	2019-20 వా.అంకెలు	2020-21 బ.అంచనా	2021-22 బ.అంచనా
ఆరోగ్య సంక్షేమం	62,397	65,012	71,269
ఆరోగ్య పరిశోధన	1,934	2,100	2,663
ఆయుష్	1,784	2,122	2,970
కొవిడ్ టీకా			35,000
తాగు నీరు పరిశుభ్రత	18,264	21,518	60,030
పౌష్టికాహారం	1,880	3,700	2,700
తాగు నీరు గ్రాంట్			36,022
ఆరోగ్య గ్రాంట్			13,192
మొత్తం	**86,259**	**94,452**	**2,23,846**

వ్యవసాయం- అనుబంధ రంగాలు :

రైతులు మూడు నెలలుగా రోడ్లపై కూర్చుని ఆందోళనలు చేస్తున్న తరుణంలో వచ్చిన కేంద్ర బడ్జెట్లో అన్నదాతలకు ఊరట కలిగించే నిర్ణయాలేవీ ప్రభుత్వం ప్రకటించలేదు. వ్యవసాయాభివృద్ధి పథకాలకు ఎప్పటిమాదిరిగా కేటాయింపులే తప్ప వినూత్నంగా కొత్త పథకాల ఊసూ లేదు. ఉన్న పథకాలకు నిధుల పెంపూ ఆశాజనకంగా లేదు. వ్యవసాయం, సహకారం, రైతుల సంక్షేమానికి 2021-22 బడ్జెట్ 8.5 శాతం కోత విధించింది. 2021-22 సంవత్సరానికి ప్రకటించిన వ్యవసాయ బడ్జెట్టు 1,31,531.19 కోట్ల రూపాయలు. ఇది 2020-21 వ్యవసాయ బడ్జెట్టు 1,42,762.35 కోట్ల కంటే తక్కువ. ఐతే రివైజ్డ్ బడ్జెట్టు రు. 1,24,520.3 కంటే కొంచెం ఎక్కువ. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం-కిసాన్) 75,000 కోట్లు (2020-21) కాగా 2021-22కి 65 వేల కోట్లకు తగ్గించారు. పిఎం కిసాన్ నిధి కింద 3 వాయిదాల్లో చెల్లించే 6 వేల రూపాయలు పెంచలేదు. పి.ఎం. ఆశా పథకానికి 2019-20లో 1500 కోట్లు. 20-21లో 500 కోట్లు ఉండగా 21-22లో 400 కోట్లకు తగ్గించారు. కనీస మద్దతు ధరకు కేటాయించే ఎంఐఎస్-పిఎస్ఎస్ నిధులు (మార్కెట్‌లో జోక్యం, మద్దతు ధరల కోసం కేటాయింపు నిధులు) 2019-20లో 1500 కోట్లు కేటాయించగా, 20-21లో 500 కోట్లకు, 2021-22లో 400 కోట్లకు కుదించారు. దీన్నిబట్టి ప్రభుత్వానికి మద్దతు ధరపై చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోంది.

దేశంలో 15.6 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూములు, 14.5 కోట్ల మంది రైతులున్నారు. వీరిలో చిన్న, సన్నకారు రైతులే 86 శాతం వరకు ఉంటారు. 2014 ముందు బిజెపి డా.స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. మోడీ ప్రధాని అయ్యాకా అది సాధ్యం కాదని సుప్రీంకోర్టుకు తెలిపాడు. 2019 ఎన్నికల తర్వాత 2022 కల్లా రైతుల పెట్టుబడిపై 50 శాతం అదనంగా వచ్చే విధంగా విధానాలు రూపొందిస్తామన్నాడు. రైతుల ఆదాయం పెరుగలేదు గానీ అప్పులు మాత్రం పెరిగాయి. దేశంలో 52.5 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయని 'నాబార్డ్' 2018లో విడుదల చేసిన ఒక సర్వేలో తెలిపింది. సగటు రుణం రు. 1.04 లక్షలుందని తేల్చింది. అయితే 2018 తర్వాత కూడా పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నామని యుపి, బిహార్ రైతులు చెబుతున్నారు. జాతీయ జిడిపిలో 15.4 శాతం వ్యవసాయ రంగం నుండి వస్తుంది. 136 కోట్ల జనాభాలో 60 శాతం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ, జీవనోపాధి కల్పిస్తున్నారు. కానీ మొత్తం 34 లక్షల 83 వేల కోట్ల దేశ బడ్జెట్టులో 4.3 శాతం నిధుల్ని మాత్రమే వ్యవసాయానికి కేటాయించారు.

వ్యవసాయ రంగానికి అందించే రుణాల మొత్తం రు. 16.5 లక్షల కోట్లు లక్ష్యాన్ని నిర్ణయించామని గొప్పగా చెప్పారు. అయితే బ్యాంకులు ఇవ్వాలి కదా! ఇప్పటి వరకు 30 శాతం మంది రైతులు కూడా పంట రుణాలు అందలేదని పలు రాష్ట్రాల గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ రుణాలు కూడ పట్టాదారుకే ఇస్తారు. కౌలు రైతుకు ఇవ్వరు. ఇక వ్యవసాయ రంగ మౌలిక సదుపాయాల సెస్ పేరిట అనేక వస్తువులపై సుంకాన్ని విధించడానికి తీసుకున్న నిర్ణయం ప్రజల మీద అపరిమితమైన భారాన్ని మోపనుంది. ఈ సెస్‌ను పెట్రోల్ లీటర్‌కు రు. 2.5, డిజిల్‌పై లీటర్‌కు రు. 4, మద్యం ఉత్పత్తులపై 100 శాతం. ముడి పామాయిల్‌పై 17.5 శాతం, ముడి సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 20 శాతం, ఆపిల్స్‌పై 35 శాతం, బొగ్గు, లిగ్నైట్, పీట్‌లపై 1.5 శాతం, ఫెర్టిలైజర్స్‌పై 5శాతం, బటానీలపై 40 శాతం, కాబూలీ చనాపై 30 శాతం, శనిగపప్పుపై 50 శాతం, పత్తిపై 5 శాతం సెస్సును విధించింది. కేంద్రం ఏటేటా సెస్సులు, సర్‌చార్జీలు పెంచుకుంటూ పోతోంది.

సంక్షేమ పథకాలకు నిధుల కోత :

ప్రజల సంక్షేమాన్ని గురించి గొప్పగా చెబుకుంటున్న పాలకులు వాటికి కూడా కోతలు విధించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్ఆర్ఇజిఎకు 38,500 కోట్ల రూపాయలు కోత విధించారు. 2020-21లో కేటాయించిన 1,11,500 కోట్ల రూపాయల నుండి రివైజ్డ్ బడ్జెట్‌కు 75,000 చేసి ఇప్పుడు 2021-22కు అదే 75 వేల కోట్ల రూపాయలు కేటాయించడం పెద్ద గారడే. పౌర సరఫరాల శాఖకు(పిడిఎస్) 2020-21లో 3.4 లక్షల కోట్లు కేటాయించగా 2021-22 నాటికి 2 లక్షల కోట్లకు కుదించి, పిడిఎస్ వ్యవస్థను నీరుగార్చే పథకాలను రచిస్తున్నారు. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న ఆహారోత్పత్తుల ధర పెంచి సబ్సిడీ భారం తగ్గించుకోవాలని, 'ఆర్థిక సర్వే' సిఫారసు చేయడం శోచనీయం.

స్త్రీ, శిశు సంరక్షణ పట్ల నిర్లక్ష్యం :

బడ్జెట్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు, బాలికల సంరక్షణ, సంబంధిత పథకాలకు మహిళగా నిర్మల కేటాయింపులు జరుపుతారని అంతా

భావించారు. కానీ, బడ్జెట్‌లో మాత్రం మోడీ సర్కారు స్త్రీ, శిశు, బాలికల సంక్షేమ పథకాలు, పోషణ పథకాలకు సరిగ్గా కేటాయింపులు జరపలేదు. ముఖ్యంగా పిల్లల, తల్లి పోషణ పథకాలకు కేంద్రం మొండిచేయి చూపించింది. ఒకపక్క దేశంలో ఆకలి సమస్య ఆందోళనకరంగా ఉన్నప్పటికీ మోడీ సర్కారు కేటాయింపులను తగ్గించింది. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్(ఐసిడిఎస్) (శిశు, పిల్లల పోషణ పథకంలో భాగంగా గ్రామస్థాయి అంగన్‌వాడీలను నడపడానికి సంబంధించి)కు 2020-21 బడ్జెట్‌లో రు. 20,532 కోట్లు కేటాయించారు. అయితే, ఈ ఏడాది ఐసిడిఎస్‌ను కేంద్రం సాక్షం పథకం కింద, పోషన్ అభియాన్, కౌమార బాలికల పథకం, నేషనల్ క్రీచ్ పథకాలన్నింటిని క్లబ్ చేశారు. అయితే, ఈ సారి సాక్షం పథకానికి కేటాయించిన మొత్తం నిధి రు. 20,105 కోట్లు. గతేడాది కేటాయించిన బడ్జెట్ రు. 24,557 కోట్ల కంటే ఇది తక్కువ. అలాగే, కేవలం ఐసిడిఎస్ కోసం గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కంటే కూడా తక్కువ కావడం గమనార్హం.

ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాన్ని కూడా సమర్థ్య పథకం కింద క్లబ్ చేశారు. ఇందులో బాలికల విద్య కోసం బేటీ బచావో, బేటీ పడావో పథకం, మహిళా శక్తి కేంద్రం, జనరల్ జండర్ బడ్జెటింగ్ వంటివి కూడా ఉన్నాయి. ఈ ఏడాది సమర్థ్య పథకం కోసం బడ్జెట్‌లో కేంద్రం రు. 2,522 కోట్లు కేటాయించింది. ఇది గతేడాది కేటాయించిన రు. 2,828 కోట్ల కన్నా తక్కువ కావడం గమనించాల్సిన అంశం. పాఠశాల పిల్లల కోసం మధ్యాహ్న భోజన పథకానికి (మిడ్-డే మీల్ స్కీం) 2021 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రు. 11,500 కోట్లు. కానీ ఇది ఈ పథకం కోసం గతేడాది కేటాయించిన రు. 12,900 కోట్ల సవరించిన బడ్జెట్ అంచనా కంటే తక్కువ.

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ఐదో ఎడిన్ ఫలితాలను విడుదల చేసింది. ఇది మహమ్మారికి ముందే పిల్లల్లో పోషకాహార లోపం పెరిగిందని సూచించింది. 2019-20 మధ్య చేసిన సర్వే సమాచారం ప్రకారం.. 13 రాష్ట్రాల్లోని చిన్నారుల్లో పెరుగుదల లోపం ఉన్నది. 16 రాష్ట్రాల్లో తక్కువ బరువున్న పిల్లల సంఖ్య పెరిగింది. అయితే భారత్‌లో ఆకలి, ఆహారభద్రత పరిస్థితి ఇప్పుడు చాలా ఆందోళనకరంగా ఉన్నదని ఆహార హక్కు ప్రచార కార్యకర్త దీపా సిన్హా అన్నారు. ఐసిడిఎస్ కింద అంగన్‌వాడీలకు నిధులు ఎప్పుడూ తక్కువగానే ఉన్నాయనీ, ఇలా అయితే దేశంలో అంగన్‌వాడీలు పనిచేయడం కష్టమని ఆమె అన్నారు. ఇప్పుడు తగ్గిన బడ్జెట్ కేటాయింపులతో ఇది మరింత దిగజారిపోతుందని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో పోషకాహారం, ఆరోగ్యం అంశాలకు అగ్ర ప్రాధాన్యం ఉంటుందని ఆశించానినీ, కానీ ఇది నిరాశపరిచిందని దీపా సిన్హా అన్నారు.

అమ్మకానికి ప్రభుత్వ రంగ సంస్థలు :

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నులా ఉన్న దాదాపుగా మొత్తం 300ల ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారదత్తం చేయడానికి మోడీ సర్కార్ పూనుకున్నది. ఆత్మనిర్భర్, దేశభక్తి ముసుగులో పెట్టుబడిదారులకు గంపగుత్తగా దోచిపెట్టడానికి కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగానే మొత్తం పిఎస్‌యులను రెండు డజన్లకు పరిమితం చేయాలని బిజెపి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ప్రైవేటీకరణ పాలసీలో భాగంగా ప్రస్తుతం 300కు పైగా ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (పిఎస్‌యు)ను ఎవరూ ఊహించని రీతిలో కేవలం 24కు దిగువన చేర్చాలని చూస్తోందని టైమ్స్ ఓ కథనంలో వెల్లడించింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తుతమున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను వ్యూహాత్మక, వ్యూహాత్మకేతర రంగాలుగా విభజించాం. వ్యూహాత్మకేతర రంగాల్లోని సంస్థలను వీలైనంత వరకు ప్రైవేటీకరిస్తాం. మిగిలిన వాటిని మూసేస్తాం. వ్యూహాత్మక రంగాల్లోని సంస్థలను సాధ్యమైనంత వరకు తగ్గించేస్తాం. ప్రధాన సంస్థలను గుర్తించి అనుబంధంగా ఉన్న సంస్థలను వాటిలో విలీనం చేస్తాం. ఇంకొన్నింటిని మూసివేసి, మరికొన్నింటిలో వాటాలను విక్రయించి ప్రైవేటీకరిస్తామని స్పష్టం చేసింది. కేవలం నాలుగు రంగాల్లో మాత్రమే ప్రభుత్వ రంగ సంస్థలు మిగిలే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆయా రంగాల్లోనూ 3 నుంచి 4 పిఎన్‌యులు మాత్రమే ఉండనున్నాయి. ప్రైవేటు, కార్పొరేటు పెట్టుబడిదారులు, గ్లోబల్ ఇన్వెస్టర్లకు ఈ వాటాలను విక్రయించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెండు ప్రభుత్వ బ్యాంకులు, ఒక సాధారణ బీమా కంపెనీ సహా రెండు పిఎన్‌యులను పూర్తిగా వదిలించుకోనున్నామని మంత్రి సీతారామన్ పేర్కొన్న విషయం తెలిసిందే.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏయే ప్రభుత్వ రంగ సంస్థలను ఎప్పుడూ, ఎలా విక్రయించాలనేది నీతి ఆయోగ్‌కు బాధ్యతలను అప్పగించింది. ప్రతిపాదిత సిఫారసుల మేరకు ఏయే పిఎస్‌యులను కార్పొరేట్లకు కట్టబెట్టాలనే దానిపై కేంద్ర క్యాబినెట్ తుదినిర్ణయం తీసుకోనుంది. అణు ఇంధన రంగం, అంతరిక్షం, రక్షణ, రవాణా, టెలికమ్యూనికేషన్స్, విద్యుత్, పెట్రోలియం, బొగ్గు, బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవల వంటి వ్యూహాత్మక రంగాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు పరిమిత సంఖ్యలో ఉంటాయని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సంకేతాలు ఇచ్చారు. ఈ రంగాల్లో మిగిలిన పిఎస్‌యులను ప్రైవేటీకరించడం లేదా ఇతర పిఎస్‌యుల్లో విలీనం చేయడం లేదా మూసివేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. మరోవైపు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విదేశీ సంస్థలకు ఆహ్వానం పలికింది. వారికి భూమి, విద్యుత్, నీరు తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తోంది.

హోం - రక్షణకు పెరిగిన నిధులు :

రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయం రు. 1,35,060 కోట్లుగా కేటాయించారు. గత ఏడాది (రు. 4.71 లక్షల కోట్లు)తో పోల్చుకుంటే స్వల్పంగా 1.4 శాతం పెరుగుదలతో రు. 4.78 లక్షల కోట్లకే పరిమితమైంది. ఇది స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)లో 1.63 శాతం. ఇందులో కొత్త ఆయుధాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, యుద్ధ నౌకలు ఇతర మిలటరీ సామాగ్రి కొనుగోలు ఖర్చును కూడా కలిపారు. గత ఏడాది మొత్తం బడ్జెట్‌లో రు. 1.15 లక్షల కోట్లు పెన్షన్లకు కేటాయించారు. పెన్షన్‌ను మినహాయిస్తే జీతాల చెల్లింపులు, ఆస్తుల నిర్వహణ వంటి రెవెన్యూ ఖర్చు రు. 2.12 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఆర్మీకి మూలనధ వ్యయం కింద రు. 36.481 కోట్లు, నౌకా దళానికి రు. 33,253 కోట్లు, వైమానిక దళానికి రు. 53.214 కోట్లు కేటాయించారు. మోడీ అధికారంలోకి వచ్చాక రక్షణ వ్యయం ఏటేటా పెరిగిపోతుంది. 2014-15లో 2.29 లక్షల కోట్లు 2015-16లో 2.46 లక్షల కోట్లు, 2016-17లో 3.40 లక్షల కోట్లు, 2017-18లో 3.59 లక్షల కోట్లు, 2018-19లో 4.04 లక్షల కోట్లు, 2019-20లో 4.31 లక్షల కోట్లు,

2020-21లో 4.71 లక్షల కోట్లు, 2021-22లో 4.78 లక్షల కోట్లుగా పెరిగింది.

ఆత్మనిర్భర్ భారత్ అంటే, భారత రక్షణ విధానమంటే, అమెరికా కనుసన్నలలో అమెరికాతో కుదుర్చుకున్న వ్యూహాత్మక భాగస్వామ్యమేనా? ఆత్మనిర్భర్ భారత్ పేరిట విదేశీ బహుళజాతి రక్షణ ఉత్పత్తి సంస్థలకు బార్లా ద్వారాలు తెరిచి రక్షణ బడ్జెట్‌లను దోచిపెట్టడమేనా? ఆత్మనిర్భర్ భారత్ అంటే 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 9 రక్షణ రంగ పరిశ్రమలు, 52 డిఆర్‌డిఓ ల్యాబోరేటరీలను కాదని మొత్తం రక్షణ ఉత్పత్తులను విదేశీ, దేశీయ బడా కార్పొరేటు సంస్థలకు అప్పజెప్పడమేనా? ఆలోచించాలి. ప్రభుత్వ రంగ సంస్థలైన భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్‌కు 2020-21 సంవత్సరానికి క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా 716 కోట్లు కేటాయించి 2021-22 సంవత్సరానికి కేటాయింపులు '0'(శూన్యం). మరొక ప్రధానమైనటువంటి క్షిపణి ఉత్పత్తులు చేస్తున్న బిడిఎల్‌కు 2020-21 సంవత్సరానికి 2404 కోట్లు కేటాయించి 2021-22 ఆర్థిక సంవత్సరానికి ఏ మాత్రం కేటాయింపులు చేయలేదు. నవరత్న కంపెనీ అయిన హెచ్‌ఏఎల్‌కు 2021-22 ఆర్థిక సంవత్సరానికి క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కేటాయింపులు శూన్యం.

హోంశాఖ :

కేంద్ర హోంశాఖకు 2021-22 బడ్జెట్‌లో రు. 1,66,547 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 11.48 శాతం అధికం. ఇందులో మెజారిటీ నిధులు కేంద్ర సాయుధ బలగాల నిర్వహణకు, జనగణనకు సంబంధించిన కార్యకలాపాలకు వినియోగించనున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో హోం శాఖకు రు. 1,49,387 కోట్లు కేటాయించగా ప్రస్తుతం ఆ మొత్తాన్ని రు. 1,66,547 కోట్లకు పెంచారు. ఇందులో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలైన సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్‌లకు రు. 1,03,802.52 కోట్లు, జనాభా లెక్కలకు రు. 3,768.28 కోట్లు కేటాయించారు.

సబ్సిడీలకు నిధులపై కత్తెర :

ఈ బడ్జెట్లో ఆహారం, ఎరువులు, ఇంధనాలపై ప్రభుత్వం సబ్సిడీలకు గణనీయంగా కోత పెట్టింది. కరోనా మహమ్మారికి ఆర్థిక రంగం కుదేలైన దృష్ట్యా రెవెన్యూని పెంచే లక్ష్యంతో ఈ కోతలు విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2020-21)లో రైతులకు ఎరువులపై ప్రభుత్వం రు. 1,33,947 కోట్ల మేరకు సబ్సిడీ కింద ఖర్చు చేయగా, కొత్త బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీని రు. 79,530 కోట్లకు తగ్గించింది. అంటే 40.62 శాతం మేరకు ఎరువుల సబ్సిడీల కోత పెట్టిందన్న మాట. అదేవిధంగా నిరుపేదలకు ఎంతో ముఖ్యమైన ఆహార సబ్సిడీని కూడా ప్రభుత్వం బాగా తగ్గించింది. ఆహార భద్రతా చట్టంలో భాగంగా దేశ జనాభాలో 67 శాతం మంది ప్రజలకు సర్కారు చౌక ధరలకే బియ్యం, గోధుమలు, చక్కెర వంటి నిత్యావసరాలు అందిస్తుంది. 2020-21 బడ్జెట్లో దీనికి ప్రభుత్వం రు. 4,22,618 కోట్లు ఖర్చు చేసింది. కొత్త బడ్జెట్లో ఆహార సబ్సిడీ కింద రు. 2,42,836 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే 42.54 శాతం మేర తగ్గించేసింది. అదేవిధంగా పెట్రో ఉత్పత్తులపై సబ్సిడీలకు కోత విధించడంతో పెట్రోలు, డిజిల్, వంట గ్యాస్ ధరలు పెరగనున్నాయి. 2020-21కి గాను ఇంధనాలపై రు. 38వేల కోట్ల మేరకు సబ్సిడీ ఇవ్వగా, తాజా బడ్జెట్‌లో దాన్ని రు. 12,995 కోట్లకు తగ్గించింది. అంటే దాదాపుగా 66 శాతం మేర కోత పడింది. ఎరువులు, వంటగ్యాస్, కిరోసిన్‌పై సబ్సిడీ బిల్లు కొత్త బడ్జెట్లో రు. 5.96 లక్షల కోట్ల నుంచి రు. 3.36 లక్షల కోట్లకు తగ్గుతుందని మంత్రి నిర్మల పేర్కొన్నారు.

అప్పుల్లో కూరుకుపోతున్న భారత్ :

భారత్‌పై రుణ భారం మరింత పెరుగుతోంది! ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనా ప్రకారం...స్థూల రుణ సేకరణ రు. 7.8 లక్షల కోట్లు కాగా దాన్ని 64 శాతం పెంచి స్థూలంగా రు. 12.80 లక్షల కోట్లకు చేర్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో గత రుణాల తిరిగి చెల్లింపులు రు. 2.80 లక్షల కోట్లు ఉంటాయని భావిస్తున్నారు. దీంతో నికరంగా అప్పు వచ్చే ఆర్థిక సంవత్సరానికి రు. 9.24 లక్షల కోట్లు ఉండనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది రు. 10.52 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. 2020 మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రు. 97.05 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం అప్పులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తీసుకోబోయే అప్పు రు. 12.05 లక్షల కోట్లను కలిపితే రు. 109.10 లక్షల కోట్లకు చేరుతుంది. దేశ జనాభా సుమారు 139 కోట్లని లెక్కవేసుకున్నా తలసరి అప్పు రు. 86వేలకు పైనే ఉంటుందని అంచనా.

ముగింపు :

దేశంలో ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగ సమస్య, కార్మికుల ఉపాధి సమస్య రోజు రోజుకు తీవ్రమౌతోంది. కరోనాతో ఈ సమస్యలు మరింతగా పెరిగాయి. వీటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు బడ్జెట్‌లో తీసుకోలేదు. పర్మినెంట్ ఉద్యోగాలకు స్వస్తిచెప్పి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ప్రోత్సహించింది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ గురించి ఎన్ని డాంబికాలు పలికినప్పటికీ అప్పులకుప్పగా కేంద్రబడ్జెట్ ఉన్నది. ఈ బడ్జెట్ పేద ప్రజలకు మేలు చేయకపోగా కార్పొరేట్ శక్తులకు ఆదాయాలను పెంచేదిగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మనకు ఎటువంటి బడ్జెట్ కావాలో సరిగ్గా దానికి భిన్నంగా కేంద్ర బడ్జెట్ ఉందనడంలో సందేహం లేదు. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థ రికవరీకి తోడ్పడుతుందని చెప్పడం ఆత్మవంచన. దీని ఫలితంగా మన దేశాన్ని తీవ్రంగా పీడిస్తున్న ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలు మరింత తీవ్రమవుతాయి.

ప్రభుత్వం చెప్తూతున్నట్లు 11 శాతం వృద్ధి భ్రమాజనితమే, ప్రభుత్వ ఆదాయం పెరగకుండా, ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా ఆర్థిక వృద్ధిరేటు పెరిగినా నిరుద్యోగం మాత్రం తగ్గదు. ఒకవేళ బడ్జెట్‌లో అంచనా వేసినట్లు వృద్ధిరేటు పెరిగినా అది బడా సంపన్నుల, కార్పొరేట్ల, సంఘటిత రంగంలోనే ఉంటుంది. అసంఘటిత రంగం కుదుటపడే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు. దేశంలో 100 మంది సంపన్నుల వద్ద లక్షలాది కోట్ల రూపాయల సంపద తాండవిస్తుంటే పాలకులు వర్గ స్వభావంతో వారిపై పన్నుల భారం వేయకుండా మరిన్ని రాయితీలిస్తూ, ప్రజల అవసరాలను విస్మరించినా నాగరిక పౌర సమాజం కూడ అణగారిన సమూహాలను వారి మానాన వారిని బతుకమని వదిలేయడం బాధాకరం. మొత్తంగా బడ్జెట్‌లో చిత్తశుద్ధి కన్పించడం లేదు. రానున్న కాలంలో శ్రామికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

విద్య, వైద్యాన్ని విస్మరించిన బడ్జెట్

బడ్జెట్ కేటాయింపుల్లో విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గించి వాటిని కార్పొరేట్ శక్తులకు అప్పగించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అంటున్నారు డా. ఏ .పున్నయ్య

దేశ ప్రజల విస్తృత రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కొరకు ప్రభుత్వం రూపొందించుకునే ఆర్థిక విధాన ప్రకటనే బడ్జెట్. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆదాయ, వ్యయాలను ఉజ్జాయింపుగా అంచనావేసి ప్రతిపాదిత ప్రయోజనాలు నెరవేర్చుటకు గణితాత్మకంగా ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందిస్తుంది. ఆనవాయితీగా రంగాలవారి కేటాయింపులూ బడ్జెట్ ప్రసంగంలో ఉండడం తప్పనిసరి. ఆర్థిక వ్యవస్థ ఎలా నడుస్తున్నదో, ఆదాయ వనరులు ఏ రంగాల నుంచి ఏ రంగాలకు ప్రవహిస్తున్నాయో, పాలకవర్గాల ప్రయోజనాలు ఏ ఆర్థిక పరిణామాలలో వ్యక్తమవుతున్నాయో తెలుసుకోవడానికి బడ్జెట్ నేటికీ ఒక ముఖ్యమైన సూచికే. కాని దాని ప్రభావానికి అత్యంత తీవ్రంగా గురయ్యే విశాల సమాజానికి మాత్రం ఈ బడ్జెట్ ఎందుకు ప్రవేశపెడుతున్నారో, ఏయే అంశాలుంటాయో అర్థం కాదు. బడ్జెట్ విషయంలో మూడు అంశాలు చాలా ముఖ్యమైనవి. అవి మొత్తం రాబడులు, సంపూర్ణ వ్యయాలు, తీసుకున్న అప్పులు. ఈ మూడు విషయాలు తప్పుడు సంఖ్యలు అయితే ఆ బడ్జెట్‌కు దార్శనికత ఉండదు. ప్రభుత్వాలు తమ రాజకీయ మనుగడ, ఎత్తుగడల కోసం అశాస్త్రీయంగా రాబడి అంచనా వేస్తున్నాయి. ఫలితంగా ఎంచుకున్న ప్రతిపాదనలు ఎన్నడూ పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు. ఈ కారణంగా బడ్జెట్ లక్ష్యాలు ఇన్ని సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. ప్రధాన రంగాలను బలోపేతం చేయుటకు కేటాయింపులు జరగడం లేదు. వాస్తవానికి మానవ వనరుల అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కొరకు విద్య, వైద్య రంగాలకు అధికంగా ఖర్చు చేయాలి. ఈ రెండు రంగాలకు సమృద్ధిగా నిధులు కేటాయిస్తే మనుషులు విజ్ఞాన వంతులుగా, ఆరోగ్యవంతులుగా పరిణతి చెందుతారు. దీనితో మొత్తం సమాజం చైతన్యవంతంగా ముందుకు నడుస్తుంది. అందుకే అభివృద్ధి చెందిన దేశాల్లో సహితం ఈ రెండు రంగాలను ఉచితంగా, సమృద్ధిగా ప్రజలందరికి అందిస్తున్నారు. మనదేశంలో దివాలాకోరు రాజకీయ నాయకత్వాలు ఈ రెండు రంగాల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి కనపరుచుట లేదు. ఫలితంగా ఈ రంగాలు నేటికీ స్థూల బడ్జెట్‌లో 5 శాతం కూడా కేటాయింపులకు నోచుకోవడం లేదు.

ఇటీవల కరోనా వలన ఏర్పడిన ఆరోగ్య విపత్తు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఈ అసాధారణ పరిస్థితుల్లో సుమారు పది నెలల పాటు దేశవ్యాప్తంగా అమలు చేసిన లాక్‌డౌన్ అనేక రంగాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రధానంగా మానవ వనరులను అందించే విద్యారంగాన్ని తీవ్ర ఒడిదొడుకులకు గురిచేసింది. ప్రభుత్వ ఆధీనంలోని ఈ రెండు రంగాల కేటాయింపుల్లోని డొల్లతనం స్పష్టంగా వెల్లడైంది. ఈ రెండు రంగాలతో పాటు వివిధ రంగాలలో కోల్పోయిన ఉపాధి, ఉద్యోగాలను పునరుద్ధరించి ఆయా రంగాలు మెరుగుపడే విధంగా బడ్జెట్ కేటాయింపులుండాలని ఆశించారు.

దేశానికి బడ్జెట్ ఆధారశిలగా నిలవాలి

ఈ క్రమంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. సరైన విద్య, వైద్య సదుపాయాలు కల్పించడం, వారికి తగిన జీవనోపాధిని కల్పించడంతో పాటు మొత్తం సమాజాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లాల్సిన గురుతర బాధ్యత కేంద్ర ప్రభుత్వం నిర్వర్తించాలని ప్రజలందరు ఆసక్తిగా ఎదురు చూసినారు. ప్రాధమ్య రంగాలను విస్మరించి ఆపద కాలములో కూడా, కార్పొరేట్ ప్రయోజనాల కోసం మాత్రమే ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసి వాపోయారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మోదాన్ని, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఖేదాన్ని మిగిల్చింది. ప్రస్తుత పరిస్థితిలో ఎటువంటి బడ్జెట్ మనదేశానికి అవసరమో సరిగ్గా దానికి పూర్తి వ్యతిరేక దిశలో ఈ బడ్జెట్ ఉంది. వాస్తవ స్థూల ఆర్థిక చిత్రాన్ని కనపడకుండ ప్రజల ముందుంచారు. కాగా ప్రభుత్వం పెంచిపోషించే మీడియా, పత్రికలు, వార్త ఛానళ్లు హడావిడి చేసి ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి తోడ్పడుతుందని ఊదరగొట్టడం విచారకరం.

బడ్జెట్ ప్రాధామ్యాల లేమి – జిడిపి వృద్ధిరేటు క్షీణత

ప్రభుత్వ అనాలోచిత ఆర్థిక విధానాల మూలంగా గత కొన్నేళ్లుగా డిజిపి వృద్ధిరేటు క్రమంగా క్షీణిస్తున్నది. బిజినెస్ స్టాండర్డ్ పత్రిక సరిగ్గా ఈ బడ్జెట్‌కు ఒక రోజు ముందు జనవరి 31న దేశం స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) 2019–20లో 1.8 శాతానికి పడిపోయిందని. కార్పొరేట్ ఆదాయం మాత్రం గణనీయంగా వృద్ధి చెందినాయని నివేదించింది. 2016–17లో 8.3 శాతంగా ఉన్న దేశ జిడిపి వృద్ధిరేటు, 2017–18లో 7 శాతంకు పరిమితమైంది. క్రమంగా 2018– 19లో 6.1 శాతానికి క్షిణించింది. నిజానికి కోవిడ్–19 వ్యాపించకముందే భారత ఆర్థిక వ్యవస్థ కుంటుపడడం మొదలై మాంద్యంలోకి జారింది. ఫలితంగా 2019–20లో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధిరేటు కేవలం 4.2 శాతంగా మాత్రమే నమోదయ్యింది. గత దశాబ్దకాలంలో ఇదే అత్యంత తక్కువ వృద్ధిరేటు. ఈ క్రమంలో కోవిడ్–19 సృష్టించిన పెను ఉత్పాతం వలన ఆర్థిక వ్యవస్థ కకావికలమై కుప్పకూలింది. 2020–21లో సంపద వృద్ధి చెందకపోగా రివర్స్ గేర్లో మైనస్ 7.7 శాతానికి పడిపోయింది. 2019–20లో రు. 146 లక్షల కోట్లుగా ఉన్న దేశ మొత్తం సంపద (జిడిపి) 2020–21లో రు.134 లక్షల కోట్లకు తగ్గింది. 2020–21లో ద్రవ్యలోటు 9.5 శాతం. ఇది 2021–22లో 6.8 శాతంగా ఉండబోతుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. ప్రభుత్వ వాస్తవ వ్యయం పెరగకపోయినా జిడిపి 10.5 శాతం పెరుగుతుందని లెక్కవేసి, దానికి

తగ్గట్టు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుందని లెక్కగట్టారు. కాని జిడిపి అంచనాల మేరకు పెరగకపోతే, ప్రభుత్వ వ్యయం బడ్జెట్ ప్రకారమే జరిగినా ద్రవ్యలోటు మాత్రం బాగా పెరుగుతుంది. ద్రవ్యలోటును తగ్గించాలని గనుక ప్రభుత్వం భావించి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిస్తే వృద్ధిరేటు ఇంకా తగ్గిపోయే ప్రమాదముంది.

ఆత్మనిర్భర్ పేరుతో 2021-22 ఆర్థిక సంవత్సరానికి రు.34,83,236 కోట్ల మొత్తంతో ఆర్థిక మంత్రి ఫిబ్రవరి 1న లోక్‌సభలో తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో ఈ దశాబ్దానికి తొలిబడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సాధారణంగా గత బడ్జెట్‌ల పాఠం మాదిరిగానే పడిగట్టు పదాలతో ప్రజలను ఆర్థిక మంత్రి మోసపుచ్చినారు. 1) ఆరోగ్యం – యోగక్షేమాలు, 2) ఆర్థిక రంగం – మౌలిక సదుపాయాలు, 3) సమ్మిళిత వృద్ధి – ఆకాంక్షపూరిత భారత్, 4) మానవ వనరులు, 5) నవకల్పనలు – పరిశోధన – అభివృద్ధి, 6) కనిష్ట ప్రభుత్వం – గరిష్ట పాలన మూల స్తంభాలుగా ఆరు రంగాలను గుర్తించి వాటిపై దృష్టిని కేంద్రీకరించినారు. ఆ రంగాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా, మెరుగైన ఉపాధి మార్గాలు ఏర్పడేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించింది. వ్యక్తిగత ప్రయోజనాలు కాకుండా సమష్టి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందించినట్లు నమ్మబలికింది. ఆయా రంగాలకు ప్రాధాన్యత పెంచాలన్న నిపుణుల సూచనలను బుట్టదాఖలు చేసి ఆరోగ్యం, శ్రేయస్సు, మూలధన వ్యయం, మౌలిక వసతుల ఏర్పాటు, దేశంలో వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు, పూర్తి స్థాయి మానవ వనరుల వినియోగం, వివిధ రంగాలలో పరిశోధనలు, ప్రయోగాల కోసం నామమాత్రంగా నైనా నిధుల మంజూరు జరగకపోవడం విచారకరం. ఈ నేపథ్యంలో వాస్తవాలతో సంబంధం లేకుండా ఘనమైన లక్ష్యాల ప్రకటనగా ఈ బడ్జెట్ స్వభావముంది. ప్రధానంగా విద్యా, వైద్య రంగాల ప్రాధామ్యాల లక్ష్యాల సాధనకు అవసరమైన, కచ్చితమైన ప్రణాళికలు లేని దుస్థితి ఈ బడ్జెట్‌లో కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది.

ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

కరోనా నేపథ్యంలో ఆరోగ్య సంక్షోభం పెరిగాక కూడా వైద్య రంగంలోని నిర్లక్ష్యాన్ని గుర్తించి, దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం తిరస్కరించింది. ఆరోగ్యం, స్వస్థతకు బడ్జెట్ కేటాయింపులు 137 శాతం పెంచామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విచారకరం. నిజానికి ఈ మోసం కూడా చాలా వినూత్నంగా ఉంది. బడ్జెట్ అనుబంధ పత్రంలో పేర్కొన్న గణాంకాలను 2020–2021 ఆర్థిక సంవత్సరానికి ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రు. 69,234 కోట్లను కేటాయించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆయుష్ మంత్రిత్వ శాఖకు, ఆర్యోగ రంగ పరిశోధనలకు చేసిన కేటాయింపులన్నీ ఇందులోనే ఉన్నాయి. ఈ పద్దులపై సవరించిన అంచనాల ప్రకారం 2020–21 సంవత్సరానికి వాస్తవ వ్యయం రు. 85,250 కోట్లుగా ఉంది. కానీ, 2021–22 సంవత్సరానికి ప్రస్తుత బడ్జెట్ అంచనాల్లో ఈ పద్దులకు మొత్తం కేటాయింపులు రు. 76,902 కోట్లుగా ఉంది. గతేడాది ఖర్చు పెట్టిన వాస్తవ వ్యయాలకన్నా ఈసారి 11 శాతం తక్కువ కేటాయింపులున్నట్లు స్పష్టంగా అర్థమవుతున్నది.

ఆరోగ్యం, స్వస్థతకు రు. 2,23,846 కోట్లు కేటాయించడాన్ని నిశితంగా పరిశీలించినట్లైతే ఆరోగ్య, సంక్షేమం, ఆయుష్, ఆరోగ్య రంగ పరిశోధన కేటాయింపులతో పాటు తాగు నీరు, పారిశుధ్యానికి కేటాయించిన రు. 60 వేల కోట్లు ఇందులో కలిపి చూపించారు. అలాగే తాగునీరు, పారిశుధ్యానికి ఆర్థిక సంఘం గ్రాంట్ రు. 36 వేల కోట్లు, పోషకాహారానికి రు. 2,700 కోట్లు కేటాయించింది. నిజానికి ఈసారి పోషకాహారానికి గతేడాది కన్నా 30 శాతం తక్కువగా కేటాయించారు.

పైగా, ఆరోగ్య రంగానికి రు. 13,192 కోట్లను గ్రాంట్‌గా ఇవ్వడానికి, వ్యాక్సిన్‌ల కోసం రు. 35 వేల కోట్లను ఒకసారిగా కేటాయించడానికి ఆర్థిక సంఘం కట్టుబడి ఉంది. అయితే వ్యాక్సిన్ రవాణ, నిల్వ, టీకాలు వేయడానికి అవసరమైన ఇతర సామగ్రిని పరిగణనలోకి తీసుకోకుండానే దాదాపు 70 కోట్ల మందికి వ్యాక్సిన్‌లు ఇవ్వడానికి అయ్యే వ్యయం కూడా ఇందులోనే ఉంది. ఒకవేళ వ్యాక్సిన్‌ల సరఫరాకయ్యే వ్యయాన్ని సైతం ఇందులో చేర్చినట్లయితే అప్పుడు ఆ మొత్తంతో కేవలం 40 కోట్ల మందికి మాత్రమే వ్యాక్సిన్ వేసే అవకాశముంది.

ఇక ఆరోగ్య రంగ బడ్జెట్‌లో గుర్తించాల్సిన మరో అంశం ఆత్మనిర్భర్ స్వస్థ్య భారత్ యోజన పథకం. ఈ పథకానికి ఆరేళ్లలో రు. 64,180 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రాథమిక, మాధ్యమిక, తృతీయ ఆరోగ్య వ్యవస్థలలో సామర్థ్యాలను అభివృద్ధి పరచడం, వైద్య పరిశోధనా ప్రయోగశాలలను, ఇతర ప్రజారోగ్య సదుపాయాలను ఆధునీకరించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే, ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి ఎలాంటి కేటాయింపులు చేయలేదు. కేవలం ప్రకటన మాత్రమే చేశారు. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో దీని అమలు ఉండదని స్పష్టమవుతోంది.

ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయాన్ని ప్రస్తుతమున్న జిడిపిలో 1 శాతం నుండి 3 శాతానికి పెంచాలని ఆర్థిక సర్వే సూచించింది. కానీ కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఈ కోణం నుండి చూసినట్లైతే తిరోగమన దిశలో ఉన్నాయి. ప్రభుత్వ వైద్య రంగాన్ని లాభాల కోసం కాకుండా ప్రజా కోణంలో చూడాల్సిన అవసరాన్ని దాన్ని ప్రజాస్వామ్య, రాజకీయ శక్తులన్నీ తమ రాజకీయ ఎజెండాలో ప్రాధాన్యతాంశంగా తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ బడ్జెట్ గుర్తించింది.

విస్మరణకు గురైన విద్యారంగం

ఏ సమాజంలోనైనా అవిద్య మొదటిగా పేదరిక సమస్యను పెంచుతుంది. పేదరికం, లింగ అసమానతలవల్ల తీవ్రంగా బాలికలు నష్టపోతారు. ఏ దేశంలోనైనా బాలిక విద్యాభివృద్ధికి ప్రభుత్వ పెట్టుబడులు పెట్టకపోతే ఆ దేశం స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించలేదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యా రంగంపై ప్రభుత్వం చేస్తున్నది ఖర్చుకాదు, ఆర్థిక వృద్ధికి మూలధన పెట్టుబడిగా అర్థం చేసుకోవాలి. ఇది వ్యక్తిగత, ఆర్థిక వృద్ధికి దారితీస్తుందని, ఆర్థిక పోటీతత్వాన్ని, దేశ ఉత్పత్తిని పెంపొందిస్తుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అందరికీ నాణ్యమైన విద్య అనే అంశం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో ఒకటి. దీనిని పాలకులు నిర్లక్ష్యం చేస్తే రాబోయే తరాలు నష్టపోతాయి. దేశం ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఎంతో వెనకబడుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో నూతన జాతీయ విద్యా విధానం సమర్థ అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ప్రకటించింది. కానీ కార్యాచరణ అమలుకు, డిజిటల్ సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

పాఠశాల విద్యలో బడ్జెట్ కేటాయింపులు (రు.కోట్లలో)

వివరాలు	2019-2020	2020-2021	2021-2022
కేంద్రీయ విద్యా సంస్థలు	6331.40	5516.50	6800
నవోదయ స్కూళ్ల సమితి	3387.60	3300	3800
ఎన్‌సిఇ రటి	276.05	300	500
సమగ్ర శిక్ష అభియాన్	32376.52	38750.50	31050.16
ఉపాధ్యాయ శిక్షణ	-	110	250
మధ్యాహ్న భోజన పథకం	9699	11000	11500
మదర్సాలు, మైనారిటీ విద్య	70.94	200	-
ఎన్‌సిఇ రటి	-	-	495

ఆధారం : 2021-22 బడ్జెట్ ప్రతి

ఈ సంక్షోభ కాలంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కేవలం మొక్కుబడిగా అరకొర కేటాయింపులు మాత్రమే చేసింది. మొత్తం బడ్జెట్‌లో గత సంవత్సరం 3.26 శాతం ఉండగా అది ఈ బడ్జెట్‌లో 2.67 శాతానికి తగ్గింది. గత సంవత్సరం విద్యకు రు. 99 వేల 311 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరానికి అది రు. 93 వేల 225 కోట్లకు తగ్గింది. దీనిలో పాఠశాల విద్యకు రు. 54,874 కోట్లు. గత బడ్జెట్‌లో రు. 59,845 కోట్లు కేటాయించగా, ఉన్నత విద్యకు రు. 38,351 కోట్లు గత సంవత్సరం రు. 39,466 కోట్లు కేటాయించింది. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10 శాతం విద్యకు కేటాయించాలని లేదా స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం తగ్గకుండా విద్యకు కేటాయించాలని 1966లో డా. కొఠారి కమిషన్ మొదలుకొని ఇటీవలి 2019 ప్రొ. కస్తూరి రంగన్ కమిటీ అందించిన నూతన జాతీయ విద్యా విధానం వరకు మార్గనిర్దేశనం చేసినాయి. అయినప్పటికీ విద్యారంగానికి కేటాయింపులు 2.67 శాతం మాత్రమే కేటాయించడమంటే ప్రభుత్వాలకు విద్యారంగం పట్ల ఉన్న వివక్షతకు అద్దం పడుతున్నది. మరోవైపు రోజు రోజుకీ విద్య ప్రైవేట్ రంగంలోకి వేగంగా చొచ్చుకొస్తోంది. పర్యవసానంగా విద్యలో రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయం కొరవడుతుంది. ఈ నేపథ్యంలో విద్య కోసం కేటాయింపుల్ని భారీగా పెంచాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో అవి గణనీయంగా తగ్గాయి. విద్యకు ఈసారి గత ఏడాది కేటాయింపులతో పోల్చితే 6 శాతం కోతపడిందని గణాంకాలు చెబుతున్నాయి. సర్వశిక్షా అభియాన్‌కు గత సంవత్సరం రు. 38,750 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో ఆ పథకానికి కేవలం రు. 31,050 కోట్లతో సరిపెట్టారు. ఈ పథకం కింద రాష్ట్రాలకూ, కేంద్ర పాలిత ప్రాంతాలకూ, కొండా ప్రాంతాల్లోనూ, మారుమూల ప్రాంతాల్లోనూ నడిచే సాధారణ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. దళిత, ఆదివాసీ పిల్లల్లో డ్రాపౌట్ల శాతం ఎక్కువగా ఉంటుందన్నది గుర్తించి, వారికీ అవసరమైన సదుపాయాల కల్పన కోసం చేసిన కేటాయింపులు కాస్త తగ్గితే దాని ప్రభావం ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఈ బడ్జెట్ 750 ఏకలవ్య మోడల్ ఆశ్రమ పాఠశాలలను కొత్తగా గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఒక్కో పాఠశాలకు నిర్మాణానికి అయ్యే ఖర్చును రు. 20 కోట్ల నుండి రు. 38 కోట్లకు పెంచారు. కొండ ప్రాంతాల్లోనైతే దీనిని రు. 48 కోట్లకు పెంచారు. ఒక్కో పాఠశాలకు రు. 38 కోట్ల చొప్పున లెక్క వేసిన ఇందుకు రు. 22,500 కోట్లు అవసరం. అయితే బడ్జెట్‌లో అధనంగా కేటాయించినది కేవలం రు. 100 కోట్లు మాత్రమే. గత ఏడాది రు. 1313 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రు. 1418 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం 588 ఏకలవ్య పాఠశాలలు ఉంటే అందులో 303 పనిచేయడం లేదు. కేవలం 191 పాఠశాలలకు మాత్రమే భవనాలు పూర్తి అయ్యాయి. నిధుల కొరత ఎంత తీవ్రంగా ఉందో ఈ వాస్తవాలు స్పష్టంగా తెలియ జేస్తున్నాయి. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయకుండానే ప్రభుత్వం కొత్తగా 750 పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం, అందుకోసం కేవలం రు. 100 కోట్లు మాత్రమే కేటాయించడం అంటే ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవాలి..

ఉన్నత విద్యలో బడ్జెట్ కేటాయింపులు (రు.కోట్లలో):

వివరాలు	2019-20	2020-21	2021-22
ప్రపంచ స్థాయి విద్య	224.10	500	1710
విద్యార్థులకు సాయం	2069.95	2316	2482.32
డిజిటల్ ఇండియా	457.58	444.40	645.61
పరిశోధన ఆవిష్కరణ	25708	307.40	237.40
యూనివర్సిటీ గ్రాంట్స్	4435.58	4693.20	4696.20
ఎఐసిటిఇ	436	416	416
సెంట్రల్ గ్రాంట్స్	798.84	7643.26	7643.26
సెంట్రల్ యూనివర్సిటీ	-	60.35	60.35
ఏపి, తెలంగాణ	0.63	53.80	53.80
డీమ్డ్ యూనివర్సిటీస్	418.02	351	351
ఐఐటిలు	6365.92	7182	7536.02
ఐఐటి హైదరాబాద్	230	150	150
ఐఐఎం	481.29	476	476

ఆధారం : 2021-22 బడ్జెట్ ప్రతి

ఉన్నత విద్య నిధి సంస్థకు గత సంవత్సరం రు. 2,100 కోట్లు కేటాయించగా, అదిప్పుడు రు. 1,000 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ సంవత్సరం ఉన్నత విద్యకు రు. 1,100 కోట్ల మేర కోత పెట్టారు. ముందుచూపుగా ప్రభుత్వం మార్కెట్ ద్వారా మొత్తాన్ని సేకరించి, ఆ నిధులతో కేంద్రీయ విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు పదేళ్లలో చెల్లించే విధంగా రుణాలివ్వాలని 2016లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆనాటి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అయితే మధ్యాహ్న భోజనం, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు వగైరాలకు నిధులు స్వల్పంగా పెరిగాయి. ప్రైవేట్ పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కొత్తగా 100 సైనిక స్కూళ్లు నెలకొల్పబోతున్నట్టు సైనిక స్కూల్స్ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. కరోనా వైరస్ తీసుకొచ్చిన కొత్త ఇబ్బందుల నేపథ్యంలో పిల్లల ఆరోగ్యం, వారి సామాజిక సంరక్షణ వగైరాలకు అదనంగా వ్యయం చేయాల్సి ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వం దీన్ని పట్టించుకున్న ధాఖలా లేదు. నూతన జాతీయ విద్యా విధానం సాంకేతిక వనరులను సమృద్ధిగా వినియోగించుకుని మన విద్యార్థుల్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పింది. కానీ నూతన జాతీయ విద్యా విధానం అమలుపై పార్లమెంట్‌లో చర్చించనే లేదు. అయినా ప్రభుత్వం అందులోని ప్రతిపాదనలు అమలులోకి తీసుకురావడం అప్రజాస్వామికం. నూతన విద్యా విధానం జాతి ప్రయోజనాలకు, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నష్టదాయకంగా ఉందని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అంతేకాక ఎన్‌ఇపిలో మార్కెట్, మతం, కేంద్రీకరణకు ప్రాధాన్యతలు ఇవ్వబడ్డాయి. ఇది

సామాన్యులకు అక్కరకు రాని బడ్జెట్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌ల ప్రయోజనాలకు తప్ప సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా లేదని అంటున్నారు

అవినాష్ భారత

ఈ ఇయర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు చాలా దూరంలో ఉండి కార్పొరేట్ సేవలో మునిగి తేలేందుకు అర్రులు చాచే విధంగా ఉందని నిశ్చితంగా ఉంది. ఈ బడ్జెట్ నేర్పుతున్న కొత్త పాఠం ఏమిటో తెలుసా ఆహార సబ్సిడీ పైన ఆధారపడుతున్న 67 శాతం మందికి సబ్సిడీలో కత్తెరపెట్టడమనే గొప్ప వినాశకర పాఠాన్ని ఈ బడ్జెట్ చెపుతున్నది. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎల్ఐసిని ప్రైవేట్ పరం చేయాలని చూడడమే గొప్ప ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని ప్రకటించి ఆరోగ్య సంక్షోభం తర్వాత ఆర్థిక వ్యవస్థను బాగుచేసే అవకాశాన్ని ఈ బడ్జెట్ చేజార్చుకున్నదని నిశ్చింతగా చెప్పవచ్చు.

అటు బ్యాంక్‌లను ప్రైవేట్ పరం చేస్తూ, ఇటు ప్రభుత్వ ఆర్థిక సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ ప్రభుత్వం ఆర్థిక రాక్షస ఆనందాన్ని పొంది పేదలను మరింత పేదలను చేస్తున్నది. ఇక అగ్రిసెస్ అనే కొత్త పన్నును ప్రైవేటైజేషన్ అనే పదాన్ని బహిరంగంగా ఎలాంటి మోహమాటం లేకుండా మొదటిసారి ప్రకటించి ప్రభుత్వం తన పరువును తానే తీసుకున్నది.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం తలెత్తిన తరవాత ఏ చిన్న పిల్లవాడిని అడిగిన చెబుతారు ఆరోగ్య రంగానికి నిధులు పెంచుతారని కానీ ఈ ప్రభుత్వం ఆర్థిక రంగానికి డైరెక్ట్‌గా కేటాయించిన నిధులు పోయిన సంవత్సరంతో పోలిస్తే 6,000 కోట్లు తక్కువే అనే విషయం గమనించవలసిందే. మరోవైపు ప్రభుత్వం డిజిటల్ ఇండియా జపం చేస్తూ, మరోవైపు మొబైల్ ఫోన్ల ధర పెంచుతూ తన ద్వంద నీతిని చాటుతున్నది.

ఎరువుల పైన సబ్సిడీని 40 శాతం తగ్గిస్తూ ఢిల్లీలో రైతాంగ పోరాటం చేస్తున్న కర్షకులకు ఏమి సందేశం ఇస్తున్నది. సామాన్య వేతన జీవులకు స్లాబులలో ఎలాంటి మార్పులు చేయకుండా ఉద్యోగులకు, వేతన జీవులకు మొండి చెయ్యి చూపిస్తున్నది. వ్యవసాయ మౌలిక వసతుల

రాజ్యాంగ స్ఫూర్తిని అతిక్రమించే విధంగా ఉంది. ఎన్ఇపి సిఫారసుల మేరకు దేశ వ్యాప్తంగా 15 వేల ఆదర్శ పాఠశాలలను నాణ్యతాపరంగా నెలకొల్పుతామని వెల్లడించారు. ఇవి మొత్తం పాఠశాలల్లో ఒక్క శాతం కన్నా తక్కువే. మొత్తం పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలి. అప్పుడే ఎన్ఇపి సమర్ధ అమలులో ఇతర పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తాయి. అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న విశ్వవిద్యాలయాల్లో నియామకాలు, మౌలిక వసతుల గురించి కేటాయింపులు లేవు. ఫలితంగా ఈ విద్యాలయాలు నిర్వీర్యం కానున్నాయి. ఉన్న విశ్వవిద్యాలయాలకు నిధుల గురించి ప్రస్తావించకుండానే లేహ్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉంది. ఉన్నత విద్యలో విదేశీ విద్యా సంస్థలకు గేట్లు బార్లా తెరిచి వాటిలో బహుళ డిగ్రీలు, గిరాకీ ఉన్న కోర్సులకు అనుమతులు ఇచ్చి వాటిని ప్రోత్సహించుటకు ఒక వ్యవస్థనే ఏర్పాటు చేసింది. ఇంత శ్రద్ధ దేశీయ విద్యపై లేకపోవడం గమనార్హం.

ప్రపంచ బ్యాంకు ఒప్పందం మేరకు ఈ ప్రభుత్వం విద్యారంగ ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు వేగంగా చర్యలు తీసుకుంటూనే, విద్యను కాషాయీకరించేందుకు, మార్కెటీకరించేందుకు వేగంగా పావులు కదుపుతుంది. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని లాక్‌డౌన్ కాలంలో పార్లమెంట్‌లో, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండానే కేవలం మంత్రివర్గ నిర్ణయంతో విధానాల అమలుకు సిద్ధపడుతుంది. మన దేశంలో విద్య సంస్కరణల పేరుతో కేవలం ప్రపంచీకరణ విధానాలతో పాటు హిందుత్వ బ్రాహ్మణీయ భావజాలాన్ని విద్యలోకి చొప్పించే ప్రయత్నం జరుగుతుంది. ఈ నూతన విద్యా విధానం భారతీయతకు అనుకూలం అనుకుంటే పొరపాటే. ఆ పేరు మీద ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలకు చౌకగా కార్మికులను తయారు చేసి అప్పచెప్పడమేనని ప్రజలు గుర్తించాల్సిన తక్షణ అవసరముంది. దేశ ప్రజలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఉండాలంటే విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్లకు అప్పజెప్పకుండా శాస్త్రీయంగా పురోభివృద్ధికి కృషిచేయాలి. ఈ రెండు కీలక రంగాల అభివృద్ధి మీదనే మొత్తం సమాజాభివృద్ధి ఆధారపడుతుందనేది చారిత్రక సత్యం. ఈ రంగాలు వర్తమాన, భవిష్యత్ కాలాలకు అనువర్తనీయంగా బడ్జెట్ రూపొందించుకోవాల్సిన తక్షణ అవసరాన్ని పాలకులు గుర్తించాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం)

వీ

పరుచూరి రామస్వామి మృతి

***తొ**లి తరం కమ్యూనిస్టు సభ్యుడు పరుచూరి రామస్వామి(104) ఫిబ్రవరి 6న హైదరాబాద్‌లోని తార్నాకలో మరణించారు. దివి తాలూకా కోడూరులో జన్మించిన రామస్వామి, భూస్వామ్య వ్యవస్థను నిరసిస్తూ చల్లపల్లి జమిందారుపై జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. చంద్ర రామలింగయ్య, కోనేరు రాజగోపాలరావుతో కలిసి కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేశారు.*

హళ్లికి హళ్లి... సున్నకు సున్న

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే ఇంటికో ఉద్యోగం అన్నారు కాని నేటికీ నిరుద్యోగ సమస్య ఎక్కడేసిన గొంగలి అక్కడే ఉన్నట్లుగా ఉందని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

మనకో సామెత ఉంది... పంచ పాండవులు ఎందరంటే మంచం కోళ్ల లాగా ముగ్గురు అని రెండు వేళ్లు చూపించి చివరికి ఒక్కరే అన్నాడట ఓ ప్రబుద్ధుడు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెరాస తెలంగాణ ప్రజలకు ఇంటింటికో ఉద్యోగం అని వాగ్దానం చేసింది. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణాంశాలలో ప్రముఖంగా చెప్పుకున్నది యువతకు సరిపోయినన్ని ఉద్యోగాలు మాత్రమే కాదు, ఉద్యోగ భద్రత కూడా ఉండాలని, ఉంటుందని. తెరాస ఏర్పడ్డ మొదటి రోజులలో దేశ దేశాలలో ఉన్న తెలంగాణీయులను కూడా హడావిడిగా స్వదేశం రప్పించి, ఒక్కరోజు మొత్తం అన్ని కార్యకలాపాలను స్థంభింపచేసి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. ఆ సర్వేలో తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 83 లక్షల 40 వేల కుటుంబాలున్నాయని తేలింది. అంటే దాదాపు 84 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించే బాధ్యత ప్రధానంగా ప్రభుత్వానిదేనని తెరాస ప్రభుత్వం వాలంటరీగా అంగీకరించింది. అందుకు అనుగుణంగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆర్థిక విధానం రూపొందించుకున్నదా అన్నది ప్రశ్న! ప్రభుత్వం అనుసరించే ఆర్థిక విధానం ఆధారంగానే ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏ మేరకు అందుబాటులో ఉంటాయన్న విషయం స్పష్టమవుతుంది. భారతదేశంలో అంతర్భాగమైన తెలంగాణలో కూడా దేశం మొత్తం మీద అమలవుతున్న ఆర్థిక విధానాలే అమలయ్యే పరిస్థితి నుండి మినహాయింపు లేకపోయినా, తెలంగాణ ప్రభుత్వం తనకు తానుగా తన ప్రజలకు ఉపాధి కల్పనలో వెసులుబాటు కల్పించవలసిన కనీస బాధ్యతనైనా సరిగ్గా నిర్వహిస్తున్నదా అన్నది సందేహాస్పదమే!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజింపబడుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన ప్రభుత్వ రంగంలోని పోస్టులు 5,23,675. అంతకు ముందు శ్రీకృష్ణ కమిటీ తేల్చిన తెలంగాణ ఖాళీల సంఖ్య 1 లక్షా 7 వేలు. శ్రీకృష్ణ కమిటీ తన రిపోర్టు సమర్పించినప్పటి నుండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినమైన 2014 జూన్ 2 వరకు ఖాళీల సంఖ్య 2,18,826 అయినప్పటికీ ముఖ్యమంత్రి గారు 1,07,744 ఖాళీలు ఉన్నట్లు శాసన సభలో ప్రకటించారు. మూడు సంవత్సరాల లోపలే వాటిని భర్తీ చేస్తామని అధికారికంగా ప్రకటించాడు కూడా. కాని, గత ఏడేళ్లలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 35,724 ఖాళీలు మాత్రం భర్తీ చేసింది. ఇప్పుడు 50 వేల పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇప్పుడు మొత్తం ఉన్న పోస్టులు ఎన్ని, వాటిలో ఖాళీలు ఎన్ని, అందులో టీచర్ ఉద్యోగాలు, పోలీస్ ఉద్యోగాలు ఎన్ని ఉన్నాయి అన్న విషయంలో గందరగోళం నెలకొని ఉంది. పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం రోజుకొక లెక్క చెపుతూ, ప్రజలను మభ్యపెడుతూ పాండవులు ఎందరంటే చివరికి ఒక్కటిగా తేల్చిన వైనాన్ని గుర్తు చేస్తున్నది. ముచ్చటగా 30 నెలల తర్వాత 2020 డిసెంబర్ 31న తమ నివేదిక సమర్పించిన వేతన సవరణ సంఘం మరికొన్ని గణాంకాలు పేర్కొంది. అది ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన అధికారిక 'కమిషన్' కాబట్టి వాటిని నిజమైన గణాంకాలుగా పరిగణనలోకి తీసుకోవాలి. వారి నివేదిక ప్రకారం ఉండవలసిన ఉద్యోగాల సంఖ్య 4,91,304 కాగా, 1,91,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నిధిని ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించి ఆ నిధులను ఎలా సేకరిస్తారో తెలుపనే లేదు.

అసలు ప్రభుత్వానికి వ్యవసాయ రంగ విధానాలపైన ఒక ప్రణాళిక లేకపోవడం దురదృష్టకరం. మరోవైపు షిప్పింగ్ రంగాన్ని కూడా ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్ మత్తులో మునిగిపోయింది. ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవాలనే ఏకైక లక్ష్యంతో ఈ బడ్జెట్ తీరుతెన్నులు చూసిన ఎవరికైనా అవగతమవుతున్నది. కానీ అలా సేకరించిన నిధులని సరైన విధానంలో ఖర్చు చేయడానికి ఒక ప్లాన్ లేకుండా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టింది.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన పథకాలను వర్ణించడానికి మాత్రమే ఎక్కువ సమయం కేటాయించడం వల్ల ప్రభుత్వం పాత పాటనే కొత్తగా పాడింది. ఎన్నికలు జరిగే తమిళనాడు, అస్సాం, కలకత్తా లాంటి రాష్ట్రాలకి ఎక్కువ నిధులు కేటాయిస్తూ తనలోని రాజకీయ కోణాన్ని నిర్భీతిగా, ఎలాంటి దాపరికాలు లేకుండా ప్రకటించుకొని అపహాస్యం పాలయ్యింది. ఒక్క తమిళనాడులోనే 1.03 లక్షల కోట్లు కేటాయించడమే దీనికి నిదర్శనం.

మరోవైపు దేశాన్ని పెట్రో గ్యాస్ మంటలు ఆలుముకుంటున్నాయి. ఈ 15 రోజులలోనే గ్యాస్ ధర 5 సార్లు పెరగడం దీనికి నిదర్శనం. ఎప్పుడైతే గ్యాస్ ధరలు నిర్ణయించే అధికారం కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారో అప్పటి నుండి ధరలు ఇష్టారాజ్యంగా పెరుగుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. అటు కరోన సంక్షోభం, ఇటు పెట్రో మంటలు సామాన్యుని పరిస్థితి ఆడకత్తెరలో పోక చెక్కలా తయారయ్యింది. మొత్తంగా చూస్తే ఈ బడ్జెట్ క్యాపిటలిస్ట్ ఫర్ పూర్ సోషలిస్ట్ ఫర్ రిచ్‌గా ఈ బడ్జెట్‌ను అభివర్ణించవచ్చు.

(రచయిత విద్యార్థి)

వీ

ఖాళీగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతి పదవుల విషయంలో తెలంగాణ గవర్నర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా అభిశంసించింది. పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది సజీవ ఉదాహరణ. సాక్షాత్తు రాష్ట్ర గవర్నరే కలగజేసుకొని తన ఆగ్రహాన్ని ప్రదర్శిస్తే గాని ప్రభుత్వంలో చలనం రాలేదు. ఏడు విశ్వవిద్యాలయాలలో 1,495 అధ్యాపక పోస్టులు, 2,700 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే విద్యారంగం పట్ల ప్రభుత్వం ఎంత ఉదాసీనత ప్రదర్శిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ ఏర్పడ్డప్పుడు ఉన్న 5,23,675 పోస్టులు ఆరేళ్ల కాలంలో 4,91,304 పోస్టులుగా ఎలా కుదించుకుపోయాయో అంతు దొరకని చిక్కు ప్రశ్న. 1952 ముల్కీ ఆందోళన నుండి తెలంగాణలో విద్యావంతులను, చదువుకున్న వారిని వేధిస్తున్న సమస్య ఉద్యోగాల సమస్యనే. 1956లో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందంలో ముఖ్యంగా ఉద్యోగులలో తెలంగాణ వారి న్యాయమైన వాటా గురించిన నిబంధన ఉల్లంఘన జరిగిందన్న కారణంగానే 1969 ఉద్యమం వచ్చింది. ఆ తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వులు, జై భారతరెడ్డి కమిటీ, 610 జిఒ, గిర్‌గ్లాని కమిషన్ అన్నీ కూడా నిరుద్యోగ సమస్య. ఉద్యోగాలు అన్యాయంగా, బలవంతంగా మాకు కాకుండా చేస్తున్నారన్న అశాంతితోనే ఉనికిలోకి వచ్చాయి. 1996 నుండి 2014 దాకా జరిగిన మలి ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అన్న అంశం చుట్టే ప్రభంజనంగా రూపొందింది.

ప్రభుత్వ ఉద్యోగాల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో సోదాహరణంగా వివరించాలంటే ఓ సంఘటన గురించి చెప్పుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన రెండు, మూడేళ్లకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పదివేల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రకటన ఇచ్చింది. పదివేల పోస్టులకు అయిదు లక్షల అరవై మూడు వేల మంది అభ్యర్థులు ఈ దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన వారిలో 1,462 మంది బి.టెక్ గ్రాడ్యుయేట్లు, 895 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 243 మంది ఎంబిఎలు, 103 మంది ఎంసిఎలు, 100 మంది బిఎడ్‌లు, 47 మంది బి. ఫార్మసీ గ్రాడ్యుయేట్లు, ఐదుగురు లా గ్రాడ్యుయేట్లు ఉన్నారు. వీరంతా కానిస్టేబుల్ పోస్టులకు ఎంపిక అయినవాళ్లు. ఎంపిక కాకుండా మిగిలిపోయిన వారిలో కొంతమంది పిహెచ్‌డి పట్టా పొందినవారు కూడా ఉండడం గమనార్హం. చిన్నదైనా, పెద్దదైనా ప్రభుత్వ ఉద్యోగానికుండే ప్రత్యేకత వేరు. 'ఆర్థిక అసమానతలతో పాటు, సామాజిక అసమానతలున్న మన సమాజంలో ప్రభుత్వ ఉద్యోగం ఆ అసమానతల నుండి బయట పడడానికి ఉన్న ఏకైక మార్గం' అని అంటారు ప్రొ. కోదండరామ్-('నిరుద్యోగ సమస్య' బుక్‌లెట్). అంతేకాదు, ప్రభుత్వ ఉద్యోగం వలన పాలనలో భాగస్వామ్యం దొరుకుతుంది. అది ఎంతో కాలంగా అణగారిన వర్గాలకు బలమైన చేయూతనిస్తుంది. కాని, కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతులతో కాలం వెళ్లబుచ్చుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో 58,128 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, 50,400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారని బిస్వాల్ నేతృత్వంలోని వేతన సవరణ సంఘం పేర్కొంది. ఇవికాక డిగ్రీ, జూనియర్ కళాశాలలలో పనిచేసే కంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లతో పాటు 16 వేల మంది దాకా స్కూళ్లలో పనిచేసే విద్యా వాలంటీర్లు ఉన్నారు. వీళ్లెవరికీ ఉద్యోగ భద్రత లేదు. రోజు కూలీలతో సమానం. ఒప్పంద ఉద్యోగుల సర్వీసులు రెగ్యులరైజ్ చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి అసెంబ్లీ ఆమోదించిన 'చట్టం 2/1994' (యాక్ట్ 2 ఆఫ్ 1994) అడ్డంకి. ఉద్యమ సమయంలో రాబోయే తెలంగాణ రాష్ట్రంలో అసలు కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉండరని బీరాలు పలికిన అధినేతలు, కాంట్రాక్ట్ ఛీఫ్ మినిస్టర్ అని హాస్యోక్తులు, వ్యంగోక్తులు పలికిన నేటి ముఖ్యమంత్రి ఈ ఏడేళ్లలో ఆ చట్టాన్ని రద్దు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తెరాస ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించింది.

ప్రజలకు బతుకుతెరువు లభించాలంటే ఒక్క ప్రభుత్వ ఉద్యోగాల వల్లనే సాధ్యం కాదు. సమాజం నడవడానికి కావల్సిన ఎన్నో ఆర్థిక కార్యకలాపాల వల్లనే మెజారిటీ ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగాల వల్ల వస్తు ఉత్పత్తి జరగదు. ప్రభుత్వ పాలన, విద్య, వైద్య, బ్యాంకింగ్ లాంటి జరూరుగా జరగవలసిన పనులు మాత్రమే జరుగుతాయి. సమాజ మనుగడకు కావల్సింది వ్యవసాయ ఉత్పత్తులు, వస్తు ఉత్పత్తులు. వీటితో పాటు వివిధ రకాలైన సేవలు కూడా అవసరం. వీటన్నింటిలో వ్యవసాయ రంగం అధిక జనాభాకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం, పశుపోషణ మీద 43.56 శాతం జనాభా ఆధారపడి ఉన్నది. దీనికి పోటీగా 43.58 శాతం జనాభా సేవారంగం మీద ఆధారపడి బతుకుతున్నది. ఉత్పత్తి ప్రధానంగా ఉన్న వ్యవసాయ రంగం, వ్యవసాయ సంబంధిత రంగాలపై ఆధారపడి బతుకుతున్న జనాభా, ఏమాత్రం ఉత్పత్తి లేని సేవా రంగాలపై బతుకుతున్న జనాభా రెండూ సమానమే అవడం విషాదం. మనలను ఆశ్చర్యానికి గురిచేసే ఇంకో విషయం ఏమిటంటే తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 65.2 శాతం వాటా సేవారంగం నుండే వస్తున్నది. వ్యవసాయ రంగం నుండి వస్తున్న రాష్ట్ర ఆదాయం 6.9 శాతం మాత్రమే. 2019-20వ ఆర్థిక సంవత్సరంలో పశు పోషణ రంగం నుండి వచ్చిన ఆదాయపు వాటా 7.6 శాతం. సేవా రంగాలలో అన్ని రంగాల కన్నా ఎక్కువగా రియల్ ఎస్టేట్ రంగం నుండి 22.5 శాతం రాబడి రాష్ట్ర ఖజానాకు చేరుతుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తర్వాత వ్యవసాయ రంగం నుండి సేవా రంగాలకు వలసలు ఎక్కువయ్యాయి. వ్యవసాయం నుండి ఆదాయం అంతగా రాకపోవడమే దీనికి కారణం. తెలంగాణ రాష్ట్ర సమితి రైతు అనుకూల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్నా, రైతుబంధు పథకానికి వేల కోట్ల రూపాయలు ప్రతి ఏటా కేటాయిస్తున్నామని బాకాలు ఊదుకుంటున్నా, సాగునీటి ప్రాజెక్టులకు ధనాన్ని అపరిమితంగా ధారపోస్తున్నామని చెప్పుకుంటున్నా వ్యవసాయం ఆదాయ వనరుగా లేదన్నది వాస్తవం. హైదరాబాద్ నగరంలో ఆటోలు నడిపే వారిలో తొంభై శాతం మంది చుట్టుపక్క జిల్లాల నుండి, గ్రామాల నుండి వలస వచ్చిన వారే ఉంటారు. భవన నిర్మాణ పనుల్లోనూ గ్రామాల నుండి బతుకుదెరువు కోసం పట్నం వచ్చిన వాళ్లే ఉంటారు. చాలా మంది వాచ్‌మెన్‌లుగా, టాక్సీ డ్రైవర్‌లుగా, పని మనుషులుగా గ్రామాల నుండి వలస వచ్చినవారే నగరాలలో కనిపిస్తారు. వారికి ఒక ఎకరమో, రెండెకరాలో ఎంతో కొంత పొలం గ్రామంలో ఉంటుంది. కాని వ్యవసాయంలో కష్టానికి సరైన ప్రతిఫలం దొరక్క, ఉన్న పొలాన్ని కౌలుకు

తెలంగాణ ఉపాధ్యాయులపై అపనిందలు

వేతన సవరణ కమిషన్ సిఫారసుల సందర్భంగా పాలకులు ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులపై వేయించిన నిందలకు జవాబు చెపుతున్నారు **కె.వేణుగోపాల్**

ఆరేళ్ల స్వరాష్ట్ర పాలనలో "ఉద్యోగుల ఫ్రెండ్లీ" ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై ఒక్కసారియైనా చర్చించి, ఒక్క సమస్యను పరిష్కరించింది లేదు. పైగా 2015లో 43 శాతం ఫిట్ మెంట్‌తో వేతనసవరణ చేయడమే ఉద్యోగులకు చేసిన మహోపకారమనే విధంగా ప్రచారం జరుగుతోంది. ఇక విద్యారంగం గురించి, ఉపాధ్యాయులగురించి ప్రభుత్వ విధానాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆరేళ్లలో ప్రభుత్వ విద్యారంగం మరింత దిగజారింది. మొదటి వేతన సవరణ కమిషన్ సిఫార్సుల అమలు సందర్భంగా రాయించిన రాతలు, కథనాలు రాష్ట్రంలో పాఠశాల విద్యా వ్యవస్థ పరిణామం, చరిత్ర, వివక్ష క లేని సర్వీస్ కండిషన్ లకోసం జరిగిన పోరాటాల పట్ల అవగాహన రాహిత్యం గాను, అపరిపక్వంగాను ఉంది. పైగా ఉపాధ్యాయులవట్ల కక్ష సాధింపుతో ఉంది. ఉపాధ్యాయ ఉద్యమాలను అవమానించేది గా ఉంది.విద్యా వ్యవస్థ పై ప్రభుత్వ నిర్లక్ష్యం, దార్శనికత లోపం కనపడుతోంది.

ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగులేనా?

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ ప్రాంతం హైద్రాబాద్ రాష్ట్రం గా కొనసాగుతున్న కాలంలో పాఠశాలలు ప్రభుత్వ ఆధీనంలో ఉండేవి. ఉపాధ్యాయుల వేతనాలను, నిర్దిష్ట వేతన స్కే ళ్ళలో తో జీతాలు ప్రభుత్వమే చెల్లించేది. ఉద్యోగ భద్రత,పెన్షన్ సౌకర్యం ఉండేది.ఆంధ్ర ప్రాంతంలో తక్కువ సంఖ్యలో ప్రభుత్వపాఠశాలలు, మెజారిటీగా జిల్లా బోర్డుల ఆధ్వర్యంలో పాఠశాలలు ఉండేవి. బోర్డుపాఠశాలలకు ప్రభుత్వం గ్రాంట్ రూపేణ ఆర్థిక సహాయం అందించేది. స్థానిక బోర్డుల దయాదాక్షిణ్యాలమేరకు ఉపాధ్యాయుల సర్వీస్ పరిస్థితులు ఉండేవి.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫార్సుల మేరకు స్థానిక సంస్థలను ఏర్పాటు చేస్తూవిద్యను స్థానిక సంస్థలకు అప్పగించే క్రమంలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆంధ్రాలోని ప్రభుత్వ మరియు బోర్డుపాఠశాలలను స్థానిక సంస్థలైన జిల్లా పరిషత్ /మున్సిపల్ (ఆంధ్ర ప్రాంతంలో మాత్రమే) యాజమాన్యాల ఆధీనంలోకివచ్చాయి.1956కు ముందు నియామక మైన ప్రభుత్వ ఉపాధ్యాయులు స్థానిక సంస్థల ఆధ్వర్యంలో పనిచేశారు. తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు అట్లే కొనసాగాయి. మున్సిపల్ సంస్థలకు పాఠశాలల బదిలీ జరగలేదు. స్థానిక సంస్థలకే ఉపాధ్యాయుల నియామక అధికారాలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో నియామకాలు మాత్రం ప్రభుత్వం జరిపేది. ఉపాధ్యాయుల

ఇచ్చి వారు నగరానికి పని వెతుక్కుంటూ వచ్చి, ఇక్కడ చిన్న చిన్న ఉద్యోగాల్లో ఉపాధి పొందుతారు. వారు సరిగ్గా సమయానికి గ్రామాలకు వెళ్లి రైతుబంధు పథకం కింద ఇచ్చే డబ్బును తీసుకొని మళ్లీ నగరానికి చేరుకుంటున్నారు తప్ప ఆ డబ్బును వ్యవసాయం మీద పెట్టుబడిగా పెట్టడం లేదు. దాదాపు నలభై శాతం లబ్దిదారులలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం. ప్రకృతి వైపరీత్యాల నుండి పంటను, రైతులను కాపాడే యంత్రాంగం ప్రభుత్వానికి లేకపోవడం. తెలంగాణ ప్రభుత్వం సేవా రంగాలకు క్రియాత్మకంగా ప్రోత్సాహం ఇస్తున్నది కాని, మాటల ద్వారా మాత్రమే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నట్లుగా కనిపిస్తుంది.

సేవా రంగాల వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది కాని, ఆ రంగాలు ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించలేవు. ఉపాధి ఉన్నా అరకొర జీతాలు, భద్రత లేని ఉద్యోగాలు. తెలంగాణ ప్రభుత్వం సేవా రంగాలకు ఇస్తున్న ప్రాముఖ్యత వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతున్నది–ఉపాధి అవకాశాలు మాత్రం తగ్గుతున్నవి. దొరుకుతున్న ఉపాధి కూడా గాలిలో దీపం లాగా మినుకు మినుకుమంటున్నదే! మరో ఉత్పత్తి రంగమైన పారిశ్రామిక రంగం కూడా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైంది. వస్తు ఉత్పత్తి ఏమీలేని ఐటి రంగానికి తెరాస ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం వస్తు ఉత్పత్తి రంగానికి ఇవ్వడం లేదు.

తెలంగాణ ఆర్థిక రంగాన్ని, ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను విశ్లేషిస్తే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ ఏడేళ్లలో రాష్ట్ర ఆదాయం పెరిగింది వాస్తవమే కాని, ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ప్రజల నిజ ఆదాయం తగ్గిపోయింది. ఉపాధి రంగంలో అభద్రతా భావం పెరిగిపోయింది అన్న వాస్తవాలు వెలుగు చూస్తాయి. కోవిడ్ వైరస్ వల్ల ఉపాధి రంగం ఇంకా అతలాకుతలం అయిపోయింది. నిరుద్యోగ సమస్య ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం కలిగిన సమస్యగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది రాజకీయ సంకల్పం ఉంటేనే అయ్యే పని. ఉపాధి లేని అభివృద్ధి వైపు అతిగా దృష్టి సారించకుండా, ప్రజలందరికీ ఉపాధి అవకాశాలు ఉండేలా పారిశ్రామిక విధానం ఉండాలి. ప్రభుత్వ పాలన గుణాత్మకంగా సాగాలంటే ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీలేవీ ఉండకూడదు.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్)

వీ

నియామకవిధానాలలో తేడాతో ప్రభుత్వ ఉపాధ్యాయులుతో సమానంగా స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు సర్వీసు నిబంధనలు అమలు కాలేదు. వేతనాల చెల్లింపు, సెలవులుఇతర సౌకర్యాల వర్తింపులో వివక్షత కొనసాగింది. దీనికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు దశాబ్ద కాలంగా చేసిన ఆందోళన ఫలితంగా స్థానిక సంస్థలఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రకటిస్తూ 1981లో అసెంబ్లీలో చేసిన చట్టం ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని ఇతర ఉద్యోగులతో పాటుఉపాధ్యాయులను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రావిన్షియలైజేషన్ జరిగింది. అంటే 1981 నుండిపంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా గుర్తించబడి ఇతర ఉద్యోగులకు వర్తించే రాజ్యాంగనిబంధనలు, క్రమశిక్షణ నియమావళి (సీసీఏ నిబంధనలు),సెలవు నిబంధనలు,పెన్షన్ రూల్స్ వర్తింపజేయబడ్డాయి. అల్లే ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తించే నియామక నిబంధనల జీవో 78లోని నిబంధనలను కూడా జిఓ 278 ద్వారావర్తింపజేయబడ్డాయి. రాజ్యాంగములోని 309 అధికరణము ననుసరించి ఒకే జిల్లాఎంపిక కమిటీ (డిఎస్‌సి) ద్వారా ఉపాధ్యాయుల నియామకాలను జరుపుతోంది. మౌలికంగా ప్రభుత్వ మరియు పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలలో తేడాలేకపోయినా విద్యా పాలనలోని పర్యవేక్షణ పోస్టు లైన ఆనాటి డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, సమితిస్థాయిలోని విద్యాధికారి, (నేటిమండల విద్యాధికారి), డిప్యూటీ విద్యాధికారి,డీఈవో, విద్యా కళాశాలలోని (కాలేజ్ ఆఫ్ఎడ్యుకేషన్)లెక్చరర్లు, డైట్ కళాశాల లెక్చరర్లు గా పదోన్నతులకు పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అర్హత కల్పించాలనే డిమాండ్ మేరకు మరొక దశాబ్ద పోరాటం తర్వాత 1992లో జీవో 40 ద్వారా పంచాయతీ రాజ్ మరియు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసులను ఏకీకృతం చేశారు.న్యాయస్థానంలో ఈ ఉత్తర్వులను సవాలు చేసినపుడు ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది. 90వదశకంలో సుందరేషన్ ఏకసభ్య కమిటీ విద్యా శాఖలోని పర్యవేక్షణ/ పాలనా సంబంధమైన పోస్టులకు పదోన్నతులవిషయంలో విద్యార్థుల బోధనకు ప్రత్యక్ష సంబంధం ఉండే పర్యవేక్షణ పోస్టులకు, పాలనా పోస్టులకు బోధనలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు అర్హత కల్పించాలని, కార్యాలయ సంబంధమైన పాలనా పోస్టులకు బోధనేతరసిబ్బందికి అవకాశం కల్పించాలని కీలక సిఫార్సులు చేసింది. రాష్ట్రంలో 6 సంవత్సరాలుగా జరిగిన ఉమ్మడి పోరాటాల ఫలితంగా ఈ సిఫార్సుల నేపథ్యంలో బోధనలో ప్రత్యక్ష సంబంధంఉండే ఉపాధ్యాయులు కూడా ఎంఇఒ, డిప్యూటీ విద్యాధికారి,డైట్ కళాశాల లెక్చరర్లు,విద్యా కళాశాల లెక్చరర్లు గా అర్హతకల్పిస్తూ, ఉన్నత పాలనా పోస్టులకు అందరినీ అంటే ఉపాధ్యాయ, మినిస్టీరియల్ సిబ్బందిని ఉమ్మడిగా అర్హులుగాచేస్తూ 1998లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు 505, 535 జీవోల ద్వారా కామన్ సర్వీస్ రూల్స్ విడుదల చేసి విద్యాశాఖలోని బోధనా సిబ్బంది సర్వీసులను ఏకీకృతం చేశారు. కొద్ది కాలం ఉమ్మడి సర్వీసు రూల్స్ ప్రకారం ఉపాధ్యాయులు ప్రయోజనాలు పొందినారు. న్యాయ వివాదాల నేపథ్యంలో 2005 వైయస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జీవోలు 95, 96 ల ద్వారా మరొకసారి ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలులోనికి వచ్చి కామన్ సీనియారిటీ ప్రాతిపదికన ప్రభుత్వ, మరియు పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ఈ జీవోలు కూడా లోకల్ కేడర్ అంశంపై న్యాయస్థానంలో నిలువలేదు. తర్వాత విద్యాశాఖలో పదోన్నతులు నిలిచిపోవడంతో తాత్కాలిక ఏర్పాటుగా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో యాజమాన్యంవారీగా పదోన్నతులు ఇవ్వడానికి జీవోలు 9,10,11మరియు 12 విడుదల చేసి పాఠశాలల అవసరాలు తీర్చుతున్నారు.

స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానా నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు మరియు ఇతర ఖర్చులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో నిధులను మంజూరు చేస్తోంది.ఈ నిధుల నుండి ఉపాధ్యాయులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో వేతనాలు చెల్లించే వారు. ఉపాధ్యాయుల సర్వీసులను ప్రభుత్వ సర్వీసుగా గుర్తించిన నేపథ్యంలో ట్రెజరీ ద్వారా ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలనే పోరాట ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలను ట్రెజరీల ద్వారా చెల్లించే విధానం 2005 నుండి అమలవుతోంది.

తర్వాత కాలంలో న్యాయ సంబంధమైన వివాదాలతో ప్రభుత్వాలు సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోక పోవడంతో రెండు దశాబ్దాలుగా ఆ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. న్యాయ వివాదాలతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. రాష్ట్రంలో వచ్చిన జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల ఫలితం గా ప్రాంతీయ అసమానతలను తొలగించే నేపథ్యంలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు,విద్య అవకాశాల విషయంలోరాజ్యాంగంలోని 371 డి అధికరణ ద్వారా రాష్ట్రపతికి 1975 ఉత్తర్వులు ద్వారా లోకల్ కేడర్రైజేషన్ ఉత్తర్వులు వచ్చాయి.వీటిని రాష్ట్రపతి ఉత్తర్వులుఅంటారు. ఇవి 18-10-1975 నుండి అమల్లోకి వచ్చాయి. 1981 తర్వాత ప్రావిన్షియలైజేషన్ జరిగిన పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సర్వీసులను లోకల్ కేడరుగా గుర్తించేచర్యలు ఆ నాటి రాష్ట్ర ప్రభుత్వం తీసికోకపోవడంతో తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సర్వీస్ రూల్స్ మనమే రాసు కుందాము అని అనేక సార్లు ప్రకటించారు. 2015 లోసుప్రీంకోర్టు ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ ఉత్తర్వుల పై తీర్పు నీస్తూ "ఇప్పటికే లోకల్ కేడరుగా ఆర్గనైజ్ చేయబడిన ప్రభుత్వ ఉపాధ్యాయులతో పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులను కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులు అయినందున ఏకీకృతం చేయడానికి రాష్ట్రపతి ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపడానికి రాష్ట్రప్రభుత్వంస్వేచ్ఛ కలిగి ఉందని, అట్టి ప్రతిపాదనలు పంపినచో సత్వరమే కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని" ఆదేశాలుఇచ్చింది. ఈ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సర్వీసులను ఏకీకృతం చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.దీని ప్రకారం23-06-2017నాడు రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణలు జరిగాయి. అయితేఈ సవరణలను హైకోర్టు 28-8-2018నాడి కొట్టివేస్తూ " రాష్ట్రపతికి లోకల్ కేడరుగా ఆర్గనైజు చేయు అధికారమే ఉందని, ఏకీకృతం చేయు అధికారం లేదని" ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాల ప్రకారము మొదట మండల, జిల్లాపరిషత్తు ఉపాధ్యాయ పోస్టులను లోకల్ కేడరుగా ఆర్గనైజ్ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతి అనుమతి పొంది, ఆర్టికల్ 309 ప్రకారము ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను జారీ చేస్తూ వారిసేవలను ఏకీకృతం చేస్తూ ఉపాధ్యాయుల మధ్య వివక్ష పోయేవిధంగా చర్యలు తీసికోవాలి. రాజ్యాంగం ప్రకారం ఉపాధ్యాయులంతా సమానమేనని చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే ! మన ముఖ్యమంత్రి సర్వీస్ రూల్స్ రెండు

పేజీ లలో రాసుకుందాము అని అనేక పర్యాయాలు ఇచ్చిన హామీ నీటి మూటలుగా మారాయి. ఉపాధ్యాయుల మధ్య అగాధం సృష్టించే ప్రచారం అప్రజాస్వామికం. అయిదు దశాబ్దాల పోరాటం చివరి దశకు చేరిన తర్వాత మళ్లీ మొదటి పరిస్థితికి తేవడం దురదృష్టం. వివక్ష త కు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులలో వివక్షతను కొనసాగించాలనే ప్రయత్నం అనైతికం.

ఉపాధ్యాయులకు కొత్త వేతనాలు అవసరమా ?

రాష్ట్రంలో విద్యా శాఖ,గిరిజన సంక్షేమ శాఖ,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఎస్సీసంక్షేమ శాఖ, మైనారిటీ శాఖల ఆధ్వర్యంలో నడిచే గురుకులాలతో పాటు,ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు(కేజీబీవీ)ఉన్నాయి. వీటితోపాటు సంప్రదాయక ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయి.వీటన్నిటిలో సుమారు 27 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 5లక్షల మంది చదివే 1000 వరకు గురుకులాలు ప్రారంభించి ఇదే" కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య" అనుకోమంటోంది ప్రభుత్వం. మరో 32 లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో నమోదై ఉన్నారు.ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా తక్కువ వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తూ యాజమాన్యాలకు లాభాల పంట తెస్తున్నారు. ప్రభుత్వ రంగంలోని వివిధ గురుకుల పాఠశాలల లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్,పీరియడ్ వారి పద్ధతులలో ఉపాధ్యాయులు తక్కువ జీతాలకు పనిచేస్తున్నారు. కేజీబీవీ పాఠశాలలోనైతే ప్రిన్సిపాల్ తో సహా ఉపాధ్యాయులంతా తాత్కాలిక ఉద్యోగులే! తక్కువ వేతనంతో అధిక శ్రమ చేసే మహిళలే! జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అతిథి అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్ పేరుతో జరిగే వెట్టిచాకిరీ మరోరకం! ఇటువంటి విద్యా వ్యవస్థను బాగు చేయడానికి చర్యలు తీసుకోకుండా వీరిది ఒత్తిడి లేని పని,పని దినాలు తక్కువ,వీరికి కొత్త వేతనాలు అవసరం లేదని,పదవీ విరమణ వయస్సు పెంచాల్సిన అవసరం లేదంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మధ్య విద్వేషాలు రగిల్చడం, విషం చిమ్మడం అపరిపక్వతతో కూడిన అవగాహనారాహిత్య చర్యలు.

ఉపాధ్యాయ, విద్యా రంగ విధానాలపై 1966లో వచ్చిన కొఠారి కమిషన్ "నేటి తరగతి గదిలో భవిష్యత్ జాతి నిర్మాణం జరుగుతుందని" చెప్తూ ఆ భవిష్యత్ జాతి నిర్మాతలైన ఉపాధ్యాయులకు సమాజంలోని అన్ని రకాల వృత్తుల కన్నా ఎక్కువ వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని, ఆకర్షణీయమైన పదోన్నతి విధానాలు కల్పించాలని, తద్వారా ప్రతిభావంతులైన యువత ఉపాధ్యాయ వృత్తికి ఆకర్షింపబడి, ఈ వృత్తిని ఎంచుకునే లా విధానాలు రూపొందించాలని చెప్పింది. 1985 లో ఛటోపాధ్యాయ కమిషన్ ఉపాధ్యాయుల వేతనాలు మిగతా ఉద్యోగుల వేతనాల కన్నా 25 శాతం ఎక్కువ ఉండాలని సూచించింది. 1957 లో జరిగిన 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సూచించిన ప్రమాణాల మేరకు అవసరాల ప్రాతిపదిక వేతనాలు ఉండాలని, 1950లో రాజ్యాంగం కార్మికులకు జీవన వేతనం ఉండాలని చెప్పాయి. ఆ మేరకు కొంత శాస్త్రీయ ప్రాతిపదికన ఉద్యోగుల, ఉపాధ్యాయుల వేతనాలను వేతన సవరణ కమిటీలు సిఫార్సు చేస్తూ వస్తున్నాయి. అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం నిర్ణయిస్తూ ఉద్యోగానికి నిర్దేశించిన కనీస విద్యార్హతలు, ఆ అర్హతలు పొందడానికి కావలసిన కాలం ప్రాతిపదికన వేతనశ్రేణులను నిర్ణయిస్తారు. కార్యాలయ గుమస్తా కనీస అర్హత ఇంటర్మీడియట్ చదవడానికి 12 సంవత్సరాల కనీస కాలం కావాలి. అదే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడికి ఇంటర్మీడియట్ తో పాటు రెండేళ్ల డిఈడి అర్హతలు అవసరము. అంటే పద్నాలుగేళ్ల చదువు అవసరమవుతుంది. దీని ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ వేతనము కంటే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడి వేతన శ్రేణి నిర్ణయిస్తారు.. పైగా విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుడు గౌరవనీయమైన వ్యక్తి. అతడిని సమాజం గౌరవించాలంటే ఉన్నతమైన వేతనాలు చెల్లించాలని కొఠారీ కమిషన్ సూచన ను గమనంలోకి తీసుకుని, సమాజం గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.కానీ చౌకబారుగా, కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరించడం మాని హుందాగా వ్యవహరించాలి.

ఏడు దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలు తిరిగి చర్చలోకి రావడం, ఉపాధ్యాయులతో ప్రభుత్వానికి సంబంధం లేదంటూ పత్రికా కథనాల ద్వారా తప్పుడు ప్రచారానికి పూనుకోవడం,సుదీర్ఘ ఉద్యమ నేపథ్యం ఉన్న ప్రభుత్వానికి సమంజసం కాదు. ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగులే కాదు! వారు స్థానిక సంస్థలకు చెందిన వారు! వారికి ప్రభుత్వం జీతాలు చెల్లించాల్సిన అవసరం లేదు! వేతన సవరణ అవసరం లేదు! పదవీ విరమణ వయసు పెంచాల్సిన అవసరం లేదనే అవగాహనారాహిత్య, అపరిపక్వ ఆలోచనలను ప్రచారం చేయడం సరికాదు. వలసపాలకులు తెలంగాణలో విద్యావకాశాలు కల్పించలేదని, విద్యా సంస్థల స్థాపన లో వివక్ష చూపారని, మొత్తం తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాపన, విస్తరణ తెలంగాణ జనాభా నిష్పత్తిలో జరుగలేదని ఉద్యమకాలంలో చెప్పుకొచ్చాం. ఉన్నత విద్యావకాశాలు లేకపోవడంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు తయారు కాలేక పోయారని, ఫలితంగా ఉన్నత పాలనా పోస్టుల పరీక్షలలో తెలంగాణ విద్యార్థులు ప్రతిభ చూపలేక పోతున్నారని, స్వరాష్ట్రం వస్తే ఆ లోటు తీరుతుందని, వివక్ష పోతుందని చర్చించుకున్నాం. కాని వివక్ష కొనసాగింపుకు ప్రయత్నించడం తిరోగామిచర్య అవుతుంది.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు) వీ

ఆనందారామం మృతి

ప్రముఖ రచయిత్రి డా. ఆనందారామం(86) గుండెపోటుతో ఫిబ్రవరి 11న కన్నుమూశారు. హైదరాబాదులోని మారేడుపల్లి బలరామ్ బ్లాక్స్ కాలనీలో ఉంటున్న ఆమెకు అర్ధరాత్రి గుండెపోటు రావడంతో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. 1935లో జన్మించిన ఆనందారామం అసలు పేరు ఆనందలక్ష్మి. పిహెచ్‌డి చేశారు. 1954 నుంచి కథలు, నవలలు రాయడం ప్రారంభించారు. ఇంద్రసింహాసనం, సంపెంగపొదలు, మమతల కోవెల, నేటి కథ, ఇదా భారతం, ప్రేమస్తోత్రం, సహా 60 కథలు, నవలలు రాశారు.

తెలుగు జాతి హక్కు విశాఖ ఉక్కు

ప్రజలు తమ జీవనాధారాలను, జీవితాలను త్యాగంచేసి సాధించుకున్న 'విశాఖ ఉక్కు'ను పాలకులు ప్రైవేట్ పరం చేయడమంటే ప్రజల్ని చావో రేవో తేల్చుకొమ్మనడమేనని అంటున్నారు బి.ఎస్. రాజు

బంగాళాఖాతం, సాగరతీరం, సుందర ప్రదేశం, కోస్తా తీర ప్రజల మణిహారం విశాఖ నగరం. సహజసిద్ధ ఓడరేవు. ఓడల నిర్మాణ కేంద్రం. భారత యుద్ధ నౌకాబల తూర్పు కమాండ్. చుట్టూ కొండలు, అడవుల కంకణం. పుష్కల ఖనిజాల ప్రాంతం. సముద్ర మత్స్య సంపద. అక్కడనుండే ఎడతెరిపి లేకుండా ఎగుమతి అయ్యే ఇనుప ఖనిజం. పేరుగాంచిన విద్యా కేంద్రం, చరిత్రాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం. కళా సాహిత్యాల స్థావరం. అయినా దారిద్ర్యం, నిరుద్యోగం, పేదరికం. అందుకే తెలుగు ప్రజలు కోరుకున్నారు ఓ బృహత్ ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమను. గూడు కట్టుకున్న ఆకాంక్ష, ఆ ఆకాంక్ష నుండి, బలీయమైన పట్టుదల నుండి, తెలుగు జాతి ఐక్యత నుండి ఎగిసి ఉప్పెనై సాగింది 1960ల్లో విశాఖ ఉక్కు ఉద్యమం. 'విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు' నినాదం తెలుగు నేలంతా శంఖారావమై మార్మోగింది.

32 మంది ఉక్కు ఉద్యమ అమర వీరుల త్యాగాలతో, 64 గ్రామాలు ఖాళీ చేసిన రైతుల 22000 ఎకరాల భూదానాలతో, సుదీర్ఘ పోరాటాలతో సాధించిన తెలుగు ప్రజల కలల పంట, ఆంధ్రుల అభిమాన కోవెల విశాఖ ఉక్కు. అది ఆంధ్రుల హక్కు, తెలుగు జాతి నిధి. వారి గుండెకాయ. వారి ఊపిరి. దాన్ని ఇప్పుడు తుక్కుగా తూకానికి తెగనమ్మేస్తున్నారు.

తెలుగు ప్రజలు ఇప్పుడు భౌగోళికంగా విడిపోయి ఉన్నా, అప్పుడు విశాఖ ఉక్కుకై కలిసే పోరాడారు. కలిసే త్యాగాలు చేశారు. తెలుగు నేలంతా విద్యార్థులు, యువకులు 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' అని వీధి పోరాటాలు చేశారు. ప్రాణాలర్పించారు. ఇటు ఓ మూల ఆదిలాబాద్, మధ్యలో ఓరుగల్లు, హైదరాబాద్, సీమ నగరాలు, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, తూర్పున వైజాగ్, విజయనగరం, శ్రీకాకుళం వరకు విశాఖ ఉక్కు సాధనోద్యమంలో భుజం భుజం కలిపి తెలుగు ప్రజలు కదంతొక్కారు. అప్పట్లో రాజకీయ నాయకులకు దేశ స్వాతంత్ర పోరాటం తాలూకు నీతి నిబద్ధతల నియమాలుండేవి. ప్రజా దృక్పథం, ప్రజాక్షేమం వారిని నడిపించేవి. అటువంటి నాయకులైన తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న, అమృత రావు వంటివారు ఉక్కు ఉద్యమానికి ప్రేరణగా నిలిచారు.

అప్పటి ఉక్కు ఉద్యమంలో పాల్గొన్న ఓ మిత్రుడు ఆ ఉద్యమ జ్ఞాపకాలను ఇలా మననం చేసుకున్నాడు: అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం1966 అక్టోబర్, నవంబర్ మాసాల్లో తెలుగు సమాజపు అన్ని తరగతుల ప్రజల ఆగ్రహావేశాలను చవిచూసింది. పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న తమ రాష్ట్రాన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, తాము ఎదుర్కొంటున్న, అనుభవిస్తున్న నిరుద్యోగం, అభద్రతాభావం, అభివృద్ధి పట్ల ప్రభుత్వాల నిర్లిప్తత వారిని కోపావేశాలకు గురిచేసి ఉద్యమబాట పట్టించాయని ఆయన అన్నాడు. గుంటూరుకు చెందిన నాయకుడు అమృత రావు 1966 అక్టోబర్ 15 నుండి విశాఖ నగరంలో చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఆంధ్రా వైద్య కళాశాల విద్యార్థులు ఉద్యమంలో పాల్గొన్నారు. విశాఖపట్నానికి 7 మైళ్ల దూరంలో ఉన్న గోపాలపట్నం వద్ద రైళ్ల రాకపోకలను నిలిపేశారు. రాష్ట్ర బంద్ పాటించారు. ప్రతి పట్టణంలోనూ నిరాహార దీక్షా శిబిరాలు వెలిశాయి. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అనే నినాదం ప్రతి తెలుగువాడి నోటి మాటగా మారిపోయింది.

ఉద్యమం తారాస్థాయికి చేరుకుంది. పోలీసు కాల్పులతో ఉద్యమాన్ని అణిచి వేయాలని చూసారు పాలకులు. 1966 నవంబర్ 1న శాంతియుత ప్రదర్శనలో పాల్గొన్న 3000 మంది ఉద్యమకారులపై అమానుషంగా, విచక్షణా రహితంగా కాల్పులు జరిపించింది అప్పటి ప్రభుత్వం. ఆ కాల్పుల్లో 9 ఏళ్ల బాలునితో సహా తొమ్మండుగురు శాంతియుత నిరసన కారులు నేలకొరిగారు.

ఆనాటి ఉక్కు ఉద్యమంలో మొత్తం 32 మంది ఉద్యమకారులను రాజ్యం పొట్టన పెట్టుకుంది. ఎట్టకేలకు అప్పటి కేంద్ర ప్రభుత్వం, దేశ ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ ఉద్యమ ఉధృతికి తలొగ్గి విశాఖలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని ప్రకటించాల్సి వచ్చింది. ఇదంతా విశాఖ ఉక్కు సాధనకై జరిగిన ప్రజా ఉద్యమం. ఇంకో రకంగా చెప్పాలంటే ఆ తరువాత తెలుగు నేలపైనా, దేశంలోనూ జరిగిన విద్యార్థి యువజనోద్య మాలకు, కార్మిక, రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలకు, నక్సల్బరీ, శ్రీకాకుళ, తెలంగాణ విప్లవోద్యమాలకు, అంతే కాదు కళా సాహిత్య రంగాల్లో ఎగసిపడ్డ భావ విప్లవానికి నిప్పు నెరుసులు అందించిన ప్రజా ఉద్యమం విశాఖ ఉక్కు ఉద్యమం.

అయితే ఇప్పుడు మాట్లాడే సందర్భం వేరు. నేడు నడుస్తున్నది దుర్మార్గపు దమనకాండ పర్వం. సకల ప్రజాస్వామ్య విలువలను కాలరాసేస్తున్న సందర్భం. ధిక్కార స్వరాలను, మంచి చెడుల విశ్లేషణ చేసే పదాలను, వాక్యాలను, రాతలను, రేఖలను, గీతాలను, గళాలను, గొంతులను పిసికేస్తున్న సందర్భం, గొలుసులువేసి జైళ్లలో కుక్కేస్తున్న సందర్భం. ఏదైనా దేశ ద్రోహమే! నోరు విప్పితే దేశ ద్రోహం. నోరు మూసుకు భజనచేస్తేనే దేశహితం. దీన్ని ఫాసిజం అంటారో, దీనికి మరో కొత్త నిర్వచనమేమైనా ఉందేమో విజ్ఞులు చెప్పాలి.

ఇప్పుడు రాసే సందర్భం కూడా వేరు. ఇది సకలం అమ్మకాల సందర్భం. ప్రజల ఆస్తులు, వనరులు, హక్కులు, ప్రజల ప్రమేయమంటూ

లేకుండా, వారితో మాటా మంతి లేకుండా, గప్‌చుప్‌గా ఐనోళ్లకు, ఆశ్రితులకు అంటకట్టేసే సందర్భం. లెక్కలు చెప్పాల్సిన పనిలేదు. చర్చకు పెట్టాల్సిన పని అసలే లేదు. ప్రజాభిప్రాయ సేకరణ మహా నేరం. ప్రభుత్వ ఆస్తులంటే, ఈ సందర్భంలో కొత్త నిర్వచనం 'మేమిద్దరం–మాకిద్దరు' అని. ఆ ఆస్తులన్నీ వారికోసమే అని, వారి సొంతమేనని.

ఈ సందర్భంలోనే విశాఖ ఉక్కును తుక్కుగా బహుశా తూకం కూడా వెయ్యకుండానే అమ్మో, అమ్మకనో బదలాయింపులు జరిగి పోతాయి, పోయాయి. ఆంధ్రావారి అభిమాన రాజకీయ నాయకుడు, పీడిత ప్రజా సేవకుడు, సకల జన ప్రియరంజకుడు, శ్రీశ్రీశ్రీ జగన్ ముఖ్యమంత్రి వర్యుడు విశాఖ ఉక్కు సంస్థ ఉద్యోగ నాయకులకు, యూనియన్ల ప్రముఖులకు ఏమి ప్రవచించాడు?

విశాఖ ఉక్కు మనది కాదురా భాయీ! అది కేంద్రానిదోయీ! మనకే హక్కు ఉండదోయీ! అక్కడ కేంద్రంలో ఉచ్ఛాధికార ద్వయం దీన్ని పోస్కో కంపెనీకి అమ్మేస్తుందో, లేక ఇంకెవరికైనా దానమిచ్చేస్తుందో వాళ్లిష్టం. నేనైతే మీవేపే. వాళ్లతో కాట్లాడదాం, కొట్లాడదాం, కాళ్లట్టుకుందాం గాని మరింకేమీ చేయలేం, మీరు మట్టుకు పోయి శాంతంగా, ప్రశాంతంగా ఉక్కు ఉత్పత్తులు కొనసాగించండి అని హితోపదేశం చేసి, దీవించి పంపించాడు ఉక్కు ఉద్దండులను.

అంతేకాదు ఇంకో అత్యంత లాభదాయకమైన రియలెస్టేట్ కిటుకు కూడా చెప్పాడు. 22,000 ఎకరాల్లో బోర్డంత నేల ఖాళీగా పడి ఉంది. కేంద్ర ద్వయంతో కాంప్రమైజ్ అయిపోయి ఆ స్థలం వాళ్లకి అప్పచెప్పేస్తే పోలేదా? ఆ తరువాత ఉక్కును ఉంచాలో, ముక్కలుగా తుంచాలో తేల్చుకోవచ్చు కదా! ఆ ఆస్తి మనదీ, మన జనానిదీ కానప్పుడు లోపాయికారీగా ఎవరి చాప వాళ్లు సర్దుకుని, ఎవరి వాటా వారు అందుకుని, నాయకులు, ఉద్యోగులతో రాజీలు కుదుర్చుకుని, ఖుషీగా కాలం గడుపుతూ ఉండొచ్చు కదా! మజాగా మస్తుగా జీవించవచ్చు కదా! ఇదో అద్భుత అవకాశం కదా!

పాత త్యాగాలు, ప్రజల ప్రాణాలు, ఆకాంక్షలు, ఆస్తులు, జీవికలు, బ్రతుకులు, మూల ఆలోచనలు, జాతి భవిష్య మనుగడలు మంట కలిస్తే ఏమిటి? మట్టి కొట్టుకు పోతే ఏమిటి? దందా, వ్యాపారం, రాజకీయ భాగోతం, ఎలక్షన్ల ఇంక్విలాబు కొనుగోళ్లు, అమ్మకాలు సజావుగా సాగుతుంటే చాలు. సర్వం స్వాహా, సర్వం మమః, సాగితే చాలదా?

ఎలానూ ఉన్నాయి గుప్పెడు మెతుకులు స్కీములు, బిస్కట్ల బుజ్జగింపులు. జండాలవతల పారేయండి. అరవటాలు మానేయండి. అరుపులతో వైఖుంటపు తలుపులు తెరుచుకోవు. ప్రసాదాలు రాలిపడవు. ఉద్యమాల రోజులు కావివి. వాటికెప్పుడో కాలం చెల్లింది. రాజీల, పంపకాల, అంపకాల కాలమిది అని ప్రస్తుత ఆంధ్రా ముఖ్యమంత్రి ఉక్కు పరిరక్షణోద్యమానికి మరో శంఖరావ మూదుతామని ఆయన్ను కలవబోయిన నాయకమన్యులకు హితబోధ చేసినట్లు మనం అర్థం చేసుకోవచ్చు.

ఇక ఇప్పుడు మిగిలింది సాధారణ జనం. శ్రామిక జనం. కార్మిక జనం. చదువుకుని, పట్టాల కాగితాలు చేత పుచ్చుకుని ఉద్యోగాలకై, బ్రతుకు తెరువుకై అల్లాడుతున్న యువత, వీరి కోర్టులో ఉంది బంతి. విశాఖ ఉక్కు రక్షణకై పోరాట పథమో, సరెండర్ పర్వమో స్వరం వినిపించాల్సింది, అడుగేయ్యాల్సింది, కదం తొక్కాల్సింది వీరే కదా!

ఏ జీవన మూలాలు పునాదులతో సహా అమ్మేస్తున్నారో గ్రహించండి. సర్వం అమ్మేసి చేతులు కడిగేసుకునే ప్రభుత్వాలను ఎందుకు ఎన్నుకుంటున్నారో, నెత్తిన పెట్టుకున్నారో ఆలోచించండి. ఇవాళ విశాఖ ఉక్కును అమ్మేయడానికి పాలకులు సవాలక్ష కారణాలు చెప్పొచ్చు. వాటి కేటికీ ప్రజలు జవాబుదారీ కాదు. పాలకులే ప్రజలకు జవాబుదారీ. ముందునుంచే ముంచెయ్యాలనే కుట్ర ఉన్నప్పుడు, నష్టాల్లోకి నెట్టడానికి కావలసిన ఉచ్చులన్నీ ముందునుండే పన్నుకుంటూ వచ్చి, నష్టాల ఊబిలోకి కావాలనే నెట్టేసి ఇది మీది కాదు మాదంటే, మా ఇష్టం కాడికి మేం అమ్మేస్తమంటే తెలుగువారు ఆలోచించాలి ఏమిచెయ్యాలో..

పాలకులు ప్రజల ఆస్తుల అమ్మకాల ప్రణాళికల్లో ఈదులాడు తున్నారన్నది నిత్యం మనకళ్లముందు ప్రదర్శితమౌతున్న బొమ్మే! ఇప్పుడు అమ్మ బంగారం అమ్మేయ్యాలి. అమ్మమ్మ బంగారాన్నీ అమ్మేయ్యాలి. జేజమ్మ కాళ్లు నరికి, కాళ్లకున్న పట్టీలను అమ్మేయ్యాలి. దేశాన్ని అమ్మేసే ఈ నకిలీ దేశ భక్త ఫాసిస్టు బృందాన్ని బంగాళాఖాతంలోకి ఎలా విసిరి కొట్టాలన్నదే ఈనాడు ప్రజాలముందున్న ప్రధాన ఎజెండా! దానికి కావలసిన జెండా ఏమిటో ఏ జండా పట్టాలో తెలుగు ప్రజలు, యావత్ దేశ ప్రజలు నిర్ణయించుకోవాలి. ఏమైనా గాని రాబోయే కాలం వేడిగాలుల కాలమే! ప్రజారోహిణీ కార్తే! తాడో పేడో, చావో రేవో తేల్చుకోవాల్సిన కొత్త పర్వంలోనికి ఈ దేశ ప్రజలు నూతనోద్యమ గృహ ప్రవేశం చేస్తున్నారనేది కొట్టిపారెయ్యలేని నిజం.

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు)

వీ

పోరంకి దక్షిణా మూర్తి మృతి

ప్రముఖ రచయిత, కథకులు డా. పోరంకి దక్షిణామూర్తి(86) ఫిబ్రవరి 6న హైదరాబాద్ చైతన్యపురిలోని స్వంత గృహంలో మరణించారు. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో 1935 డిసెంబర్ 24న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిజి పూర్తిచేసి అదే యూనివర్సిటీలో తెలుగు శాఖ రీడర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1969లో తెలుగు అకాడమీకి బదిలీ అయ్యారు. తెలుగు కథానిక–స్వరూప స్వభావాలు అనే అంశంపై పరిశోధనచేసి డాక్టరేట్ పొందారు. తెలంగాణ మాండలికంలో ముత్యాల పందిరి, రాయల సీమ మాండలికంలో రంగవల్లి, కోస్తాంధ్ర మాండలికంలో వెలుగూ వెన్నెల గోదారి నవలలను రచించారు. కథలు, నవలలు, పరిశోధనా వ్యాసాలతో కలిపి దాదాపు 40 పుస్తకాలు రచించారు. అనువాదాలు చేశారు. నలభై వేల పదాలతో ఇంగ్లిష్–తెలుగు–ఇంగ్లిష్ నిఘంటువును సంకలనం చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఒక్కటైన పాలకులు

***ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయడంలో పాలకులు ఒక్కటయ్యారని, ఈ నిర్ణయాన్ని రైతుల ఉద్యమ ప్రేరణతో ప్రజలంతా ఒక్కటై అడ్డుకోవాలని అంటున్నారు* చిమ్మో. జాన్ బర్నబాస్**

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 50 ఏళ్ల క్రితం ఎంతో మంది త్యాగంతో, పోరాటాలతో స్థాపించబడ్డ విశాఖ ఉక్కు కర్మాగారం నేడు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పోతుందని తెలిసి అందుకు నిరసనగా విశాఖపట్టణం జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలుచోట్ల ప్రజలు ఆందోళన బాట పట్టారు.

నాడు విశాఖ ఉక్కు కోసం దాదాపు 40 గ్రామాల ప్రజలు 25 వేల ఎకరాల భూమిలిచ్చారు. వారికిచ్చిన అప్పటి ప్రభుత్వ హామీలు ఇంకా చాలా వరకు నెరవేరలేదు. చాలా మందికి నేటికీ ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. అప్పటి కాలంలో ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేసేవరకూ అమృతరావు అనే వ్యక్తి ఆమరణ దీక్ష చేయడం, నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి స్వయంగా దీక్ష విరమింపజేయడం జరిగింది. తమనంపల్లి అమృతరావు గుంటూరు జిల్లా వాసి అయినప్పటికీ గుంటూరు నుంచి విశాఖపట్టణం వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టి, రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి ప్రేరణగా నిలిచాడు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసులు జరిపిన కాల్పుల్లో దాదాపు 32 మంది మరణించారని చెబుతారు. దాదాపు 20 రోజులు అమృతరావు ఆమరణ దీక్ష చేశారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కేంద్ర బడ్జెట్‌లో విశాఖ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేయడానికి సుముఖంగా ఉంటున్నట్లు ప్రకటించింది.

విశాఖ ఉక్కు కర్మాగారానికి స్వంతంగా ఇనుప ఖనిజ గనులు లేకపోవడం వల్లనే నష్టాలు వస్తున్నాయన్నది కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రధాన వాదన. ఇదే నిజమైతే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత వారికి స్వంత ఖనిజం ఎక్కడి నుండి వస్తుందనేదానికి కేంద్ర ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. అయితే వారికి దేశంలో ఏదో ఒకచోట ఇనుప ముడి ఖనిజ సంపద కేటాయించడానికి ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసినట్లు అర్థమవుతున్నది. లేనిచో ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఏమి ఆశించి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తలమానికం లాగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ధారాదత్తం చేయాలని అనుకుంటున్నది?

ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని లాభాల బాటలో నడిపించలేనప్పుడు ప్రైవేట్ వ్యక్తులు ఏ విధంగా అదే కర్మాగారాన్ని లాభాల బాటలో నడిపించ గలుగుతారు అనేది మనముందున్న ప్రధాన ప్రశ్న. ఇందులో ఒకటి ప్రభుత్వమే వారికి ఏదో ఒక విధంగా ఆదాయ మార్గం కల్పించాలి అనగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి అప్పులు వచ్చే విధంగా చూడాలి లేదా వారు ఉత్పత్తి సామర్థ్యం తగ్గించి, ఖాళీగా ఉన్న ఉక్కు కర్మాగారానికి చెందిన భూమిని తమ తమ వాణిజ్య అవసరాల కోసం విక్రయించుకుంటూ పోయి, (లీజుల రూపేణా) చివరకు మొత్తం భూమినంతటినీ ప్రైవేట్ వ్యక్తుల భూ దందా పరమయ్యే విధంగా చేసుకొని దానిని ధన (నగదు) రూపేణా అయినా చేయిస్తుంది కేంద్ర ప్రభుత్వం.

దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో కూడా స్పష్టత లేదు. కేంద్ర ప్రభుత్వంతో పోరాడడానికి సంసిద్ధంగా లేదు. అందుకు వారి కారణాలు వారికున్నాయి. ఇడి/సిబిఐ కేసుల భయం ఒకవైపు, మరోవైపు ప్రభుత్వం ఏర్పడక ముందు బిజెపి-వైకాపా ఏదో ఒక రహస్య ఒప్పందం వారిమధ్య ఉండకనే ఉంది. అంతేకాకుండా ఇప్పుడు జరుగుతున్న ప్రజా పోరాటానికి 22 మంది వైకాపా లోక్‌సభ సభ్యులు, ఇరువురు రాజ్యసభ సభ్యులు స్పష్టంగా ఉద్యంలో పాల్గొంటామని చెప్పడానికి సంకోచిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ దానిని ఏదో ఒక విధంగా తమవైపు తిప్పుకోవడానికి మాజీ శాసన సభ్యుడు పల్లా శ్రీనివాసరావుతో ఆమరణ నిరాహార దీక్ష చేయిస్తోంది. ప్రస్తుతం అదే వేదికగా అన్ని రాజకీయ పక్షాలు పాల్గొంటున్నాయి. ముఖ్యంగా ఒకవైపు ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారికి నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘాలు, విశాఖపట్టణంలో ఉన్న అన్ని ప్రజా సంఘాలతో కూడిన 'ఐక్య కార్యాచరణ' కమిటీ ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని తీసుకున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణాన్ని 'కార్య నిర్వాహక రాజధాని' చేయాలనే సంకల్పం ఇప్పుడు నెరవేరడానికి ఈ ఉద్యమం కొంత అడ్డంకిగానే ఉందని చెప్పవచ్చు. కేంద్రంతో పోరాడడానికి సంసిద్ధం వ్యక్తం చేస్తే అప్పుడు 'కేంద్ర-రాష్ట్ర సంబంధాలు' దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యక్షంగా పోరాడితే తనకున్న సిబిఐ కేసులు త్వరితగతిన విచారణ జరిగి, శిక్ష పడవచ్చునే భయం కూడా ముఖ్యమంత్రిలో ఉన్నట్లు ఉంది. కాబట్టే కేంద్రంతో పోరాడడానికి వెనుకంజ వేస్తున్నట్లుంది.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటివరకూ ఒక లేఖ రాసింది తప్ప, ప్రత్యక్షంగా తన నాయకత్వంలో ముఖ్యమంత్రి ఈ సమస్యపై ప్రధాన మంత్రిని కలిసి వివరించి తన స్పష్టమైన వైఖరిని ఇంతవరకూ తీసుకోలేదు. లేదా అన్ని రాజకీయ పార్టీలతో ఒక ప్రతినిధి బృందాన్ని ప్రధాన మంత్రి వద్దకు తీసుకుపోయి ముఖ్యమంత్రి ఆ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించనూ వచ్చు. ఆ ప్రయత్నం కూడా చేయడం లేదు.

ఇక్కడ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఉన్న జనసేన పార్టీ కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను కలిసి కేవలం వినతి పత్రం మాత్రం సమర్పించింది. ఎందుకనగా జనసేన పార్టీ - రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ కలిసి పనిచేస్తున్నాయి. రెండూ మిత్రపక్షంగా ఉంటూ భవిష్యత్తులో శాసన సభ ఎన్నికలలో పోటీ చేయాలనే ప్రణాళికతో పనిచేస్తున్నాయి. కాబట్టి వారిపై 'విశాఖ ఉక్కు'ను కాపాడవలసిన బాధ్యత మరింత ఎక్కువగా ఉన్నది. లేనిచో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారికి భవిష్యత్తు ఉండదు. ఇటీవల జరిగిన కొన్ని గ్రామ పంచాయితీ ఎన్నికలలో జనసేన తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాలలో చాలా సీట్లు గెలిచింది. దీనివల్ల అది

ప్రజలలో స్వంతంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేసినట్లు స్పష్టమవుతున్నది. ఇదే తెగువ విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి, జరుగుతున్న ప్రజా పోరాటానికి 'జనసేన' కూడా ఒక గట్టి ప్రయత్నం చేయవలసిన బాధ్యత కూడా ఉంది. చేయవచ్చు కూడాను.

ఆంధ్రులకున్న ఏకైక ఉక్కు పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమ కాబట్టి అది ప్రైవేటీకరణ జరుగకుండా దానిని నిలువరించడానికి ప్రజా పోరాటం మరింత తీవ్రతరం చేయవలసి ఉంది. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ తమ విభేదాలను పక్కకు పెట్టి ఒకే ఎజెండాతో పనిచేయవలసి ఉంది. లేనిచో ప్రజలలో చరిత్ర హీనులుగా మిగిలిపోయే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో నుంచి విడిపోయిన తర్వాత మిగిలిన ఏకైక ప్రభుత్వ రంగ అతిపెద్ద సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్. దీన్ని పోగుట్టుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు మిగిలేది ఏమీ ఉండదు. ఎంతో మంది ప్రజల సుదీర్ఘ పోరాటాల, త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు, తమ తమ స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి. ఇప్పుడు ఢిల్లీ సరిహద్దులో ఇంత చలికి తట్టుకొని పట్టువిడువని విక్రమార్కుల లాగా పోరాడుతున్న రైతుల మాదిరి విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా 'ప్రజా పోరాటం' నడపాలి.

ఛత్తీస్‌గఢ్‌లో 'నగర్‌నార్' ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని నిర్ణయిస్తే అక్కడి రాష్ట్ర ప్రభుత్వమే కొంటుందని ముందుకు వచ్చినట్లుగా ఇక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో చర్చించి ఏకవాక్య తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. అవసరమనుకుంటే రాష్ట్ర ప్రభుత్వం నడుపడానికి, కేంద్రం నుంచి అనుమతి తీసుకోవడానికి ప్రయత్నించాలి. రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

విశాఖ ఉక్కు పరిశ్రమ స్థాపనకు ముందు సంక్షిప్త చరిత్ర

నాలుగవ పంచవర్ష ప్రణాళికను ప్రకటించడానికి ముందు దేశంలో 4 ఉక్కు పరిశ్రమలను స్థాపించారు. 5వ ఉక్కు పరిశ్రమను సముద్ర తీర ప్రాంతంలో నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధతను తెలియ జేయడంతో, విశాఖపట్టణంలో ఉన్న సముద్ర తీర ప్రాంతానికే అన్ని అనుకూలతలు ఉండడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇక్కడ ఉన్న అన్ని సానుకూలతలతో నివేదిక సమర్పించింది. 1963 ఏప్రిల్‌లోనే అప్పటి కేంద్ర ఉక్కు శాఖా మంత్రి సి. సుబ్రమణ్యం పార్లమెంట్‌లోనే బహిరంగంగా ప్రకటించారు, విశాఖపట్టణంలో ఉక్కు పరిశ్రమ తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ కూడా ఇచ్చారు. లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు విశాఖపట్టణానికి వచ్చిన సందర్భంలో కూడా ఇక్కడే ఉక్కు కర్మాగారం స్థాపిస్తున్నామని కూడా చెప్పారు. ప్రధాని ప్రకటించిన 6 నెలల లోపే ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసే విధంగా, కర్ణాటకలోని హోస్పేట్‌లో ఫ్యాక్టరీ పెట్టబోతున్నట్లు మరో ప్రకటన వెలువడింది. అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. ఆంగ్లో అమెరికన్ నిపుణుల కమిటీని స్థల నిర్ణయం కోసం ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కూడా విశాఖ వైపే మొగ్గు చూపింది. 15 లక్షల టన్నుల సామర్థ్యం గల కర్మాగారాన్ని కర్ణాటకలో ఏర్పాటు చేయడానికి రు. 2,500 కోట్లు ఖర్చవుతుంది. అదే విశాఖ పట్టణంలో అయితే 1,402 కోట్లకే నిర్మాణం పూర్తవుతుంది. సముద్ర తీరం ఉన్నందున ఎగుమతి, దిగుమతి ఖర్చులూ తగ్గుతాయని నిపుణుల కమిటీ స్పష్టమైన నివేదిక ఇచ్చింది. నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయడానికి కొంత వెనుకంజ వేసింది. విశాఖ ఉక్కుపై కేంద్రం అనవసర రాద్ధాంతం చేస్తుంటే అప్పుడే రాష్ట్రంలో ఆందోళనలు జరిగాయి. 1966 జూలై 1న అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తూ, రాష్ట్రానికున్న అన్ని అనుకూలతలు, ప్రయోజనాలు ఏమిటో రాష్ట్ర అసెంబ్లీలో గంటన్నర పాటు ప్రసంగించారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో స్పందన రాలేదు. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 నెలలు అన్నీ స్థంబించిపోయే విధంగా, ప్రజలు కులాలకు, మతాలకతీతంగా స్పందిస్తూ, 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' నినాదంతో రోడ్డుమీదకు వచ్చారు. 1966 అక్టోబర్ నాటికి ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.

అక్టోబర్ 15న గుంటూరు జిల్లాకు చెందిన గాంధేయవాది అమృతరావు ఉక్కు కర్మాగారం వెంటనే స్థాపించాలనీ విశాఖపట్టణం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. దానికి మద్దతుగా విద్యార్థులంతా సంఘీభావం ప్రకటించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. అక్టోబర్ 27 నుంచి నిరవధిక సమ్మె జరిగింది. 1966 నవంబర్‌లో విశాఖపట్టణంలో 3 వేల మందితో జరుగుతున్న భారీ ప్రదర్శనపై పోలీస్ కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో అక్కడికక్కడే 9 మంది చనిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంఘటనలలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. కాల్పులకు నిరసనగా నవంబర్ 1న పత్తి శేషయ్య నిరాహార దీక్ష ప్రారంభించారు. నవంబర్ 3 నాటికి అమృతరావు నిరాహార దీక్ష మొదలు పెట్టి 20వ రోజు అయింది. ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఆయన దీక్షను విరమింప జేసింది. ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి స్వయంగా ఆయన చేత దీక్ష విరమింపజేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు, లాఠీ చార్జీలు, కాల్పులు జరిగాయి. ప్రజాందోళనకు మద్దతుగా అప్పుడు ఏడుగురు పార్లమెంట్ సభ్యులు, 67 మంది శాసన సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఎట్టకేలకు అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దిగివచ్చి ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తామని 1970 ఏప్రిల్ 10న ప్రకటించారు.

ముగింపు

ఉక్కు ఉత్పత్తిలో దక్షిణ కొరియాకు చెందిన పోహాంగ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (పిఒఎస్‌సిఒ) ప్రపంచంలోనే 6వ స్థానంలో ఉన్న సంస్థ. మన పొరుగు రాష్ట్రం ఒడిశాలో 50 వేల కోట్లతో 12 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ పెట్టాలని 2005లో ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకున్నది. ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా నాలుగు వేల ఎకరాల భూమి, నీరు, విద్యుత్ ఇతర సదుపాయాలు అందిస్తామని ముందుకు వచ్చింది. అక్కడ పర్యావరణ నిబంధనలను పాటించడానికి పోస్కో ఇష్టపడలేదు. పోస్కో స్వార్థపూరిత ప్రయోజనాలను ఒడిశా ప్రభుత్వం ఎండగట్టడంతో, అక్కడ ఇనుము ఉక్కు కర్మాగారం ప్రారంభించడానికి పోస్కో విరమించుకుంది. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లోనూ, కర్ణాటకలోనూ, జార్ఖండ్‌లోనూ పోస్కో సంస్థ తన ప్రయత్నాలను చేసి విరమించుకుంది.

దేశంలో ఏ రాష్ట్రంలోనికి వెళ్లినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పూర్తి సహకారం అందడం లేదంటున్న పోస్కో సంస్థ కన్ను ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం ఉక్కు కర్మాగారంపై పడింది. దేశంలో ఉన్న ఏకైక సముద్ర తీర ప్రాంత ప్లాంట్ కావడంతో ఎగుమతి, దిగుమతులకు అనువుగా

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు - మిగిలేనా?

***పాలకులు ప్రజలను రకరకాల సమస్యల్లోకి నెట్టి తాము అనుకున్నవి చేసుకుపోవడంలో భాగంగానే 'విశాఖ ఉక్కు'ను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని చూడాలని అంటున్నారు* అరుణ్**

సంక్షోభ సమయాల్లో శాంతి కాలాల్లో అమలుచేయలేని విధానాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా అమలుచేయవచ్చని పెట్టుబడి విధానకర్తలంటారు. మోడీషా ప్రభుత్వం కోవిడ్ కష్టకాలాన్ని చక్కగా వినియోగించుకుంది. కార్మిక, విద్యుత్, వ్యవసాయ రంగాల చట్టాలను సునాయాసంగా రెండు సభల్లో అంగీకరింపజేసింది. ఒక్క వ్యవసాయ రంగ చట్టాలకు తప్ప, మిగతావాటికి వ్యతిరేకంగా చెప్పుకోదగ్గ ఆందోళనలు లేవు. ఆవు చేలో మేస్తే, దూడ బయట మేస్తుందా అన్నట్టు చాలా రాష్ట్రాలు మోడీషా బాటనే పట్టాయి. ఎందుకో విశాఖ ఉక్కు కర్మాగారపు ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విషయాన్ని బయట పెట్టడంలో అలసత జూపాయి. ఏముందిలే ఆంధ్రులు ఆరంభశూరులే గదా అనుకున్నారేమో? అంతేగాక జగన్ ఇప్పటికే ప్రాంతాల మధ్య మూడు రాజధానులంటూ చిచ్చుపెట్టాడు. ప్రజలందరూ ఏ సమస్యపైనా కలిసికట్టుగా పోరాడే మానసిక స్థితిలేదనుకున్నారేమో? అదే లాక్‌డౌన్ కాలంలోనైతే విశాఖ ప్రాంతంలో ఈ మాత్రం ఆందోళన ఉండేది కాదు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకే పరిమితమయ్యేది.

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అనేది ఒకప్పటి మాటగా మిగులుతుందేమో? ననే భయం ఉంది. ఇది ఒక నిరాశావాది నోటి నుండి వెలువడిన మాటకాదు, నేటి సామాజిక వాస్తవాలను విశ్లేషించి ఆవేదనతో వెలిబుచ్చుతున్న అభిప్రాయం. అందులోనూ నేను సైతం అంటూ విశ్వవిద్యాలయ విద్యార్థిగా తిరుపతిలో క్లాసులు బాయ్ కాట్ చేసి రోడ్లపైన అలజడులు సృష్టించిన నాటి యువతరంలో ఒక భాగస్వామిగా రాస్తున్న మాటలివి.

ఏ ఉద్యమానికైనా మధ్యతరగతి బుద్ధిజీవులు నాయకత్వం వహిస్తారు. ఆ ఉద్యమపు అవసరాన్ని ప్రజల్లోకీ బలంగా తీసుకెళతారు. ఇక ఉద్యమాలకు జవం, జీవం సామాన్యులే. ప్రజల్లోనున్న నిగూఢ అసంతృప్తి జ్వాలకు ఆజ్యంపోసి దాన్ని బలోపేతం చేసేది సామాజిక స్పృహ కల్గిన మధ్యతరగతి బుద్ధిజీవులేననేది వాస్తవం. కానీ, ఇప్పుడదే మధ్యతరగతి కోమాలో ఉంది. ఎవరో కొందరు మేధావులు, ప్రజల కోసం గళం

ఉంటుందని భావించి ఇక్కడికి మూడు సార్లు కంపెనీ ప్రతినిధులు వచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పెద్దలతో మొదట అవగాహనకు వచ్చి, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వంతో విశాఖపట్టణంలోని స్టీల్ ప్లాంట్ గెస్ట్ హౌస్‌లోనే పోస్కో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో విశాఖ స్టీల్ సిఎండి, డైరెక్టర్లు చర్చల్లో పాల్గొన్నారు. విశాఖలో నాలుగు వేల ఎకరాల భూములు కావాలనీ, ఐదు మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో స్టీల్ షీట్లు తయారు చేసే కర్మాగారం ఏర్పాటు చేస్తామనీ పోస్కో ప్రతినిధులు ప్రతిపాదించారు. వారు కోరిన భూముల విలువ ప్రస్తుత ధరల విలువలో 40 వేల కోట్లు ఉంటుందని ప్రాథమిక అంచనా. జాయింట్ వెంచర్ కింద విశాఖ స్టీల్ కంపెనీ భూములనిస్తే, పోస్కో అవసరమైన మూలధనం, టెక్నాలజీ అందిస్తుందనీ, అందులో 50 శాతం వాటా కావాలంటూ పోస్కో కోరింది. ఈ ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన అంగీకారం తెలిపింది. దీంతో రహస్యంగా ఒప్పందం జరిగిపోయింది. ఈ వాస్తవం వెలుగులోకి రాకుండా అధికార పార్టీ ఉద్యమంలోకి చొరబడడానికి ప్రయత్నం చేస్తూ ఉంది. 'పోస్కో' ఒప్పందం తమకు తెలియదన్నట్లుగా అటు బిజెపి ఇటు వైకాపా రెండూ ప్రజల ముందు ప్రయత్నిస్తూ ఉన్నాయి.

దక్షిణ కొరియాలో 43 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసే పోస్కో కర్మాగారంలో 34 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అందులో సగం మంది కాంట్రాక్ట్ కార్మికులే. అదే విశాఖపట్టణం విషయానికి వస్తే అందులో 7వ వంతు 63 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అదే సంఖ్యలో కార్మికులు ఉన్నారు. పోస్కో తయారు చేసే స్టీల్‌కు అనుబంధ ప్లాంట్ కోకింగ్ కోల్ ఒవెన్ (పెన్నెం) అవసరం ఉండదు. భవిష్యత్తులో విశాఖ ఉక్కును పోస్కో హస్తగతం చేసుకుంటే ఆ రెండు విభాగాలతో పాటు అనుబంధంగా ఉన్న అన్ని ఉప విభాగాలన్నీ మూతపడతాయి. కొన్ని వేల మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడతారు.

ప్రస్తుతం విశాఖ స్టీల్ ప్లాంట్ 18 వేల కోట్ల స్వంత నిధులు కలిగి ఉంది. వాస్తవానికి 5 వేల కోట్ల (4,890 కోట్లు సుమారు) తొలి పెట్టుబడితో ఈ స్టీల్ ప్లాంట్ ప్రారంభమైంది. కొన్ని వేల ఎకరాల స్వంత భూమి కలిగి ఉంది. ఇలాంటి ప్లాంట్‌ను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అనే నినాదం మరోసారి మారుమోగుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం అవుతున్నది. ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు తొలి ఉద్యమంలో ముందుండి పోరాడాడు. ప్రస్తుతం ఆయన వైఖరి ఈ ఉద్యమానికి ఏ విధంగా ఉంటుందో భవిష్యత్తులో తెలుస్తుంది. ప్రజా ఉద్యమానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా చూడాలి. మరోవైపు ప్రధాన మంత్రి అనుయాయుడైన గౌతమ్ అదానీకి ఈ ప్లాంట్‌ను కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్నదని మరో వాదన కూడా వినిపిస్తున్నది. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకైన 'విశాఖ ఉక్కు' ప్రైవేట్ పరం కాకుండా అన్ని ప్రజాస్వామిక శక్తులూ కలిసికట్టుగా పోరాడాలని కోరుకుందాం. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమం నిర్మించాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు)

వీ

విప్పినా ప్రజా సమస్యలపై పట్టించుకొనే ప్రభుత్వాలు లేకపోగా, ఇక మరెవ్వరూ నోరువిప్పే సాహసానికొడిగట్టకుండా ఆ పిడికెడు మందిని నిర్బంధం పాలుజేస్తున్నాయి. 1990లలో ఉదారవాద విధానాల అమలుతో, అంతవరకూ పీడిత ప్రజల కళ్లూ, నోళ్లుగా ఉన్న మధ్యతరగతి బుద్ధిజీవులు, ఆ విధానాలందించిన విలాస జీవితపు శ్లేష్మంలో ఈగల్లాగా దొర్లాడుతున్నారు. దానికి తోడు నిర్బంధ భయం సమాజమంతా ఆవహించింది. ఇక యువతలో కొందరు, కొత్తగా అందివచ్చిన సాఫ్ట్‌వేర్ రంగపు జీవితాల్లో తలమునకలై ఉండగా, మిగిలినవారు, విద్యార్థులతో సహా, జీవికకై ప్రభుత్వాశ్రితులుగా మారుతున్నారు. టివిలు, సెల్ ఫోన్లు, సినిమాలందించే ఊహాలోకానికి పరిమితమై జీవిత వాస్తవాలకు దూరమవుతున్నారు. దీనికి మినహాయింపులు లేవనడం తప్పవుతుంది.

మోడీ ప్రభుత్వ సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన మహత్తర ఉద్యమంలో పాల్గొన్న అశేష యువతీ యువకులను అవమానించడమే అవుతుంది. అంతకన్నా దుర్మార్గమైనదేమీ లేదు. పోతే వారి సంఖ్య దేశ యువతలో చాలా తక్కువని చెప్పవచ్చు. అయితే అది చరిత్రలో అరుదైన ఘట్టం. అవి మరల, మరల సంభవిస్తాయనడానికి దేశ పరిస్థితి దోహదం చేయదు.

నేటి సమాజం కుల, మత, ప్రాంత శకలాలుగా విడివడి ఉంది. ఎవరిగోల వారిదే. ఎవరి స్వార్థం వారిదే. బతుకుతెరువు పోటీలో పక్కవాన్ని తొక్కి, పాతేసినా సరే, తానూ గెలవాలనేదే ప్రతి ఒక్కరి ఆశ, ఆకాంక్ష. సమిష్టితత్వం నశించి, వ్యక్తివాదం పెరిగింది. సమిష్టితత్వం గురించి మాట్లాడే వారు సాంప్రదాయ కమ్యూనిస్టులుగానో, లేక కడుపునిండిన వారిగా చూడబడుతున్న కాలమిది. పాలకులకు తమ ప్రజా వ్యతిరేక విధానాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా అమలు జేసేందుకు ఇంతకన్నా అనుకూల పరిస్థితి లభిస్తుందా? కోవిడ్ లాక్‌డౌన్‌తో కోట్లాది మంది ప్రజల జీవితాలు చిన్నాభిన్నమై, బతుకు పోరాటంలో నిమగ్నం కావడం ఒకవైపు, మరోవైపు ప్రజలు సమిష్టితత్వం మరిచి శకలాలుగా విడిపోవడం. ఇదీ నేటి దేశ పరిస్థితి.

దేశంలో నేడు జరుగుతున్న రైతు ఉద్యమాన్ని పరిశీలిస్తే అదెంత సామాజిక పరమైనదైనా, స్పందిస్తున్నది ఆ సమస్యతో ప్రత్యక్ష బాధిలనుకొనే రైతాంగం కొద్ది భాగమే. ఈ చట్టాలు దేశ ఆహార భద్రతను దెబ్బతీస్తాయని, అది కేవలం రైతుల సమస్య కాదని, 130 కోట్ల దేశ ప్రజలదని అవగాహన ఉన్న మధ్యతరగతి స్పందన ఎంతో నిరాశపూరితంగా ఉంది. గ్రామీణ ప్రజలకు పై విషయాలన్నీ తెలియకపోవచ్చు. నిత్యజీవిత ఉపాధి సమస్యలతో వారికి తీరికా లేకపోవచ్చు. మరి పట్టణ, నగర ప్రాంతాలలోని ఉద్యోగ, విద్యార్థి లోకం మాటేమిటి? 1960 చివరనా నక్సల్బరీ రైతాంగ ఉద్యమ నిప్పురవ్వ దావానలంలాగా మారడం, దేశం నలుమూలల నుండి లక్షలాది విద్యార్థి, యువజనులు ఆ ఉద్యమానికి మద్దతుగా ప్రాణ త్యాగాలకు సిద్ధం కావడం మన చరిత్రే కదా. మరి ఇప్పుడు? సమాజం పురోగమిస్తుందా? తిరోగమిస్తుందా?

పై దేశ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని అవలోకిద్దాం రాష్ట్ర పునర్విభజన తర్వాత చంద్రబాబు విధానాల పర్యవసానమే రాష్ట్రాన్ని మానసికంగా, మూడు ప్రాంతాలుగా విడదీసింది. అమరావతీ, పోలవరం అంటూ ఇతర ప్రాంతాల, మరీ ముఖ్యంగా రాయలసీమ, శ్రీకాకుళాంధ్రల జీవన్మరణ సమస్యలను పట్టించుకోలేదు. ఆయన నిర్లక్ష్యం వల్ల సీమ వాసులలో తమకు ఈ రాష్ట్రంలో అస్తిత్వముందా అనే సందేహమూ కలిగింది. విభజన తర్వాత శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాజధానినాశించిన సీమ ప్రజలు చివరకు హైకోర్టు ఏర్పాటు హామీని పొందలేకపోయారు. ఇక కడప ఉక్కు గురించి మాట్లాడిన రాజకీయ పార్టీలు లేవు, రైల్వే జోన్, విభజన చట్టంలోనే విశాఖకు కేటాయించినట్టు అన్ని రాజకీయ పార్టీలు, రైల్వే జోన్‌ను విశాఖలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో గుంతకల్‌లో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్‌ను పట్టించుకొనేవారు కరువయ్యారనే భావన సీమలో బలంగా ఉంది. దీనికితోడు సీమ నీటి ప్రాజెక్టుల ఆందోళనకు ఇతర ప్రాంతాల మద్దతు కరువయ్యింది.

సీమ ప్రాంత విద్యార్థి, యువజనులు, అడ్వకేట్లు తమ ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని ఏడాదికి పైగా ఉద్యమిస్తే కోస్తా ప్రాంత మేధావులు మద్దతునివ్వకపోగా, హైకోర్ట్‌ను తమ ప్రాంతం నుండి తరలించరాదని ఆందోళన జేసేదాక నేటి మేధావుల సంకుచితత్వం దిగజారింది. ఒక టివి డిబేట్‌లో ఒక ఆంధ్రా మేధావి శ్రీబాగ్ ఒడంబడికను చిత్తుకాగితంతో పోలుస్తూ సీమ ప్రాంతం విడిపోయినా తమకిబ్బంది లేదన్నట్టు మాట్లాడాడు. అతనిప్పుడు అమరావతి, విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షకుడయ్యాడు.

ఇక ఈ మధ్యే కృష్ణానది నిర్వహణ బోర్డ్‌ను అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగే శ్రీశైలం ప్రాజెక్ట్, కర్నూల్‌లో గాక, కృష్ణా పరివాహక ప్రాంతానికి వందల మైళ్ల దూరంలో ఉన్న విశాఖలో ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ అనుచిత నిర్ణయానికి వ్యతిరేకంగా సీమలోని ప్రజా, విద్యార్థి సంఘాలు తప్ప ఒక్క రాజకీయ పార్టీ గాని, ఇతర ప్రాంతాల మేధావులు గాని గొంతెత్తిన దాఖలాలు లేవు. అంటే, వెనుకబడిన (నెట్టేయబడ్డ) ప్రాంతాలపట్ల అభివృద్ధి చెందిన సోకాల్డ్ మేధావుల ధోరణి అలా ఉందన్నమాట. ఇక ప్రాంతాల మధ్య సంఘీభావం, ఇచ్చిపుచ్చుకొనే ధోరణిని ఎలా ఆశించగలం.

జగన్‌రెడ్డి చంద్రబాబుకన్నా ఎత్తుగడలలో రెండడుగులు ముందే ఉన్నాడు. అన్ని ప్రాంతాల ప్రజలకు మేలు చేకూరుస్తున్నట్టు ప్రకటనలు జేసి, వాటి అమలు సాధ్యా సాధ్యాలు, చట్టబద్ధతను మరుగున దాస్తూ ప్రజల మెప్పును పొందడంలో జగన్‌ను మించిన నాయకుడెవ్వరూ లేరనిపిస్తుంది. వాటి అమలును కోర్టులు ప్రశ్నిస్తే, తన ప్రజానుకూల విధానాలకు న్యాయస్థానాలు అడ్డుపడుతున్నాయనే సొద్దు ఉండనే ఉంది.

జగన్ ఎత్తుగడలలో అతి ప్రధానమైనది మూడు రాజధానుల ప్రకటన. చంద్రబాబుతో విస్మరించబడ్డామన్న సీమ, శ్రీకాకులాంధ్ర వాసులకు పెద్ద ఉపశమనం. సీమలో హైకోర్టు అనగానే ఈ ప్రాంతవాసులు (మధ్యతరగతి) ఎగిరి గంతేశారు. సాధ్యా సాధ్యాలటుంచి, వారి అస్తిత్వ గుర్తింపు, అంతవరకూ పరాయివారిగా భావించబడ్డామనే వేదన చెందుతున్న మనుషులకు సీమలో హైకోర్టు ప్రకటన ఊరటనిచ్చింది. గత గాయాలకు తాత్కాలిక ఉపశమనమైనా కలిగింది. దక్షిణ కోస్తావారిపై విజయం సాధించామనే భావన కలిగింది.

జగన్ ఎత్తుగడలతో మూడు రాజధానులేమో గాని, మూడు రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్ భౌగోళికంగా కాకపోయినా, మానసికంగా

విడిపోయిందని చెప్పవచ్చు. రాజకీయంగా జగన్ నష్టపోతే కేవలం కృష్ణా, గుంటూర్ జిల్లాల వరకే ఉంటుంది. ఇతర ప్రాంతాలలో ఎవరి ఆశలు, ఎవరి ఆకాంక్షలు వారివి. ఇతర ప్రాంతం వారు తమ సమస్యల పట్ల సానుభూతి చూపలేదనే భావన అన్ని ప్రాంతాలలో బలంగా ఉంది. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు టివి షోలకి చేసిన హడావిడి తప్ప అమరావతి రైతు ఉద్యమానికి మిగతా ప్రాంతాల నుండి స్పందనలేదు. ఇతర ప్రాంతాల విద్యార్థి, యువజనులలో, ప్రజా సంఘాలలో అమరావతి రైతులకు అన్యాయం జరిగిందనే సానుభూతి ఏ కోశానా లేదు. ఈ విషయంలో రాయలసీమలో అసలూ లేదు. ఇక విశాఖ వాసులు అమరావతి రైతు ఉద్యమాన్ని తమకొచ్చే పాలనా రాజధానికి అడ్డంకుగా భావిస్తున్నారు తప్ప మరేమీ లేదు. ఇవన్నీ చేదు వాస్తవాలు.

ఇప్పుడు విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కుగా మొత్తం రాష్ట్ర ప్రజలు భావిస్తున్న స్పందన కనపడడం లేదు. ఇతర ప్రాంతాల ప్రజలకు ఆ సెంటిమెంట్ ఇప్పుడు లేదు. అది విశాఖ వాసుల సమస్యగానే ఇతర ప్రాంతాల ప్రజలు పరిగణిస్తున్నారనేది వాస్తవం. అందులో సీమ ప్రజల్లో విశాఖ ఉక్కు కర్మాగారం కోసం తామూ ఉద్యమం చేసినా ఆ కర్మాగారం ఉద్యోగాలలో తమకేమాత్రం వాటా దక్కలేదనే భావన ఉంది. అంతేగాక, కడప జిల్లాలోని రాయలసీమ పవర్ ప్రాజెక్ట్‌ను మూసివేస్తున్న అటు రాజకీయ పార్టీలు గాని, ఇటు ఇతర ప్రాంతాల ప్రజా సంఘాలు గాని కిమ్మనకపోవడాన్ని వేలెత్తి చూపుతున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంతో పోలిస్తే రాయలసీమ పవర్ ప్రాజెక్ట్ చిన్నదే గాని, దాన్ని ఇక్కడి ప్రజలు ఉద్యమం ద్వారా సాధించుకున్నారు. అమరావతి రైతుల ఉద్యమంతో సంఘీభావం ప్రకటించని విశాఖ వాసులు ఇప్పుడు వారి నుండి మద్దతునాశించే అవకాశం ఉందా. ఓట్ల కోసం పరస్పర విరుద్ధ డిమాండ్లకు రాజకీయ పార్టీ ఆయా ప్రాంతాలకు పరిమితమై మద్దతు ప్రకటించడం మామూలే. కాని మొత్తం ప్రజా సమూహం నుండి మద్దతునాశించే పరిస్థితి నేడు లేదు.

నేడు విశాఖ కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన భాద్యత అందరిపైన ఉందనేది ఎవరూ కాదనలేరు. అయితే రాజకీయ పార్టీల చిత్తశుద్ధి లేకుండా అది సాధ్యం కాదు. తమ ఓట్లకు గండిపడుతాయనే భయమే వారిని విశాఖ కర్మాగారాన్ని కాపాడేలా చేయగలదు. అదీ ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుంది. ఆ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వల్ల ప్రత్యక్షంగా నష్టపోయేది అందులో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక కుటుంబాలు. పరోక్షంగా కొన్ని వేల మంది వివిధ సేవలందిస్తున్నవారు. అంతేతప్ప శ్రీకాకులాంధ్ర గ్రామీణ ప్రాంత ప్రజలకు భిన్నమైన డిమాండ్లు ముఖ్యంగా సాగు, తాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఆదివాసీల సమస్య లాంటివి ఉన్నాయి. ఆ డిమాండ్ల పట్ల విశాఖ పురవాసులు ఇంతవరకు స్పందించిన తీరుబట్టి కర్మాగారం పట్ల అదే స్థాయిలో గ్రామీణుల స్పందన ఉంటుంది. అంతకన్నా ఎక్కువ ఆశించడం అమాయకత్వమే అవుతుంది.

రాజకీయ నాయకులు తమ అధికారం కోసం ప్రజలని కుల, మత, ప్రాంతాల శకలాలుగా విడదీశారు. శకలాల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, విశ్లేషించేందుకు పనికివస్తాయి తప్ప, వాటి పరిష్కారానికి ఉపయోగపడవు. శరీరంలో ఏ అంగానికి గాయమైనా, దాని ప్రభావం మొత్తం శరీంపై ఉన్నట్టే సమాజంలో ఏ సమూహానికి, ప్రాంతానికి నష్టం కలిగినా దాని ప్రభావం అన్ని సమూహాలపై, ప్రాంతాలపై కొద్దిపాటి తేడాతోనైనా ఉంటుందనే భావన ఈ రోజు మేధావులనబడే వారికి కొరవడడం ఒక విషాదం.

పాలకులు విభజించి దెబ్బతీయాలనే విధానంతో పాలితులను శకలాలుగా విడదీసి తమ పబ్బం గడుపుకుంటున్నారనేది మనం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

విశాఖ ఉక్కు సమస్య నేడు ఎంత ఉద్వేగాల, ఉద్రేకాలను రేకెత్తించినా, కొంత ఆవేశం తగ్గాక అది కేవలం ఉద్యోగుల సమస్యగా మిగిలే అవకాశం ఉంది. అది కార్మికుల జీవనోపాధి సమస్యగా ప్రాధాన్యం సంతరించుకొనే వరకు రాజకీయ పార్టీలు ఉత్తుత్తి మాటలతో, టివి ఆందోళనలతో కాలయాపన చేస్తారు. చివరకు ఉద్యోగ భద్రతా హామీతో ముగించేయడం కద్దు. ఎప్పుడైతే సమస్య ఉద్యోగ భద్రత స్థాయికి దిగజారిందో, అప్పుడది ప్రజా స్వభావం కోల్పోతుంది. అది ఉద్యోగ, యాజమాన్య డిమాండ్‌గా మారినా అశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

దేశాన్ని మొత్తం తాకట్టుపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తే, నేడు హోల్‌సేల్‌గా, రిటైల్‌గా అమ్మకానికి పెట్టాడు మోడీ. దాన్ని నిలువరించడం అంత సులభం కాదని నేటి రైతుల ఉద్యమం చెబుతుంది. వారంతటి సహనం, పట్టుదల వారికి దేశ, విదేశాల నుండి వస్తున్న మద్దతు విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి ఆశించగలమా? ఫలితమేలా ఉన్నా నేర్చుకోవలిసిన గుణపాటాలెన్నో ఉన్నాయి. తోటివారు వారి సమస్యల పరిష్కారానికై ఉద్యమాలు చేస్తున్నప్పుడు, ఒక ప్రజాస్వామిక దృక్పథంతో వాటిని అర్థం చేసుకొని వాటికి మద్దతునివ్వాలి. ప్రజల సమస్యలపై ఉద్యోగులు స్పందించనపుడు, ఉద్యోగుల సమస్యలపై ప్రజా స్పందనను ఆశించడం దురాశే. గతం లోగా ఉద్యోగులు తమ డిమాండ్లను తామే సాధించుకోగలమని భావించడం నేటి పాలకుల తీరును సరిగా అంచనా వేయకపోవడమే అవుతుంది. ఇలాంటి పరిస్థితి, తోటివారి సమస్యల పట్ల నిస్తబ్ధతగా ఉండడం సమిష్టితత్వం, సంఘీభావం లేకపోవడానికి ఓట్ల రాజకీయాలకతీతంగా పనిచేసే ప్రగతిశీల శక్తులు అత్యంత బలహీనంగా ఉండడం కారణం గాక మరేమిటి.

(రచయిత రాయలసీయ విద్యావంతుల వేదిక)

వీ

సుబ్బలక్ష్మి మృతి

ప్రముఖ రచయిత బుచ్చిబాబు సతీమణి, రచయిత్రి, చిత్రకారిణి శివరాజు సుబ్బలక్ష్మి(96) ఫిబ్రవరి 6న బెంగళూరులోని స్వగృహంలో మరణించారు. 1925 సెప్టెంబర్ 17న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరంలో జన్మించారు. బుచ్చిబాబు ప్రోత్సాహంతో కుంచెపట్టి రచయిత్రిగా, చిత్రకారిణిగా గుర్తింపు పొందారు. నీలం గేటు అయ్యగారు, అదృష్టరేఖ, తీర్పు నవలతో పాటు కావ్యసుందరి కథ, ఒడ్డుకు చేరిన కెరటం, మనోవ్యాధికి మందుంది, మగతజీవి చివరిచూపు, పేరుతో ఆమె కథా సంకలనాలు వెలువడ్డాయి.

ప్రేమకోసం యుద్ధం: మిలిటెంట్ పోరాటం, అద్భుత విజయం

అణచివేతకు గురవుతున్న అన్ని ప్రజా సమూహాలు విశాల ఐక్యతతో ఫాసిస్టు పాలకులను ప్రతిఘటించాలని పిలుపునిస్తున్నారు **అరుంధతీ రాయ్**

భీమా కోరేగావ్ యుద్ధంలో 1818లో విజయాన్ని సాధించిన సందర్భంగానూ, రోహిత్ వేముల (జీవించి వుంటే) 32వ జన్మదిన సందర్భంగానూ జరుగుతున్న ఈ సమావేశంలో మాట్లాడడానికి నన్ను ఆహ్వానించినందుకు ఎల్గార్ పరిషత్ నిర్వాహకులకు కృతజ్ఞతలు. మహర్లను, ఇతర దళిత కులాలకు చెందినవాళ్లని వర్ణించడానికి వీలులేని విధంగా క్రూరంగా హింసించిన, హీనంగా చూసిన పీష్వారాజు రెండవ బాజీరావును ఇక్కడకు కొద్ది దూరంలోనే బ్రిటిష్ సైన్యంలో భాగంగా పోరాడిన మహర్ సైనిక బలగాలు ఓడించాయి.

ఇదే వేదిక మీద నుండి మిగిలిన వక్తలతో పాటు నేను కూడా మూడు అక్రమ వ్యవసాయ చట్టాలను తక్షణం ఉపసంహరించుకొమ్మని డిమాండ్ చేస్తూ రైతులు చేస్తున్న పోరాటానికి సంఫీుభావాన్ని తెలియజేస్తున్నాను. లక్షలాది మంది రైతులు, రైతు కూలీలపైన ఈ చట్టాలను బలవంతంగా రుద్దుతున్నారు. వాళ్లను వీథుల్లోకి తీసుకువచ్చారు. ఈ నిరసన క్రమంలో మరణించినవారిపట్ల మా దుః ఖాన్ని, మరణాలపట్ల మా కోపాన్ని మేం వ్యక్తీకరిస్తున్నాం. రెండు నెలలుగా ఢిల్లీ సరిహద్దులలో శాంతియుతంగా నిరసన సాగుతున్న ప్రాంతంలో పరిస్థితి ఉత్కంఠభరితంగానూ, ప్రమాదకరంగానూ మారింది. వాళ్లమధ్య చీలికలు తేవడానికి, ఉద్యమాన్ని అపఖ్యాతిపాలు చేయడానికి సాధ్యమైనన్ని టక్కుటమారాలను, కవ్వింపు చర్యలను ప్రభుత్వం చేస్తోంది.

పాశవికమైన టెర్రరిస్టు వ్యతిరేక చట్టాల కింద హాస్యాస్పదమైన ఆరోపణలతో జైల్లో పెట్టిన 16 మంది భీమా కోరెగావ్ ముద్దాయిలతో పాటు, డజన్లకొద్దీ ఉన్న రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం. వాళ్లలో చాలా మంది కేవలం కామ్రేడ్లు మాత్రమే కాదు. నాకు వ్యక్తిగత స్నేహితులు కూడా. వాళ్లతో కలిసి నేను నడిచిన, హాస్యంగా నవ్వుకున్న, కలిసి భోజనం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రధాన మంత్రిని హత్య చేయడానికి ఈ ముద్దాయిలు కుట్రపన్నారని పదేపదే వెల్లువెత్తుతున్న ఆరోపణలను, వాళ్లు చేసి ఉంటారని, వాళ్లని నిర్బంధంలో ఉంచినవాళ్లు కూడా బహుశా నమ్మరు.

వాళ్లు తమ మేధో స్పష్టత, నైతిక స్థైర్యాల కారణంగానే జైల్లో ఉన్నారని అందరికీ తెలుసు. ఈ రెండు లక్షణాలూ భయంకరమైన ప్రమాద సూచికలుగా పాలకులు భావిస్తున్నారు. వాళ్లకి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేని వాస్తవాన్ని కప్పిపుచ్చుకోవడానికి, కొందరు ముద్దాయిలకు వ్యతిరేకంగా వేల పేజీల ఛార్జిషీట్లు తయారు చేస్తున్నారు. వాటి న్యాయాన్యాయాలను పరిశీలించడం అటుంచి, కేవలం వాటిని చదవడానికే న్యాయమూర్తికి అనేక సంవత్సరాల సమయం అవసరమవుతుంది.

ఒక ప్రమాదకర ప్రతిపాదన

నిద్రపోతున్నట్లు నటిస్తున్న వాడిని లేపడం ఎంత కష్టమో అక్రమంగా మోపబడిన అభియోగాల నుంచి నిన్ను నీవు కాపాడుకోవడం కూడా అంతే కష్టం. భారతదేశంలో న్యాయవ్యవస్థ మీద ఆధారపడడం ఒక ప్రమాదకర ప్రతిపాదన అని మనం తెలుసుకున్నాం. నిజానికి న్యాయ స్థానాలు ఎక్కడైనా, ఎప్పుడైనా ఫాసిస్టు వెల్లువను వెనక్కి నెట్టగలిగాయా? మనదేశంలో వ్యక్తి – వర్గం, కులం, తెగ, మతం, లైంగికత, రాజకీయ విశ్వాసాల మీద ఆధారపడి చట్టాల అమలు జరుగుతోంది. అందుచేత కవులు, మత గురువులు, విద్యార్థులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు జైళ్లలో ఉంటే, సీరియల్ హంతకులు, పట్టపగలే మనుషులను చంపే మూకలు, గౌరవం కోల్పోయిన న్యాయమూర్తులు, విషంకక్కే టి.వి. యాంకర్లు – మంచి మంచి బహుమతులు పొందుతూ, మరింత ఉన్నత స్థానాల కోసం అర్రులు చాస్తున్నారు. ఉన్నతమే కాదు, అత్యున్నతస్థానం కోసం కూడా.

2018 భీమా కోరెగావ్ ఊరేగింపునూ, 2020 పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసనలనూ, ప్రస్తుతం రైతుల నిరసనలనూ అపఖ్యాతిపాలు చేయడానికి, లోపలి నుండి వాటిని దిగజార్చడానికి పాలకుల ఏజెంట్లు కొందరు ఎలా ప్రయత్నిస్తున్నారో మనం చూస్తున్నాం. చట్టం నుండి వాళ్లు అనుభవిస్తున్న మినహాయింపులనుబట్టే ప్రస్తుత పాలకుల నుండి వాళ్లకు లభిస్తున్న మద్ధతును మనం ఊహించుకోవచ్చు. వీళ్లను అధికారంలోకి తీసుకురావడానికి కొన్ని దశాబ్దాలుగా ఈ పద్ధతి ఎలా కొనసాగిందో నేను చెప్పగలను. ఎన్నికలు సమీపిస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ప్రజలకు ఎలాంటి స్థితి ఎదురౌతుందోననే భయం మనల్ని వెన్నాడుతోంది.

గత రెండు సంవత్సరాలుగా కార్పొరేట్ మీడియా, ఒక సంఘటనగానూ, ఒక సంస్థగానూ ఎల్గార్ పరిషత్‌ను దుర్మార్గమైనదిగా చిత్రించి దాని ప్రతిష్టను దిగజార్చడానికి నిరంతరాయంగా ప్రయత్నిస్తూనే ఉంది. అనేకమంది సాధారణ ప్రజల దృష్టిలో ఎల్గార్, పరిషత్ అనే రెండు పదాలు – టెర్రరిస్టులు, జిహాదీలు, పట్టణ నక్సలైట్లు, దళిత పాంథర్లు వంటి రాడికల్స్ ధరించిన ముసుగు అనే అభిప్రాయం ఉంది. వాళ్లు ఈ దేశాన్ని నాశనం చేయడానికి కుట్రపన్నుతున్నారనే భావన ఉంది. వ్యక్తులకు నిందాపూర్వకమైన పేర్లు పెడుతున్న, బెదిరిస్తున్న ఈ వాతావరణంలో ఈ సభను నిర్వహించడమే ధైర్యంతో, సహసంతో కూడిన చర్య. ఇందుకుగాను నిర్వాహకులకు మనం అభినందనలు తెలపాలి. సాధ్యమైనంత ధైర్యంగా నిజాలు మాట్లాడడం వేదిక మీద ఉన్న మనందరి కర్తవ్యం.

సుమారు మూడు వారాల క్రితం, జనవరి 6న ఒక విచిత్రమైన గుంపు కాన్‌ఫెడరేట్ (అమెరికా అంతర్యుద్ధ కాలంలో బానిసత్వాన్ని సమర్థించిన శ్వేతజాతి దురహంకారుల పథకాలు) పతకాలు, ఆయుధాలు, ఉరికొయ్యలు, క్రాస్‌లు పట్టుకుని, బొచ్చు టోపీలు, కొమ్ములు తగిలించుకుని అమెరికాలో క్యాపిటల్ హిల్ మీద చేసిన దాడిని మనం చూశాం. అది చూసినప్పుడు నాలో మెదిలిన భావన ఏమిటంటే, 'మనదేశంలో వీళ్ల లాంటి వ్యక్తుల చేత మనం ఇప్పటికే పరిపాలించబడుతున్నాం. వాళ్లు మన క్యాపిటల్ హిల్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. వాళ్లు విజయాన్ని సాధించారు.' మన సంస్థలన్నింటినీ వాళ్లు చిన్నాభిన్నం చేశారు. మన నాయకుడు ప్రతిరోజూ రకరకాల వేషధారణలతో మనముందు కనిపిస్తాడు. ఆవు మూత్రం మనం ఇష్టపడుతున్న అమృతం. ఈ దేశంలోని ప్రతి ప్రజాస్వామిక సంస్థను నాశనం చేసే దిశగా వాళ్లు ప్రయాణిస్తున్నారు. జనవరి 6 వినాశనం నుండి తప్పించుకుని అమెరికా ఏదో ఒకరకంగా నామమాత్రమైన 'సాధారణ' దశకు చేరుకున్నట్లు కనపడుతోంది. కాని మనం శతాబ్దాల వెనక్కి – దేని నుండైతే తప్పించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించామో అక్కడికి నెట్టివేయబడుతున్నాం.

ఇక్కడున్న మనం గానీ, ఈ ఎల్గార్ పరిషత్ సమూహం గానీ తీవ్రవాదులు కారు. చట్ట విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నది మనం కాదు. ముస్లింలను వేల సంఖ్యలో చంపిన హత్యాకాండను ప్రత్యక్షంగా ప్రోత్సహించిందీ మనం కాదు. ఆ దుర్మార్గాన్ని చూడకుండా మొహం పక్కకు తిప్పుకొన్నదీ మనం కాదు. నగర వీధుల్లో దళితుల్ని బహిరంగంగా చావమోదుతుంటే నిర్లిప్తంగా చూస్తున్నదీ మనం కాదు. ప్రజల్ని ఒకళ్లపై మరొకళ్లను పురికొల్పుతున్నదీ మనం కాదు. ద్వేషం ద్వారా, ప్రజల మధ్య విభేదాలను సృష్టించడం ద్వారా పరిపాలిస్తున్నదీ మనం కాదు. ఆ పనులు చేస్తున్నదంతా మన పాలకులుగా మన చేత ఎన్నుకోబడ్డవాళ్లు, మీడియాగా పిలవబడుతున్న వాళ్ల ప్రచార యంత్రాంగం.

భీమా కోరెగావ్ యుద్ధం జరిగి 200 సంవత్సరాలయింది. బ్రిటిష్ వాళ్లు దేశం నుండి వెళ్లిపోయారు. కాని వాళ్లకంటే కొన్ని శతాబ్దాల ముందు నుండీ ఉన్న ఒకలాంటి వలసవాదం ఇప్పటికీ సజీవంగానే ఉన్నది. పీష్వాలు పోయారు గానీ, పీష్వాయీ – బ్రాహ్మణవాదం – పోలేదు. బ్రాహ్మణవాదం అంటే ఏమిటో ఇక్కడున్నవారికి నేను వివరించాల్సిన అవసరం లేదు. ఆ పదానికి అర్థం తెలియనివాళ్ల కోసం నేను వివరణ ఇస్తున్నాను. బ్రాహ్మణ వాదమనేది జాతి వ్యవస్థను సూచించడానికి కుల వ్యతిరేక ఉద్యమం చారిత్రకంగా ఉపయోగించిన పదం. ఇది కేవలం బ్రాహ్మణులను మాత్రమే ఉద్దేశించిన పదం కాదు. బ్రాహ్మణిజాన్ని వర్క్‌షాపుకు తీసుకువెళ్లి ఆధునికత, ప్రజాస్వామ్యం వంటి ఆకర్షణీయమైన పదాల ముసుగులు తగిలించి, నూతన కుల సమీకరణలతో కార్యక్రమంతో ప్రజల ముందుకు తెచ్చారు (ఇదేదీ కొత్తది కాదు. పాతదాన్నే మరమ్మత్తులు చేసి కొత్తదానిగా భ్రమింప చేస్తున్నారు). కొంతకాలం పాటు మనలో ఆశలు రేకెత్తించిన దళిత బహుజనుల నాయకత్వంలోని రాజకీయ పార్టీల ఉనికికే ఈ కొత్త రూపంలో ఉన్న బ్రాహ్మణవాదం సవాలు విసురుతోంది.

ప్రస్తుతం, 21వ శతాబ్దపు బ్రాహ్మణవాదం, అతిమితవాద బ్రాహ్మణ ఆధిపత్యంలోని ఆర్‌ఎస్‌ఎస్‌ను తన వాహనంగా ఎంచుకున్నది. ఒక శతాబ్దం పాటు విరామం ఎరుగకుండా కష్టపడిన ఆర్‌ఎస్‌ఎస్ నరేంద్రమోడీ రూపంలో ఢిల్లీలో అధికారాన్ని హస్తగతం చేసుకున్నది.

కార్పొరేట్ వర్గం

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ భారతదేశంలో కులాన్ని అంతం చేస్తుందనీ, లేదా కనీసం దాన్ని అధిగమించగలుగుతుందనీ కార్ల్ మార్క్స్‌తో సహా అనేక మంది విశ్వసించారు. అలా జరిగిందా? ప్రపంచవ్యాప్తంగా సంపద కొద్ది లేదా అతికొద్ది మంది చేతుల్లో కేంద్రీకరించేటట్లు పెట్టుబడిదారీ వ్యవస్థ జాగ్రత్త పడింది. భారతదేశంలో అత్యంత సంపన్నులైన 63 మంది వద్ద 130 కోట్ల మందికి ఉద్దేశించిన 2018–19 కేంద్ర బడ్జెట్ కంటే ఎక్కువ సంపద ఉన్నది. కరోనా మహమ్మారి ప్రబలిన కాలంలో భారతదేశంలో కోట్లాది మంది ప్రజలు లాక్‌డౌన్ కారణంగా ఉద్యోగాలు పోగొట్టుకున్న తరుణంలో – ఏప్రిల్ 2020న ప్రతి గంటకు 17 లక్షల మంది ఉద్యోగాలు పోగొట్టుకున్నారు – భారతదేశంలోని కోటీశ్వరులు తమ సంపదను 35 శాతం పెంచుకున్నారని ఆక్స్‌ఫాం నివేదిక తెలియచేస్తోంది.

వాళ్లల్లో అత్యంత సంపన్నులైన వందమంది – వాళ్లని మనం కార్పొరేట్ వర్గమని పిలుద్దాం – భారతదేశంలోని అత్యంత పేదలైన సుమారు 15 కోట్ల మంది ప్రజలకు, మనిషికి లక్ష రూపాయల చొప్పున పంచగలిగినంత ఆదాయాన్ని కలిగి ఉన్నారు. ఇదే విషయాన్ని ప్రధాన స్రవంతికి చెందిన పత్రిక ఈ శీర్షిక కింద ఇలా ప్రకటించింది: 'కోవిడ్–19, సంపద, విద్య, లైంగికత వంటి అసమానతలను మరింత తీవ్రం చేసింది.' ఈ నివేదికలోనూ, పత్రిక శీర్షికలోనూ కనపడకుండా పోయిన పదం 'కులం'.

నౌకాశ్రయాలు, గనులు, గ్యాస్ క్షేత్రాలు, రిఫైనరీలు, టెలీ కమ్యూనికేషన్, హైస్పీడ్ డేటా, సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లు, యూనివర్సిటీలు, పెట్రోకెమికల్ కర్మాగారాలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఆహార పదార్థాల పంపిణీ కేంద్రాలు, టెలివిజన్ కేబుల్ నెట్‌వర్క్‌లు – వీటన్నిటి మీదా యాజమాన్యం కలిగిన, సంఖ్య రీత్యా అతి చిన్నదైన ఈ కార్పొరేట్ వర్గానికి, వాస్తవానికి ఈ దేశాన్ని స్వంతం చేసుకుని నడిపిస్తున్న ఈ వర్గానికి కూడా కులం ఉందా?

చాలావరకు ఉన్నది. భారతదేశంలోని కార్పొరేట్లలో అతిపెద్ద సంస్థలన్నీ కుటుంబ యాజమాన్యం కింద నడుస్తున్నవే. వాటిల్లో అతిపెద్దవైన కొన్నింటిని గురించి ప్రస్తావిద్దాం – రిలయన్స్ పరిశ్రమలు (ముఖేష్ అంబాని), అదానీ గ్రూపు (గౌతమ్ అదానీ), ఆర్సెలార్ మిట్టల్ (లక్ష్మీ మిట్టల్), ఓ.పి. జిందాల్ గ్రూప్ (సావిత్రీదేవి జిందాల్), బిర్లా గ్రూపు (కె.యమ్.బిర్లా). వీళ్లందరూ తమని తాము వ్యాపారస్తుల కులమైన వైశ్యులుగా పిలుచుకుంటారు. భగవంతుడు తమకు నిర్దేశించిన విధిని – డబ్బు చేసుకోవడం – మాత్రమే వాళ్లు నిర్వర్తిస్తున్నారు.

కార్పొరేట్ మీడియా సంస్థల యాజమాన్యాల, వాటి సంపాదకుల, కాలమిస్టుల, సీనియర్ జర్నలిస్టుల, కుల గణాంకాలను పరిశీలిస్తే ప్రధానంగా బ్రాహ్మణ, బనియా కులాలతో సహా మిగిలిన ప్రత్యేక హోదా కలిగినవారి గుప్పెట్లో అవి చిక్కుకుపోయాయన్న వాస్తవం మనకు తెలుస్తుంది. వాస్తవమైన, అవాస్తవమైన వార్తలను రూపొందించడంలో, ప్రచారం చేయడంలో కిందిస్థాయి వరకు తీసుకువెళ్లడంలో వీళ్లదే ప్రధాన స్థానం. ఈ రంగంలో దళితులు, ఆదివాసీలు, ముస్లింలు దాదాపుగా మనకు కనపడరు. ఉన్నత స్థాయి, కింది స్థాయి న్యాయ వ్యవస్థలోనూ, సివిల్ సర్వీసులలో ఉన్నత స్థానాలలోనూ, విదేశాంగ సర్వీసులోనూ, చార్టర్డ్ ఎకౌంటెంట్లలోనూ, విద్యా, వైద్య, ప్రచురణా రంగంలోనూ, పాలనా రంగంలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. మొత్తం జనాభాలో బ్రాహ్మణుల, వైశ్యుల సంఖ్య 10 శాతం కంటే తక్కువే. కులం,

పెట్టుబడిదారీ వ్యవస్థ కలగలిసి భారతదేశంలో ఒక విచిత్రమైన ప్రాణాంతకమైన మిశ్రమాన్ని తయారు చేశాయి.

కాంగ్రెస్ పార్టీ వంశపారంపర్య రాజకీయాలపై నిత్యం దాడిచేస్తున్న ప్రధాని మోడీ ఈ కార్పొరేట్ వంశాలను సంపన్నం చేయడానికి, మద్దతు ఇవ్వడానికి పూర్తిగా తనను తాను అర్పించుకున్నాడు. మంచికో, చెడుకో ఆయనను ఆకర్షణీయంగా చూపిస్తున్న పల్లకీలన్నీ ప్రధానంగా వైశ్య, బ్రాహ్మణ కుటుంబాల యాజమాన్యంలో ఉన్న కార్పొరేట్ మీడియాలే. ఉదాహరణకు – ది టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్థాన్ టైమ్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది హిందూ, ఇండియా టుడే, దైనిక్ భాస్కర్, దైనిక్ జాగరణ్. రిలయన్స్ పరిశ్రమలకు 27 ఛానళ్లను అదుపు చేయడానికి అవసరమైనంత వాటాలున్నాయి. 'ఆకర్షణీయంగా' అనే పదాన్ని నేను ఎందుకు వాడుతున్నానంటే ప్రధాన మంత్రిగా ఉన్న దాదాపు ఏడు సంవత్సరాల కాలంలో మోడీ ఒక్కసారి కూడా ప్రత్యక్షంగా పత్రికా విలేఖరులను ఉద్దేశించి ప్రసంగించలేదు.

ఒకవైపు మనకు సంబంధించిన వ్యక్తిగత గణాంకాలను తవ్వితీస్తూ మన కనుపాపలను స్కాన్ చేస్తున్నారు. మరోపక్క పాలకులు తమకు కల్పిస్తున్న సౌకర్యాలకు గాను తిరుగులేని విధేయతను కృతజ్ఞతాపూర్వకంగా ప్రదర్శించడం కోసం, కార్పొరేట్ ప్రపంచానికి అవకాశాన్ని కల్పిస్తూ మన కంటికి కనపడని రీతిలో ఒక వ్యవస్థను తయారు చేశారు. 2018లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం పేరు ప్రకటించాల్సిన అవసరం లేకుండా ఎవరైనా సరే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వవచ్చును. దీని కారణంగా ఒక వాస్తవమైన, సంస్థాగతమైన అత్యంత రహస్యమైన వ్యవస్థ తయారైంది. ఇది కార్పొరేట్లకు, రాజకీయ శిష్టులకు మధ్య డబ్బును, అధికారాన్ని పరస్పరం పంపిణీ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇలాంటప్పుడు భాజపా ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన రాజకీయ పార్టీ అయిందంటే పెద్దగా ఆశ్చర్యపడాల్సింది లేదు.

ప్రజల పేరిట, హిందూ జాతీయవాదం పేరిట ఈ దేశంపై ఆధిపత్యాన్ని సంఘటితం చేసుకున్న – సంఖ్యరీత్యా చాలా చిన్నదైన ఈ వర్గ, కుల శిష్ట బృందం తనకు ఓట్లు వేసిన తన ప్రజల్నే శత్రు బలగాలుగా పరిగణించడం ప్రారంభించింది. వాళ్లను మోసపూరితంగా అజమాయిషీ చేయాలనీ, దోచుకోవాలనీ, రహస్యంగా దాడిచేయాలనీ, ఊహించని రీతిలో నిర్ణయాలు చేయాలనీ, వాళ్లపై ఉక్కుపాదం మోపాలనీ అనుకుంటోంది. మెరుపు ప్రకటనల, చట్ట వ్యతిరేక ఆర్డినెన్స్‌ల జాతిగా మనల్ని మార్చివేశారు.

మెరుపు ప్రకటనలు

పెద్దనోట్ల రద్దు రాత్రికి రాత్రే ఆర్థిక వ్యవస్థ వెన్నుపూసను విరిచివేసింది. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసినకారణంగా 70 లక్షల మంది ప్రజలు అకస్మాత్తుగా నెలల తరబడి సైనిక, నెట్‌వర్క్ దిగ్బంధనానికి ప్రపంచమంతా చూస్తుండగానే గురయ్యారు. ఇది మన పేరుమీద మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరం. అధికారిక, అనధికారిక ఆదేశాల ప్రకారం కశ్మీరీ జాతి శరీరంలో ప్రతి ఎముకనూ విరగ్గొడుతూ ఉన్నా, లొంగుబాటు తత్వంలేని అక్కడి ప్రజలు స్వేచ్ఛ కోసం ఒక సంవత్సరం తరవాత కూడా కృత నిశ్చయంతో పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

ముస్లిం వ్యతిరేక పౌరసత్వ సవరణ చట్టాన్ని, జాతీయ పౌరసత్వ రిజిష్టరు చట్టాన్ని నిస్సిగ్గుగా తీసుకువచ్చిన ఫలితంగా ముస్లిం మహిళల నాయకత్వంలో నెలల తరబడి నిరసన ఉద్యమం జరిగింది. ఇది చివరకు, ఈశాన్య ఢిల్లీలో ముస్లిం వ్యతిరేక హింసాకాండతో ముగిసింది. పోలీసుల సమక్షంలోనే స్వయంసేవకుల మూకలు ఈ హింసాకాండకు ఆజ్యం పోశాయి. ఇప్పుడు అదే హింసాకాండకు ముస్లింలను నిందిస్తున్నారు. ఉమర్ ఖలీద్, ఖలీద్ సైఫీ, షార్జీల్ ఇమామ్, మేరాన్ హైదర్, నటాషా నార్వల్, దేవాంగన కలితలతో సహా వందలాది మంది ముస్లిం యువకులు, విద్యార్థులు, కార్యకర్తలు జైళ్లలో ఉన్నారు. వాళ్ల నిరసనోద్యమాన్ని ఇస్లామిక్ జిహాదీ కుట్రగా చిత్రీకరించారు.

దేశవ్యాప్తంగా జరిగిన ఈ తిరుగుబాటుకు వెన్నెముకలాంటి చారిత్రాత్మకమైన షహీన్‌బాగ్ ధర్నాకు నాయకత్వం వహించిన మహిళలను, 'జండర్ ముసుగు'గా వాడుకున్నారని పాలకులం టున్నారు. ప్రతి నిరసన స్థలంలోనూ రాజ్యాంగాన్ని కాపాడడం కోసం ప్రజలు బహిరంగంగా చేసిన ప్రమాణాలను 'లౌకికవాద ముసుగు'గా చిత్రీకరిస్తున్నారు. ముస్లింలు చేసిన ప్రతిపనీ జిహాదీ అని చిత్రీకరించడమే వాళ్ల లక్ష్యం. (ఈ జిహాదీ అనే పదాన్ని టెర్రరిజం అనేపదం స్థానంలో తప్పుడు అర్థంలో ఉపయోగిస్తున్నారు.)

తీవ్రంగా గాయపడ్డ ముస్లిం పురుషులను వీధుల్లో ఒకళ్ల మీద ఒకళ్లను కుప్పగా వేసి జాతీయ గీతాన్ని ఆలపించమని వాళ్లపై ఒత్తిడి తెచ్చారు. ఇలా చేసిన పోలీసులపై కేసులు పెట్టడం మాట అటుంచి, కనీసం వాళ్లను గుర్తించను కూడా లేదు. ఒక 'దేశభక్తు'డైన పోలీసు తన లాఠీని ఒక వ్యక్తి గొంతులోగుండా బలంగా దించిన కారణంగా తదనంతరం అతను మరణించాడు. ఢిల్లీ పోలీసులు ఈ అల్లర్లను అదుపు చేసినందుకు వాళ్లను హోం మంత్రి పొగిడాడు.

ఈ నరమేధం ముగిసిన ఒక సంవత్సరం తరవాత, దెబ్బతిన్న ముస్లిం మత సమూహం తిరిగి తన కాళ్లమీద తాను నిలబడడానికి ప్రయత్నిస్తూ ఉంటే మరోవైపు భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌లు, ఆ నరమేధం జరిగిన కాలనీలలోనే, అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం విరాళాలు వసూలు చేయడానికి రథయాత్రలు, మోటారు సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నాయి.

మనం లాక్‌డౌన్ మెరుపుదాడికి కూడా గురయ్యాం. 130 కోట్ల మందిని కేవలం నాలుగు గంటల నోటీస్‌లో లాక్‌డౌన్‌కు గురిచేశారు. లక్షలాది మంది నగర కార్మికులు వేల కిలోమీటర్లు నడిచి వాళ్లవాళ్ల స్వగ్రామాలకు చేరవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో నేరస్థుల్లా వాళ్లను కూడా పోలీసులు చావమోదారు.

కరోనా మహమ్మారి చెలరేగుతున్న సమయంలోనే, వివాదాస్పద జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదాను మార్చినందుకు స్పందనగా చైనా, లడఖ్‌లో భారత భూభాగాన్ని కొంతమేరకు ఆక్రమించుకున్నది. చేతగాని మన ప్రభుత్వం ఏమీ జరగలేదన్నట్టుగా నటించక తప్పలేదు. యుద్ధం జరిగినా జరక్కపోయినా, ఆర్థిక రంగంలో అభివృద్ధి వ్యతిరేక దిశలో పయనిస్తోంది. ఇలాంటి సమయంలో కూడా వేలాది మంది సైనిక బలగాలను, వాళ్లకు అవసరమైన అన్ని సాధన సంపత్తులను సమకూర్చి శాశ్వత ప్రాతిపదిక మీద యుద్ధానికి సన్నద్ధం చేసి ఉంచడానికి పెద్ద మొత్తంలో డబ్బు కుమ్మరించాల్సి వస్తోంది. సున్నా డిగ్రీల వాతావరణంలో ఉన్న చాలా మంది సైనికులు కేవలం దాని మూలంగానే ప్రాణాలు కోల్పోవలసి వస్తోంది.

ఈ తెచ్చిపెట్టుకున్న విపత్తుల జాబితాలో ఇప్పుడు మూడు వ్యవసాయ బిల్లులు అగ్రభాగాన చేరాయి. ఇవి భారత వ్యవసాయ రంగపు వెన్నెముకను విరుస్తాయి. వ్యవసాయాన్ని కార్పొరేట్ల ఆధీనంలోకి తెస్తాయి.

రైతాంగానికి ఎలాంటి రాజ్యాంగబద్ధ హక్కులు ఉండవు. వాళ్లకి న్యాయ సంబంధమైన అవకాశాలు కూడా మృగ్యమవుతాయి.

ఒక వాహనంలోని ఇంజన్‌ను, చక్రాలను, సీట్లను పూర్తిగా ధ్వంసం చేసి శిథిలమైన దాని చట్రాన్ని హైవే మీద నిలిపి ఉంచి ఉన్నట్లుంది. అదే సమయంలో అదే హైవే మీద కొమ్ములు, బొచ్చు టోపీలు ధరించిన వాళ్లు వాళ్ల కార్లను వేగంగా నడుపుకుంటూ పోతున్న దృశ్యాన్ని మనం చూస్తున్నాం.

కోపానికి సమష్టి వ్యక్తీకరణ

ఈ కారణంగానే మనకి ఇలాంటి ఎల్గార్ ఒక తప్పనిసరి అవసరం. బ్రాహ్మణవాదానికి, పెట్టుబడికి, ఇస్లామ్ ఫోబియాకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా – స్థిరంగా, సమిష్టిగా తిరుగుబాటు తత్వంతో మన కోపాన్ని వ్యక్తీకరించే ఎల్గార్ అవసరం. వీటిల్లో అన్నింటికంటే ముఖ్యమైనది పితృస్వామ్యం. ఎందుకంటే పురుషులు స్త్రీలను అజమాయిషీ చేయలేకపోతే, తాము ఇకదేన్నీ అజమాయిషీ చేయలేమని వాళ్లకు తెలుసుకాబట్టి.

కరోనా మహమ్మారి చెలరేగుతూ ఉన్న సమయంలో, రైతులు రోడ్లమీద ఉన్న సమయంలో, భాజపా పాలనలోని రాష్ట్రాలు మతమార్పిడి వ్యతిరేక ఆర్డినెన్స్‌లను తీసుకురావడానికి తొందరపడుతున్నాయి. దీని గురించి కూడా నేను కొంత చెప్పాల్సి ఉంది. కులం, పురుషత్వం, ముస్లింలు, క్రైస్తవులు, ప్రేమ, జనాభాలో మత నిష్పత్తి, చరిత్ర వంటి అంశాలపై ప్రస్తుత పాలకులకున్న ఆరాటాన్ని, అంతర్ దృష్టిని ఈ ఆర్డినెన్స్‌లు ప్రతిబింబిస్తున్నాయి.

'ఉత్తరప్రదేశ్ చట్ట వ్యతిరేక మత మార్పిడి నిషేధ ఆర్డినెన్స్ 2020'ను (దీన్నే అందరూ లవ్ జీహాద్ వ్యతిరేక ఆర్డినెన్స్ అంటున్నారు) ప్రకటించి నెల కూడా కాలేదు. ఇప్పటికే కొన్ని వివాహాలకు విఘాతం కలిగింది. కొన్ని కుటుంబాలపై కేసులు నమోదు అయ్యాయి. డజన్లకొద్దీ ముస్లిం యువకులు జైళ్ల పాలయ్యారు. తాము తినని గొడ్డు మాంసం కోసం, తాము చంపని ఆవుల కోసం, తాము చేయని నేరాల కోసం బహిరంగంగా ఇంతకాలం ఊచకోతకు గురవుతున్న (ముస్లింలను హత్యచేయడం ఒక నేరపూరిత చర్యగా చూడడం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ), తాము వేయని జోకుల కారణంగా జైళ్లపాలవుతున్న (యువ హాస్యగాడు మునావర్ ఫరూకీ కేసు) దానికి అదనంగా, ముస్లింలను ఇప్పుడు ప్రేమలో పడ్డ నేరానికి, పెళ్లి చేసుకున్న నేరానికి కూడా జైల్లో పెట్టవచ్చునన్నమాట.

ఈ ఆర్డినెన్స్‌ను అర్థం చేసుకునే క్రమంలో ఒక ప్రధానమైన ప్రశ్నను – మతాన్ని ఎట్లా నిర్వచిస్తావు అనే దాన్ని – పక్కనబెడదాం. ఒక వ్యక్తిని నాస్తికుడుగా మారమని ప్రోత్సహించిన వ్యక్తికూడా ఈ చట్ట ప్రకారం శిక్షార్హుడేనా?

2020 ఉత్తరప్రదేశ్ ఆర్డినెన్స్, 'బలాన్ని ఉపయోగించి గానీ, అనవసరమైన ప్రభావాన్ని కలిగించి గానీ, వత్తిడి ద్వారా గానీ, వాస్తవాలను దాచిపెట్టటం ద్వారా గానీ, ప్రలోభాలకు గురిచేయడం ద్వారా గానీ, ఏ ఇతర కుట్రపూరిత పద్ధతుల ద్వారా లేదా వివాహం ద్వారా జరిగే చట్టవ్యతిరేక మత మార్పిడులను నిషేధించింది'. ప్రలోభానికి గురిచేయడం అనేదానికి ఇచ్చిన నిర్వచనంలో బహుమతులు ఇవ్వడం, ప్రసిద్ధి చెందిన పాఠశాలలో ఉచిత విద్యను, మెరుగైన జీవన విధానాన్ని వాగ్దానం చేయడం, చేసిన పనికి కృతజ్ఞతగా బదులు తీర్చుకోవడం వంటివన్నీ చేర్చారు. (భారతదేశంలో కుదిర్చిన పెళ్లిళ్లు అన్నింట్లో ఇలాంటి లావాదేవీలన్నీ సాధారణమే.)

మతమార్పిడి జరగడానికి కారకుడైన వ్యక్తికి ఒకటి నుండి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించవచ్చు. ఆ కుటుంబ సభ్యుడు ఎవరైనా గానీ, లేక దూరపు బంధువైనా గానీ నిందితుడు కావచ్చు. తాను నేరం చేయలేదని రుజువు చేసుకోవాల్సింది నేరస్థుడే. 'బాధితురాలికి' ఐదు లక్షల రూపాయల నష్టపరిహారాన్ని నిందితుడు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చును. ఇలాంటి నిబంధన ఫలితంగా బ్లాక్‌మెయిల్ చేయడానికి, భయపెట్టి డబ్బులు వసూలు చేయడానికి ఎన్ని అవకాశాలు ఉంటాయో మనం ఊహించవచ్చు.

ఒక గొప్ప విషయం ఏమిటంటే ఒకవేళ మతం మారిన వ్యక్తి మైనర్ గానీ, మహిళ గానీ, ఎస్.సి. గానీ, ఎస్.టి. గానీ అయి ఉంటే 'మత మార్పిడి'కి శిక్ష రెట్టింపు అవుతుంది. అంటే రెండేళ్ల శిక్ష పదేళ్ల శిక్ష అవుతుంది. మరోమాటలో చెప్పాలంటే ఈ ఆర్డినెన్స్ మహిళలకు, దళితులకు, ఆదివాసీలకు–మైనర్లతో సమానమైన హోదా ఇచ్చిందన్నమాట. ఇది చిన్నపిల్లల చేష్ట. మన చర్యలకు మనం బాధ్యత వహించే మేజర్లంగా మనని వాళ్లు గుర్తించలేదన్నమాట. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దృష్టిలో అగ్రకుల హిందూ పురుషుడు మాత్రమే సర్వశక్తి సంపన్నుడన్న మాట.

రైతుల నిరసన ప్రదర్శనలలో మహిళలను ఎందుకు 'ఉంచుతున్నారని' భారత ప్రధాన న్యాయమూర్తి అడగడానికి కూడా ఈ మనస్తత్వమే కారణం (భారతదేశంలో వ్యవసాయానికి ఒక ప్రధానమైన వెన్నెముక ఏ రకంగా చూసిన మహిళలే). తమ కుటుంబాలతో కలిసి నివసించని మహిళలందరూ పోలీస్ స్టేషన్లలో రిజిస్టర్ చేయించుకోవాలని, దాని మూలంగా 'తమ రక్షణ'ను పోలీసులు పట్టించుకోవడం సాధ్యమవుతుందని మధ్యప్రదేశ్ ప్రభుత్వం సూచిస్తోంది.

కులం గురించిన ఆరాటం

మదర్ థెరిస్సా గనక సజీవంగా ఉండి ఉంటే ఈ ఆర్డినెన్స్ ప్రకారం ఆమె కూడా కచ్చితంగా జైలు శిక్షను అనుభవిస్తూ ఉండి ఉండేది. ఎంతో మందిని క్రైస్తవ మతంలోకి మార్చినందుకు ఆమెకు పది సంవత్సరాల నుండి యావజ్జీవ శిక్షపడి ఉండేది. భారతదేశంలోని పేద ప్రజలలో పనిచేస్తున్న ఏ క్రైస్తవ మతగురువు 'అదృష్టం' అయినా ఇలానే ఉంటుంది.

అలానే దురదృష్టం కొద్దీ మనల్ని మనం హిందువులుగా పిల్చుకుంటున్న కారణంగా మనపట్ల వారి ప్రవర్తన ఇలా ఉంది. మనం మరొక మత విశ్వాసానికి చెందినవాళ్లం అయి ఉంటే మనపట్ల ఇలా ప్రవర్తించడానికి ఎవరికీ ధైర్యం ఉండదు. మీకు సమాన హోదాను ఇచ్చే ఏ మతాన్నైనా ఎంచుకోండి. మన తప్పుని ఇప్పుడు సరిదిద్దుకుందాం' అని అన్న వ్యక్తి పరిస్థితి ఎలా ఉండేదో?

ఆ మాటలన్నది బాబాసాహెబ్ అంబేద్కర్ అని మీలో చాలా మందికి తెలుసు. మెరుగైన జీవన విధానాన్ని వాగ్దానం చేస్తూ ఆయన ప్రజల మతమార్పిడికి స్పష్టమైన పిలుపునిచ్చారు. ఈ ఆర్డినెన్స్ కింద 'గుంపు మతమార్పిడి' అంటే 'ఇద్దరు గానీ అంతకంటే ఎక్కువ మంది గానీ మత మార్పిడి చేసుకోవడం' అని నిర్వచించారు. దీని ప్రకారం పై మాటలు అన్నందుకు అంబేద్కర్ క్రిమినల్ నేరం కింద శిక్షార్హుడు అవుతాడు.

మహాత్మ ఫూలే కూడా గుంపు మతమార్పిడికి బహిరంగంగా అంగీకారాన్ని ఇచ్చాడు కాబట్టి ఆయనకు కూడా శిక్షపడి ఉండేది. ఆయన ఇలా అన్నారు: 'ముస్లింలు మోసగాళ్లయిన ఆర్యభట్‌ల శిలా ప్రతిమలను

ధ్వంసం చేసి, వాళ్లను బలవంతంగా బానిసలుగా చేసుకొని, శూద్రులను, అతి శూద్రులను పెద్ద సంఖ్యలో వాళ్ల గుప్పిట నుండి విముక్తి చేసి, ముస్లిం మతంలో చేర్చి ముస్లింలుగా మార్చారు. ఇంతేకాదు వాళ్ల మధ్య సహపంక్తి భోజనాలకి, పరస్పర వివాహాలకి అవకాశాలు ఇచ్చారు. వాళ్లకి అన్ని సమాన హక్కులు కూడా కల్పించారు....'

ఈ ఉపఖండంలోని జనాభాలో ఒక పెద్ద భాగమైన లక్షలాది మంది సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు చారిత్రక పరిణామానికి, గుంపు మతమార్పిడిలకు సాక్ష్యం. 'హిందూ జనాభా' వేగంగా సంఖ్యరీత్యా తగ్గిపోవడం అగ్రకుల హిందువులలో ఆందోళనకు కారణమైంది. ఈ దేశ జనాభా ప్రాతిపదిక మారిపోతుందనే భయంతో వాళ్లు ఈ రోజు హిందూత్వగా పిలవబడుతున్న రాజకీయాలకు పురికొల్పారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ అధికారంలో ఉండడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇప్పుడు పెద్ద ఎత్తున జరుగుతున్న మతమార్పిడులు విశ్వహిందూ పరిషత్ నిర్వహిస్తున్నవే. దీనినే 'ఘర్ వాపసీ' (ఇంటికి తిరిగిరావడం) అని అంటున్నారు. ఇది 19వ శతాబ్దపు చివర్లో హిందూ సంస్కరణవాదులు ప్రారంభించిన కార్యక్రమం. అడవుల్లో నివసించే ఆదివాసీలు 'తిరిగి హిందూ మతంలోకి' చేరడమే ఘర్ వాపసీ అంటే అర్థం. అయితే అలా చేరడానికి ముందు, ఇంతకాలం పాటు 'ఇంటికి' దూరంగా ఉన్న కారణంగా వాళ్లకు అంటుకున్న మైలను వదిలించడానికి జరిగే 'శుద్ధి' (పవిత్రం చేయబడడం) క్రతువుకు వాళ్లు లోబడాలి.

ఈ ఆర్డినెన్స్‌లో ఒక నిబంధన ఇలా పేర్కొంటోంది. 'ఏ వ్యక్తి అయినా మత మార్పిడికి ముందు ఉన్న తన స్వంత మతంలోకి తిరిగి మారితే దాన్ని మత మార్పిడిగా పరిగణించకూడదు.' ఈ నిబంధన కారణంగా, హిందూమతం పురాతనమైన స్థానిక మతమేనని, అది వలసలు వచ్చిన వారి వారసత్వంగా రూపొందింది కాదనే మిథ్యా భావనను కొనసాగించడానికి, చట్టబద్ధం చేయడానికి అవకాశం లభించింది. హిందూమతం భారత ఉపఖండంలోని వందలాది మంది దేశీయ ఆదివాసీలు, దళితులు, ద్రావిడుల మతాలన్నింటినీ స్వాహా చేసి తనలో సంలీనం చేసుకున్నదనే వాస్తవాన్ని అది అంగీకరించడం లేదు. హిందూ మతం దేశీయమైనదని చెప్పడం అవాస్తవికమేకాక అచారిత్రకం కూడా.

పౌరాణిక గాథలకు చరిత్ర హోదా

భారతదేశంలో పౌరాణిక కథలను చరిత్రగా, చరిత్రను పౌరాణిక కథలుగా అనేక రకాలుగా మార్చివేస్తున్నారు. ఒకపక్క హిందువులైన తాము దేశీయ వాసులమేనని చెపుతూనే మరోపక్క విజేతలైన ఆర్యుల వారసులుగా తమనుతాము చెప్పుకోవడంలో అగ్రకుల చరిత్రకారులకు ఎలాంటి వైరుధ్యమూ కనపడడం లేదు. వాళ్లకు ఎప్పుడు ఏది అనుకూలమో దాన్ని వాడుతుంటారు. నల్లజాతి ఆఫ్రికన్లను 'కాఫిర్లు', 'పశుప్రాయులు' అని అనేక సందర్భాలలో పిలిచిన గాంధీ, వాళ్లతో కలిసి భారతీయులు ఒకే ద్వారం గుండా పోస్టాఫీసులోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా భారతీయులకు ఒక ప్రత్యేక ద్వారం కావాలని, దర్బన్‌లో తన జీవితాన్ని ప్రారంభించిన తొలి దినాల్లో ప్రచారం చేశాడు. భారతీయులు, ఇంగ్లీష్ వాళ్లు, 'ఇండో-ఆర్యన్ అనే ఉమ్మడి మూలాల నుండి' వచ్చారని గాంధీ వాదించాడు. అగ్రకుల 'భారతీయ ప్రయాణికులను' అణగారిన కులాలకు చెందిన వెట్టి కూలీల నుండి కచ్చితంగా వేరుచేయాలని ఆయన జాగ్రత్తపడ్డాడు. ఇది జరిగింది 1893లో. అయితే ఇప్పటికీ ఆ సర్కస్ ముగియలేదు.

మనమీద కలిసికట్టుగా జరుగుతున్న దాడి, ఒకవైపు నుండికాక అన్నివైపుల నుండి జరుగుతున్నదిగా గుర్తించగలిగిన మేదో సామర్థ్యం ఎల్గార్ పరిషత్‌కు ఉంది. ఈ రోజు ఈ వేదిక మీద వివిధ భావజాలాలకు చెందినవాళ్లం వక్తలుగా ఉండడమే అందుకు నిదర్శనం. మనందరం చిన్నచిన్న కుంటలలో, నీటి మడుగులలో కూరుకుపోయి ఆ నీళ్లలోనే కాళ్లూ చేతులూ కొట్టుకుంటూ, మన కోపాన్ని వ్యక్తం చేస్తూ, ఎవరికివాళ్లం మన గురించీ, మన సమూహం గురించీ మాత్రమే ఆలోచిస్తూ, విశాల దృక్పథాన్ని సంతరించుకోకుండా, తరచుగా మన కోపాన్ని మన మిత్రుల మీదే ఎక్కుపెడుతూ ఉంటే ఈ పాలకులకు అంతకు మించిన సంతోషం మరొకటి ఉండదు.

ఆ చిన్న చిన్న మడుగుల హద్దులను పగలకొట్టుకొన్నప్పుడే మనం ఒక నదిగా మారగలం. అప్రతిహతమైన ప్రవాహం లాగా సాగగలం. అలా చేయాలంటే మనం మన పరిమిత చింతనలను అధిగమించాలి, రోహిత్ వేములలాగా ధైర్యంతో కలగనాలి. ఆయన ఈ రోజు మనతో మన మధ్యనే ఉన్నాడు. ఆయన కలలు కంటూ చనిపోయాడు. అందుచేతనే తన మరణంలో కూడా ఆయన ఒక కొత్త తరాన్ని పూర్తిగా ఉత్తేజపరచ గలిగాడు. సంపూర్ణమైన మానవుడుగా ఎదగడానికి కావల్సిన హక్కు గురించి వక్కాణిస్తూ ఆయన చనిపోయాడు. తన ఆశయాలను, మేధో ఉత్సుకతను సాకారం చేసుకునే హక్కు గురించి పట్టుపట్టాడు. తాను మరుగుజ్జుగా మారడానికి, కుంచించుకు పోవడానికి, బయటవాళ్లు ఇచ్చిన నమూనాలో కుదించుకుపోవడానికి ఆయన తిరస్కరించాడు. వాస్తవిక ప్రపంచం ఆయనకు తగిలించ దలచుకున్న ముద్రలను ఆయన నిరాకరించాడు. తాను ఒక ప్రజాకర్షక వ్యక్తిత్వం కల మాంత్రికుడినని ఆయనకు తెలుసు. ఆయన అలానే మాంత్రికుడు అయ్యాడు.

మన అస్తిత్వాలకు ఆవల

ఒక వ్యక్తికి గానీ, వ్యక్తుల సమూహాలకి గానీ కొన్ని స్వభావాలు సహజ సిద్ధంగా ఉంటాయనే సూత్రంతో మనల్ని లోబరుచుకుని, మన శక్తియుక్తుల్ని పరిమితం చేసే ప్రయత్నాల పట్ల మనం జాగరూకతతో ఉండాలి. మనమెవ్వరం మన అస్తిత్వాల మొత్తం మాత్రమే కాదు. మనం అది కూడా, కాని అంతకంటే ఎక్కువే. మనం శత్రువులను ఎంత నిర్దిష్టంగా పసిగడతామో అంతే సామర్థ్యంతో మన మిత్రులను గుర్తించగలగాలి. ఈ యుద్ధంలో మనమెవ్వరం ఎవరికి వాళ్లమే పోరాడలేం. అందుచేత తప్పనిసరిగా మన మిత్రుల కోసం ఎదురు చూడాలి. గత సంవత్సరం సిఏఏ వ్యతిరేక నిరసనలలో, ఇప్పుడు మనల్ని ఆవరించి ఉన్న మహత్తర రైతాంగ ఉద్యమంలో ఉన్న సాహసికత్వం మనకు చాలా విషయాలను నేర్పుతుంది. వివిధ భావజాల విశ్వాసాలు, వివిధ చరిత్రలు కల అనేకమంది వ్యక్తులకు ప్రాతినిధ్యం వహించే రైతు సంఘాలు కలిసికట్టుగా ఈ ఉద్యమంలోకి వచ్చాయి. పెద్ద, చిన్న రైతుల మధ్య, భూస్వాములు, భూమిలేని వ్యవసాయ కూలీల మధ్య, జాట్, సిక్కులు, మజబి సిక్కుల మధ్య, వామపక్ష యూనియన్లు, మధ్యేమార్గ యూనియన్ల మధ్య లోతైన ఎన్నో వైరుధ్యాలున్నాయి.

కుల వైరుధ్యాలు కూడా ఉన్నాయి. భయంకరమైన కుల హింస కూడా ఉన్నది. 2006లో తన రెండు చేతులు, ఒక కాలు నరికివేయబడిన బంత్‌సింగ్ ఈ రోజు మనముందు ప్రసంగించాడు. ఆ భిన్నాభిప్రాయాలను కప్పి ఉంచలేదు. వాటిగురించి మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు ఇక్కడికి రావల్సిన రణదీప్ మద్దోకే తాను ధైర్యంగా తీసిన 'భూమి హీనులు' అనే డాక్యుమెంటరీలో వీటన్నింటినీ ప్రస్తావించాడు. అయినప్పటికీ అస్తిత్వ యుద్ధంగా మనం భావిస్తున్న ఈ పోరాటంలో ఈ రాజ్యాన్ని ఎదుర్కోవడం కోసం వాళ్లందరూ కలిసి కట్టుగా ఉన్నారు.

పూనా ఒడంబడిక మీద సంతకం చేసేటట్టుగా అంబేద్కర్‌ను

రైతుల నిరసనలపై నిర్బంధం

ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఆందోళనకు అంతర్జాతీయ మద్దతు అందితే పాలకులు దేశాన్ని అస్థిరపరిచే కుట్రగా, దేశంలోని ప్రజాస్వామికవాదులు మద్దతిస్తే వారిని దేశద్రోహులని పాలకులు అంటున్నారు **బి. రామకృష్ణ**

వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా 2020 జూన్ నుండి ప్రజాస్వామిక నిరసనలు వస్తున్నాయి. ఈ బిల్లులను ప్రభుత్వం ఆర్డినెన్స్‌లు తెచ్చి పార్లమెంట్‌లో ఎటువంటి చర్చలేకుండా చట్టాలు చేసింది. ఈ చట్టాలను వెనక్కి తీసుకోవాలని 2020 నవంబర్ 26 నుండి ఢిల్లీ సరిహద్దుల్లో నిరంతరాయంగా ఆందోళనలు జరుగు తున్నాయి. వీటిలో లక్షలాదిగా రైతులు పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి భజన బృందాలు ఈ ఉద్యమంపై విపరీతమైన, విషపూరిత, విద్వేషపూరిత, అసహ్యకరమైన, అవమానకరమైన దుష్ప్రచారాన్ని చేస్తూ వచ్చారు. అయినా ప్రజల్లో ఉద్యమానికి మద్దతు ఏమాత్రం తగ్గలేదు. ఉద్యమానికి నైతిక బలం పెరుగుతున్నది. జాతీయంగా, అంతర్జాతీయంగా రైతు ఉద్యమానికి పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష మద్దతు విస్తృతమౌతున్నది.

ఇంత పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం జరుగుతున్నప్పుడు ప్రజాస్వామిక ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను, ఆశయాలను గౌరవించాల్సింది పోయి దానిని నేరపూరితం చేస్తున్నది. నిర్బంధాలను, అణచివేతలను అమలు చేస్తున్నది. అప్రజాస్వామిక రాజ్యాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రశ్నించడం, ప్రతిఘటించడం, దోపిడీ పీడనలు, అసమానతలు, వివక్షతలకు వ్యతిరేకంగా ఉద్యమించడం అనేది రాజ్యాంగ బద్ధమైన హక్కే తప్ప మరొకటి కాదు. చరిత్రలో జరిగిన అనేక ఘర్షణల్లోంచి ప్రజాస్వామిక సెక్యులర్ సమానత్వం వంటి విలువలు ముందుకొచ్చాయి. వాటి సాఫల్యత కోసం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాల్సి ఉంటుంది. అందులో భాగంగానే తమను తాము చైతన్యపరచుకోవడం, సామూహిక చైతన్యాన్ని పెంపొందించుకుంటూ, బలమైన శక్తిగా ఎదుగుతూ సమాజాన్ని మౌలిక మార్పు వైపు మళ్లించడం అనేది నిరంతర ప్రక్రియ. ఇవ్వాళ రైతులు చేస్తున్న ఆందోళనలు అందులో భాగమే. ఈ ఉద్యమం అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యానికి వన్నె తెస్తుందనే విషయాన్ని మరువకూడదు.

ఢిల్లీ సరిహద్దులకు రైతాంగం తరలి వస్తున్న తరుణంలో రోడ్లను తవ్వడం, బారికేడ్లను అడ్డంగా పెట్టడం, బాష్ప వాయువును ఉపయోగించడం, వణికించే చలిలో సైతం వాటర్ కెనాన్లను ఉపయోగించడం జరిగింది. రైతు ఉద్యమ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం మామూలుగానే జరిగిపోయాయి. దుష్ప్రచారాలతో, తప్పుడు కేసులతో నిరసనలు అణిచి వేయబడి ఏవో కొన్ని రోజులు సాగి కనుమరుగవుతాయి అనుకున్న వారి ఆశలు వమ్ము అయ్యాయి. కుట్రలను, కుతంత్రాలను లెక్క చేయకుండా పట్టుదలగా, కష్టనష్టాలకోర్చి తెగించి పోరాడుతున్న రైతుల పోరాటపటిమ పాలకులకు చిరాకు తెప్పిస్తున్నది. ఢిల్లీ సరిహద్దులలో ఆరుబయట, రోడ్లపక్కన వణికించే చలిలో, కనీస సౌకర్యాలు లేని దుర్భరమైన పరిస్థితుల్లో న్యాయం కోసం పోరాడుతున్న రైతులకు కరెంట్, ఇంటర్నెట్ కట్ చేసి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకుండా చేశారు. అంటే మూలిగే నక్కపై తాటికాయ పడేసినట్లే కదా. నిజానికి రైతుల కష్టనష్టాలు పంచుకోవడం ప్రజల, ప్రభుత్వ బాధ్యత అవుతుంది. కానీ వారిని తరిమేసే ప్రభుత్వాన్ని ఏమనాలి?

ప్రజాస్వామిక ప్రభుత్వం తన ప్రజలను తనతోటి వారిని శత్రువులుగా చూడొచ్చా? ప్రజలు వద్దంటున్నా బలవంతంగా ఆరు నూరైనా నూరు ఆరైనా సరే తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లనడం దేనికి సంకేతం. గుండె దిటవు చేసుకొని పోరు రంగంలో నిలబడుతున్నారు రైతులు. రైతు కార్యకర్తలు, నాయకులపై ఇన్‌కమ్ టాక్స్ దాడులు జరుగుతాయి, వారి కదలికలను నియంత్రించడం కోసం లక్షల రూపాయల బాండ్లను అడుగుతారు. దేశం విడిచి వెళ్లొద్దని నోటీసులు ఇస్తారు. వారు ఉన్నదే ఆందోళనలో దేశం విడిచి వెళ్తారట. అంటే వారేదో బడా నేరస్తులు అయినట్లు దృశ్యాన్ని సృష్టించే కుట్ర చేయబడింది అన్నమాట. నీరవ్ మోడీ, విజయ్ మాల్యా వంటి వాళ్లు కోట్లకు కోట్లు ప్రజల సొమ్మును బ్యాంకుల ద్వారా రుణాలుగా పొంది, తిరిగి చెల్లించకుండా దేశం విడిచి పోగలరు. విదేశాల్లో విలాసవంతమైన జీవితాలు గడుపుతుంటారు. వారిని దేశం విడిచిపోకుండా ఆపలేరు, తిరిగి రప్పించనూ లేరు.

చర్చలు జరుపుతామనే పేరుతో సెప్టెంబర్ నుండి జనవరి వరకు నాలుగు నెలలుగా 11 సార్లు రైతు నాయకులతో మాట్లాడారు. రైతులు డిమాండ్ చేస్తున్న చట్టాల రద్దుపై ప్రభుత్వం ఎప్పుడూ కూడా సానుకూలత ప్రకటించలేదు. కానీ చట్టాలను క్లాజుల వారీగా చర్చిద్దామని దొంకతిరుగుడు, కుట్రపూరిత వ్యవహారాన్ని నడిపారు. పేరుకు చర్చలు. జరిగింది ఏకపక్షం. చెప్పిందే చెబుతారు తప్పితే చట్టాలను రద్దు చేస్తామని స్పందించలేదు. చర్చలకు అర్థం లేకుండా పోయింది.

నవంబర్ 26 నుండి నిరంతరంగా, స్థిరంగా ఢిల్లీ సరిహద్దులలో

బ్లాక్‌మెయిల్ చేసిన ఈ నగరంలో, జ్యోతిబా, సావిత్రీబాయి పూలేలు తమ విప్లవాత్మక కార్యకలాపాలను నిర్వహించిన ఈ నగరంలో మన పోరాటానికి మనం ఒక పేరు పెట్టుకోవచ్చు. బహుశా దాన్ని 'సత్యశోధక్ ప్రతిఘటన' అని పిలవవచ్చు.

ఇది ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమ జరుపుతున్న యుద్ధం. ప్రేమకోసం యుద్ధం. ఈ యుద్ధంలో మిలిటెంట్‌గా పోరాడాలి, అద్భుతమైన విజయాన్ని సాధించాలి.

(2021 జనవరి 30న ఎల్గార్ పరిషత్ సమావేశంలో అరుంధతీ రాయ్ చేసిన ప్రసంగ పాఠం)

(స్క్రోల్. ఇన్ సౌజన్యంతో)

(అనువాదం : సి.యస్.ఆర్. ప్రసాద్)

వీ

జరుగుతున్న నిరసన ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలని ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా కూడా సఫలం కావడం లేదు. పోటీ రైతు సంఘాలను అప్పటికప్పుడు పుట్టించి, వారిచే వ్యవసాయ చట్టాల పట్ల సానుకూల వైఖరిని ప్రకటింపచేయడం, రైతు సంఘాలలో చీలికలు తెచ్చే ప్రయత్నం చేయడం, ఈ ఉద్యమంలో రైతులు లేరని దళారులే ఉన్నారని, ఇందులో పంజాబ్ వారు మాత్రమే ఉన్నారని పెద్ద ఎత్తున తప్పుడు ప్రచారాలు చేశారు. ఇవేవీ పనిచేయకపోవడంతో అదృశ్య టూల్ కిట్లు తెరపైకి వస్తుంటాయి.

జనవరి 26న ఢిల్లీలో జరిగే రైతు పరేడ్ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకుని ఢిల్లీ ఎర్రకోటలోకి కొన్ని సమూహాలు సునాయాసంగా వెళ్లే మార్గం సిద్ధమైపోతుంది. ఏం కనికట్టు జరుగుతుందో ఏమో కానీ శాంతియుతంగా, నిబ్బరంగా, నిజాయితీగా జరుగుతున్న ఆందోళనల నుంచి కొన్ని గుంపులు సునాయసంగా ఎర్రకోటలోకి ప్రవేశిస్తాయి. జాతీయ జెండా పక్కనే సిక్కుల మత జెండా ఎగురవేసే తంత్రం అమలవుతుంది. వీటిని అక్కడ ఏ కాపలాదారు అడ్డుకోని మాయ జరుగుతుంది. వందల పోలీసులకు గాయాలు అవుతాయి. ఇదంతా ఏ టూల్ కిట్ పనో, అలా చేయడం ఎవరికీ అవసరమో, ఎవరికీ సంభవమో కొంచెం తార్కికంగా ఆలోచిస్తే తెలియని విషయం కాదు కదా. ఆ రోజు దేశ గౌరవానికి, భద్రతకు భంగం కలిగించారని, జాతీయపతాకాన్ని అవమానించారని, అందులో తీవ్రవాదులు ఉన్నారని, ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఉన్నారని రైతుల ఉద్యమాన్ని నైతికంగా దెబ్బతీసే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మరింతగా నిర్బంధాలను అమలు చేయడానికి దారి సుగమం చేసుకున్నారు.

జనవరి 26న ఢిల్లీలో నిరసనకారుడు పోలీస్ బుల్లెట్ గాయాలతో చనిపోయాడు అని అతని తల్లిదండ్రులు అంటున్నారని ట్వీట్ చేసినందుకు, రాసినందుకు బిజెపి పాలిత రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు అలాగే కేంద్ర నియంత్రణలోని ఢిల్లీ పోలీసులు ఇండియా టుడే, కారవాన్, నేషనల్ హెరాల్డ్ మొదలగు వార్తా సంస్థలకు చెందిన జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు పెట్టారు. మతవిద్వేషాలను ప్రోత్సహించారని, దేశ భద్రతకు ముప్పు వాటిల్లేలా మాట్లాడారని/రాశారని తీవ్రమైన కేసులు నమోదు చేశారు. ఏ ప్రశ్నకైనా అవు కథ జవాబు రాసినట్లుగా ఇటీవల బిజెపి పాలనా విధానాలను విమర్శిస్తే ఎటు తిప్పి దానిని దేశ ద్రోహానికి అనుసంధానం చేసి కేసులు పెడుతున్నారు. జనవరి 30న ఢిల్లీ పోలీసులు ధర్మేంద్ర సింగ్, మందీప్ పునియా అనే జర్నలిస్టులను అరెస్టు చేశారు. వీరు సింఘు వద్ద రైతుల నిరసనలు రిపోర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులతో తప్పుడుగా ప్రవర్తించారని, ప్రభుత్వాధికారి విధులను అడ్డగించారని, వారిపై దాడి చేశారనే నేరారోపణలపై నిర్బంధించారు. జనవరి 29న ఢిల్లీ సరిహద్దులోని సింఘు వద్ద నిరసన ప్రాంతంలోని రైతులపై, వారి టెంట్లపై రాళ్లు రువ్వి, టెంట్లను పీకేసిన వారు స్థానికులని ప్రచారం చేశారు. వారి గురించి ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ మందీప్ పునియా విచారిస్తున్న క్రమంలో వారంతా స్థానికులు కారనీ, బిజెపి మద్దతు దారులని, హిందూత్వ సమూహాలకు చెందినవారని తెలిసింది. ఇలాంటి వార్తలను బయటి ప్రపంచానికి చెప్పకుండా చేయడానికి హెచ్చరికగా ఉండడం కోసం అతన్ని జైలుకు పంపించారని అర్థం చేసుకోవచ్చు.

జనవరి 26 ఢిల్లీ ఘటనను (ప్రీ ప్లాన్ పథకం?) సాకుగా చూపిస్తూ ఢిల్లీ పోలీసులు హత్యానేరం, నేరపూరిత కుట్ర, అల్లర్లు సృష్టించడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి 50 వరకు క్రిమినల్ కేసులు పెట్టి వందలాది మందిని అరెస్టు చేశారు. ఢిల్లీ సరిహద్దులోని ప్రాంతాలలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను తొలగించి వేశారు. ఏమంటే ప్రజా భద్రత అంటారు. హర్యానా ప్రభుత్వం ఫిబ్రవరి 1 వరకు ఈ సేవలను నిలిపి వేసింది. ప్రజల భావప్రకటనా స్వేచ్ఛ లేదా ఒకరికి ఒకరు మాట్లాడుకోవడం, సమాచారాన్ని పంచుకోవడాన్ని ప్రమాదకరంగా చూస్తున్నారు. ఇది రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు, అలాగే అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందానికి వ్యతిరేకం.

రైతు ఉద్యమ నాయకుడు రాకేష్ తికాయత్‌తో సహా మేధాపాట్కర్, యోగేంద్ర యాదవ్‌లపై, అలాగే ప్రభుత్వంతో రైతుల తరపున చర్చలు జరిపిన అనేక మందిపై తప్పుడు కేసులు పెట్టారు. శాంతియుతంగా నిరసన తెలపడం, సమావేశం అవ్వడం, అప్రజాస్వామిక విధానాలను, చట్టాలను వ్యతిరేకించడం, ప్రతిఘటించడం అనేది ప్రాథమిక హక్కుల్లో భాగమే తప్ప నేరమో ఘోరమో కాదు. వారనే దేశద్రోహం అసలే కాదు. శాంతియుత నిరసనకారులపై స్థానికుల పేరుతో దాడులు చేయించడం కదా నేరం. తప్పుడు కేసులు బనాయించి పోలీస్ స్టేషన్‌లో, జైల్లో నిర్బంధించడం కదా అసలు నేరం అంటే. ఢిల్లీ రానీయరు. రోడ్లపై ఉండనీయరు. గుమిగూడితే చట్టవ్యతిరేకం అంటారు. రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాల రద్దు గురించి మాట్లాడితే రెచ్చగొట్టడం అంటారు. సమాచారాన్ని పంచుకుందాం అంటే ఇంటర్నెట్ కట్ చేస్తారు. విపరీత ప్రతికూల పరిస్థితుల్లో నైనా సరే ఆరుబయట, కనీస వసతుల్లేకుండా శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే కరెంట్, నీటి సరఫరా కట్ చేస్తారు. మరి ఎలా ప్రజలు తమ గోడును ప్రభుత్వానికి వినిపించాలి?

2019లో ప్రజలకు అందుబాటులో లేకుండా ఇంటర్నెట్‌ను షట్‌డౌన్ చేసిన దేశాలలో భారత్ ముందు వరుసలో ఉన్నది. కశ్మీర్‌లో నెలల కొద్దీ ఇంటర్నెట్ కట్ చేశారు. పౌరసత్వ చట్ట వ్యతిరేక ఉద్యమ సందర్భంలో ఢిల్లీ పరిసరాలలో ఈ పని చేశారు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి సిఎన్ఎన్ అనే వెబ్ వార్తా సంస్థ ప్రచురించిన వ్యాసాన్ని పాప్ సింగర్ రిహానా షేర్ చేస్తూ వై ఆర్ వి నాట్ టాకింగ్ అబౌట్ దిస్ అని ఫార్మర్స్ ప్రొటెస్ట్ అనే హ్యాష్ ట్యాగ్‌తో ట్వీట్ చేసింది. పాప్ ఐకాన్‌గా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రిహానా రైతులకు మద్దతుగా ట్వీట్ చేయగానే, కొందరు విదేశీ నేతలు శాంతియుత నిరసనలను గౌరవించాలని అనగానే, భారత ప్రభుత్వానికి కంపరం పుట్టుకొచ్చింది. ఇదంతా అంతర్గత వ్యవహారమని, ఎవరు ఇందులో తల దూర్చవద్దని కటువుగా స్పందిస్తారు. కాని వ్యవసాయ విధానాలు ఎలా సరైనవో శాస్త్రీయంగా నిరూపిస్తూ హుందాగా వ్యవహరించలేక పోతున్నారు.

వ్యవసాయదారులకు, రైతులకు భరోసా, భద్రత, మొత్తంగా ప్రజలందరికీ స్వచ్ఛమైన ఆహార భద్రతను ఇవ్వాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వం ప్రజలకు సాగు భూములను పంచాల్సి ఉన్నది. వ్యవసాయ విజ్ఞానాన్ని, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను రైతులకు చేరవేయవలసి ఉన్నది. పర్యావరణాన్ని రక్షిస్తూ ప్రజలందరి ఆహార అవసరాలను తీర్చడానికి కావలసిన వ్యవసాయ, ప్రజా పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయవలసి ఉన్నది. అలా చేయకుండా కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యవసాయాన్ని, ఆహార భద్రతను పెట్టే చట్టాలు చేయడం తప్పని ప్రశ్నిస్తే దేశద్రోహం అని ప్రజాభిప్రాయాలను, ప్రజా ఉద్యమాలను అణచి వేస్తుండడం ఎవరికైనా ధర్మాగ్రహం తెప్పించక మానదు. మూన్నాళ్ల బలాన్ని చూసుకుని మిడిసిపడే వాళ్లకు భవిష్యత్తు సరైన గుణపాఠం చెప్పకుండా ఉండబోదు. అయినా బలమైన సర్పం చలిచీమల చేత చిక్కి ఏమవుతుందో సుమతీ శతకం ఏనాడో చెప్పే ఉన్నది. అలా అంటే సుమతి శతకం కూడా దేశద్రోహం తలపెట్టే టూల్ కిట్ అవుతుందో ఏమో.

బ్యాంకుల నుండి ప్రజల సొమ్మును కాజేసి, తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతూ దేశంలో లేదా విదేశాల్లో విలాస జీవితాన్ని గడుపుతున్నవారు దేశ ద్రోహులు కారు. వారిని బిజెపి, ఐటి సెల్‌లు, వాట్సాప్ యూనివర్సిటీలు పల్లెత్తు మాట అనవు. కాని 21 ఏళ్ల దిశా రవి అనే అమ్మాయి దేశద్రోహ కుట్రదారు అవుతుంది. ఇంతకీ ఆమె చేసిన నేరం ఏమిటి? ఆమె ఒక టూల్ కిట్‌ని తయారు చేసింది. దాన్ని ప్రచారం చేయడంలో పొయెటిక్ జస్టిస్ ఫౌండేషన్‌తో కలిసి పర్యావరణవేత్త గ్రేటా థన్బర్గ్ ద్వారా వ్యాప్తి చేయించడం జరిగింది. దాని ఫలితమే జనవరి 26న ఢిల్లీలో జరిగిన సంఘటన అని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. ఈ టూల్ కిట్‌ను దిశా రవి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. రైతు ఉద్యమానికి మద్దతుగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఇదంతా దేశద్రోహం అని చెబుతున్నారు.

అసలు ఆ టూల్ కిట్‌లో ఏమున్నది. ఇదేదో ఆయుధ పరికరం అనుకుంటే నవ్వుకోవాల్సిందే. ఇదొక మామూలు పత్రం. ఒక కరపత్రం లేదా చిన్న బుక్‌లెట్ లాంటిది. ప్రజా సమస్యలపై చైతన్యాన్ని, అవగాహన కల్పించడం, దానిని ఎదుర్కోవడానికి అనుసరించవలసిన కార్యక్రమాల వివరాలతో ఉన్నటువంటిది. పోలీసులు చెబుతున్న టూల్ కిట్‌లో ఏమున్నాయంటే రైతుల ఉద్యమ నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి భారతదేశంలోని రైతుల వ్యవసాయ సంక్షోభానికి సంబంధించిన వివరాలు, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు, రైతులకు చేసిన నష్టాలు, రైతు ఆత్మహత్యల నేపథ్యం, కొత్తగా తెచ్చిన వ్యవసాయ చట్టాలు ప్రజలకు చేసే నష్టాలు, కార్పొరేట్లకు ఎలా ఉపకరిస్తాయో తెలిపే వివరాలు, వీటిని నిలువరించడం కోసం రైతులకు మద్దతుగా నిలవడం కోసం ఏం చేయాలో తెలిపే వివరాలు ఉన్నాయి. రైతులకు మద్దతుగా నిలవడం కోసం స్థానిక ప్రభుత్వ ప్రతినిధులకు ఈమెయిల్ గానీ, ఫోన్ కాల్ గాని చేయమని చెప్ప బడింది. పర్యావరణానికి నష్టం చేసే కర్బన ఉద్గారాలను నియంత్రించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయండని ఆన్‌లైన్ పిటిషన్లలో సంతకాలు చేయమని, పై వాటి గురించి తగు చర్యల కోసం ప్రధానమంత్రి వ్యవసాయ మంత్రులకు ట్వీట్ చేయమని చెప్పబడింది. ఐ.ఎం.ఎఫ్, డబ్ల్యు.టి.ఓ., ప్రపంచ బ్యాంకులకు కూడా తెలియపరచమని అందులో ఉన్నది. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్లను సూచించడం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసేటప్పుడు ఫార్మర్స్ ప్రొటెస్ట్, స్టాండ్ విత్ ఫార్మర్స్ అనే హాష్ ట్యాగ్‌ను ఉపయోగించమని తెలుపబడింది.

ఇదన్న మాట దేశద్రోహ టూల్ కిట్. ఎంత ప్రమాదకరమైనదో కదా. ఇందులో పోలీసులకు, బిజెపి పరివారానికి దేశాన్ని అస్థిరపరిచే, ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రలు కనిపిస్తున్నాయి. వారికి ఈ యువ మహిళ అత్యంత ప్రమాదకరమైన దేశద్రోహిగా కనిపిస్తోంది. ఇంతటి ప్రమాదకర కుట్రదారును పట్టుకోవడానికి పోలీసులు ఢిల్లీ నుంచి బెంగళూరుకు వచ్చారు. ఆ టూల్ కిట్‌లో ఏమున్నదో, అది అంత ప్రమాదకరమైనదేనా అని కోర్టు విచారించిందో లేదో గాని దిశా రవిని ఐదు రోజుల పోలీసు కస్టడీకి పంపించడం జరిగింది. దిశా రవి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న టూల్ కిట్‌లో ఉన్నవన్నీ కూడా శాంతియుతంగా చట్ట పరిధిలో చేసే పనులేనని ఎవరికైనా అర్థమయ్యే విషయమే కదా! రైతులకు మద్దతుగా నిలబడడాన్ని సహించలేని తనం, ప్రపంచ ప్రసిద్ధి పొందిన 18 ఏళ్ల పర్యావరణ కార్యకర్త గ్రేటా థన్బర్గ్ ఈ విషయమై సానుకూలంగా స్పందించడం కంటగింపుగా మారింది. వాతావరణ పరిరక్షణ కోసం గ్రేటా థన్బర్గ్ తన 15వ యేట 2018లో ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ అనే అంతర్జాతీయ ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో దిశా రవి పాలుపంచుకుంటున్నది. పర్యావరణ ప్రభావ అంచనా డ్రాఫ్ట్ 2020పై పర్యావరణ మంత్రిత్వ శాఖ 2020లో ప్రజాభిప్రాయాలను అడిగింది. అందులో భాగంగానే పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కి ఈ డ్రాఫ్ట్‌ను వ్యతిరేకిస్తూ ఎంతోమంది ఈ మెయిల్స్ పంపించడం జరిగింది. వీటి వెనుక ఫ్రైడే ఫర్ ఫ్యూచర్ అనే సంస్థ ప్రమేయం ఉందని ఆ సంస్థను సహించలేకపోయింది ప్రభుత్వం. మంత్రి ప్రకాష్ జవదేకర్ ఫిర్యాదు మేరకు ఊపా చట్టం అనుసరించి 2020లో ఈ సంస్థ వెబ్ సైట్‌ను బ్లాక్ చేశారు.

విద్యార్థులకు చిన్నప్పటి నుండి పర్యావరణ పరిరక్షణ, దాని ఆవశ్యకత గురించి పాఠశాలల్లో, పాఠ్య పుస్తకాలలో వివరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ అనేది రాజ్యాంగం చెప్పిన బాధ్యత కూడా. ఈ బాధ్యతను చొరవతో నిర్వహిస్తున్నందుకు అరెస్టులు, జైలు నిర్బంధాలు, అణచివేతలు, దేశద్రోహం కేసులు. అంటే ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి అర్థం ఏమున్నది. పర్యావరణ పరిరక్షణ ప్రచార కార్యకర్తలైన 18 ఏళ్ల గ్రేటా థన్బర్గ్, 21 ఏళ్ల దిశా రవి అనే అమ్మాయిల ఆలోచనల్లో దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసే కుట్రలను కనిపెట్టడంలో పోలీసుల, పాలకవర్గ ప్రతినిధుల మేధస్సు అమోఘం. సంభ్రమాశ్చర్యాలతో వారిని కళ్లకు అద్దుకోవాల్సిందే. లేదంటే మీరూ దేశ ద్రోహులు అవుతారు కాబోలు. పద్దెనిమిదేళ్ల స్వీడిష్ దేశీయురాలు గ్రేటా థన్బర్గ్ కానీ, దిశా రవి కానీ, పాప్ సింగర్ రిహానా కానీ రైతుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తే దాంట్లో దేశాన్ని అస్థిర పరిచే అంతర్జాతీయ కుట్రలు ఉన్నాయని ఆరోపిస్తున్నారంటే ఇది అభద్రతను, పిరికితనాన్ని, భయాన్ని లేదా కావాలనే రైతు ఉద్యమాన్ని కించపరుస్తూ తక్కువగా చేసేదిగా, ప్రజల్లో దాన్ని అనైతికమైనదిగా చూపేలా, మొత్తంగా బలహీనపరిచి కనుమరుగు చేయాలనుకునే ఎంతటికైనా దిగజారే దౌర్భాగ్య స్థితిని సూచిస్తున్నది.

దిశా రవి రూపొందించిందని చెప్పబడుతున్న టూల్ కిట్‌లో ఎక్కడా కూడా ఖలిస్తాన్ మద్దతు పదాలు లేనే లేవు. కానీ పోలీసులకు దిశా రవి, ఆమె మిత్రుల ఆలోచనల్లో ఖలిస్తాన్ కనిపించింది. ఆ ఆలోచనలు కలిగి ఉండడమే నేరం అంటున్నారు. ఖలిస్తాన్ జిందాబాద్, రాజ్ కరేగా ఖల్సా అని నినాదం ఇచ్చినా కూడా హింస జరగనట్లైతే నేరమేమీ కాదని గతంలో బల్వంత్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. నిషిద్ధ సంస్థల ఆలోచనలు కలిగి ఉన్నంత మాత్రాన నేరస్తులు కారని, చట్ట వ్యతిరేక హింసలో పాల్గొంటే నేరమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన చరిత్ర ఉన్నది. ఈ సందర్భంలో శివసాగర్ కవిత్వం గుర్తుకు రాక మానదు. కలలపై నిఘా.. కలల అలలపై నిఘా. . . నిఘా. . నిఘా.. కార్పొరేట్ దాష్టీకాలు పోవాలని, ప్రజలు బాగుండాలని ఆలోచించడం, కలలు కనడం నేరంగా ప్రభుత్వాధినేతలకు అనిపించడం విషాదం. వాటిని వింటేనే వణికి పోతున్నారో లేదా అధికారం అండతో అహంకారంతో ఊగిపోతున్నారో ఎవరికి వారుగా తెలుసుకోవచ్చు. మరోవైపు రైతులు ఎముకలు కొరికే చలిని ఖాతరు చేయకుండా మనోనిబ్బరంతో ధైర్యంగా వ్యవసాయ చట్టాలను ఎదిరిస్తున్నారు.

కుట్ర కేసులు, దేశద్రోహం కేసులు కోర్టులో నిలిచేవి కావు. అయితే ఈ ప్రక్రియే ఒక శిక్షగా మారుతుంది. భీమా కోరేగావ్ కేసులో జైల్లో నిర్బంధించబడిన వారికి రెండు సంవత్సరాలు గడిచినా బెయిల్ రాక విడుదలకాలేదు. ఇంకా వారిపై కేసులు విచారణకే రావడం లేదు. వారందరూ ఈ రెండు సంవత్సరాలకు పైగా కాలమంతా స్వేచ్ఛను కోల్పోయారు కదా. తర్వాత ఎప్పుడో గాని వీరిని నిరపరాధులని కోర్టు

అన్నదాతల ఆగ్రహం - ఎవరీ అన్నదాత?

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనే పాలకుల మొండి వైఖరిని ఎదిరిస్తూ, జీవన్మరణ పోరాటాలకు సిద్ధమైన రైతుల త్యాగాలను వివరిస్తున్నారు **సి.ఎన్.వి. నరసింహారావు**

పొలాల నన్నీ
హలాల దున్నీ ఇలాతలంలో - హేమం పిండగ
జగానికంతా - సౌఖ్యం నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలంధరిత్రికి బలికావించే
కర్షక వీరుల కాయంనిండా
కాలవకట్టే ఘర్మ జలానికి
ఘర్మ జలానికి
ధర్మ జలానికి
ఘర్మ జలానికి - ఖరీదు లేదోయ్

- *శ్రీశ్రీ*

ఆగ్రహం ఎరుగని అన్నదాత ఎందుకు ఆగ్రహించాడు?

2020 జూన్ 5న మూడు వ్యవసాయ జిల్లులకు సంబంధించి ఆర్డినెన్స్ తీసుకువచ్చి, 2020 సెప్టెంబర్ 27న వాటిని చట్టం చేసినందువలన, ఈ చట్టం చేసే ముందు పార్లమెంట్‌లో వాటిపై చర్చకు అవకాశం ఇవ్వలేదు. ప్రతిపక్షాలు అడిగినప్పటికీ వాటిని సెలక్టు కమిటీకి పంపలేదు. చట్టాల రూపకల్పనలో కనీస ప్రజాస్వామిక విలువలు పాటించలేదు. రైతుల అభిప్రాయాలు తీసుకోలేదు. రాజ్యాంగ వ్యతిరేకంగా, ఇంత అప్రజాస్వామికంగా తీసుకువచ్చిన చట్టాలలోని ప్రధానాంశాలు.

1. వ్యవసాయ ఉత్పత్తుల కోసం, సేవల కోసం ఒప్పందం కుదుర్చుకోవచ్చునే పేరుతో కాంట్రాక్టు వ్యవసాయానికి తలుపులు బార్లా తెరిచారు.

2. ఈ కాంట్రాక్టు అమలులో అన్యాయం జరిగితే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి వీలులేని స్థితిని చట్టంలో భాగం చేశారు. న్యాయ స్థానాలకు అధికార పరిధి లేనే లేదని రాశారు. అన్యాయం జరిగిన సందర్భంలో వివాదం రేకెత్తినప్పుడు ఆ వివాద పరిష్కారాన్ని అధికార వ్యవస్థ చేతిలో పెట్టారు.

3. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టంలో, అందుకు భిన్నమైన అంశాలుంటే అవి చెల్లవని సమాఖ్య స్వభావాన్ని కాలరాశారు.

4. ప్రభుత్వ మార్కెట్లను, రాష్ట్రాల వ్యవసాయ మార్కెట్లను, చట్టాల ద్వారా ఏర్పడిన కొనుగోలు క్షేత్రాలను ప్రభుత్వ ఆమోదంతో నడిచే ప్రైవేట్ వ్యాపార క్షేత్రాలను ఈ చట్టం పరిధి నుండి మినహాయించారు.

5. నియంత్రణ, చట్ట పరిధి లేని ప్రైవేట్ లాభార్జనాపరుల కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఉండే స్థితి కల్పించారు.

6. నిత్యావసర సరుకులు, చీకటి బజారుకు జేరి, కృత్రిమ కొరత కల్పించి, కృత్రిమ ధరలు పెంపుదలకు అవకాశం ఇచ్చేలా పెద్ద స్థాయిలో నిల్వలు చేయగూడదని ఇప్పటివరకూ నియంత్రణ చేస్తున్న నిత్యావసర సరుకుల చట్టానికి సవరణ చేసి ఏ సరుకైనా, ఎంత స్థాయిలోనైనా నిలువ చేసుకోవచ్చుననే నిబంధన రాశారు.

7. కనీస మద్దతు ధరకు గ్యారంటీ లేకుండా చేశారు. సంక్షిప్తంగా

విడుదల చేస్తే నిర్బంధించబడిన కాలం తిరిగి రాదు కదా. వారి ఉపాధి ఉద్యోగాలకు, వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలకు ఈ కేసులు అడ్డంకిగా మారతాయి. కోర్టుల్లో ఈ కేసులను ఎదుర్కోవడానికి కావలసిన ఏర్పాట్లు, న్యాయవాదుల ఫీజులు, కోర్టుకు సమర్పించవల్సిన పత్రాలు, సాక్ష్యాలు సంపాదించడం ఖరీదైనదిగా తయారవుతుంది. వారికి న్యాయం అందని ద్రాక్ష అవుతుంది.

వాతావరణ పరిరక్షణ కార్యకర్త అయిన 21 ఏళ్ల యువ మహిళను దేశద్రోహ కేసు పెట్టి అరెస్ట్ చేయడం చూస్తుంటే ప్రశ్నించే గొంతులను నులిమి వేసే కుట్రలు బయటపడుతున్నాయి. ఎవరైనా సరే తమ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పి రాజ్యాంగమని, ప్రజాస్వామ్యమని చట్టబద్ధ నిరసనలని అంటే కుదరదని చెప్పదలుచుకుంటున్నారు. ప్రభుత్వాన్ని ప్రభుత్వ అధినేతలను ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే చాలు కేసులు పోలీస్ స్టేషన్లు జైళ్లు ఎదురొస్తాయనే బలమైన సంకేతాలను పంపడంలో భాగంగా రైతులపై, రైతు ఉద్యమ సానుభూతిపరులపై, జర్నలిస్టులపై తీవ్రమైన రాజద్రోహనేర కుట్ర కేసులని అర్థం చేసుకోవచ్చు. కార్పొరేట్ శక్తుల కొమ్ము కాస్తూ వారి లాభాలకు భంగం కలగకుండా దేశ సంపదను అప్పగించేందుకే ఇదంతా అని స్పష్టమవుతున్నది.

చదువుకునే యువత నిజాయతీగా నడిచే ఉద్యమాల వైపు రాకుండా దూరం పెట్టడం అనేది అరెస్టుల కేసుల వెనుక ఉన్న ఉద్దేశ్యం అని తేలిపోతున్నది.

సోషల్ మీడియాని ఉపయోగించుకోవడం గురించి అమిత్ షా తమ కార్యకర్తల మీటింగ్‌లో మాట్లాడుతూ తాము చేసే ప్రచారంలో హాస్యం ఉండాలి భయమూ ఉండాలి అని ముసిముసిగా నవ్వుతూ అంటాడు. వారికి నవ్వు తెప్పించేదిగా వారి వ్యతిరేకులకు భయం పుట్టించేదిగా ఉండాలని నర్మగర్భంగా చెబుతాడు. నరేంద్ర మోడీ రాజ్యసభలో రైతు ఉద్యమంపై మాట్లాడుతూ ఆందోళనా జీవులని వ్యంగ్యంగా నవ్వుతూ అంటాడు. ఈ నవ్వులు ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నించే ప్రజలను అధికారాహంకారంతో వెటకారం చేస్తున్నాయి. ఎప్పటికైనా ప్రజలే చరిత్ర నిర్మాతలు అనే విషయం మరచిపోరాదు. చీకటి తర్వాత వెలుగు రావాల్సిందే కదా. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలనుకునే ఫాసిస్టు శక్తుల కుతంత్రాలు అణచివేతలు, నిర్బంధాలు ఎల్లకాలం సాగవని రాబోయే చరిత్ర నిరూపించకుండా ఉండబోదు. కాకుంటే ఇదో గడ్డు కాలంగా నిలుస్తుందనేది వాస్తవం.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

'ఒన్ మార్కెటర్ - ఒన్ నేషన్' 'ఒకే దేశం - ఒకే మార్కెట్' అనే ట్యాగ్‌లైన్‌తో చేసిన ఈ చట్టాలలో స్వేచ్ఛాయుత మార్కెట్ చట్టం - మొదటది.

దీని ప్రకారం రైతు తన ఉత్పత్తిని దేశంలో ఎక్కడైనా, ఎంతకైనా అమ్ముకోవచ్చు. ఏ వ్యాపారైనా, ఎంతటి వ్యాపారైనా రైతు ఉత్పత్తిని కొనుగోలు చేయవచ్చు అని. రైతుకు స్వేచ్ఛనిచ్చాం కదా అంటున్నారు. చూడడానికి బాగానే ఉంది. ఆచరణలో ఇది నేతి బీరకాయలోని నెయ్యి మాత్రమే. 2015 వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం దేశంలోని రైతాంగంలో నూటికి 85 శాతం మంది 2 నుండి 5 ఎకరాల భూమి మాత్రమే కలిగి ఉన్నారు. వారు వ్యవసాయం అప్పులు చేసి మాత్రమే చేస్తారు. వారు అప్పులు చేసి, వ్యవసాయం చేసి, పంట చేతికి రాగానే అప్పిచ్చిన వాళ్లు వచ్చి అప్పు తీర్చమని కూర్చుంటారు. రైతు పంట అమ్మి అప్పు తీరుస్తానంటే ఆ అమ్మేదేదో నాకే అమ్ము, నేనే కొంటానని తన ఇష్టం వచ్చిన రేటుకు కొంటాడు. అంతేగాని రైతు స్వేచ్ఛగా తన ఇష్టం వచ్చిన రేటుకు అమ్ముకునే స్థితిలో రైతు ఉండడు. రైతుల ఈ వాస్తవ పరిస్థితి పాలకులకు అర్థం కాకపోవడం సోచనీయం. అందుకై రైతులు కనీస మద్ధతు ధర నిర్ణయం కోసం డిమాండ్ చేస్తున్నారు.

ఇక ఒప్పంద వ్యవసాయ చట్టం - రెండవది

నిర్దేశిత కాలానికి ప్రైవేట్ వ్యాపారులు రైతులతో ఏయే కాలాలలో ఏయే పంటలు పండించాలో నిర్ణయిస్తారు. వ్యాపారులు నిర్ణయించడమంటే, వ్యాపారం అంటే పెట్టుబడి. పెట్టుబడి అంటే లాభం. లాభం కోసం ఏమైనా చెయ్యి - అదేంటంటే వ్యాపారం అని చెప్పర భాయి. అదువల్ల వ్యాపారులు గిరాకీని బట్టి ఏ పంటలు పండించాలో నిర్ణయిస్తారు. అక్కడ ఆగకుండా ఏయే ఎరువులు, పురుగు మందులు వాడాలో వారే నిర్ణయిస్తారు. ఎందువల్ల నంటే అంతా వ్యాపారం - లాభం దృష్టే కదా. ఫలితంగా చిన్నా, సన్నకారు రైతులు ఈ భారాన్ని మోయలేక, ఒప్పందాల నుండి బయట పడలేక, చేతులెత్తేసి సేద్యానికి 'మంగళం' పాడేసి, చేసిన అప్పు మేరకు పొలం వదిలేసి వలస కార్మికుల్లా ఊరు విడిచి పోవలసి వస్తుంది.

ఇక నిత్యావసర వస్తువుల సవరణ చట్టం - మూడవది

దీని ప్రకారం - రైతన్నలు తమ ఉత్పత్తులు ఓ పరిమితం మేరకే నిలువ చేసుకోవాలి. ఇప్పుడా పరిస్థితిని ఎత్తివేసి ఎంత స్థాయిలో నైనా నిలువ చేసుకొని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు.

ఇది ఎలా ఉందంటే ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కు అన్నట్లుంది. ఎందువల్లనంటే - రైతు కల్లంలోనే పంటనమ్ముకోవలసిన పరిస్థితిని గురించి - మొదటి స్వేచ్ఛాయుత మార్కెట్ చట్టం సందర్భంగా వివరించాను. ఆ పరిస్థితులలో 85 శాతం మంది రైతులు మంచి ధర వచ్చేదాకా నిలువ చేసుకునే పరిస్థితులలో ఉండరు. అందువల్ల ఈ చట్టం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మాత్రమే ఉపయోగకరం.

ఈ మూడు బిల్లుల సారాంశం ఒక్క మాటలో చెప్పాలంటే రైతులకు భద్రతే లేకుండా, వారి బతుకులు బజారు పాల్జేసి, పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు బంగారు బతుకునిచ్చే చట్టాలు మాత్రమే. అందుకే ఆగ్రహం ఎరుగని అన్నదాత ఆగ్రహించాడు. చారిత్రాత్మక ఉద్యమం నిర్వహిస్తున్నాడు.

ఉద్యమం

2020 జూన్ 5న కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక మూడు బిల్లులకు సంబంధించి ఆర్డినెన్స్ తీసుకువచ్చి సెప్టెంబర్ 27న చట్టం తీసుకువచ్చింది. ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిన తర్వాత మొదటగా పంజాబ్, హర్యానా రైతాంగం ఈ చట్టాలను వ్యతిరేకించడం ప్రారంభించారు. క్రమంగా రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ రైతులు కూడా ఈ ప్రతిఘటనలో భాగస్వాములై తరువాత చిలికి, చిలికి గాలివాన అయినట్లుగా దేశవ్యాపిత ఉద్యమంగా మారి 2020 నవంబర్ 26న ఢిల్లీ సరిహద్దుల దిగ్బంధన ఉద్యమంగా మారి నేటికి (2021 ఫిబ్రవరి 10కి) 77 రోజుల నుండి కొనసాగుతుంది. ఈ 77 రోజులలో ఉద్యమకారులు విభిన్న కార్యక్రమాలు నిర్వహించారు.

1. 2020 డిసెంబర్ 8న భారత్ బంద్. సహజంగా బంద్ అంటే మనం మూయించే కార్యక్రమం నిర్వహిస్తాం. అయితే రైతు ఉద్యమ నాయకత్వం బలవంతంగా మూయించే కార్యక్రమం నిర్వహించొద్దని ప్రకటించింది. శాంతి, భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమం ఎవరైనా నిర్వహిస్తే వారిని మేమే పోలీసులకు అప్పగిస్తామని ప్రకటించింది.

2. 2020 డిసెంబర్ 20న దిగ్బంధనం చేస్తున్న ప్రదేశాలలో ఒకరోజు నిరాహార దీక్షలు.

3. 2020 డిసెంబర్ 25 నుండి 27 వరకు టోల్‌గేట్ల పికెటింగ్. సహజంగా మనం టోల్‌గేట్ల పికెటింగ్ అంటే టోల్‌గేట్ల దగ్గర వాహనాలను ఆపుతాం. అయితే అందుకు భిన్నంగా రైతు ఉద్యమ నాయకత్వం - వాహనాల రాకపోకలను అంగీకరిస్తూ టోల్‌గేట్ల వద్ద ట్యాక్స్ కలెక్షన్‌ను నివారించారు.

4. 2021 జనవరి 1న దేశవ్యాపిత నిరసన. దేశవ్యాపిత నిరసన ప్రకటించి - దేశవ్యాపిత సహకారాన్ని పొందారు.

5. 2021 జనవరి 24న ఉద్యమకారులు రైతు వ్యతిరేక బిల్లులను తగులబెట్టారు.

6. 2021 జనవరి 26న రిపబ్లిక్ డే - దేశ రాజధాని ఢిల్లీలో వేలాది ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు.

7. 2021 ఫిబ్రవరి 6న దేశవ్యాపిత రాస్తారోకో నిర్వహించారు.

ఈ అన్ని కార్యక్రమాలు శాంతియుత పద్ధతులలో, నూతన రూపాలలో నిర్వహించి వారి పోరాటం అహింసాయుత పద్ధతులలో కొనసాగుతుందని నిరూపించారు.

2020 నవంబర్ 26న ఢిల్లీ సరిహద్దుల దిగ్బంధన కార్యక్రమం ప్రారంభమై నేటికి (2021 ఫిబ్రవరి 10) 77 రోజులయింది. ఈ ఉద్యమాన్ని గాంధీ 153వ జయంతి అయిన 2021 అక్టోబర్ 2 వరకు కొనసాగిస్తామని, ఈలోపు బిల్లుల రద్దు జరగకపోతే తదనంతర కార్యక్రమాన్ని తరువాత ప్రకటిస్తామని భారత కిసాన్ యూనియన్ నేత రాకేష్ తికాయత్ చక్కా జామ్ (రాస్తారోకో) ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిన తరువాత 2021 ఫిబ్రవరి 6న ప్రకటించారు. ఈ అక్టోబర్ 2 ఏంటి? చాలా ఆశ్చర్యంగా ఉంది. దీని విషయం తరువాత మాట్లాడుకుందాం.

ఢిల్లీ సరిహద్దుల దిగ్బంధనం - చారిత్రాత్మకం

ఉద్యమం ప్రారంభమైన రోజు నుండి ఆడా, మగా, పిల్లా జెల్లా అనే తేడా లేకుండా వేలాది మంది వంటా, వార్పు అక్కడే చేసుకుంటూ కనీస వసతులు అయిన మలమూత్ర విజర్జనలకు, స్నాన, పానాదులకు, తిండి, నిద్రలకు ఇబ్బంది పడుతూ వ్యవసాయ చట్టాలు రద్దుచేసే వరకు అక్కడి నుండి కదలమని పోరాటం సాగిస్తున్నారు. తల్లిదండ్రులతో వచ్చిన పిల్లల చదువులు అక్కడే కొనసాగుతున్నాయి. వందలాది చోట్ల వంటలు, సామూహిక భోజనాలు కొనసాగుతున్నాయి. దేశవ్యాపితంగా అందుతున్న సంఘీభావంతో ఉద్యమకారులకు అవసరమైన అనేక వస్తువులు గుట్టలు

గుట్టలుగా తరలి వస్తున్నాయి. ఉపన్యాసాలు, పాటలు, కళా ప్రదర్శనలు, నృత్యాలతో అది ఒక ఉత్సవ సందర్భంలాగున్నది. ముట్టడి స్థలాలలో గ్రంథాలయాలు నెలకొన్నాయి. ఉద్యమం పక్షాన ఒక పత్రిక ప్రచురణ కూడా ప్రారంభమయింది. నిరసనలు, ప్రదర్శనలు, ప్రతిఘటనలు, ఉద్యమాలు సాధ్యం కావనుకుంటున్న తరుణంలో ఇంత విస్తారమైన ఉద్యమాన్ని నిర్వహించి రైతాంగం ఉద్యమాలకు ఊపిరిలూదారు. దాని ప్రభావం అప్పుడే కనిపించడం ప్రారంభయింది.

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఉద్యమం ప్రారంభమై - 32 మంది విద్యార్థుల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి, ప్రస్తుత విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు తన శాసన సభ్యత్వానికి రాజీనామా ఇస్తూ, ప్రైవేటీకరణ ప్రతిపాదనను ఉపసంహరించు కోకపోతే ప్రస్తుతం ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న రైతు ఉద్యమాన్ని మించిన 100 రెట్ల ఉద్యమాన్ని నిర్మిస్తాం అంటున్నాడు.

చర్చలు

ఉద్యమ నాయకులకు, ప్రభుత్వానికి మధ్య 2020 అక్టోబర్ 14న ప్రారంభమై 2021 జనవరి 22 లోపు 11 సార్లు చర్చలు జరిగాయి. చర్చలలో ప్రభుత్వం రైతుల ప్రధాన డిమాండ్లయిన 1. మూడు బిల్లుల రద్దు. 2. కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారంటీల విషయంలో సానుకూలంగా స్పందించకుండా సవరణలు ప్రతిపాదించండి - అంగీకరిస్తామంటూ కాలం గడుపుతున్నారు. అందుకు రైతు నాయకులు చట్టాల రద్దు తప్ప - మేం ఇంక ఏ ప్రతిపాదనలు చేయం, అంగీకరించమని ప్రభుత్వంతో చాలా స్పష్టంగా చెప్పి వాటి రద్దుకొరకు ఉద్యమిస్తున్నారు. సావిత్రి తన భర్త సత్యవంతుడు ప్రాణాలు తీసుకువెళ్తున్న యముడి వెంటబడి, పతి ప్రాణాలు ఇవ్వమంటుంటే అందుకు యముడు అది దక్క అన్నట్లు కేంద్ర ప్రభుత్వం బిల్లుల రద్దు దక్క అంటుంది. చివరకు సావిత్రి తన భర్త ప్రాణాలు దక్కించుకొని వెనుకకు తిరుగుతుంది. అలాగే రైతులు వాళ్ల ప్రధాన డిమాండ్ అయిన మూడు బిల్లుల రద్దు సాధించేవరకు ఘర్వారసి లేదంటున్నారు.

ఉన్నత న్యాయస్థానం

బిల్లుల రద్దు విషయాన్ని న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలనే ప్రతిపాదనను రైతులు నిష్కర్షగా తిరస్కరించారు. ఇది ప్రజలు - ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వం మధ్య పరిష్కరింపబడవలసిన విషయం అని స్పష్టంగా చెప్పారు. ఉన్నత న్యాయస్థానం ఉద్యమానికి సంబంధించి తన ముందున్న కేసులను పరిశీలించి 2020 జనవరి 12న తదుపరి ఆదేశాల వరకు మూడు బిల్లుల అమలును నిలుపుదల చేసింది. తరువాత ప్రభుత్వం 18 మాసాలు బిల్లుల అమలు నిలుపుదల చేస్తామని ఉద్యమాన్ని విరమించమని రైతు నాయకులను కోరింది. అందుకు రైతు నాయకులు మీరు 18 మాసాల తరువాత అమలు చేస్తే మేమేమి చేయాలి. బిల్లుల రద్దు కొరకు అమరులైన 170 మందికి మేమేమి సమాధానం చెబుతాం. అందువల్ల వారి ఆశయ సాధన కొరకు మేము మూడు బిల్లులు రద్దయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం, మూడు బిల్లులు రద్దయిన తరువాతే మేము తిరి ఇళ్లకు వెళ్తామని తేల్చి చెప్పారు.

ఉద్యమం పట్ల ప్రభుత్వ వైఖరి

ఈ దేశ ప్రధాన మంత్రి మోడీ సిక్కు గురుద్వారాలు సందర్శిస్తున్నారు. సిక్కు గురువుల, వాళ్ల కుటుంబాల త్యాగాలను కీర్తిస్తున్నారు. అదే సిక్కుల నాయకత్వంలో కొనసాగుతున్న ఉద్యమాన్ని గురించి ఖలిస్థాన్ తీవ్రవాదులు, పాకిస్థాన్ ఏజెంట్లు, తుక్‌డే తుక్‌డే బ్యాచ్ (విచ్ఛిన్నకారులు) నక్సలైట్లు, మావోయిస్టులు, దేశ ద్రోహులు ఉన్నారంటూ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. 1922లో జరిగిన చౌరీ చౌరా సంఘటన శత జయంతి ప్రారంభ సందర్భంగా మాట్లాడుతూ, చౌరీ చౌరా సంఘటనలను కీర్తిస్తూ ఆనాడు మరణశిక్షకు గురైన 19 మందికి చరిత్రలో ఇవ్వాల్సిన స్థానం ఇవ్వలేదని బాధపడతారు. కాని రైతు ఉద్యమ సందర్భంగా అమరులైన దాదాపు 170 మంది అమరుల త్యాగాన్ని గుర్తించరు. రిపబ్లిక్ డే సందర్భంగా జరిగిన సంఘటనలకు ఉద్యమకారులను బాధ్యులను చేయడానికి ప్రయత్నం చేస్తారు. అయితే ఆ సంఘటనలతో మాకేమి సంబంధం లేదని రైతు నాయకులు ప్రకటించారు. చర్చలంటూనే ప్రధాన డిమాండ్లయిన 1. మూడు బిల్లుల రద్దు, 2. కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారంటీల విషయాలు పరిష్కరించకుండా సాచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారు.

అక్టోబర్ 2 వరకు ఉద్యమం

2021 అక్టోబర్ 2న గాంధీ 153వ జన్మదినం. గాంధీ మాకు ఆదర్శమని చెబుతున్న ప్రభుత్వానికి - మేము మూడు బిల్లులు రద్దుచేసే వరకు గాంధీ మార్గంలోనే మా ఉద్యమాన్ని ఆయన జన్మదినం వరకు కొనసాగిస్తామనే సంకేతాన్ని ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వానికి ఉద్యమకారులు తెలిపారని భావించవచ్చు.

బలవంతులు - ప్రజలే

కా. మావో చెప్పినట్లు ప్రభుత్వ విభాగాల కన్నా, వాటి సాయుధ బలగాల కన్నా, ఆయుధాల కన్నా, ఆయా సంపదకన్నా అంతిమంగా ప్రజా సమూహాలు - వారి పోరాటాలే బలవంతమైనవనే విషయాన్ని రైతులు చేస్తున్న ఈ ఉద్యమం రుజువు చేస్తుంది. ఈ ఉద్యమం దేశంలో అన్ని రంగాలు ప్రైవేటీకరణ జరిగి, ముఖ్యంగా విద్య, వైద్య రంగాలు కార్పొరేట్ కబంద హస్తాలలో చిక్కి ప్రజలు విద్యకు, వైద్యానికి ఇబ్బందులకు గురవుతున్న దశలో వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను నివారించడానికి జరుగుతున్న మహత్తర చారిత్రాత్మక ఉద్యమం. ఇది తప్పకుండా విజయం సాధించాలి.

ముగింపు

కష్టం దరిద్రికి బలిగావించి ఆహార ఉత్పత్తులు అందించే అన్నదాత ఆగ్రహించి నిర్వహిస్తున్న ఈ ఉద్యమం అన్నదాతకు సంబంధించింది మాత్రమే కాదు, ఆహార ఉత్పత్తుల వినియోగదారులైన ప్రజలందరిది.

రైతు లేకపోతే - తిండిలేదు
రైతు లేకపోతే - బతుకులేదు
రైతు లేకపోతే - దేశమే లేదు.

అందువల్ల ఈ ఉద్యమంలో పాల్గొనడం, ఉద్యమం విజయవంతం అవ్వడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం మన బాధ్యత. ఇదే విషయాన్ని ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) తన 2021 క్యాలండర్‌లో అన్నదాతకు అండగా ఉందాం అనే నినాదం ప్రకటించింది. ఉద్యమ అమరులకు జోహార్లు. ఉద్యమ వీరులకు విప్లవాభివందనాలు.

(రచయిత కార్యదర్శి, సామాజిక చేతనా వేదిక, గుంటూరు) వీ

రామాలయ విరాళాల విపత్తు

***రామాలయ నిర్మాణం కోసం హిందుత్వ సంస్థలు విరాళాల సేకరణ పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతూ, ఆస్తుల విధ్వంసం చేస్తూ, భౌతిక దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అంటున్నారు* అరణ్య**

అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించేందుకు హిందుత్వ సంస్థలు, ముఖ్యంగా ఆర్ఎస్ఎస్, విఎచ్పి, వాటి అనుబంధ సంస్థలు చాలా పెద్ద ఎత్తున ప్రపంచ వ్యాప్తంగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఎన్నో ఏళ్ల కల అయిన ఈ రామ మందిర నిర్మాణం సాకారమైనందున ప్రజలందరూ భారీగా విరాళాలివ్వాలని ఆ సంస్థలు పిలుపునిస్తున్నాయి. ఆ దిశగా ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, దాని పేరుమీద వివిధ బ్యాంకులలో ఖాతాలు తెరిచి, ఆన్‌లైన్‌లోనూ వివిధ యుపిఐ మాధ్యమాల ద్వారా ఖాతాలను అనుసంధానించి ఆ ఖాతాలకు తమ విరాళాలను జమచేయాల్సిందిగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ విరాళాల పేరిట జరుగుతున్న డబ్బు సేకరణ కార్యక్రమంలో ఎక్కువ డబ్బులు వసూలయ్యేందుకు రాముని సెంటిమెంట్‌ను, రామ మందిర భావోద్వేగాలను, ముస్లిం వ్యతిరేకతలను, పరమత ద్వేషాలను తమ పావులుగా ఈ సంస్థలు వాడుకుంటున్నాయి. రామ మందిర నిర్మాణం కోసం కోట్లాది మంది ప్రజలు, భక్తులు, హిందువులు తమవంతు ఆర్థిక బాధ్యతను నెత్తికెత్తుకోవాలని పెద్దగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

రామ మందిర నిర్మాణానికి గాను ఏర్పడ్డ సంస్థ రామజన్మ భూమి తీర్థ క్షేత్ర న్యాస్. దీని ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్. కోశాధికారి స్వామి గోవింద్‌దేవ్ గిరిమహరాజ్. వీళ్ల లెక్కల ప్రకారం రామాలయ ప్రధాన మందిర నిర్మాణానికి మూడు నుంచి మూడున్నర సంవత్సరాల సమయం పడుతుంది. ఇందుకు అయ్యే ఖర్చు 300 నుంచి 400 కోట్ల రూపాయలు. ప్రధాన మందిరం పోను ఇతరత్రా 70 ఎకరాల భూమి అభివృద్ధి కోసం అయ్యే ఖర్చు 1100 కోట్ల రూపాయలు. ఈ గుడిని భూకంపాలు తదితర సహజ, వాతావరణ విపత్తుల నుండి తట్టుకునేలాగా కడతారు. కనుక పెద్ద ఎత్తున జరిగే ఈ నిర్మాణ బాధ్యతలను లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టి) సంస్థకు అప్పగించారు. ఈ సంస్థకు ప్రభుత్వ సంస్థలైన సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిబిఆర్ఐ), నేషనల్ జియోగ్రఫికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జిఆర్ఐ), వివిధ ఐఐటిలు మందిర నిర్మాణంలో సహాయపడతాయి. నిర్మాణానికి చీఫ్ ఆర్కిటెక్ట్ చంద్రకాంత్ భాయ్ సోంపుర (సోంపుర ఫ్యామిలి). దేశ వ్యాప్తంగా 6.5 లక్షల గ్రామాలు, 15 కోట్ల కుటుంబాల నుంచి భారీగా విరాళాల సేకరణ జరపాలనేది రామజన్మ భూమి తీర్థక్షేత్ర న్యాస్ ఆలోచన. 2019 నవంబర్ 9 కోర్టు తీర్పు తర్వాత గుడి కట్టడం కోసం ఏర్పడ్డ ఈ సంస్థ సంవత్సర కాలం పాటు వివిధ ఆర్థిక సమీకరణలు సిద్ధం చేసుకుని ఈ విరాళాల సేకరణకు తెరతీసింది. 2021 జనవరి 15 నుంచి ఫిబ్రవరి 27 వరకు ఈ విరాళాల సేకరణను జరిపేలా జనవరి 15న న్యాస్ ఈ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్ పేరు నిధి సమర్పణ అభియాన్.

ఈ విరాళాల కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర బడాబడా నాయకులు, ప్రజా ప్రతినిధులు భారీగా డబ్బులు ముట్టచెపుతున్నారు. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ క్యాంపెయిన్ ప్రారంభించిన మొదటి రోజే రు. 5,00,100 విరాళమిచ్చాడు. శివసేన నాయకుడు, మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటి చైర్‌పర్సన్ నీలంగోరె కిలో వెండి ఇటుకను దానమిచ్చాడు. కాంగ్రెస్ నాయకులు కూడా విచిత్రంగా ఈ విరాళాలు సేకరించే కార్యక్రమంలో పాల్గొన్నారు, నిర్వహించారు, దానాలిచ్చారు. కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ రు. 1,11,111 విరాళమిచ్చాడు. మధ్యప్రదేశ్, కేరళ, రాజస్థాన్ నాయకులు కూడా విరాళాలిచ్చారు. రాజస్థాన్ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ విభాగం ఏకంగా డొనేషన్ డ్రైవ్‌లనే నిర్వహించింది. 'రూపి 1 రామ్ కె నామ్‌పర్' అనే నినాదంతో కాంగ్రెస్ నాయకులు వీటిని నడిపారు. అభియాన్ ప్రారంభమైన రెండు రోజుల్లోనే అంటే జనవరి 17 నాటికి వంద కోట్ల రూపాయలు వసూలయ్యాయి. జనవరి 30 నాటికి 230 కోట్ల రూపాయలు, ఫిబ్రవరి 8 నాటికి 600 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. అంటే కేవలం 25 రోజులలో వసూలైన మొత్తం ఆరు వందల కోట్లు. ఒక్క మధ్యప్రదేశ్ నుంచే వంద కోట్ల రూపాయలు న్యాస్ ఖాతాలోకి చేరాయి.

అయితే రాముని గుడి పేరిట, దేవుని భక్తి ముసుగున వసూలు చేస్తున్న ఈ విరాళాలు సాఫీగా, సవ్యంగా, పవిత్రంగా, ప్రశాంతంగా తీసుకోబడడం లేదు. విరాళాల పేరిట ప్రజలను, ముఖ్యంగా ముస్లింలను బెదిరించడం, దాడులు చేయడాలు, హింసలకు పాల్పడడాలు, భయభ్రాంతులకు గురిచేయడాలు, ఇళ్లు తగులబెట్టడాలు, కూల్చడాలు, మసీదులను ధ్వంసం చేయడాలు జరుగుతూ వస్తున్నాయి. మొదటి నుంచీ మతం పేరుతో రెచ్చగొట్టడంలో, మత విద్వేషాలను పురిగొల్పడంలో, ఇతర మతస్థులపై దాడులు చేయడంలో సిద్ధహస్తులైన సంఘ్‌పరివార్ శక్తులు ఇప్పుడు విరాళాల సేకరణ మాటున మళ్లీ మళ్లీ అవే పనులను నిరాటంకంగా నిర్వహిస్తున్నాయి. వీటిలో బయటపడి, మీడియా చూపించిన, ప్రజల దృష్టికి వచ్చిన ఘటనలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన కొన్ని హింసాత్మక దాడులు. జనవరి 15 నుంచి విరాళాల సేకరణ ప్రారంభమైనా అంతకు ముందుగానే దాదాపు ఏడాది కాలంగా నిర్దిష్టంగా మూడు నెలల ముందుగా న్యాస్, ఆర్ఎస్ఎస్, విఎచ్పి, బిజెపి, వివిధ సాధువులు, బాబాలు, వాళ్ల సంస్థలు, పీఠాలు చాలా పకడ్బందీగా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ వచ్చాయి. ఆ ప్రణాళికలన్నీ ఒక క్రమ పద్ధతిలోకి తెచ్చుకున్నాక జనవరి 4న తమ కార్యకర్తలకు పెద్ద ఎత్తున శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ శిక్షణా కార్యక్రమంలోనే ముస్లింలపై దాడిచేసే పథకమొకటి సిద్ధమైంది. ఈ పథకం అమలుగా మధ్యప్రదేశ్‌లోని మందసోర్, ఉజ్జయిన్, ఇండోర్ జిల్లాలలో ముస్లింలపై, ముస్లిం ఆవాస ప్రాంతాలపై దాడులు జరిగాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో వాలంటీర్లకు ఒక డాక్యుమెంట్ ఇచ్చారు. రాత్రంతా ప్రజలను చైతన్యపరిచేలా జాగరణ్ కార్యక్రమాలు, పగలంతా భారీ సంఖ్యలతో ర్యాలీలు, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాలని అందులో

చెప్పారు. నిధులు ఎలా సేకరించాలి, వాటినెలా భద్రపరచాలి, ఎవరిని కలవాలి, జాగరణ్‌లు, ర్యాలీలు ఎలా నిర్వహించాలి, హిందూ కుటుంబాలను ఎలా ప్రేరేపించాలి, వారితో ఎప్పుడెప్పుడు భోజనాలు చేయాలి వంటి విషయాలను ఆ సమావేశంలో చర్చించారు. రు. 10, రు.100, రు.1000ల కూపన్లు తీసుకుని 'టోలీలు' అనబడే కార్యకర్తల గుంపులు హిందూమత సాహిత్యం, రాముని బొమ్మలు, అయోధ్యలో కట్టబోయే రామ మందిర నమూనా చిత్రం చూపిస్తూ విరాళాలు సేకరించాలని సూచించారు. అంతకు ముందే సిద్ధం చేసిన భారీ మొత్తాలిచ్చే వ్యక్తుల, సంస్థల జాబితాను రాష్ట్రాల, ప్రాంతాల బాధ్యులకు అప్పగించి వారినెలా ఒప్పించాలో వివరించారు. చెక్కులు 48 గంటలలోగా బ్యాంకు అకౌంట్లలో జమయ్యేందుకు గాను బ్యాంకు అధికారులతో కుదుర్చుకున్న ఒప్పంద వివరాలను తెలిపి, చెక్కుల సేకరణను కూడా ప్రోత్సాహపరచమని చెప్పారు. ఇంత భారీ ప్రణాళికతో నిర్వహించిన ఈ సమావేశంలోనే ముస్లింలపై దాడుల ప్రణాళికా సిద్ధమైంది. ఒక పద్ధతి ప్రకారం మొదటగా రెచ్చగొట్టే మాటలతో కార్యకర్తలను ఉత్తేజపరిచారు. ఒక ఉదాహరణగా చెప్పుకుంటే మధ్యప్రదేశ్ గోపాలన్ ఆశ్రమ్ పశు సంవర్ధన్ బోర్డ్ మాజీ నాయకుడు, గత శివరాజ్ సింగ్ ప్రభుత్వంలో క్యాబినెట్ హోదా అనుభవించిన గిరి ఏమంటాడంటే, 'ముస్లింలను ఫండ్ అడగం. కార్యకర్తలు ముస్లింల ఇళ్లకు పోకండి. కానీ ముస్లిం ప్రాబల్య ప్రాంతాలలోని ప్రతి హిందువు ఇంటికీ వెళ్లండి' అని. ఇలా చాలా చోట్ల చాలా మంది రెచ్చగొట్టే మాటలు మాట్లాడారు. వీటితో రెచ్చిపోయిన కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. మధ్యప్రదేశ్‌లో ఈ తరహా జరిగిన దాడులను ఇక్కడ ప్రస్తావించుకోవాలి.

ఉజ్జయిన్ జిల్లా బేగంబాగ్, ఇండోర్ జిల్లా చందన్ ఖేది, మందసోర్ జిల్లా దోరానా గ్రామాలలో జరిగిన కార్యకర్తల ర్యాలీలలో హింస చెలరేగింది. ఈ మూడూ మాల్వా ప్రాంతంలో ఉన్నాయి. ఈ మూడింటి వెనకా పక్కా ప్రణాళిక ఉంది. ఈ మూడు హింసలకు మూలం విరాళాల సేకరణ. ఈ మూడు హింసలూ ఒకే పద్ధతిలో జరిగాయి. అభ్యంతరకర నినాదాలు ఈ మూడింటికీ కారణం. మూడింట్లో కార్యకర్తలు కత్తులు, ఆయుధాలు ధరించి ఉన్నారు. ముస్లింల ఇండ్లను కూలగొట్టారు లేదా కాల్చివేశారు. కేవలం ముస్లింల ఇండ్లనే టార్గెట్ చేశారు. ఇదంతా జరిగినా ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, 'అన్ని కమ్యూనిటీల ప్రజలు రాష్ట్రంలో రక్షణతో, భద్రతతోనే ఉన్నారు'ని ప్రకటించారు. పైగా హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా 'రాళ్లు రువ్వితే బాగుండ'దని ముస్లింలనే హెచ్చరించాడు.

ఉజ్జయిన్ జిల్లా బేగంబాగ్‌లో ముస్లింలు అధికం. భజరంగ్ దళ్, బిజెవైఎం, విఎచ్‌పిలు డిసెంబర్ 25న అక్కడ బైక్ ర్యాలీ నిర్వహించారు. అది నడుస్తుండగా ర్యాలీలో కార్యకర్తలు అభ్యంతరకర నినాదాలిచ్చారు. అందువల్లే స్థానికులు రాళ్లు రువ్వారని కొందరు ఆరోపిస్తున్నా అందుకు సరైన సాక్ష్యాధారాలు లేవు. బైక్ ర్యాలీ రెచ్చగొట్టే తరహాలో అదే ప్రాంతంలో పదేపదే మూడు సార్లు కొనసాగింది. మూడవ సారి హింస చెలరేగింది. సాయంత్రం హఠాత్తుగా గొడవ ప్రారంభమైంది. రాళ్లు రువ్వారని ఆరోపిస్తూ అధికారగణమే అబ్దుల్ హమీద్ అనే వ్యక్తి ఇంటి కూల్చివేతకు ఆదేశించింది. అయితే అక్కడి ఇంకో హిందూ యజమాని ఇంటి నుండి రాళ్లు వచ్చాయని చెప్తున్నా హిందువు అయిన కారణంగా ఆ ఇంటి కూల్చివేతకు ఆదేశించలేదు. అసలు ర్యాలీకి అనుమతే లేదు. ముందస్తుగా పోలీస్ పర్మిషన్ తీసుకోనే లేదు. పూర్తి ఆధారాలు సేకరించకుండానే అస్పష్టమైన వీడియో రికార్డింగ్ ఆధారంగా రాళ్లు విసిరారనే అభియోగంతో స్థానికుల మీద నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. కానీ అనుమతి లేని ర్యాలీని నిర్వహించిన దళ్, బిజెవైఎం, విఎచ్‌పి నాయకుల మీద కేసులు పెట్టలేదు. గుర్తు తెలియని వ్యక్తులు అంటూ ఒకరిద్దరి మీద కేసులు పెట్టారు. నినాదాలు చేయలేదు కానీ, రాళ్లయితే విసిరారని స్థానికుల మీద ఎస్‌పి శుక్లా ఆరోపించారు. హిందుత్వ గ్రూప్‌లే రాళ్లు విసిరారని ఆరోపిస్తున్న స్థానికుల మాటలను పోలీసులు లక్ష్యపెట్టలేదు. స్థానిక కలెక్టర్ కూడా అసలు నినాదాలే చేయలేదని ర్యాలీ నిర్వాహకులను వెనకేసుకొచ్చారు.

ఇండోర్ జిల్లా చందన్‌ఖేది కూడా ముస్లిం ప్రాబల్య ప్రాంతం. 3500 జనాభాలో 10 నుండి 12 హిందూ కుటుంబాలుంటాయి. డిసెంబర్ 29న ఈ ప్రాంతంలో తీవ్ర హింస చెలరేగింది. ర్యాలీలోని వాళ్లు 'మీ ఆఖరి రోజులు వచ్చేశాయి' అంటూ ముస్లిం ప్రాంతంలో నినాదాలిచ్చారు. వాళ్ల చేతులలో ఆయుధాలు, కత్తులు, దేశీయ తుపాకులు, పదునైన ఆయుధాలున్నాయి. సద్దాం పటేల్ అనే స్థానికుడు ర్యాలీలోని వారికోసం ఇంటిబైట నీళ్లు కూడా పెట్టాడు. కానీ ర్యాలీ వాళ్లు అతన్ని కొట్టి, గాయపరిచి, అతని ఇంటి ఒకవైపు భాగానికి నిప్పుపెట్టి కాల్చేశారు. సద్దాం సోదరున్ని బుల్లెట్‌తో కాల్చారు. మూడు ట్రాక్టర్లకు, బైక్‌లకు, పంటలకు కూడా నిప్పు పెట్టారు. మేకలు, దున్నపోతులను కత్తులతో గాయపరిచారు. కానీ పోలీసులు ఏమీ ఎరుగని నలుగురు స్థానికుల పైన కేసులు పెట్టారు. మసీదును కూల్చడానికి ప్రయత్నించిన ర్యాలీ నిర్వాహకులెవ్వరి మీద కేసులు పెట్టకుండా ఆ కారణం మీద అప్రధానమైన ఇద్దరు వ్యక్తుల మీద కేసులు పెట్టారు. దాంతో ర్యాలీలోని మిగతా వాళ్లంతా భద్రంగా బయట పడ్డారు. ఇక్కడ కూడా రాళ్లు రువ్వారని స్థానికుల మీద పోలీసులు ఆధారం లేని అభియోగాలు మోపారు. వహాబిజం, తబ్లిగి జమాత్ భావాలతో ప్రభావితమైన వాళ్లే రాళ్లు విసిరారని, హింసకు ఇస్లామిక్ ఉగ్రవాద రంగు పులమాలని ప్రయత్నించారు. హిందువుల మీద ఈ దాడి 'సముద్రంలో బలమైన మొసలితో శతృత్వం పెట్టుకోవడం' వంటిదని పోలీసులు వివాదాస్పదంగా మాట్లాడారు. జ్వరంతో బాధపడుతున్న మహ్మద్ ఇమ్రాన్ అనే అతనిపై కూడా కేసు పెట్టారు. అతని ఇంటిని పోలీసులే కొంత భాగం ఆ తర్వాత రోజు కూల్చేశారు.

మందసోర్ జిల్లా దోరానాలో ర్యాలీ, హింస డిసెంబర్ 29న జరిగాయి. ర్యాలీలో 5,000 మంది ఉన్నారు. 'ఔరంగజేబు వారసులారా వెళ్లిపోండి, ఈ దేశం మాది, విధానాలు మార్చుకోండి' అంటూ ర్యాలీలో వాళ్లు నినాదాలిచ్చారు. ఈ ర్యాలీకి ఒకరోజు ముందే స్థానికులు సరైన పోలీసు పహారా కావాలని అర్థించారు. కానీ పోలీసులు పట్టించుకోలేదు. ఆ రోజున ర్యాలీలోని వాళ్లు స్థానిక మసీదును కూల్చడానికి ప్రయత్నించారు. ఆ మసీదు ముందు హనుమాన్ చాలీసాలు చదివారు. దర్గాలోని చాదర్‌కు నిప్పు పెట్టారు. దాని కిటికీ పగలగొట్టారు. సిసి కెమెరాలను ధ్వంసం చేశారు. చందన్‌ఖేదిలో లాగానే పశువులపై దాడి చేశారు. ఒక మేకను తలపై మోది చంపేశారు. నిజానికి ఈ ర్యాలీకి భయపడి 10-15 మంది స్థానికులు తప్ప మిగిలిన వారంతా పక్క గ్రామాలలో తలదాచుకున్నారు. మహిళలు ఒకరోజు ముందే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేశారు. పోలీసులు మౌన పాత్ర పోషించారు.

వాలంటీర్లకు శిక్షణనిచ్చిన ఆరు రోజులకు జనవరి 10న భోపాల్‌లో ఒక ర్యాలీ జరిగింది. ఇందులో భారత్ మాతాకి జై, గోమాతాకి జై, ధర్మాంతరణ్ బంద్‌హో వంటి నినాదాలిస్తూ పోయారు. భోపాల్ జిల్లా ఖజూరి గ్రామం రాగానే కార్యకర్తలు రెచ్చగొట్టే మరిన్ని నినాదాలిచ్చారు. సాయంత్రం 4 గంటలకు ఈ నినాదాలు 'హిందువుల జోలికివస్తే కాలనీలన్నీ లేకుండా చేస్తాం' లాంటి రెచ్చగొట్టే నినాదాలుగా మారాయి. ఔరంగజేబు, బాబర్ లాంటి వాళ్ల పేర్లు తెచ్చి రెచ్చగొట్టేలా, భయపెట్టేలా 'బూడిద చేస్తా'మంటూ హెచ్చరికలు చేశారు. చేతిలో కాషాయ జెండాలు,

పెద్ద శబ్దాలతో భారీ గుంపులు ఓపెన్ జీపులలో భయంకరంగా అరుస్తూ ఆ ప్రాంతమంతా భయానక వాతావరణాన్ని సృష్టించారు.

ఇలా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అనేక ప్రదేశాలలో ఇలాంటి భయానక చర్యలకు హిందుత్వ గ్రూపులు తెగబడ్డాయి. మధ్యభారతంలో 1.25 కోట్ల జనాభాతో ఉన్న 53 వేల గ్రామాలలో 21 వేల గ్రామాల నుంచి రామ మందిర నిర్మాణ నిధిని సేకరించాలని ఆర్ఎస్ఎస్ నిధి సమర్పణ్ అభియాన్ లక్ష్యంగా పెట్టుకున్న దరిమిలా హింసను ప్రేరేపించి, దాడులు చేసి, మసీదులు, ఇళ్లు కూలగొట్టి, పశువులను చంపి మరీ ఈ నిధిని వసూలు చేయాలని నిర్ణయించుకుంది. తన ఈ ప్రణాళికను అమలులో పెట్టి చూపించింది.

ఈ విరాళాలు, నిధుల సేకరణ తంతు ఇప్పుడే కొత్తగా నిర్వహిస్తున్నదేమీ కాదు. గతంలో ఆర్ఎస్ఎస్, విఎచ్‌పిలకు ఇది అలవాటైన విద్యే. 1989 నవంబర్ 9న అయోధ్యలో విఎచ్‌పి శిలాన్యాస్ నిర్వహించింది. అప్పటికి ప్రధాన మంత్రిగా రాజీవ్ గాంధీ భారీ మెజారిటీతో గెలిచి ఉన్నాడు. కానీ శ్రీలంక, కశ్మీర్ అంశాలలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో, భోఫోర్స్ కుంభకోణంతో పేరు పోగొట్టుకున్నాడు. అదే సమయంలో విఎచ్‌పి ఈ శిలాన్యాస్ ప్రకటన చేసింది. దాంతో ప్రపంచ వ్యాప్తంగా ఎందరో వ్యక్తులు, సంస్థలు శిలాన్యాస్ కోసం విరాళమివ్వడం ప్రారంభించారు. కానీ అలహాబాద్ హైకోర్టు కార్యక్రమంపై స్టేటస్ కో ఇవ్వడంతో తాత్కాలికంగా శిలాన్యాస్ నిలిచిపోయింది. కాని విఎచ్‌పి కోర్టు ఉత్తర్వును ఉల్లంఘించ దలచుకుంది. బహాటంగానే కోర్టును విమర్శిస్తూ విరాళాల సేకరణ కొనసాగిస్తూ పోయారు. దేశవ్యాప్తంగా శ్రీరామ్ అని రాసిన ఇటుకలను పంపమని పిలుపునిస్తూ పోయారు. 2.75 లక్షల ఇటుకలు సేకరించారు. షాబానో కేసులో తీసుకున్న నిర్ణయానికి గాను హిందువులను తటస్థ పరుచుకునేందుకు రాజీవ్ గాంధీ విఎచ్‌పిని శిలాన్యాస్ కోసం అనుమతించాడు. వివాదాస్పద స్థలానికి బయట శిలాన్యాస్ నిర్వహించండని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరినా వినిపించుకోకుండా విఎచ్‌పి 1989 నవంబర్ 9న 7×7×7 అడుగుల గుంతను సింహద్వార నిర్మాణం కోసమై తవ్వింది. ఆ తర్వాత ఎల్.కె. అద్వాని రథయాత్ర గుజరాత్‌లోని సోమ్‌నాథ్ నుండి ప్రారంభమై అయోధ్య వరకూ మధ్య భారతమంతా కొనసాగింది. దాని పర్యవసానమే 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత. అయితే ఈ రథయాత్ర కోసం కూడా దేశ వ్యాప్తంగా భారీ విరాళాల సేకరణను ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి, బిజెపిలు నిర్వహించాయి. బాబ్రీ మసీదు విధ్వంసం ముందు కొన్ని నెలలు కూడా ఈ సంస్థలు భారీగా విరాళాలు సేకరించాయి. ఈ సమయంలో బిజెపి, విఎచ్‌పి తదితర సంఘ్‌పరివార్ సంస్థలకు, నాయకులకు కోట్లాది రూపాయలు బ్యాంకు అకౌంట్ల ద్వారానే బదిలీ అయ్యాయని జస్టిస్ లిబర్హాన్ కమిషన్ తన రిపోర్టులో చాలా స్పష్టంగా పేర్కొన్నది. అంటే భూమి పూజకు, యాత్రలకు, మసీదు కూలగొట్టడానికి అన్నింటికీ డబ్బు వసూలు చేయడమే సంఘ్ సంస్థల పని. అంతా డబ్బు దందాయే.

ఇప్పుడూ అంతే! జరుగుతున్న భారీ విరాళాల సేకరణ చుట్టూ అన్నీ అనుమానాలే. ఇప్పటికే రామ మందిర నిర్మాణానికి సంబంధించిన అంచనా వ్యయమే ఉంది గానీ, అఫీషియల్ బడ్జెట్ స్టేట్‌మెంటే ఇంకా తయారు కాలేదని రామజన్మ భూమి తీర్థక్షేత్ర న్యాస్ కోశాధికారి స్వామి గోవింద్‌దేవ్ గిరిమహారాజ్ స్వయంగా పేర్కొన్నాడు. అలాంటప్పుడు ఏ లెక్క ఆధారంగా విరాళాలు సేకరిస్తున్నట్లు? ప్రజలను మూర్ఖులుగా భావిస్తున్నట్లు కాదా ఇది? 39 నెలల్లో అంటే 2024కు ముందు సరిగ్గా మందిర నిర్మాణం పూర్తవుతుందని చంపత్‌రాయ్ అంటున్నాడు. అంటే ఇది ఎన్నికలలో లబ్ధిపొందే అంశం కాదా? 2024 ఎన్నికలలో బిజెపికి మళ్లీ గెలుపొందే అస్త్రంగా రామ మందిర నిర్మాణం ఉపయోగపడబోతుందన్నమాట. రాముని మీద భక్తి కంటే ఎన్నికల మీదనే ప్రేమ ఎక్కువన్నమాట. 1980ల చివర నుంచి 1992 వరకూ అయోధ్య పేరిట విశ్వహిందూ పరిషత్ సేకరించిన విరాళాలకు ఇప్పటికీ లెక్కాపత్రం లేదు. ఏనాడూ తాను సేకరించిన విరాళాలు అందించిన ప్రజలకు ఆ సంస్థ లెక్కలు, ఖర్చుల వివరాలు చెప్పలేదు. నిజానికి అదొక పెద్ద కుంభకోణం. అప్పుడు రామ మందిరం ప్రవేశం మీద నిషేధం ఉండేది. పైగా విఎచ్‌పి మందిరం పేరిట చేసిన పనులు శిలాన్యాస్, రథయాత్ర, మసీదు కూల్చివేత. ఈ మూడు పనులకు ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి? దేశ, విదేశాల నుంచి భారీగా సేకరించిన మొత్తమెంత? వీటి ఖర్చెంత? మిగిలినదెంత? ఆ మిగిలిన డబ్బు ఎక్కడున్నట్లు? ఏమైనట్లు? ఆ తర్వాత వేటికి వినియోగించినట్లు? లాంటి ఏ వివరాలనూ విఎచ్‌పి ఏనాడూ వివరించలేదు. అడిగే నాథుడు లేడు. చెప్పే బాధ్యత ఆ సంస్థకూ లేదు. సరిగ్గా ఇప్పుడూ అదే జరుగుతున్నది. ఖచ్చితంగా మందిర నిర్మాణ ఖర్చెంతో తెలియదు. దానికి ప్రభుత్వం తరపు ఆర్థిక సహాయమెంతో తెలియదు. కానీ ఇప్పటికే విరాళాల వసూలు కార్యక్రమం మొదలైంది. ఈ వసూలులో ఎవరెవరు ఎంతెంత ఇస్తున్నారో అంతా గోప్యం. కనీసం భారీగా విరాళాలిచ్చిన వారి వివరాలైనా బహిర్గత పరచడం లేదంటే ఎంత గోప్యమో ఆలోచించాలి. ఒక ధార్మిక కార్యక్రమం కోసం అనుకున్నప్పుడు ఈ గోప్యత ఎందుకు? ఈ గోప్యతకు అర్థం ఏమిటి? ఈ గోప్యత వెనుక అసలు ఉద్దేశమేమిటి? లాంటి ప్రశ్నలకు జవాబు లేదు. తరచి చూస్తే ఇదివరకు లాగా ఇప్పుడూ రాముని పేర, మందిర నిర్మాణం పేర డబ్బులు వసూలు చేసే కార్యక్రమం తప్ప భక్తి, దేవుడు పేరుమీద జరిగే ఈ తంతులో ఎలాంటి పారదర్శకత ఉండదనే భావించాల్సి వస్తున్నది. ఇలాంటి వసూలు కార్యక్రమాలు అంతిమంగా ప్రజల భావోద్వేగాలు, సెంటిమెంట్‌లు, భక్తి ప్రదర్శనలు, అమాయకత్వాలు అన్నీ డబ్బు రూపంలోకి మారి అకౌంట్లలో చేరి కోటాను కోట్లు పోగుపడడానికి పనిచేస్తాయే తప్ప నిష్పాక్షిక ఉపయోగకరమైన పనుల కోసం కాదనేది మరోసారి నిరూపించబడుతున్న కఠిన సత్యం.

(రచయిత సామాజిక కార్యకర్త)

వీ

నరెడ్ల శ్రీనివాస్ మృతి

సామాజిక కార్యకర్త నరెడ్ల శ్రీనివాస్(68) కరోనాతో ఫిబ్రవరి 15న కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మరణించారు. శ్రీనివాస్ కవిగా, రచయితగా, జర్నలిస్టుగా, ఉత్తమ బ్యాంకు అధికారిగా పేరు పొందారు. పౌర హక్కుల కోసం, వినియోగదారులకు జరిగే మోసాలపై అనేక పోరాటాలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచేవారు. కరీంనగర్‌లోని ఒకనాటి ఎఎస్ఐ మోహన్‌రెడ్డి ఫైనాన్స్ కేసులో బాధితుల పక్షాన పోరాడారు. బొమ్మకల్ భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా పోరాడారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షునిగాను పనిచేశారు. రాష్ట్ర, జిల్లా వినియోగదారుల ఫోరంలో 9 వేలకు పైగా కేసులు ఫైల్ చేశారు.

ప్రజాధన దుర్వినియోగం సెంట్రల్ విస్తా

కొత్త పార్లమెంటు భవన నిర్మాణం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుబారా కార్యక్రమాన్ని వివరిస్తున్నారు

సతీష్ బైరెడ్డి

పార్లమెంట్ భవన దృశ్యం మారబోతున్నది. పార్లమెంట్ అనగానే మనలో కదలాడే దృశ్యం ఇప్పటివరకూ ఉన్నది కాకుండా మరో ముఖచిత్రం ఒక సంవత్సరంలోగా రూపుదాల్చి ప్రజలకు దర్శనం ఇవ్వబోతున్నది. 1927 బ్రిటిష్ వారి కాలం నుండి నేటి వరకు వేలాది చట్టాల రూపకల్పనకు వేదికగా నిలిచిన పార్లమెంటు పాత భవనం కొత్తగా నిర్మించబోయే దాని పక్కన చరిత్రకు సాక్ష్యంగా మౌనంగా నిలబడబోతుంది. వరల్డ్ క్లాస్ పేరుతో భారీ ప్రాజెక్టులు చేపట్టడం పాలకులకు అలవాటయింది. 2022 ఆగస్టు15 కల్ల నూతన భవనం ఆవిష్కృతం కాబోతున్నది. సెంట్రల్ వీస్టా పేరుతో ఒక భారీ నిర్మాణ కార్యక్రమాన్ని మొదలు పెట్టింది నరేంద్రమోడీ సర్కారు. ఈ సెంట్రల్ వీస్టా ప్రాజెక్టు లో భాగంగానే నూతన పార్లమెంటు భవన నిర్మాణం. రాష్ట్రపతి భవనం నుండి ఇండియా గేటు వరకు దాదాపు 3 కిలోమీటర్ల పరిధిలో విస్తరించ బోతున్న అతిభారీ, విశాలమైన బహుళ అంతస్తుల నిర్మాణ సముదాయమే సెంట్రల్ వీస్టా ప్రాజెక్టు. ఇప్పటికైతే దీని అంచనా వ్యయం 20 వేల కోట్లు. ఒక్క పార్లమెంటు భవన నిర్మాణానికే వెయ్యి కోట్లు ఖర్చు పెడుతున్నారు. పార్లమెంటు భవనంతో పాటు కొత్తగా ఉపరాష్ట్రపతి,ప్రధాని నివాసాలతో పాటు కేంద్ర సచివాలయం వంటి అనేక నిర్మాణాలు రాబోతున్నాయి. కృషి భవన్, విజ్ఞాన్ భవన్ వంటి కొన్ని పాత కట్టడాలను దీంట్లో భాగంగానే కూల్చివేయబోతున్నారు. కేంద్ర సచివాలయంలో భాగమైన నార్త్ మరియు సౌత్ బ్లాక్ లను మ్యూజియములుగా మార్చబోతున్నారు. 75 వ 'స్వాతంత్ర్య' దినోత్సవం నాటికి పార్లమెంటుకు నూతన భవనం రావాలన్నది ప్రధాని సంకల్పం! ఇదంతా చూడటానికి, వినడానికి గొప్ప అభివృద్ధికరమైన అంశంగా ఉన్నది! నిజమే నిజంగా అభివృద్ధికరమైనదైతే ఎవరూ దీని గురించి పెద్దగా అభ్యంతర పెట్టాల్సింది లేదు. కాస్త వెనక్కి వెళ్లి చూస్తే ఇది ఏ కాలంలో ఆలోచనగా పురుడు పోసుకున్నది, ఈ రూపానికి వచ్చే నాటికి విధిగా పాటించి ఉండాల్సినవి ఏమిటి అనే విషయాలు అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాజెక్టు పట్ల అభ్యంతరాలను, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నది బీజేపీ ని,నరేంద్రమోడీ ని వ్యతిరేకించే వాళ్ళు మాత్రమే కాదు. గడచిన అనేక దశాబ్దాలుగా ఇవ్వాళ అమలవుతున్న అభివృద్ధి నమూనాలో భాగస్వాములుగా ఉన్న మాజీ బ్యూరోక్రాట్స్, మాజీ సైనిక అధికారుల నుండి మొదలు కుంటే పర్యావరణ ప్రేమికులు, పురావస్తు సంరక్షణకు పాటు పడే వాళ్ళు, పట్టణ ప్రణాళిక నిపుణులు, వాస్తుశిల్పులు ఇలా అనేక రంగాలకు చెందిన వారు ఈ భారీ ప్రాజెక్టును వ్యతిరేకించే వారిలో ఉన్నారు. ఆయా రంగాలకు చెందినవారు ఆయా కోణాల్లో నుండి ఈ నిర్మాణాలను వ్యతిరేకిస్తున్నారు. కరోనా విలయతాండవం చేస్తున్న కల్లోల కాలంలో ఏ సంప్రదింపుల ప్రక్రియను చేపట్టకుండా, పార్లమెంటు ను పరిగణనలోకి తీసుకోవాలనే ప్రజాస్వామిక మూల సూత్రాన్ని కూడా పక్కకు పెట్టి ఏక పక్షంగా ప్రధాని ఈ ప్రాజెక్టును ప్రకటించాడు. వాళ్ళ సొంత పార్టీలో ఎలాగూ ఇలాంటి చర్చల ఉసుండదనుకోండి. అయినా మోడీని తప్పనే వాళ్ళు కాదుగదా చర్చలు,సంప్రదింపులు అనే కనీస ప్రజాస్వామిక నియమాన్ని ప్రస్తావించే ధైర్యం ఎవరికి ఉంది. రాజు తలచిందే ఆలస్యం పర్యావరణ మదింపు తో పాటు అన్ని అనుమతులు చకా చకా వచ్చేశాయి. ప్రజల ప్రయోజనాలుండే దగ్గర నియమ నిబంధనల అడ్డుగోడలు అనేకం ఉంటాయిగాని పాలకుల పెట్ ప్రాజెక్టులకు అడ్డు చెప్పేదెవరు? అసలు అడ్డేముంటుంది? ఈ లోగా అనేకమంది కోర్టు తలుపులు తట్టారు. ఇది పర్యావరణానికి పెను ముప్పు కలిగిస్తుందని, పురాతన వారసత్వ కట్టడాలు ధ్వంసం అవుతాయని కోర్టుకు విన్నవించారు. నిజానికి ఈ ప్రతిపాదిత నిర్మాణ చుట్టూ ఉన్న మొత్తం ప్రాంతంలో 86 శాతం పైగా హరిత ప్రాంతంగా ప్రకటించబడింది. ఈ ప్రాజెక్టు వల్ల అది కాస్తా 9 శాతంకి కుంచించుకపోతుంది. 105 ఎకరాల్లోని ప్రజా పార్కులు,ఆట స్థలాలు 90 ఎకరాలకు పైగా అంతర్ధానం అవుతాయి. వీటికి తోడు 2003 లో యునెస్కో ప్రకటించిన వారసత్వ సాంస్కృతిక కట్టడాల పరిరక్షణ ప్రకటనలో భాగస్వామ్య దేశంగా ఉన్న భారత్ ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేపట్టి వాటిని ఉద్దేశ్యపూరితంగా ధ్వంసం చేయరాదని విస్పష్టంగా పేర్కొన్నది. పర్యావరణ, పురావస్తు అంశాల పై పడే ప్రభావానికి చెందిన అంశాలేవి అధ్యయనం చేయకుండానే, అసలవంటేనే లెక్కలేనితనంతో వ్యవహరిస్తోంది మోడీ ప్రభుత్వం. ఈ లోగా సుప్రీంకోర్టు "భూమిపూజ" చేసుకోండిగాని నిర్మాణం మొదలు పెట్టొద్దనే ఆదేశాన్ని ఇచ్చింది. లాక్ డౌన్ కాలంలో లక్షలాది వలస కార్మికుల దయనీయ స్థితి పైన వెంటనే స్పందించ నిరాకరించిన ఇదే సుప్రీంకోర్టు యుద్ధప్రాతిపదికన తీర్పును ఇచ్చేసింది.

నిత్యావసర వస్తువులు ఆకాశాన్నినీటినా, పెట్రోలు ధరలు భగ్గున మండుతున్న చలించడం లేదు ప్రభుత్వం. అవన్నీ పాత ప్రభుత్వాల పాపమే అని చేతులు దులుపుకుంటున్నాడు మోడీగారు. కరోనా సంక్షుభిత కాలంలో వలస కార్మికుల గోస కళ్లారా చూసి కూడా కరుణించని విశాల ఛాతి ఉన్న ప్రభుత్వం 20 వేల కోట్లతో దర్జాగా, డాబుగా అధికార కేంద్రాలను నిర్మిస్తోంది. నిరుద్యోగం తాండవిస్తోంటే, ఉన్న ఉద్యోగాలు ఊడి పోతుంటే చోద్యం చూస్తూ వీస్టా విలాసాలు కావాలంటోంది. కనిపించని అర్ధ జీవి దేశాన్ని వనికిస్తుంటే ప్రజా ఆరోగ్యం పై శ్రద్ధ కనపర్చాల్సింది పోయి కట్టడాలపై కన్ను పెట్టింది. ఇదేదో అత్యవసరమైన ప్రజా ప్రయోజన పని అన్నట్టు ఆఘమేఘాలమీద పావులు కదుపుతున్నది. యుద్ధప్రాతిపదికన చెయ్యాల్సిన ప్రజా అవసరాల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. నిజానికి ఇదొక హిందుత్వ ఎజెండా! దేశంలో హిందూయేతర గుర్తులన్ని చేరిపివేసే సంఘ్ పరివార్ ఎజెండా. హిందు

తేలిపోయిన భీమా కోరేగాం కేసు అబద్ధాలు

భీమా కోరేగాం కేసు ఎలా అబద్ధపు సాక్ష్యాధారాల మీద తయారయిందో తాజాగా వెలువడిన డిజిటల్ ఫోరెన్సిక్ నివేదిక తేటతెల్లం చేస్తున్నదని అంటున్నారు ఎన్ వేణుగోపాల్

చిక్కుముడులుగా అల్లుకున్న, అనేక మలుపులు తిరుగుతున్న భీమా కోరేగాం కేసు వాస్తవంగా ప్రజా పక్ష మేధావులకు వ్యతిరేకంగా పాలకవర్గాలు పన్నిన భారీకుట్రకేసు మాత్రమేనని నానాటికీ రుజువవుతున్నది. మొదట హింసాకాండకు నాయకత్వం వహించిన హిందుత్వ గురువులు శంభాజీ భిడే, మిలింద్ ఎక్బోటెలను రక్షించడానికి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రోత్సాహంతో, పోలీసు అధికారుల అత్యుత్సాహంతో పుణెలో ఈ భీమా కోరేగాం హింసాకాండ కేసు మొదలైంది. తర్వాత ఎల్గార్ పరిషద్ కేసుగా, నేరపూరితకుట్ర కేసుగా మలుపు తిరిగింది. తర్వాత ప్రభుత్వాన్ని కూల్చడానికి, ప్రధానమంత్రిని హత్య చేయడానికి మావోయిస్టుకుట్ర కేసుగా చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (యుఎపిఎ) కేసుగా విస్తరించింది. పుణె పోలీసుల చేతినుంచి ఎన్ఐఎ చేతికి మారి మరిన్ని కోరలు సంతరించుకుంది. విచారణ జరగకుండా, బెయిల్ ఇవ్వకుండా నిందితులను మూడు సంవత్సరాలుగా జైలులో నిర్బంధించి ఉంచిన మహాకుట్ర కేసుగా దేశంలోని ఆలోచనాపరులందరికీ పరిచయమైంది. ఈ భారీకుట్ర ఎక్కడ ఎట్లా మొదలయిందో ఇప్పుడు అమెరికాకు చెందిన ఒక ఫోరెన్సిక్ టెక్నాలజీ సంస్థ మరిన్ని తిరుగులేని ఆధారాలతో రుజువు చేసింది.

రోనా విల్సన్ దగ్గర జప్తు చేశామని పోలీసులు చెపుతున్న కంప్యూటర్ సాక్ష్యాధారాలను అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రంలోని బాస్టన్ నగరంలో పనిచేస్తున్న ఆర్సెనాల్ కన్సల్టింగ్ అనే సుప్రసిద్ధ డిజిటాల్ ఫోరెన్సిక్ అనాలిసిస్ సంస్థ స్వతంత్రంగా విశ్లేషించి తన విశ్లేషణా ఫలితాల నివేదికను ఫిబ్రవరి 8న విడుదల చేసింది. ఆ నివేదికను అందుకున్న వాషింగ్టన్ పోస్ట్ దినపత్రిక తాను స్వయంగా ముగ్గురు స్వతంత్ర విశ్లేషకులతో నిర్ధారణ చేయించుకుని, ఫిబ్రవరి 11న ఒక పూర్తి పేజి సంచలనాత్మక వార్తా కథనం ప్రచురించింది.

ఈ నివేదిక ద్వారా బహిర్గతమైన వాస్తవాలు, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వెల్లడైన వాస్తవాలు దిగ్భ్రాంతికరమైనవి. వరవరరావునుంచి వచ్చినట్టు కనబడిన ఈమెయిల్ ద్వారా రోనా విల్సన్ కంప్యూటర్‌లోకి 2016 జూన్ 13 సాయంత్రం 6.18కి ఆగంతుకులెవరో జొరబడడంతో ఈకుట్ర మొదలయింది. ఆ రోజు మధ్యాహ్నం 3.07నుంచీ తాను ఈమెయిల్‌లో పంపిన డాక్యుమెంటు తెరవమని వరవరరావునుంచి అనేకసార్లు అభ్యర్థన వచ్చింది. బహుశా అప్పటికే వరవరరావు కంప్యూటర్‌లోకి చొరబడి, ఆయన ఈమెయిల్ కాంటాక్ట్ అడ్రస్‌లను చేజిక్కించుకుని, దానినుంచి ఉద్దేశపూర్వకంగానే రోనా విల్సన్ తో సహా కొందరికి ప్రత్యేక డాక్యుమెంట్లతో ఈమెయిల్స్ పంపి ఉంటారు. ఆ ఈమెయిల్‌ను వరవరరావునుంచి వచ్చిన నిజమైనదిగానే భావించి రోనా విల్సన్ తెరిచారు. ఆ ఈమెయిల్‌లో అటాచ్‌మెంట్‌గా అనదర్ విక్టరీ. రార్ పేరుతో ఒక ఫైలు ఉంది. ఆ ఫైల్ తెరిస్తే ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అనే లెటర్ హెడ్, కింద ఏమీ తెలియకుండా అలుక్కుపోయిన అక్షరాలు ఉన్నాయి. ఇదేమిటో తెలియడం లేదు అని కూడ రోనా విల్సన్ జవాబు రాశాడు. కాని ఆ ఫైల్ తెరవగానే మాల్‌వేర్ రోనా కంప్యూటర్‌లో ప్రవేశించింది. అలా ఈమెయిల్ ద్వారా ఉద్దేశపూర్వకంగా పంపే చొరబాటు సాఫ్ట్ వేర్‌ను మాల్‌వేర్ అంటారు. అది తెరవగానే రిమోట్ ఆక్సెస్ ట్రోజన్ అనే సాఫ్ట్‌వేర్ తెరిచినవారి కంప్యూటర్‌లోకి చొరబడుతుంది. అప్పుడిక ఆ చొరబాటుదారుకు సుదూరంనుంచే ఈ కంప్యూటర్ మీద అదుపు వస్తుంది. ఈ కంప్యూటర్‌లో ఏం జరుగుతున్నదో తెలుస్తుంది. ఈ కంప్యూటర్‌లో అప్పటికే స్టోర్ అయి ఉన్న ఐడిలు, పాస్ వర్డ్‌లు, ప్రోగ్రాంలు అన్నిటి మీద అదుపు వస్తుంది. ఈ కంప్యూటర్‌లోకి తాను కోరుకున్న డాక్యుమెంట్లను ప్రవేశపెట్టే, ఈ కంప్యూటర్‌లో ఉన్న డాక్యుమెంట్లను తొలగించే, మార్చే అవకాశం వస్తుంది.

ఇదంతా జరిగినది 2016 జూన్ 13 సాయంత్రం 6.18 కి అని ఆర్సెనాల్ కన్సల్టింగ్ స్పష్టంగా నిర్ధారించింది. ఆరోజునుంచి పుణె పోలీసులు రోనా విల్సన్ ఇంటిపై దాడిచేసి, ఈ కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్న 2018 ఏప్రిల్ 17 వరకు, మొత్తం 22 నెలల పాటు రోనా విల్సన్ కంప్యూటర్ పూర్తిగా చొరబాటుదారుల అధీనంలో ఉండిపోయింది. ఇలా తన కంప్యూటర్ మరొకరి అధీనంలో ఉన్నదని రోనా విల్సన్‌కు తెలియకుండా దాచి ఉంచే సాఫ్ట్‌వేర్లను కూడ చొరబాటుదారులు వాడారు.

రాజులు,పాలకులు నిర్మించిన, పరివార్ వాళ్లూహిస్తున్న జ్వాజ్వల్యమానమైన హిందూ గతాన్ని మాత్రమే నిలబెట్టాలి. హిందూ గతం కానిది ఏది ఈ దేశ చరిత్రలో మిగలకూడదు. దేశంలో అనేక నగరాల్లో ఉండే పేర్ల మార్పు లాంటిది ఎప్పటి నుండో సంఘ్ పరివార్ సంతృప్తి కోసం చేస్తున్నారు. సెంట్రల్ వీస్టా ప్రాజెక్టు పరిపూర్ణం కావాలని పెట్టుకున్న కాలం 2024 కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకునే సందర్భనీ కావడం కాకతాళీయం కాదేమో..బహుశా మోడీ తన మాతృ సంస్థకి వందేళ్ల కానుకగా వీస్టా ను సమర్పిస్తాడేమో! ఆలోపు ఒకే దేశం,ఒకే చట్టం,ఒకే మతం,ఒకే భాష,ఒకే గ్రంధం(భగవద్గీత)....ఇలా అనేకం ఒకటే చేస్తారేమో. ఎందుకంటే వారికి అనేకం అంటే అసహ్యం. అంతా 'ఏకం' కావాలి కదా. తస్మాత్ జాగ్రత్త సెంట్రల్ వీస్టాలు, పార్లమెంటు భవనాలు, కోట్లాది రూపాయలతో విగ్రహాలు కట్టకుండా ప్రజలకు వైద్య,విద్యాలయాలు, ఉపాధి ఉద్యోగాలు చూపెట్టే ప్రణాళికలు వేయమని చెప్పకండి దేశ ద్రోహులవుతారు!

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)

వీ

అంతే కాకుండా ఈ రెండు సంవత్సరాల కాలంలో ఆయన వాడిన ఆంటీ వైరస్ సాఫ్ట్ వేర్లు, ఆంటీ మాల్‌వేర్ సాఫ్ట్ వేర్లు కూడ పట్టుకోలేని విధంగా తమ రిమోట్ ఆక్సెస్ ట్రోజన్‌ను నిగూఢంగా ఉంచారు. "చొరబాటుదారుల చేతుల్లో తమ లక్ష్యం ఇంత సుదీర్ఘ కాలం ఉండే అవకాశం మాత్రమే కాక విస్తారమైన సాంకేతిక పరిజ్ఞాన వనరులున్నట్టు అనిపిస్తున్నది" అని ఆర్సెనాల్ విశ్లేషకులు అన్నారు. ఇలా రోనా విల్సన్ కంప్యూటర్‌ను తమ అదుపులో ఉంచుకోవడం కేవలం రోనా విల్సన్ పనుల మీద నిరంతర నిఘా ఉంచడం కోసం మాత్రమే కాదని, ఆ కంప్యూటర్‌లోకి కొన్ని నేరారోపక డాక్యుమెంట్లను ప్రవేశపెట్టడానికి కూడ జరిగిందని ఆర్సెనాల్ నివేదిక రాసింది.

అలా రోనా విల్సన్ కంప్యూటర్ తమ అదుపులోకి వచ్చిన తర్వాత ఆ చొరబాటుదారులు ఆ కంప్యూటర్‌లో అదృశ్యంగా ఉండే ఒక కొత్త ఫోల్డర్‌ను సృష్టించారు. ఆ ఫోల్డర్‌లోకి పది డాక్యుమెంట్లు చేర్చారు. ఆ డాక్యుమెంట్లను, ఆ ఫోల్డర్‌ను రోనా విల్సన్ గాని, ఆ కంప్యూటర్‌ను వాడినవారెవరైనా గాని ఒక్కసారి కూడ తెరిచారనడానికి ఎటువంటి ఆధారాలు లేవు. ఆ డాక్యుమెంట్లన్నీ మైక్రోసాఫ్ట్ వర్డ్ 2010 లేదా ఆ తర్వాతి వర్షన్లలో టైప్ చేసినవి కాగా, రోనా విల్సన్ లాప్ టాప్‌లో ఉన్నది 2007 వర్షన్ మాత్రమే కావడమే ఆ డాక్యుమెంట్లు ఈ కంప్యూటర్‌లో ప్రవేశించిన తర్వాత ఒక్కసారైనా తెరవడం జరగలేదనడానికి తిరుగులేని ఆధారం.

ఆ తర్వాత ఈ నిగూఢ ఫోల్డర్‌లో ఉన్న పది డాక్యుమెంట్లు రోనా విల్సన్ తన పెన్ డ్రైవ్ వాడేటప్పుడు ఆయనకు తెలియకుండా, కనబడకుండా, వాటంతటవే ఆ పెన్ డ్రైవ్‌లోకి వెళ్లే ఏర్పాటు కూడ చేశారు. అలా 2018 మార్చ్ 14న రోనా విల్సన్ తన పెన్ డ్రైవ్‌ను వాడుతున్నప్పుడు లాప్ టాప్‌లోని అదృశ్య ఫోల్డర్ ఆ పెన్ డ్రైవ్‌లోకి బదిలీ అయింది. సరిగ్గా నెల తర్వాత ఏప్రిల్ 17న రోనా విల్సన్ ఇంటిమీద దాడి చేసిన పోలీసులు ఆ పెన్ డ్రైవ్‌ను "వెతికి పట్టుకున్నారు"! ఆ పెన్ డ్రైవ్ నే, అందులోని పది డాక్యుమెంట్లనే భీమా కోరేగాం కేసులో రోనా విల్సన్ మీద, సహనిందితుల మీద నేరారోపణలకు సాక్ష్యాధారాలుగా వాడుతున్నారు!

ఆ డాక్యుమెంట్లు పదీ ఉత్తరాలు. అయితే ఈమెయిల్ ఉత్తరాలైతే ఎవరు రాశారో, ఎవరికి రాశారో, ఎప్పుడు రాశారో, ఎప్పుడు చేరిందో, రాసినవారి, అందుకున్నవారి ఈమెయిల్ ఐడిలతో సహా వివరాలన్నీ ఉంటాయి. కాని ఈ పది డాక్యుమెంట్లు కూడ ఈమెయిల్‌లో రాసిన ఉత్తరాలు కావు. తెల్ల కాగితాల మీద టైప్ చేసిన ఉత్తరాలు. అందులో కింద పేరున్నవారే రాశారనడానికీ, పైన పేరున్నవారే అందుకున్నారనడానికీ ఏ ఆధారమూ లేదు. ఆ పది ఉత్తరాలలో ఎనిమిది ఇంగ్లిష్‌లో రాసినవి, రెండు హిందీలో రాసినవి. వాటిలో ప్రధాని హత్యా ప్రయత్నం, ప్రభుత్వ కూల్చివేత, ఆయుధ సేకరణ, ధన సేకరణ వంటి అంశాలున్నాయి.

ఆర్సెనాల్ కన్సల్టింగ్ కేవలం రోనా విల్సన్ మీద నేరారోపణలకు ప్రాసిక్యూషన్ ఉపయోగించిన ఎలక్ట్రానిక్ "సాక్ష్యాధారాల"లో కొంత భాగాన్ని విశ్లేషించి మాత్రమే ఈ నిర్ధారణలకు వచ్చింది. ఇక ఈ కేసులో ఇతర నిందితులందరి దగ్గర జప్తు చేశామని చెపుతున్న కంప్యూటర్ హార్డ్ వేర్లను, ఇతర ఎలక్ట్రానిక్ "సాక్ష్యాధారాల"ను కూడ పరీక్షిస్తే ఈకుట్ర ఎంత విస్తృతంగా, ఎంతలోతుగా జరిగిందో మరిన్ని వివరాలు తెలుస్తాయి.

ఇంతకూ ఆర్సెనాల్ కన్సల్టింగ్ సంస్థ ఈ విశ్లేషణలోకి వచ్చిన చరిత్ర కూడ ఆసక్తికరమైనది.

మూడు సంవత్సరాల కింద, 2018 జూన్ 6న ఢిల్లీలో రోనా విల్సన్‌ను, నాగపూర్‌లో సురేంద్ర గాడ్లింగ్, షోమా సేన్, మహేష్ రౌత్ లను, ముంబాయిలో సుధీర్ ధావలేను అరెస్టు చేసిన పుణె పోలీసులు వాళ్ల అరెస్టు కారణాలు చెప్పడానికి జూన్ 7న పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పుడు అరెస్టు చేసిన వారిలో ఇద్దరి ఇళ్లను ఇదివరకే సోదా చేసి కంప్యూటర్లు, పెన్ డ్రైవ్‌లు జప్తు చేశామని, వాటిలో రోనా విల్సన్ కంప్యూటర్‌లో ఈ ఐదుగురితో సహా మరికొందరికి మావోయిస్టు పార్టీతో ఉన్న సంబంధాల గురించీ, వారు ప్రభుత్వాన్ని కూల్చడానికి జరుపుతున్నకుట్ర గురించీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని హత్య చేయడానికి రచిస్తున్న పథకం గురించీ "సాక్ష్యాలు" దొరికాయని విలేఖరులకు చెప్పారు. అలా దొరికిన వాటిలో మూడు ఉత్తరాలనుంచి భాగాలు చదివి వినిపించారు. ఆ లేఖలు తాము రాసినవో, అందుకున్నవో కావని, తమ కంప్యూటర్లలో, పెన్ డ్రైవుల్లో అటువంటివేమీ లేవని నిందితులు అప్పుడే ప్రకటించారు. కాని పోలీసులు ప్రకటించిన "సాక్ష్యాధారాలు" నిజమైనవేనా కావా అనే ప్రశ్నే వేసుకోకుండా వార్తా ప్రచార సాధనాలు వాటికి పెద్ద ఎత్తున ప్రచారం ఇచ్చాయి. సంఘ్ పరివార్‌కు చెందిన ప్రచార సాధనాలు ఆ అబద్ధ ప్రచారాన్ని ముమ్మరంగా సాగించాయి. ఆ "సాక్ష్యాధారాలు" హాస్యాస్పదంగా ఉన్నాయని, అవి నిజమైనవి అయి ఉండకపోవచ్చునని అనేక మంది నిపుణులు, విశ్లేషకులు అప్పుడే పత్రికల్లో వ్యాసాలు రాశారు. టెలివిజన్ చర్చల్లో వ్యాఖ్యానించారు.

ఆ తర్వాత ఆగస్ట్ 28న దేశవ్యాప్తంగా ఆరు నగరాలలో పది మంది మేధావుల, కార్యకర్తల ఇళ్ల మీద పుణె పోలీసులు దాడులు చేసి, సోదాలు జరిపి, ఐదుగురిని అరెస్టు చేశారు. ఆ అరెస్టుల మీద ఒకవైపు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగానే, వారిని విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచాలని సుప్రీం కోర్టు ఆదేశించి ఉండగానే, పుణె పోలీసులు ఆగస్ట్ 31న మరొక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి, అరెస్టయిన వారి కంప్యూటర్లలో దొరికిన సాక్ష్యాధారాలు అంటూ మరికొన్ని ఉత్తరాల భాగాలు చదివి వినిపించారు. సంఘ్ పరివార్ అనుకూల ప్రచారసాధనాలు ఈ సాక్ష్యాధారాలను మరొకసారి మరింత పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఒకవైపు తాను విచారణ జరుపుతుండగా ఇలా పత్రికా సమావేశం ఏర్పాటు చేయడం అనుచితమని సుప్రీం కోర్టు కూడ పుణె పోలీసులను మందలించింది. అప్పుడు సుప్రీం కోర్టులో వ్యాజ్యం వేసిన రొమిలా థాపర్, తదితర మేధావులు కూడ పోలీసులు చూపుతున్న సాక్ష్యాధారాల మీద, పోలీసుల దర్యాప్తు మీద అనుమానాలున్నాయని, కనుక సుప్రీం కోర్టు తన పర్యవేక్షణలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలని కోరారు. ఈ కోరిక న్యాయమైనదేనని, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనంలో ఒక న్యాయమూర్తి కూడ అంగీకరించారు. కాని ఇద్దరు న్యాయమూర్తులు అలా భావించలేదు గనుక దర్యాప్తు అని చెపుతున్న దానిలో అక్రమాల గురించి దర్యాప్తు జరగనేలేదు.

ఈ రెండు పత్రికా సమావేశాల్లోనూ, ఈ మధ్యలో తమకు అనుకూలమైన టివి చానళ్లకూ పత్రికలకూ, మొత్తంగా పుణె పోలీసులు పదమూడు ఉత్తరాలు, పత్రాలు "సాక్ష్యాధారాలు"గా విడుదల చేశారు. ఆ "సాక్ష్యాధారాలను" నిస్సందేహంగా ఆమోదించడం కష్టమని, అవి న్యాయవిచారణకు నిలవజాలవని స్వతంత్ర పరిశీలకులతో పాటు మాజీ పోలీసు అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, పత్రికా రచయితలు ఈ

రెండున్నర సంవత్సరాలలో అనేకసార్లు అన్నారు.

ఆ ఉత్తరాల్లో వాడిన భాష, సరైన సంబోధన, సంతకం లేకపోవడం, మావోయిస్టులు ఎన్నడూ వాడని పదజాలం వాడడం, హిందీ ఎన్నడూ రాయని వరవరరావు హిందీలో ఉత్తరం రాశారనడం, సుధా భరద్వాజ్ రాసినట్టుగా చెపుతున్న హిందీ ఉత్తరంలో ఆమెకు ఎంతమాత్రమూ రాని మరాఠీ పదాలుండడం వంటి ఎన్నో అసంగతాలను పరిశీలకులు ఎత్తి చూపారు. నక్సలైట్ల అతి పెద్ద చర్య అయిన అలిపిరి దాడికి సంబంధించి అప్పటికి పద్నాలుగు సంవత్సరాలైనా ఒక్కటంటే ఒక్కటైనా అక్షర రూపపు బలమైన ఆధారం దొరకలేదని, అటువంటి వారు ప్రధానమంత్రి హత్యకు పథకం రచించి నేరుగా పేర్లతో, వివరాలతో ఉత్తరాలు రాసుకుని ఇంత బహిరంగంగా తమ కంప్యూటర్లలో పెట్టుకుంటారని అనడం హాస్యాస్పదమని, నమ్మశక్యం కానిదని అప్పుడు టివి చర్చలో అజయ్ సాహ్ని అనే సాధారణంగా పాలకవర్గ భావజాలం ఉన్న సైనిక వ్యవహారాల నిపుణుడు అన్నారు.

ఆ తర్వాత పుణె కోర్టులో విచారణ క్రమంలో ఆ ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాల విషయంలో పాటించవలసిన నియమ నిబంధనలను పాటించకుండా, సాక్ష్యాధారాలని తారుమారు చేస్తూ పోలీసులు ఎన్ని అక్రమాలు చేశారో న్యాయవాదులు అనేకసార్లు ఎత్తిచూపారు. జప్తు చేసి పోలీసులు స్వాధీనం చేసుకున్న సమయానికి ఉన్నట్టుగానే కోర్టుకు సమర్పించే సమయానికి ఉన్నదని రుజువు చేసే హాష్ వాల్యూ నమోదు చేయడం అనే నిబంధనను పోలీసులు పాటించలేదని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. జప్తు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాల క్లోన్ కాపీలను నిందితులకు, న్యాయవాదులకు ఇచ్చి, వారి వాదన వినిపించుకోవడానికి చట్టప్రకారం అవకాశం ఇవ్వవలసి ఉండగా, క్లోన్ కాపీలను ఇవ్వడానికి పోలీసులు మొదట నిరాకరించారు. ఏడాది వాదనల తర్వాత ఇవ్వడానికి అంగీకరించి తాత్సారం చేశారు. ఇప్పటికీ అందరికీ పూర్తిగా ఇవ్వలేదు. అలా ఇచ్చిన రోనా విల్సన్ క్లోన్ కాపీ మీదనే ఇప్పుడు ఆర్సెనాల్ కన్సల్టింగ్ పరిశోధన జరిగింది.

అమెరికన్ బార్ అసోసియేషన్ అనే సుప్రసిద్ధ అమెరికన్ న్యాయవాదుల సంస్థ 2019 డిసెంబర్‌లో భీమా కోరేగాం కేసులో విచారణ సక్రమంగా జరగడం లేదని, దర్యాప్తు, సాక్ష్యాధారాలు, విచారణా ప్రక్రియ అనుమానాస్పదంగా ఉన్నాయని ఒక నివేదిక విడుదల చేసింది. అమెరికన్ బార్ అసోసియేషన్ నాలుగు లక్షల మంది న్యాయవాదులు సభ్యులుగా గల స్వతంత్ర న్యాయ, చట్టపరమైన సంస్థ. ప్రపంచవ్యాప్తంగా న్యాయస్థానాల విచారణలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా పరిశీలించడం కూడ ఆ సంస్థ పనుల్లో ఒకటి.

సరిగ్గా ఆ సమయంలోనే మహారాష్ట్రలో ఎన్నికలు జరిగి, అప్పటివరకూ పాలిస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పడిపోయి, శివసేన–ఎన్ సి పి – కాంగ్రెస్ ల ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ సి పి నాయకుడు శరద్ పవార్ భీమా కోరేగాం దర్యాప్తు సక్రమంగా జరగలేదని, దానిమీద పునర్విచారణ జరపవలసి ఉందని పుణెలో ఒక బహిరంగసభలో అన్నారు. కొత్త ప్రభుత్వంలో హోం శాఖ ఎన్ సి పి చేపట్టింది గనుక హోం మంత్రి ఈ కేసు దర్యాప్తు అధికారులను బొంబాయికి పిలిచి చర్చించాడు. ఒకసారి సమావేశం జరిగి, మరొకసారికి వాయిదా వేసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, అమిత్ షా నాయకత్వంలో నేరుగా పనిచేసే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ)కు ఈ కేసును బదిలీ చేసింది.

ఒకవైపు ఇది జరుగుతుండగానే, నిందితులకు ఇచ్చిన ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలను, ముఖ్యంగా రోనా విల్సన్, సురేంద్ర గాడ్లింగ్‌ల క్లోన్ కాపీలను పరీక్షించిన ది కారవాన్ పత్రిక ఆ సాక్ష్యాధారాలలోని సాంకేతిక పరమైన అవకతవకలను బైటపెట్టి అవి అనుమానాస్పదమైనవని వ్యాఖ్యానిస్తూ డిసెంబర్ 2019లో, మార్చ్ 2020లో వివరమైన విశ్లేషణా కథనాలు రాసింది.

దేశంలో అనేకమంది హక్కుల కార్యకర్తల, న్యాయవాదుల కంప్యూటర్లలోకి పెగాసస్ అనే స్పైవేర్ (నిఘా సాఫ్ట్ వేర్) ద్వారా చొరబడి గూఢచర్యం చేయడం, వారి కంప్యూటర్లలో నేరారోపణలకు వీలు కలిగించే పత్రాలను ప్రవేశపెట్టడం విరివిగా జరుగుతున్నదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, సిటిజెన్ లాబ్‌లు 2020 జూన్‌లో ఆధారాలు ప్రకటించాయి.

అంటే పోలీసులు సాక్ష్యాధారాలుగా చెపుతున్నవాటి మీద నిందితుల అనుమానాలతో, డిఫెన్స్ న్యాయవాదుల వాదనలతో సంబంధం లేకుండానే, ఇప్పటికి కనీసం ఆరు సార్లు వేరువేరు వ్యక్తులనుంచి, సంస్థల నుంచి అనుమానాలు వ్యక్తమయ్యాయి. మొదట స్వతంత్ర పరిశీలకులు, మాజీ పోలీసు, ఫోరెన్సిక్ అధికారులు, పత్రికా రచయితలు, తర్వాత రొమిలా థాపర్ తదితరులు వేసిన వ్యాజ్యం, తర్వాత అమెరికన్ బార్ అసోసియేషన్, తర్వాత శరద్ పవార్ నాయకత్వంలో ఎన్ సి పి, తర్వాత ది కారవాన్ పత్రిక, తర్వాత ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ – సిటిజెన్ లాబ్ – ఇన్ని వైపులనుంచి ఈ కేసులో పుణె పోలీసులు, ఎన్ఐఎ ఘనంగా చెప్పుకుంటున్న "సాక్ష్యాధారాలు" బోలు సరుకు మాత్రమేనని అనుమానాలు, వాదనలు, సాంకేతిక నిర్ధారణలు వెలువడ్డాయి.

ఈ నేపథ్యంలో, రోనా విల్సన్ దగ్గర జప్తు చేసుకున్నామని పోలీసులు చెపుతున్న ఎలక్ట్రానిక్ "సాక్ష్యాధారాల" క్లోన్ కాపీ (యథాతథ ప్రతి) ని అమెరికాలోని ఏదైనా స్వతంత్ర డిజిటల్ ఫోరెన్సిక్ సంస్థ ద్వారా పరీక్షింపజేయగలరా అని డిఫెన్స్ న్యాయవాదులు అమెరికన్ బార్ అసోసియేషన్‌ను సంప్రదించారు. అమెరికన్ బార్ అసోసియేషన్ సహకారంతో ఈ క్లోన్ కాపీలు ఆర్సెనాల్ కన్సల్టింగ్‌కు చేరాయి.

ఆర్సెనాల్ కన్సల్టింగ్ అనుమానించడానికి ఆస్కారం లేని సుప్రసిద్ధ డిజిటల్ ఫోరెన్సిక్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ సంస్థ. అది 2009నుంచి న్యాయ సంస్థలకు, వ్యాపార సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు అవసరమైన సాంకేతిక సేవలు అందిస్తున్నది. న్యాయ, నేర పరిశోధనా సంస్థలు, సైనిక బలగాలు, ప్రైవేట్ సంస్థలు ఉపయోగించే ఫోరెన్సిక్ పరికరాలను, సాధనాలను కూడ ఈ సంస్థ అభివృద్ధి చేసింది. అమెరికాలోనూ అంతర్జాతీయంగానూ ఫోరెన్సిక్ శాస్త్ర పరిజ్ఞానాన్ని, పరికరాలను ఉపయోగించిన అనేక న్యాయ, చట్టపరమైన వివాదాలలో నైపుణ్య సహకారం అందించింది. భీమా కోరేగాం కేసు తానింతవరకూ చూసిన వాటిలోకెల్లా "అత్యంత తీవ్రమైన సాక్ష్యాధారాల తారుమారు ఘటనల్లో ఒకటి"ని ఆ సంస్థ అధ్యక్షుడు మార్క్ స్పెన్సర్ వ్యాఖ్యానించారు.

వర్గ సమాజంలో పోలీసులు పాలకవర్గానికి అనుకూలంగా ప్రవర్తిస్తారని, పాలితులకు, ప్రశ్నించే వారికి, తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా దమనకాండకు, కుట్రలకు పాల్పడతారని కొత్తగా చెప్పనక్కర లేదు. కాని పోలీసులు ఒక తటస్థ వ్యవస్థ అని, సమాజ రక్షణ కోసం ఏర్పాటయిన అవసరమైన వ్యవస్థ అని భావించే మధ్యతరగతి

స్పందన

విప్లవోద్యమం - విపత్తుల్లో సహాయ కార్యక్రమాలు

విపత్తులో సహాయ కార్యక్రమాల గురించి వీక్షణం ఏప్రిల్ - జూలై 2020 సంచికలో వచ్చిన వ్యాసానికి చరిత్ర అనుభవాల స్పందనను తెలియజేస్తున్నారు **ప్రవాసి**

కోవిడ్-19 నిర్బంధ పరిస్థితుల వల్ల ఆ వ్యాధి లేదా వైరస్ ఏమిటి, దాని వెనుక ఉన్న సామ్రాజ్యవాద రాజకీయార్థిక విధ్వంస పూర్వక అభివృద్ధి నమూనా ప్రభావం ఏమిటి అని తెలుసుకునే అన్ని సమాచార, ప్రసార సాధనాలు మూతపడిన చీకటిలో తొమ్మిది నెలలు గడపవలసి వచ్చింది. దిన పత్రికలు, బయటి ప్రపంచం అందుబాటులో లేని స్థితి ఈ ఉడ్డుకుడ్చుకున్నట్లు ఉన్న స్థితిలో మొదట అందుబాటులోకి వచ్చిన పుస్తకం రీసెర్చ్ యూనిట్ ఫర్ పొలిటికల్ ఎకానమీ (ఆర్‌యుపిఇ) ప్రచురించిన క్రైసిస్ అండ్ ప్రివేషన్-ఇండియా, కోవిడ్-19, అండ్ గ్లోబల్ ఫైనాన్స్. తర్వాత నిన్న ఇవ్వాళ చేతికి వచ్చిన 'వీక్షణం' ఏప్రిల్-జూలై 2020 సంచిక. వీక్షణం కూడ లాక్ డౌన్ (మార్చ్ 2020) తర్వాత నాలుగు నెలలకు గానీ పాఠకులతో మళ్లీ సంభాషించడం (అచ్చులో) ఈ సంచిక ద్వారానే సాధ్యమైందంటే లాక్ డౌన్ ప్రభావం నా బోటి సామాజిక మాధ్యమాలు కూడా అందుబాటులో లేని మనిషికి చైతన్యం తప్ప, అందువల్ల కలిగే అవగాహనా జ్ఞానం తప్ప 'సమాచార' ఆధారిత జ్ఞానం అతి స్వల్పమైంది.

అయితే ఇక్కడ ఒకటి రెండు అంశాలపై స్పందించడానికే ఈ స్పందన. ఒకటి నా హృదయానికి దగ్గరయిన కామ్రేడ్ మనీష్, అతని సహచరి బెయిలుపై విడుదలయి అప్పుడే పదకొండు నెలలయినట్లు ఈ సంచిక ద్వారానే తెలిసింది. దానితో పాటు ఆయన వ్యాసం కోవిడ్-19 రాజకీయార్థిక పరిచయం ఏడు పేజీల వ్యాసం 214 పేజీల ఆర్‌యుపిఇ పుస్తకం వివరించని కోవిడ్-19 వైరస్ సామ్రాజ్యవాద వ్యాధి మూలాలను, లక్షణాలను, స్వభావాన్ని, కుట్రను కూడ వివరించింది. అందులోను సోఫీస్ వాయిస్ మొదలుకొని, అప్టన్ సిన్‌క్లేర్ నుంచి 'రెండు మహానగరాల' దాకా సాహిత్య గంధ శైలి అద్భుతంగా ఉంది.

'కోపంలేని మనుషులపై కనికరం లేని దేశం' (సి. వనజ) వ్యాసంలో కోవిడ్-19 ప్రకటించగానే వలస కార్మికులు వందల మైళ్లు తమ గ్రామాలకు ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాలకు ఆదివాసులు తిరుగు ప్రయాణంలో పడిన బాధలు, తమ మిత్ర బృందం చేయగలిగిన చిన్న సాయం గురించి రాస్తూ ఆ కృషి గురించి వచ్చిన రెండు విమర్శనాత్మక పరిశీలనలలో ఇట్లా సాయం చేయడం పోరాట పటిమను తగ్గించడం కాదా అనడానికి విప్లవోద్యమం నుంచి వచ్చిన సమాధానాన్ని పేర్కొన్నారు. 'ముందు మనుషులు బతికుండాలి కదా విప్లవం సాధించాలంటే' 'ఆశయం పెద్దదైనపుడు, యుద్ధం దీర్ఘకాలమైనపుడు, తక్షణ సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ వివరణలు చెప్పడం కుదురుతుందనుకోను. అది సమాంతర ప్రక్రియే' అని డివిజన్ కార్యదర్శి గణేష్ ఉయికె దండకారణ్యంలో మనుషులు తిండిలేకా, మలేరియాతోనూ నలభై ఏళ్ల వయసు కూడా దాటకుండా మరణిస్తున్నారని చెప్పాడట.

అదే సందర్భంలో దివి సీమ ఉప్పెన సమయంలో ఎం.ఎల్. పార్టీలు చేపట్టిన సహాయ కార్యక్రమాలపై కూడ ఇటువంటి విమర్శలే వచ్చాయి. 'విమర్శించిన వాళ్లు ఎక్కడున్నారో కాని పని చేసిన వాళ్లు మాత్రం ఇపుడు జైలులో ఉన్నారు' అని చేసిన పరిశీలనా వ్యాఖ్యపై నేనేమి వ్యాఖ్య చేయడం లేదు గాని ఈ పరిశీలనా వ్యాఖ్య నా మనసులోని తేనె తుట్టెను కదిలించింది.

కృష్ణా జిల్లాలో దివి సీమలో ఉప్పెన 1979 నవంబర్‌లో వచ్చి ఐదు వేల మంది చనిపోయారు. ఉప్పెన రావడానికి ముందు రోజు రేడియో 'ఆకాశవాణి' తుఫాను హెచ్చరిక చేసింది. జాలర్లు, తీరవాసులు తుపానుకు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. తుఫానులో గాలి ఉధృతి ఉంటుంది- 'ఉప్పెన'లో నీటి ఉధృతి ఉంటుంది. దింటి మెరక, పాలకాయ తిప్ప వంటి తీర గ్రామాల్లో జాలర్ల ఇళ్లు సముద్ర ఉధృతికి మునిగిపోయి కొట్టుక పోయారు. ఇళ్లు, గుడిసెలు కూలి వాటికింద చనిపోయారు. వేలాదిగా పశు నష్టం జరిగింది. ఉప్పెన వచ్చిన రాత్రి ముఖ్యమంత్రి వెంగళరావు ఢిల్లీలో ఉన్నాడు. అక్కడి డెల్టా ప్రాంత కుటుంబాలకు అమెరికాలోని ఎన్‌ఆర్‌ఐలు ఫోన్ చేస్తే, వాళ్లలో తెలిసిన వాళ్లు చెప్తేగానీ ముఖ్యమంత్రికి తెలియలేదు. (కాని 1969లోనే పంచాది కృష్ణమూర్తి, పద్నాలుగేళ్ల బాల కళాకారుడు తామాడ చినబాబు, మరి నలుగురు పట్టుబడినారని వైర్‌లెస్ మెసేజ్ వస్తే 'బంప్ దెమ్ అఫ్' (కాల్చేయండి) అని చెప్పే సాంకేతిక విజ్ఞానం మాత్రం ఆయనకు హోం మంత్రిగానే పదిన్నరేళ్లకిందనే అబ్బింది - ఎన్‌కౌంటర్ తెలివితేటలు!)

అయితే దివి సీమలో ముఖ్యంగా అవనిగడ్డ, దింటి మెరకలు కేంద్రంగా పనిచేసింది చల్లపల్లి శ్రీనివాసరావు నాయకత్వంలోని యుసిసిఆర్‌ఐ ఎంఎల్ మాత్రమే. అక్కడే న్యాయవాదిగా పనిచేస్తూ ఒపిడిఆర్ నాయకుడుగా ఉన్న కంఠంనేని రవీందర్ రావు. విషయం

అమాయకులు చాల తరచుగా "కంచే చేను మేస్తే ఎలా" అనే ప్రశ్న అడుగుతుంటారు. భీమా కోరేగాం కేసులో అక్షరాలా అదే జరిగింది. పోలీసులు, లేదా ఇప్పటికి బైటపడని ఆగంతుకులు, కొందరు వ్యక్తులను, ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాలను ప్రశ్నించేవారిని ఎంచుకుని, వారి మీద నేరారోపణలకు అవసరమైన "సాక్ష్యాధారాలను" వారి ఎలక్ట్రానిక్ పరికరాల్లో ప్రవేశపెట్టి, వాటి ఆధారంగా మూడు సంవత్సరాలుగా వారిని నిర్బంధంలో ఉంచారు. ఇది ఇవాళ వారికి జరిగింది. రేపు కంప్యూటర్ వాడే ఎవరికైనా జరగవచ్చు. ఇప్పటికైనా ఎటువంటి వ్యవస్థలో బతుకుతున్నాం మనం అనే ప్రశ్న రాకుండా బతుకుదామా?

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

తెలిసిన రోజే వెళ్లి ఆ ప్రాంతమంతా శవాల మధ్య పర్యటించి వచ్చిన వరంగల్ కాకతీయ వైద్యకళాశాల విద్యార్థి డా. రావి భుజంగరావు, ఎపిసిఎల్‌సి ఉపాధ్యక్షుడు డా. రామనాథం చలించి ఆ హృదయ విదారక దృశ్యాలు వివరించారు. దివిసీమ ఉప్పెన బాధితుల కోసం వరంగల్ మెడికల్ షాపుల నుంచి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ నుంచి మాత్రమే కాకుండా విజయవాడ ఫార్మాసుటికల్స్ నుంచి కూడ డా. రామనాథం గారు మందులు సేకరించారు. విరాళాల సేకరణలో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి ప్రొ. బి.వి. సుబ్బారావు గారు చాలా సహాయం చేశారు.

రామనాథం గారు ఒక పశు వైద్యుణ్ని, మరో ఇద్దరు ఎపిసిఎల్‌సి మిత్రులను వెంటబెట్టుకొని వెళ్లి వైద్య శిబిరం నెలకొల్పి నెల రోజుల పాటు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. డా. రామనాథం ఎపిసిఎల్‌సి జిల్లా అధ్యక్షుడు, జీవన్‌కుమార్ కార్యదర్శిగా 1977 ఎమర్జెన్సీ ఎత్తివేసిన దగ్గర నుంచి బాలగోపాల్ వచ్చేదాక, వచ్చిన తర్వాత 1985 దాక ఇటువంటి సహాయ కార్యక్రమాల గురించి చెప్పాలంటే అది ఒక చరిత్ర అవుతుంది. చెప్పదల్చుకున్నదల్లా దివిసీమ ఉప్పెన సహాయ చర్య మొదలు కొడవటి సుదర్శన్ మిస్సింగ్ కేసు దాకా ఆయన పట్టించుకోని పౌర, ప్రజా సమస్య లేకపోవడం వల్ల ఆయనను పోలీసులు చంపేసారని మాత్రమే. దివి సీమలో ఎంఎల్ పార్టీ కృషిని, ఒపిడిఆర్, ఎపిసిఎల్‌సి సహాయక చర్యల్లో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా కూడా సమర్థంగా సహాయక చర్యలకు పూనుకున్న ఎ.వి.ఎస్. రెడ్డి కూడ ప్రశంసించాడు. అందరికన్నా ముఖ్యం జాలర్లు ప్రాణాలకు తెగించి సముద్ర ప్రాంతంలో మునుగుతున్న డెబ్బై మంది తీరవాసుల ప్రాణాలు కాపాడారు. (సృజనలో సుదీర్ఘమైన రిపోర్టు వచ్చింది.

ఎనభైల తొలి సంవత్సరాల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు తమ న్యాయమైన డిమాండ్లకోసం సమ్మె చేసారు. ఆ సమ్మెను బలపరుస్తూనే ఎపిసిఎల్‌సి వరంగల్ ఎంజిఎం ఎదురుగా పేద రోగుల పరీక్షలు, చికిత్స కోసం డా. రామనాథం, జూనియర్ డా. దామెర రాములు మొదలైన వారితో వైద్య శిబిరం నిర్వహించింది. వరంగల్ మెడికల్ షాప్‌ల నుంచి మెడికల్ రిప్రజెంటేటివ్స్ నుంచి సేకరించి ఉచితంగా మందులిచ్చింది.

ఇదే కాలంలో (1977-85 తెలంగాణలో, 92 దాకా హైదరాబాదులో) పీపుల్స్‌వార్ గానీ, దాని అనుబంధ సంస్థలు ముఖ్యంగా ఆర్ఎస్‌యు, ఆర్‌వైఎల్‌లు గానీ, సికాస గానీ ఎన్ని విప్లవ సంస్కరణలు అమలు చేసారో చెప్పనలవికాదు.

తర్వాత చాలా కాలానికి డిటిఎఫ్‌ను బదనామ్ చేయాలని కరీంనగర్ ఎస్.పి. ఉపాధ్యాయులు ఉద్యోగం చేసే ఊళ్లోనే ఉండాలని నిర్బంధపు నినాదాలు గోడలమీద రాయించాడేమో గానీ, ఉపాధ్యాయులెక్కడున్నా వేళకు బడికి రావాలని, పాఠాలు చెప్పాలని (92 తర్వాత ప్రొ. భాస్కరరావును యూనివర్సిటీ ఎట్లా ఉంది సార్ అని కెయులో అడిగితే మాకేం జీతాలు తీసుకుంటున్నాం. క్లాసులు ఎగ్గొడుతున్నాం. మమ్మల్నిపుడు పాఠాలు చెప్పమని అడిగే రాడికల్స్ లేరు గద అని అన్నాడు) జీతాల రోజు బడిలో మందు పార్టీలు చేసుకోవద్దని నియమాలు పెట్టారు. ఆదిలాబాద్ జిల్లాలో కరువు దాడుల సందర్భంగా నిజ నిర్ధారణకు ఎపిసిఎల్‌సి వెళ్లినపుడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఈ కరువు పరిస్థితుల్లో జవహర్ రోజ్‌గార్ యోజన కింద చేరవలసిన వాళ్లకు సహాయం చేరడం రాడికల్స్ వల్లనే సాధ్యమవుతుందని చెప్పాడు. అట్లాగే అనారోగ్యం వలన అజ్ఞాతం నుంచి నిర్బంధం తట్టుకోలేక వచ్చిన విప్లవకారులు గానీ, మిలిటెంట్లని ప్రచారం పొందిన యువకులు గాని గ్రామాల్లో చేపట్టిన విప్లవ సంస్కరణలు వెంకటాద్రిపేట (వరంగల్ జిల్లా) వంటి గ్రామాల్లో వాళ్ల ఎన్‌కౌంటర్ హత్యలకు కూడా దారితీసాయి. ఆ గ్రామంలో భూస్వాధీనమే కాదు, సహకార వ్యవసాయం చేసిన వార్తలు విని టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్టర్ వచ్చి ఫోటోలతో సహా రిపోర్టు రాసాడు. హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న చౌటుప్పల్ గ్రామంలో పార్టీ దళం ప్రజల సహకారంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేసింది. వందలాది గ్రామాలకు అది ఒక మచ్చుతునక.

ప్రత్యేకించి చెప్పవలసింది వరంగల్ రైతుకూలీ సంఘం మహా సభలు (మే 5, 6, 1990) సందర్భంగా పార్టీ తీసుకున్న సహాయ కార్యక్రమం గురించి. సభల మొదటి రోజే బంగాళాఖాతంలో తుఫాన్ వల్ల వరంగల్‌లో గూడ పెద్ద వానవచ్చి రెండు వేల మంది సదస్సుకోసం వేసిన టెంట్ కూలిపోయింది. రాత్రికి రాత్రే దానిని మళ్లీ వేశారు. కానీ రెండో రోజు సభలు అయిపోయేవరకు తుఫాను ఉధృతికి గుంటూరు జిల్లా పేద బస్తీలలో వందల ఇళ్లు కూలిపోయి ప్రజలు నిరాశ్రయులయ్యారని వార్తలు వచ్చాయి. పద్నాలుగు లక్షల మంది బహిరంగ సభకు వచ్చిన ఆ చారిత్రాత్మక సభలు నిర్వహించింది రాష్ట్ర కమిటీ సభ్యుడు, బెయిల్‌పై బయట ఉన్న సూర్యం (చింతల వెంకటస్వామి) గారి నాయకత్వంలో ఐదుగురు పార్టీ నాయకులైన మోడెం బాలకృష్ణ, రవి (మంజీర), భూషణం, పరశురామ్. వీరిలో సూర్యం గారు, మంజీర, పరశురామ్‌లు తర్వాత కాలంలో ఎన్‌కౌంటర్‌లలో అమరులయ్యారు. సభలు అయిపోగానే మిగిలిన బియ్యం, పప్పులు తదితర ఆహార ధాన్యాలు, వెదురు బొంగులు, కర్రలు, తెలంగాణ, వరంగల్ ప్రాంతంలో ఎక్కువగా దొరికే తాటి కమ్మలు లారీల్లో వేసుకొని గుంటూరుకు తీసుకపోయి అక్కడ సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఆలేరు స్టేషన్ నుంచి అక్కడి పార్టీ బియ్యం బస్తాలు సహాయంగా పంపించింది.

నిషేధం లేక, బహిరంగ కార్యకలాపాలకు అవకాశం ఉండి పార్టీ నాయకత్వం స్వయంగా చేసిన సహాయ కార్యక్రమం అది అయితే 1993 ఎఐఎల్ఆర్‌సి దశాబ్ది ఉత్సవాలు మతతత్వవాదం మీద హైదరాబాద్‌లో నిర్వహించిన అక్టోబర్‌లో ఒక పది పదిహేను రోజులకు ముందు లాతూర్‌లో పెద్ద భూకంపం వచ్చింది. లాతూర్ ఉన్నది మరట్వాడలో గానీ ఆ భూకంపం ప్రభావం హైదరాబాద్ పాతనగరం మలక్‌పేట దాకా ఉన్నది. మలక్‌పేటలో కూడ భూమి సన్నగా కదిలి కిటికీ అద్దాలు పగిలిపోయాయి.

ఎఐఎల్ఆర్‌సి సభల కోసం అహర్నిశలు పనిచేస్తున్న బృందానికి నాయకుడు వీరన్న (వీరారెడ్డి) వెంటనే బీదర్‌కు వెళ్లినా ఆ బీభత్సాన్ని కళ్లారా చూసాడు. అప్పుడాయన మరో సహచరునితో కలిసి పాత బస్తీలో ముస్లింల మధ్యన పనిచేస్తున్నాడు. సభలు వాయిదా వేసి బీదర్ వెళ్లి అక్కడ బాధితులకు సహాయం చేయాలని ఆలోచించాడు. బీదర్ భూకంపం వార్త రేడియో ద్వారా విని అప్పటి రాష్ట్ర కార్యదర్శి వీరన్నకు ఫోన్ చేసి సభలు వాయిదా వేయొద్దు, సభలో ఆ భూకంపం గురించి కూడా వివరించి, అంతకు ముందే ప్రజల నుంచి కూడా బాధితుల కోసం కూడా సహాయం అర్థించి సభలు కాగానే వెళ్లి సహాయ కార్యక్రమాలు చేపట్టండి అని చెప్పారు. ద్విగుణీకృత పట్టుదలతో వీరన్న, సహచరులు పనిచేసి సభలు అయిపోగానే వెళ్లి లాతూర్ భూకంప బాధితులకు భూరి సహాయ సహకారాలు, శ్రమ అందించారు. అప్పుడు హైదరాబాద్‌కు

చెందిన అన్వర్ మౌజమ్, సుప్రసిద్ధ రచయిత్రి జిలానీబాను దంపతులు ప్రజల మధ్య ఐక్యత కోసం ప్రతి సంవత్సరం ఇచ్చే అవార్డును వీరన్న బృందానికి ఇవ్వజూపారు. ఆయన వినయపూర్వకంగా ప్రజలకు సేవ చేయడం కమ్యూనిస్టుల కర్తవ్యం, సంస్కృతి అని చెప్పాడు. ఎఐఎల్ఆర్‌సి సభలు అయిపోయిన వారం పది రోజులకే సాగర్ (పులి అంజయ్య), ఆయన సహచరి భాగ్యలను బెంగళూరులో అరెస్ట్ చేసి వెంకటాద్రిపేట, పీచర మధ్యన పొలాల్లో ఎన్‌కౌంటర్ చేసి శవాలనక్కడ వదిలిపోయారు. 1994 ఎన్నికల సందర్భంలో ఏటూరు నాగారం అడవుల్లో ఎన్నికల బందోబస్తుకోసం పిలిపించిన పంజాబ్ కమాండోలు వీరన్నను కాల్చిచంపి మృతదేహాన్ని కూడ బంధువులకివ్వలేదు. అతన్ని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి పంజాబ్ కమాండోలకు అప్పగించింది ఎస్ఐబి.

రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఆదివాసీ, దళిత, ముస్లిం మైనారిటీలపై జరిగిన దాడుల్లో పీడితుల, బాధితుల పక్షాన నిలిచిన వారికి సహాయ సహకారాలందిస్తూ వారితో కలిసి పోరాటాలు చేసింది. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి ఇంద్రవెల్లి గిరిజనులపై పోలీసు కాల్పులు (1981), చింతపల్లి ఏజెన్సీ (విశాఖ జిల్లా) గుత్తికోయల గృహ దహనాలు(నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారని 1986), కారంచేడు, చుండూరు, వేంపెంట, లక్ష్మింపేట (శ్రీకాకుళం), పాతపల్లి (మహబూబ్‌నగర్) దళితులపై అగ్రవర్ణాల దాడులు, బాబ్రీ మసీదు విధ్వంసం, గుజరాత్ మారణకాండ, రాష్ట్రంలో హైదరాబాద్ పాతనగరం మొదలు, నిర్మల్ వరకు ఎన్నో సందర్భాలు ఉన్నాయి. ఇంద్రవెల్లిలో 20 ఏప్రిల్ 1981న ఆదిలాబాద్ జిల్లా గిరిజన రైతుకూలీ సంఘం సభలు భగ్నం చేయడానికి పోలీసులు కాల్పులు జరిపితే అరవై మంది ఆదివాసీలు మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. ఆ సమయంలో వరంగల్‌లో ఆర్‌వైఎల్ మహాసభలు జరుగుతున్నవి. ఆ సభలకు ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొ. మనోరంజన్ మహంతీతో పాటు విరసం కార్యదర్శి కెవిఆర్ మొదలైన వారిని నిజనిర్ధారణకు పంపించి, పదమూడు మంది మృతుల వివరాలు మాత్రం సేకరించగలిగి ఇంద్రవెల్లి స్మారక నిధిని ఏర్పాటు చేసి, జోడెన్‌ఘాట్, పిట్ట బొంగరం మొదలైన ఆదివాసీ గ్రామాల్లో మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి స్వయంగా అందజేసింది. ఈ కృషి అంతటా ఎపిసిఎల్‌సి బాలగోపాల్ సహకరించారు.

మరొకవైపు రైతు కూలీ సంఘం అధ్యక్షుడు గంజి రామారావు గారు రెండేళ్ల పాటు ఇంద్రవెల్లి కేంద్రంగా అమరుల స్థూపాన్ని తీన్‌మీన్ స్క్వేర్ (చైనా విప్లవ అమరుల స్మృతి చిహ్నం) వలె 89 అడుగుల ఎత్తున నిర్మించారు. దానిని ఆలంపెల్లి సిఆర్‌పిఎఫ్ క్యాంపుపై పీపుల్స్‌వార్ దాడికి ప్రతీకారంగా పోలీసులు డైనమైట్లు పెట్టి పేల్చివేశారు (1987). ఆదివాసుల, ప్రజల, ప్రజాస్వామ్యవాదుల పోరాటాలతో ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా పునర్నిర్మాణం చేసిందే ఇపుడున్న స్థూపం. కాని దాదాపు నలభై ఏళ్లయినా తమ ఆదివాసీ అమరులను స్మరించుకోకుండా అక్కడ నిషేధాజ్ఞలుంటాయి.

1985 జూలై 17న కారంచేడులో దళితుల హత్యాకాండ ఎన్‌టిఆర్ వియ్యంకుడు దగ్గుపాటి చెంచు రామయ్య నాయకత్వంలో జరిగినపుడు చీరాల విజయనగర్‌లో బాధితుల కోసం బొజ్జా తారకం, కత్తి పద్మారావుతో దళిత మహాసభ శిబిరం ఏర్పాటు చేయగా నిర్వహించింది మాత్రం ఆర్ఎస్‌యు, ఆర్‌వైఎల్, జననాట్యమండలులే. ఈ సందర్భంగా ముఖ్యంగా స్మరించుకోవాల్సిన వాళ్లు చంద్రవంక దళం ఏసు, జననాట్య మండలి దివాకర్, జిల్లా పార్టీ నాయకుడు కారుమంచి శేషప్రసాద్. కారంచేడులో చెంచు రామయ్యను, వేంపెంటలో బుడ్డా వెంగళరెడ్డిని పీపుల్స్‌వార్ దళం శిక్షించి ప్రజల పక్షాన నిలిచింది. చుండూరులో బాధితుల హత్యాకాండపై వచ్చిన స్పందనకు అక్కడికెళ్లిన ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి నిందితుల భూములు స్వాధీనం చేసుకుంటామన్నాడు. అంతమాత్రమే కాదు అవి బాధితుల కుటుంబాలకు పంచాలని పీపుల్స్‌వార్ డిమాండ్ చేసినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రిక పతాక శీర్షికలో రిపోర్ట్ చేసింది. (ఆగస్టు 6, 1992) చుండూరు మారణకాండకు బాబ్రీ మసీదు విధ్వంసానికి వ్యతిరేకంగా, మండల్ వ్యతిరేక ఆందోళనను ప్రతిఘటిస్తూ వీరన్న నాయకత్వంలో రాష్ట్ర బంద్, నిజాం కాలేజి గ్రౌండ్‌లో మీటింగ్ జరిగింది. గుజరాత్ గాయంపై ఏడాదిపాటు సంఘీభావ సభలు జరిగినవి. ఎఐఎల్ఆర్‌సి మొట్టమొదటి నిజ నిర్ధారణ జరిపి దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టింది.


ఇంద్రవెల్లి బాధితుల మధ్యన నిలిచిన పీపుల్స్‌వార్ పోరాటం దండకారణ్యానికి విస్తరించి దండకారణ్య పర్‌స్పెక్టివ్ అమలు చేయడంతో అది జనతన రాజ్య ప్రయోగానికి దారితీసింది. దళిత పాంథర్స్ (మహారాష్ట్ర) పోలిన కారంచేడు దళితుల ఆత్మగౌరవ కుల నిర్మూలన భూస్వాధీన పోరాటాలకు ప్రతీక అయింది.

ఇంక 1995 లోనయితే పీపుల్స్‌వార్ స్పెషల్ కాన్ఫరెన్స్‌లో పార్టీ ఇంతకాలం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అభివృద్ధి నమూనాను విధ్వంసకరమైందని ప్రతిఘటిస్తున్నది కాని ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను మనకు బలమున్న చోట చేసి చూపాలని దండకారణ్యంలో, ఉత్తర తెలంగాణలో గ్రామ రాజ్య కమిటీలు నెలకొల్పి దాని రాజకీయ దర్శకత్వంలో ప్రజల నుంచి అభివృద్ధి కమిటీలను వందలాది గ్రామాల్లో నెలకొల్పి ఎన్నో అభివృద్ధి కార్యకలాపాలను గడ్డివేళ్ల స్థాయి నుంచి ప్రజల శ్రమ, సహకారాల ప్రాతిపదికగా ఏర్పాటు చేసింది. 1999 డిసెంబర్ 2న కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో అమరుడు కావడం కన్నా ముందు ఈ ప్రత్యామ్నాయ గ్రామ రాజ్య కమిటీ రూపకర్తల్లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఎపి కమిటీ కార్యదర్శి మహేశ్ (ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి)తో పాటు ఒకడైన శ్యాం (నల్లా ఆదిరెడ్డి) స్వయంగా కొన్ని నెలల పాటు నిజామాబాద్, వరంగల్ మొదలైన ఉత్తర తెలంగాణ జిల్లాలలో పర్యటించాడు. నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన ఇటువంటి అభివృద్ధి కార్యక్రమంలో మద్దిమల్ల గ్రామంలో నైజాం కాలంలో గండిపడిన చెరువు గండి పూడ్చి కట్టను పెంచి వేల ఎకరాల భూమిని సాగులోకి తేవడంతో ఆ చెరువుకింది గ్రామాల ప్రజలు ఆరు వందల మంది ఆరు నెలల పాటు స్వచ్ఛంద శ్రమ సహకారాలతో కోట్ల రూపాయల నిర్మాణం పూర్తి చేసి వేలాది మంది ఆ చెరువు కట్ట కింద చేసుకున్న సామూహిక భోజనాల కార్యక్రమం గురించి ఆ రోజుల్లోనే అరుణతారలో రిపోర్టు కూడ వచ్చింది. ఈ పర్యటనలో చివరి పాదంగా వరంగల్ జిల్లాలో ఉన్నపుడు రాజకీయాలు కమాండ్ (ఆదేశిక పాత్ర)లో లేకపోతే సంస్కరణలు ఆర్థికవాదం అవుతాయి అనే విలువయిన రిపోర్టును, స్వీయ విమర్శ లాంటి దాన్ని శ్యాం రాసాడు. కనుక వనజ రాసినట్లు సహాయ కార్యక్రమాలు దాతృత్వం, ఆశ్రితత్వం (బిచ్చమేసే వాళ్లు, బిచ్చం ఆశించేవాళ్లు)గా కాకుండా ప్రజల మౌలిక హక్కుగా మనుషుల్ని మనుషులుగా నిలబెట్టేదిగా విప్లవకారులు భావిస్తారు.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

రొమిలా థాపర్ అసమ్మతి స్వరం

- కొప్పర్తి వెంకటరమణ మూర్తి



ప్రశ్నించడమూ, అసమ్మతి తెలియచెయ్యడమూ, విభిన్నమైన గొంతును వినిపించడమూ నేరమౌతున్న కాలంలో, పాశ్చాత్య దేశాల నుంచే అసమ్మతి దేశంలోకి ప్రవేశించిందని, అంతకు ముందు అసలది ఇక్కడ లేనేలేదని బుకాయిస్తున్న కాలంలో ఆ వాదనని సాధికారికంగా పూర్వపక్షం చేశారు ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ తన కొత్త పుస్తకం 'వాయిస్ ఆఫ్ డిసెంట్'లో. పరిచయం అవసరం లేని ఈ ప్రజా మేధావి ప్రజాస్వామ్యానికీ, లౌకికత్వానికీ భంగం వాటిల్లిన అనేక సందర్భాలలో తన తిరుగుబాటు స్వరంతో పతాక శీర్షికల్లో నిలిచారు. మళ్లీ ఇప్పుడు అక్టోబర్ 2020లో మనదేశంలో విడుదలై మార్చ్ 2021లో అంతర్జాతీయ మార్కెట్‌లో విడుదల కాబోతున్న నూట డెబ్బై ఐదు పేజీల ఈ సుదీర్ఘ వ్యాసంలో భారతదేశ చరిత్ర పొడవునా వినిపించిన అసమ్మతి స్వరాలను సోదాహరణంగా ఉపపత్తులతో నిరూపించారు. ఎవరో ప్రవేశించేవరకూ ఇక్కడ అసమ్మతి లేదంటూ దీన్నొక అఖండ సంస్కృతిగా చిత్రీకరిస్తూ ఇప్పుడు కూడా అసమ్మతిని రూపుమాపడానికి జరుగుతున్న ప్రయత్నాల మీద అసమ్మతి అస్త్రంగా ఈ వ్యాసాన్ని ప్రయోగించారు.

ఆమోదం పొందిన భావనలు, సిద్ధాంతాలు, సంప్రదాయాలు, నమ్మకాల పట్ల అసమ్మతి అన్ని సమాజాల్లోనూ, నాగరికతల్లోనూ ఉందనీ, అది మరీ ముఖ్యంగా జ్ఞానాన్వేషణలో, తాత్విక దృక్పథంలో స్పష్టంగా కనిపిస్తుందనీ అంటారు ఈ జెఎన్‌యు ఎమిరిటస్ ప్రొఫెసర్. ఇందుకు భారతదేశం మినహాయింపు కాదని అంటూ భారతీయ చింతనలో అది సమ్మిళితమై తద్వారా దాన్ని సంపద్వంతం చేసిందని కూడా అంటున్నారు. అసమ్మతి చైతన్యమూ అది నిర్వహించిన పాత్రా భారత చరిత్ర అధ్యయనంలో తగినంత గుర్తింపు పొందలేదని అంటున్న ఈ క్లుగ్ బహుమతి విజేత తన తొలినాళ్ల పరిశోధనల్లో రేఖామాత్రంగా చోటు చేసుకున్న ఈ అంశానికి ఈ వ్యాసంలో నిర్దిష్ట రూపాన్నివ్వడం ద్వారా వర్తమానంలోని అసమ్మతికి ఉపోద్ఘాతం భారతీయ గతంలో ఉన్నదని చెప్పదలిచానంటున్నారు.

థాపర్ అభిప్రాయంలో ఒక వ్యక్తి కానీ, ఒక సమూహం కానీ తమ మీద ఆధిపత్యం చెలాయించే లేదా తమ జీవితాల్ని ప్రభావితం చేసే వ్యవస్థల పట్ల వాటి విధివిధానాల పట్ల అనంగీకారమూ లేదా అసంతృప్తి కలిగి ఉండడమే అసమ్మతి. అసమ్మతి కొత్త భావన కానే కాదు, కానీ దాని అనేక పార్శ్వాలని గుర్తించడం కొత్త. నిజమైన ప్రజాస్వామిక సమాజంలో ఆ ప్రక్రియ నిరాకరింపబడదు. ప్రశ్నించే హక్కును ఇప్పుడైతే ప్రతీ పౌరుడూ ఉపయోగించుకో గలుగుతున్నాడు కానీ, గతంలో అది బలవంతులు మాత్రమే పొందగలిగినది. ఆధునిక సమాజాల్లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగంగా పౌరులందరికీ ఈ హక్కు ఉండాల్సి ఉంది. అయితే ఈ ప్రశ్నించే హక్కే చరిత్రలో నిరంతరం ప్రశ్నించబడింది. నిరాకరింప బడింది. మనమెంత కాదనుకున్నా భారతీయ సమాజం చరిత్ర పొడవునా వైరుధ్యాలు లేని అద్భుత సామరస్యంతో ఏమీ మనలేదు. మనకూ మన భాగం అసహనం, హింస, భావ సంఘర్షణ ఉన్నాయి. అసమ్మతి స్వరాల సంఖ్య, విస్తృతి కూడా మనం అంగీకరించడానికి సిద్ధంగా ఉన్న దానికన్నా ఎక్కువే ఉంది.

చారిత్రకంగా సామాజిక సంబంధాలు భూమి, సంపద, కర్మకాండలు, మొదలైన అధికార కేంద్రాలను చేజికించుకున్న వర్గాలకూ వాటిని దక్కించుకోలేని వర్గాలకూ నడుమ నెలకొని ఉండేవి. ఉదాహరణకు రాజు – ప్రజలు, భూస్వామి – రైతు, ఫాక్టరీ యజమాని – ఉద్యోగి, వలసాధిపతి – వలస ప్రజ ఇట్లా. అయితే రెండు వందల సంవత్సరాల క్రితం పారిశ్రామికీకరణ, పెట్టుబడిదారీ విధానం, మధ్యతరగతి ఆవిర్భావం, కార్మికవర్గ అవతరణల పర్యవసానంగా ఒక చారిత్రక పరిమార్పు సంభవించి నూతన సమాజం అవతరించింది. ఈ పరిమార్పుకు ప్రజలు తామంతా ఒక జాతికి చెందినవారమనే జాతీయ భావం ప్రోద్బలం చేసింది. ఈ జాతీయతలో ఇమిడి ఉన్న మూలకం పాత వ్యవస్థను విచ్ఛిన్నం చేసి ప్రజలందరు పౌరులు అనీ, వాళ్లంతా కలిసి సృష్టించుకున్న రాజ్యం అనీ రెండు కొత్త వ్యవస్థల్ని నిర్మించింది. వాటి మధ్య సంబంధాలే సామాజిక గమన సూత్రాలయ్యాయి. రాచరికాలు పడిపోయి ప్రజాస్వామ్యాలు ఏర్పడడం ఈ చారిత్రక దశలో ముఖ్య ఘట్టం. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలలోనూ ప్రతి పౌరుడికీ సమాన హక్కుతో ప్రాతినిధ్యం ఉండడం వల్ల అవి లౌకికంగా మాత్రమే ఉండగలవు. ఈ లక్షణం లౌకికత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ, జాతీయతనీ ముప్పేటలా ముడివేస్తుంది. నిజమైన ప్రజాస్వామ్యంలో అసమ్మతి ప్రకటించే హక్కు, సామాజిక న్యాయాన్ని కోరే హక్కు కేంద్ర బిందువులుగా ఉంటాయి.

అసమ్మతి పాశ్చాత్యుల రాకతోనే దేశంలోకి ప్రవేశించిందంటారు కొందరు. ఈ వాదన చేసే వారి దృష్టిలో భారతీయ గతం అపవాదాలకు అతీతమైంది. అందువల్ల అక్కడ అసమ్మతి లేదు, ఉండదు. అదొక అద్భుతమైన నాగరికత. ఉత్కృష్టమైన సంస్కృతి. వారిది వెల కట్టలేని ఘనత. అది దోష రహితం. సర్వజన సమ్మతం. దాని మూలాలన్నీ ఆ నేలలోనే ఉన్నాయి. దాని జ్ఞాన వ్యక్తీకరణ అంతా ఆ ఒక్క భాషలోనే జరిగింది. ఆ ఏకైక మతమే దానికంతటికీ ఒక అస్తిత్వాన్నిచ్చింది. ఆ న్యాయస్మృతే ఆ వ్యవస్థకొక నిర్మాణాన్నిచ్చింది.

అయితే మరికొందరు. ఏకశిలాసదృశ్యమైన ఈ అభిప్రాయాన్ని ఖండించి, సవాళ్లనూ, అసమ్మతినీ ఎదుర్కొనకుండా ఏ నాగరికతా వికసించలేదని ప్రతిపాదించారు. అసమ్మతిని ఎంత లోచూపుతో అర్థం చేసుకుంటే సమ్మతి అంత సమగ్రంగా అర్థమౌతుందన్నారు. వీటికి పేరు పెడుతూ సమ్మతిని 'నేను' (ది సెల్ఫ్) అనీ, అసమ్మతిని 'ఇతరులు' (ది

అదర్) అనీ అన్నారు థాపర్. ఈ మొత్తం వైనాన్ని విశదం చెయ్యడానికి మతానికి, సమాజానికి ఉన్న సంబంధాల మీద 'నేను'కు 'ఇతరుల'కు ఉన్న వైవిధ్యాన్ని అంచనా వెయ్యడానికి కొన్ని ఉదాహరణలను వివరించారు ఈ వ్యాసంలో. ఇందుకు హింసాత్మకం వైపు పోకుండా అహింసాపూర్వక సంఘటనలను ఎంచుకున్నట్లు చెప్పారు.

కొందరిని ఇతరులుగా గుర్తించడం వల్ల కొందరికి కొన్ని ప్రయోజనాలు ఉంటాయి. వారిని అంచుల అవతలకి నెట్టేయవచ్చు. నిషేధిత ప్రాంతాలకూ అవసరమైతే దేశాంతరవాసానికీ పంపవచ్చు. దేశ పౌరసత్వాన్ని నిరాకరించవచ్చు. కొందరిని ఇతరులుగా చూడడమనేది గతంలో లేకపోలేదు. మన నాగరికతలన్నీ రకరకాల పోగులతో అల్లిన దారాలే. ఆ పాయలలో కొన్ని సంస్కృతిలోనే పుట్టినవైతే మరికొన్ని వలసల రూపంలో బయటి నుంచి వచ్చి చేరినవి. కాగా రాజ్యాన్నీ, దేశాన్నీ కాదని ఇతర ప్రాంతాలకు తరలివెళ్లి స్థాపించుకున్న వలసలూ ఉన్నాయి. ఈ క్రమంలో 'నేను' 'ఇతరుల' స్థితులు స్థాన భ్రంశం చెంది ఉండవచ్చు కానీ అసలంటూ లేకపోలేదు అంటున్నారు థాపర్.

ఇందుకు థాపర్ ఆధునిక యుగ పూర్వ చరిత్ర నుంచి ఒక్కో సహస్రాబ్దికి ఒక్కో ఉదాహరణగా మూడింటినీ, ఆధునిక యుగం నుంచి రెండింటినీ తీసుకున్నారు. దీని విస్తృతి దాసి పుత్ర సమస్య దగ్గర మొదలై షహీన్‌బాగ్ ఉద్యమం దాకా సాగింది. ఇందులో గాంధీ సత్యాగ్రహాన్ని ఒక ప్రధాన అసమ్మతిగా గుర్తించి విశ్లేషించారు. ఆ ఉదాహరణలని సంక్షిప్తంగా చూద్దాం.

మొదటిది క్రీ.పూ. రెండవ సహస్రాబ్దికి చెందింది. ఇది భిన్న సంస్కృతికి చెందిన దాసి పుత్రుడు బ్రాహ్మణుడు కావడం గురించి. అప్పటి ప్రబల మతం వేదానుగుణంగా బ్రాహ్మణుల చేత నడుపబడుతూ వారికి మాత్రమే ఆ నిర్వహించే హక్కును దఖలు పరిచింది. ఇప్పటీ కొందరి అభిప్రాయంలో అప్పటికి ఒకే సంస్కృతి నెలకొని ఉండేది. కానీ, రుగ్వేదం ఆర్యులు కాక దాసదస్యులు అనే భిన్నమైన ప్రజల్ని పదేపదే ప్రస్తావించింది. ఎవరీ దాసులు? వీళ్లు ఆర్య భాష సంస్కృతం మాట్లాడలేని ఇతరులు. అమానుషులు. రాక్షసులు. యజ్ఞ యాగాలను చెయ్యరు. ఇతర దేవతలను పూజిస్తారు. విగ్రహారాధకులు. లింగ పూజ చేస్తారు. వారికి తాంత్రిక విద్య తెలుసు. వారంటే అయిష్టం. కొంచెం అసూయ. వారిలో కొందరికి పశుసంపద ఉంది. పురాలు ఉన్నాయి. ఇంతకీ ఎవరీ దాసులు? గుర్తించడం కష్టం కానీ, పురావస్తు పరిశోధనలు వైవిధ్య భరిత సంస్కృతుల మూలాలను బహిర్గతం చేస్తున్నాయి. వేద సంచయాన్ని అనుసరించి చూస్తే దాసులు స్థానికులనీ, దేశంలోకి ప్రవేశించి నిలదొక్కుకున్న ఆర్యులతో వీరికి సంపర్కం కుదిరి సామాజిక విభజన జరిగిందని అర్థమౌతుంది. ఆధిక్యం ఉన్నవాళ్లూ, ధనికులూ ఆర్యులలో కలిసిపోగా పేదలు సేవలకు పరిమితమయ్యారు. దాస స్త్రీలు ఆర్య గృహాలలో దాసీలయ్యారు. సంఘర్షణల్లో పట్టుబడినపుడు భార్యలయ్యారు. బానిసలయ్యారు. ఈ సందర్భంగానే 'దాసి పుత్ర బ్రాహ్మణుడు' అనే మాట వినిపిస్తుంది. రుగ్వేదంలో కొన్ని రుక్కులు రాసిన రుషి కక్షివంతుడు దీర్ఘతమస్సుడనే బ్రాహ్మణుడికీ ఉషిజ అనే దాసి భార్యకు జన్మించాడు. ఐతరేయ బ్రాహ్మణాన్ని అనుసరించి రుషి కావశ ఐలూషుడు దాసి పుత్రుడు. సోమ క్రతు నిర్వహణకు అనర్హుడిగా ప్రకటింపబడ్డాడు. అతను నిర్గమిస్తూ కొన్ని శ్లోకాలను గానం చేసే సరికి సరస్వతి అతని వెంట ప్రవహించింది. బ్రాహ్మణులు అతన్ని దేవతలకు ప్రియమైన వాడిగా గుర్తించి తమలో కలుపుకున్నారు. సత్యకామ జాబాలి కథ ఉండనే ఉంది. ఇవన్నీ సమ్మతి, అసమ్మతి సంస్కృతుల మధ్య జరిగిన సంభాషణలకు నిదర్శనాలు. 'ఇతరులు' 'నేను'లో మిళితమైన సందర్భాలు.

రెండవ ఉదాహరణ క్రీ.పూ. మొదటి సహస్రాబ్దికి చెందింది. ఇది అస్తిత్వంలో ఉన్న ఒక 'నేను'కు ప్రత్యామ్నాయంగా అందులో నుంచే 'ఇతరం' ఆవిర్భవించి, ఆదరణ పొంది అదే నేనుగా మారినపుడు అందులో నుంచే దానికి అనేక ఇతరాలు ఆవిర్భవించడం, చివరికి మొదటి నేను ఇతరంను అనుకరించి నూతన నేనుగా నిలదొక్కుకోవడం ఇక్కడి కథాంశం. ఇక్కడ తొలి నేను వైదిక మతం. ఇతరులు శ్రమణులు. వారి నుంచి పుట్టిన ఇతరులు ఆయా మత శాఖలు. చివరికి నేనుగా నిలదొక్కుకున్న మొదటి నేను మారిన రూపమే పౌరాణిక హిందూమతం. జైనులు, బౌద్ధులు, అజీవికులు అందర్నీ కలిపి శ్రమణులన్నారు. చార్వాకుల్ని కూడా కొందరు వీరిలో కలుపుతారు. వీళ్లంతా వైదిక బ్రాహ్మణ మతాన్ని నిరసించారు. వారి దేవతల్ని ప్రశ్నించారు. యజ్ఞ నిర్వహణను ఖండించారు. వైదిక సాహిత్యం వీళ్లని నాస్తికులనీ, అవిశ్వాసులనీ నిందించింది. బ్రాహ్మణేతర మతాల వారిని శతాబ్దాల పాటు నాస్తికులనే అన్నారు కదా. శ్రమణ మతాలు అగ్ర వర్ణాలకెంత అవకాశం కల్పించాయో నిమ్నవర్ణాలకూ అంతే అవకాశం కల్పించాయి. కర్మకాండల ప్రాధాన్యత తగ్గించబడింది. వాటి నిర్వహణలో వర్ణ గుత్తాధిపత్యం రద్దు చేయబడింది. సమ్మతి అసమ్మతుల నడుమ స్పర్ధ ఉచ్ఛ స్థితి నందుకున్నట్లు ఆధారాలు చెబుతున్నయ్. గ్రీకు రాయబారి మెగస్తనీస్ దేశంలో ఏడు కులాలు ఉన్నాయంటూ బ్రాహ్మణుల్నీ, శ్రమణుల్నీ అగ్రస్థానంలో నిలబెట్టాడు. శ్రమణుల్ని తాత్వికులన్నాడు. అశోకుడి శాసనాలు పదే పదే బ్రాహ్మణ, శ్రమణ సామరస్యాన్ని కాంక్షించాయి. పతంజలి బ్రాహ్మణ, శ్రమణ వైరాన్ని పాము ముంగిస వైరంతో పోల్చాడు. ఇక్కణ్నుంచీ మొదలై 'నేను'ను త్రోసి రాజని 'ఇతరులు' దూసుకెళ్లారు. శ్రమణ మతాలు రాజాదరణ, వర్తకాదరణ, చివరికి ప్రజాదరణ పొందాయి. శ్రమణులు తమ నిష్టతో ప్రజల నమ్మకం పొందారు. వారి స్థూపాలు, విహారాలు, ఆరామాలు నిర్మితమై మోక్ష కేంద్రాలయ్యాయి. వైదికం వెనక్కు తగ్గింది. సమ్మతి నుంచి పుట్టిన అసమ్మతి సమ్మతి స్థాయినందుకున్న అరుదైన సందర్భమిది. శ్రమణుల్లో బలమైన విభాగాలు తమను అనుసరించిన వారి రాజకీయాల్లో జోక్యం చేసుకున్నాయ్. సమాజం నుంచి తమను తాము దూరం చేసుకున్న పరిత్యాగులు మళ్లీ తిరిగి సమాజ సంక్షేమానికి పాటుపడడం అప్పుడు మొదలై ఇప్పటికీ కొనసాగుతోంది.

ఆకాశంలోకి విసరబడిన రాయి ఉచ్ఛదశనందుకున్నాక కింద పడడం మొదలైనట్లు శ్రమణ మతాల పతనం ప్రారంభమైంది. అసమ్మతి మతాలలోకి సమ్మతి లక్షణాలు ప్రవేశించి అందులో నుంచి 'ఇతరులు' బయలుదేరారు. బౌద్ధం హీనయాన మహాయానాది తెగలుగా విడిపోయింది. జైనమూ ముక్కలయ్యింది. శ్రమణుల నిష్ఠ సందేహాస్పదమైంది. ఈ నేపథ్యంలో వైదిక మతం శ్రమణ మతాల స్ఫూర్తితో మొదట భాగవత మతంగా, క్రమంగా శైవ వైష్ణవాల రాకతో పురాణ లేదా పౌరాణిక మతంగా మార్పు చెందింది. పౌరాణిక మతంలో చాలా శ్రమణ లక్షణాలు చేరాయి. పురాణమత మూల గ్రంథాలైన పురాణాలు మొదట సులభ సంస్కృతంలో, తర్వాత్తర్వాత స్థానిక భాషల్లో రాయబడ్డాయి. వేదాల మాదిరి కాకుండా ఇవి అన్ని వర్ణాల ప్రజలకు వినిపించబడ్డాయి. వైదిక కాలానికి భిన్నంగా విగ్రహారాధనను అంగీకరించాయి. దేవాలయ నిర్మాణం ప్రారంభమైంది. ఇవన్నీ శ్రమణ సంప్రదాయ స్ఫూర్తితో జరిగిన పరిణామాలే! అసమ్మతి ప్రభావంతో సమ్మతిలో మార్పులు జరుగుతాయనడానికి ఇది ఉదాహరణ. విశాలమైన

భూములూ, భూరి విరాళాలూ అందుకున్న శ్రమణులు 'ఇతరులు'గా నిర్వర్తించే పాత్రను విస్మరించారు. క్రమంగా రాజాదరణ శ్రమణ మతాల నుంచి పౌరాణిక మతం వైపు మళ్లింది. ఈ దశలోనే వర్తక వాణిజ్యాల పతనంతో వ్యాపార వర్గాల ఆదరణ పొందిన శ్రమణ మతాలు క్షీణదశ పట్టాయి. అవిప్పుడు ఏ మాత్రమూ అసమ్మతి మతాలు కావు. అందులో నుంచే అనేక చిన్న చిన్న అసమ్మతులు పుట్టాయి. క్రమంగా పౌరాణిక మతమూ అందుకు మినహాయింపు కాలేకపోయింది. శైవ, వైష్ణవ, శాక్త, శక్తి, కాపాలిక, పాశుపత అంటూ చీలింది. ఫలితం అందరికీ ఆమోద యోగ్యమైన ఏకైక మతం కానీ, ఏకైక పవిత్ర గ్రంథం కానీ లేకపోవడం. ఏది ఏమైనా ఇది సమ్మతి, అసమ్మతుల మధ్య శతాబ్దాల పాటు సుదీర్ఘంగా జరిగిన సంభాషణ. ఇందులో ఎవరెంత ఇచ్చిందీ, పుచ్చుకున్నదీ తేల్చడం కష్టం. యుగం పొడవునా సమ్మతి, అసమ్మతి ఉండడం మాత్రం వాస్తవం.

ఇతరత్వం అనేది అన్ని సార్లూ 'నేను' మీద తిరుగుబాటు కాకపోవచ్చునంటారు థాపర్. ఒక్కోసారి 'నేను' ఉద్దేశపూరితంగా 'ఇతరుల్ని' సృష్టిస్తుంది. చాలా సమాజాలు కొందరిని సేవకులుగా మార్చుకోవడానికి ఈ పద్ధతిని పాటిస్తాయి. వారిని లొంగదీసు కోవడానికీ, సేవకత్వంలోకి నెట్టడానికీ, లేదా బహిష్కరించడానికీ ఉద్దేశిస్తాయి. వారికి స్వేచ్ఛ, హక్కులు లేకుండా చేస్తాయి. ఇట్లా సృష్టించబడిన సామాజిక అంతరం అసమ్మతిగా పరిణమిస్తుంది. ఈ తరగతికి చెందినవారే నిమ్న కులస్థులు, అంటరానివారు, ఆదివాసీలు అంటున్నారు ఈ వ్యాస రచయిత్రి.

మూడవ ఉదాహరణ క్రీ.శ. రెండవ సహస్రాబ్దికి చెందింది. క్రీ.శ. 15, 16 శతాబ్దాలకు చెందిన ఈ పరిణామంలో అనేక సమ్మతులూ, అనేక అసమ్మతులూ ఉన్నాయి. ఇది భారతదేశ మత చరిత్రలో ఒక గొప్ప ఘట్టం. మతానికీ, సమాజానికీ జరిగిన అపూర్వ సంభాషణ. సమాజం అనేక సంస్కృతులతో సమ్మిళితమైన ఈ సందర్భం బోధనల్లో, పద్యాల్లో, గీతాల్లో, గానాల్లో ప్రతిఫలించింది. భక్తి, సూఫీ ఉద్యమాల పేరిట ఉపఖండమంతా విస్తరించిన ఈ చైతన్యంలో సంత్‌లని, పీర్‌లని పిలువబడిన మతగురువులదే ప్రధాన పాత్ర. వీళ్లంతా అప్పటికి అస్తిత్వంలో ఉన్న ప్రధాన మతాలైన పురాణ హైందవానికీ, ఇస్లాంకీ ఇతరులు. దీనికి దేశంలోనే రూపుదిద్దుకుంటున్న తాత్విక చింతన కొంత కారణమైతే, మధ్య ఆసియా, పర్షియాల నుంచి వచ్చిన ఆలోచనలు కొంత కారణమయ్యాయి. మొత్తం మీద మత సామాజిక రంగాల మీద దేదీప్యమానమైన వెలుగు ప్రసరించిందీ యుగంలో.

ఒకేసారి అనేక నేనులు, అనేక ఇతరాలు ఉన్న కాలంలో ఈ వేర్వేరు విశ్వాసాలకు సౌకర్యం కోసం హిందూ అనీ, ముస్లిం అనీ సార్వత్రిక ఉల్లాకు (లేబుల్) లంటించబడిన దశ ఇది. కలగాపులగమైన మూలాల నుంచి వచ్చిన విశ్వాసాలను ఆ రెండు మతాలుగా ముడిపెట్టే వేగిరపాటులో వాటి మధ్య ఉన్న సున్నితమైన వైరుధ్యాలను, సందిగ్ధతలను, మార్మికతను విస్మరించిన స్థితి ఇది. బ్రాహ్మణాధిక్యతతో, భారీ దేవాలయాలతో, అపారమైన సంపదతో రాజకీయంలో, సమాజంలో జోక్యం చేసుకోగలిగిన ఆధిక్యతతో అలరారుతున్న పురాణ హైందవం సమ్మతి అయితే, ప్రధానంగా మధ్యస్థాయి కులాల నుంచి లేదా అవర్ణాల నుంచి వచ్చిన కబీరు, దాదు, రవిదాస్, చోఖమేళ, చైతన్యుడు, నానక్ వంటి సంత్‌లు ఒక ప్రధాన దేవత లేక అమూర్త భావన కేంద్రాలుగా కర్మకాండలకన్న భక్తి కలిగి ఉండడమే ప్రధాన లక్షణంగా భక్తి ఉద్యమం పేరిట సాగించిన తాత్విక తిరుగుబాటు ఈ యుగ అసమ్మతి. ప్రధాన ఇస్లాం శాఖలు సమ్మతి అయితే, నమాజ్ మీద, హజ్ యాత్రల మీద, ఉపవాసాల మీద అవిశ్వాసంతో అహింస, భక్తి, సంయమనం వంటి లక్షణాలను అందిపుచ్చుకున్న సూఫీతత్వం మరొక అసమ్మతి. ఈ రెండింటి మూలాలు ఒకనాటి శ్రమణ సంస్కృతిలో ఉన్నట్టు అనిపిస్తుంది. భక్త సంత్‌లు గానీ, సూఫీ పీర్‌లు గానీ కొత్త మతాల్ని స్థాపించలేదు. వాళ్లు మతాన్నీ, తత్వాన్నీ ఆధిపత్య వర్గాల నుంచి విముక్తి చేసే ప్రయత్నం చేశారు. కుల వివక్షను తోసిపుచ్చారు. తమ శిష్యులు ఏ మతానికి చెందిన వారనే విషయాన్ని గణించలేదు. ప్రజల భాషలో గొంతు విప్పారు. కబీరుకు దైవం రూపరహితం. నానక్‌కూ అంతే. కొందరికి కృష్ణుడు. రవిదాస్ స్వప్నం సామాజిక అసమానతలులేని ఒక నగరం. కశ్మీర్‌కు చెందిన లాల్ దేద్ బోధనలు నంద రుషి అని పిలువబడిన షేక్ నూరుద్దీన్ అనే సూఫీ కవిని ప్రభావితం చేశాయి. నానక్ భావనల మీద సూఫీ గురువు బాబా ఫరీద్‌తో పాటు కబీరు, రవిదాస్‌ల ప్రభావం కూడా ఉంది. ఈ ఆదాన ప్రదానాలూ, అంతర్నిహిత చైతన్యాలూ ఈ యుగ భావనల్ని ఉద్దీపింప చేశాయి. ఇవి వర్తమానంలో తలెత్తిన అనేక ప్రశ్నలకు సమాధానాలు సూచిస్తున్నాయి. ఇందులో రాధ కేంద్రంగా సాగిన రాధాకృష్ణ భక్తి సంప్రదాయం స్త్రీ అస్తిత్వాన్ని గుర్తించింది. లాల్ దేద్, మీరాబాయ్ వంటి మహిళా బోధకుల్ని అంగీకరించడం కూడా అంత తేలికగా జరగలేదు. అది అటుంచితే, బుల్లేషా, మాలిక్ మహమ్మద్ జైసీ, సయ్యద్ ముబారక్ ఆలి బిల్ గ్రామీ వంటి వారు తమ కృష్ణ భక్తిని ప్రదర్శిస్తూ అద్భుతమైన గీతాలు రాశారు. అవి ఇప్పటికీ హిందూస్తానీ సంగీత కచేరీలలో, నాట్య ప్రదర్శనల్లో గానం చేయబడుతూనే ఉన్నాయి. వీళ్లని ఆధునిక చరిత్రకారులు ముస్లిం వైష్ణవులని అన్నారు గానీ, వీరు మాత్రం తమను కృష్ణ భక్తులుగానే పిలుచుకున్నారు. భారతీయ సంస్కృతికి ఇస్తున్న సమకాలీన సంకుచిత నిర్వచనం కన్న ఇది భిన్నమైంది. అట్లాగే, మొఘల్ రాజపుత్ర సంబంధాలు కేవలం రాజకీయమైనవి కావు. ఇండో పర్షియన్ లేదా మొఘల్ రాజపుత్ర శిల్పకళా శైలీ సమ్మేళనంతో నిర్మించబడిన బృందావనంలోని గోవింద దేవుని ఆలయం ఇందుకు ఉదాహరణ. ఈ దేవాలయ నిర్వహణకు రెండు వర్గాల నుంచి లభించిన ఆదరణలో రాజకీయాలను మించిన ఆత్మ సంలీనం ఏదో ఉంది. అది అట్లా ఉంచితే ఈ దశలో పురాణ హైందవం స్వయం ప్రతిపత్తి శాఖలుగా ఎదగగలిగిన కొన్నింటిని తనలో విలీనం చేసుకుంది. ఒడిశాలో జగన్నాథ ఆరాధన, మహారాష్ట్రలో విఠల భక్తి, సింధ్‌లో హింగ్లజ్ మతం, సుందర్బన్ బోనీబీబీ భక్తి ఈ కోవలోనివే. ఇవన్నీ పురాణ హిందూ మతంలోకి అతుకులుగా కుట్టబడ్డాయి. ఇవి స్థానిక మతాలుగా తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటూ కొన్ని సందర్భాల్లో పురాణ వాచకాల కన్న భిన్నమైన గొంతును వినిపించాయి.

ఇక మహమ్మదీయులు ఇస్లాం మత అనుయాయులుగా ఎప్పుడూ ఇతరులుగానే చూడబడడం గురించి. నిజానికి ఈ రెండు మతాల మధ్య సమ్మతి అసమ్మతి, సర్దుబాటు తిరుగుబాటుల స్వరూపం మనం అనుకున్న దానికన్నా సంక్లిష్టంగా ఉంది. ఇస్లాంతో సంబంధం ఉన్న వారినందరినీ మనం ఇప్పుడు గంపగుత్తగా ముస్లింలు అంటున్నాం కానీ, అప్పట్లో అట్లా పిలవలేదు. సంస్కృతంలోనూ, ఇతర భాషల్లోనూ ఉన్న ఆధారాలు వీరిని యవనులుగా, శకులుగా, తురుష్కులుగా ప్రస్తావించాయి. అవి జాతి సంబంధమైన పేర్లే గానీ మత సంబంధమైనవి కావు. విశేషం వీటికి పూర్వ చరిత్రలతో కూడా లంకెలుండడం. యవనులు అని మొదట పశ్చిమం నుంచి వచ్చిన గ్రీకులను అన్నారు. తర్వాత పశ్చిమం నుంచే

వచ్చిన అరబ్బులు మొదలుకుని అందర్నీ, చివరికి విక్టోరియా మహరాణినీ కూడా అదే పేరుతో పిలిచారు. ప్రాచీన శకులు మధ్య ఆసియా నుంచి వచ్చారు. తురుష్కులదీ మధ్య ఆసియాయే. రాజతరంగిణి రాసిన కల్హనుడు శకులైన కుషాణుల్ని తురుష్కులనే ప్రస్తావించాడు. కాబట్టి అటు నుంచి వచ్చిన అరబ్బులు, ఆఫ్ఘనులు, టర్కులు, మొఘలులు యవనులుగా పిలువబడి తొలినాటి యవనుల వారసులుగానే గుర్తించబడ్డారు. చారిత్రకంగా కూడా అందులో కొంత సత్యం లేకపోలేదు. ఇస్లాం కన్నా ముందు నుంచే అరబ్బులు పశ్చిమ తీరాన వ్యాపారం చేశారు. వారినే మనం ఇప్పుడు ముస్లింలు అంటున్నాం. అక్కడ స్థిరపడిన వీరు స్థానిక ప్రజలతో వివాహ సంబంధాలు నెలకొల్పుకున్నారు. రాష్ట్రకూటుల ఆస్థానాల్లో పనిచేశారు. బ్రాహ్మణులకు దానాలిచ్చారు. వారికి స్థానిక హిందూ జైన సంస్కృతులతో మేళవింపు జరిగింది. ఫలితంగా ఆవిర్భవించిన వాళ్లే పశ్చిమ భారతంలో బోహ్రాలు, ఖోజాలు, కేరళలో మోప్లాలు, దక్షిణ కొసన నవయతులు. అయితే సవర్ణ అవర్ణ భేదాలు ఇస్లాంలోకి మారిన వారిలోనూ, శిక్కులలోనూ కొనసాగాయి. వీళ్లంతా ప్రధాన మతాల నుంచి వీలైనంత దూరంగా ఉంటూ తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించినవాళ్లే. కాగా పదహారవ శతాబ్దికి చెందిన సంస్కృత పండితుడు మధుసూదన సరస్వతి దేశంలో వివిధ తాత్విక చింతనలని బౌద్ధులు, జైనులు, తురుష్కులు అంటూ ప్రస్తావిస్తూ తనని బ్రాహ్మణుడిగా ప్రస్తావించుకున్నాడు గానీ, హిందువుగా కాకపోవడం గుర్తించదగిన అంశం. ఇక భక్తి సూఫి తత్వవేత్తల కలయిక మరొక అంశం. భక్తి ప్రధాన అంశం కావడం, వారిలో కొందరు భగవంతుణ్ణి రూప రహితంగా ఆరాధించడం వీరిని దగ్గరకు చేర్చింది. అసలు విషయం ఇద్దరూ ఆయా ప్రధాన మతాలకు 'ఇతరులు' కావడం. మధ్య ఆసియా నుంచి వచ్చిన సూఫీయిజంలో అంతకుముందే అక్కడకు చేరిన బౌద్ధమత మూలాలుండడం.

ఆధునిక యుగారంభంలో బ్రిటిష్ వలసవాదుల దృక్పథం ఈ పరిస్థితిని పూర్తిగా మార్చివేసిందంటారు ఈ చరిత్రకారిణి. అన్నింటినీ ఒక్కతాటి మీదకు తెచ్చే ప్రయత్నంలో భాగంగా ఇస్లాం, క్రైస్తవ, జొరాష్టర్ మతాలు మినహా మిగిలిందంతా హైందవంగా ముద్రవేయ బడిందనీ, ఈ క్రమంలో రకరకాల అసమ్మతులు విలీనం చేయబడి లేదా ఉపేక్షించబడి హైందవం అగ్రవర్ణాలకు అప్పగించబడిందనీ అంటారీమె. వలసవాదులు ప్రారంభించిన భారతదేశ చరిత్ర, సంస్కృతుల అధ్యయనం (ఇండాలజీ) కేవలం వలస దృక్పథంతో చూడబడిన అగ్రవర్ణ సాంస్కృతిక అధ్యయనమేనంటూ ఇది నిమ్న కులాల సంస్కృతుల అధ్యయనాన్నీ, వివిధ సాంస్కృతిక అసమ్మతుల అస్తిత్వాన్నీ నిరాకరించేటట్టు చేసిందని అంటారు థాపర్. ఆమె ఇంకా ఇలా అంటారు: హిందూ సమాజానికి చెందిన ఒక చిన్న సమూహం మాత్రమే దీన్ని అనుసరిస్తుందనీ, అత్యధిక సంఖ్యాకులు కాదనీ అర్థం చేసుకోవడంలో వలసవాదులు విఫలమయ్యారు. వారు పరిశీలించిన సంస్కృత ఆధారాలు ఒక హిందువు ముందుగా ఒక కులం చేత గుర్తించబతాడు గానీ, మతం చేత కాదనే విషయాన్ని చెప్పలేకపోయాయి.

ఆధునిక యుగ ప్రారంభాన మతం ఆధునిక అవసరాలను తీర్చడానికి బ్రహ్మసమాజం, ఆర్యసమాజం వంటివి స్థాపితం అయ్యాయి. ఈ సామాజిక మత సంస్కరణ సంస్థలు భారత జాతీయ భావ పుట్టుకకు ఉత్ప్రేరకాలుగా పనిచేశాయి. క్రమంగా మతం, రాజకీయం ఒక వైపుకు చేరుకున్నాయి. ఒక జాతిని నిర్మించడానికి మతం అవసరమైతే అది హిందూత్వ వంటి ఏకాండీ శిల రాజకీయ ప్రణాళికగా మారుతుంది. హిందూత్వ నిర్వచనంలో ఒక భౌగోళిక సరిహద్దులోపల ఉండే వారంతా హిందువులే. ఆ సరిహద్దు బ్రిటిష్ ఇండియాయే. బ్రిటిష్ ఇండియాలో అధిక సంఖ్యాకులు హిందువులు కాబట్టి వారు ప్రాధాన్యత గల పౌరులుగా ఉండాలి. జాతీయ భావనకు సరిహద్దులు అవసరం గానీ మతం కాదు. అవసరమనుకుంటే మతం రాజకీయ ఏజెంట్ అవుతుంది అని విశ్లేషించారు రెండు సార్లు భారత ప్రభుత్వం ఇవ్వజూపిన పద్మ భూషణ్ పురస్కారాన్ని తిరస్కరించిన ఈ విద్యా వేత్త.

నాల్గవ ఉదాహరణగా భారతదేశాన్ని ప్రజాస్వామిక స్వేచ్ఛా దేశంగా మార్చడానికి సహకరించిన అసమ్మతిగా గాంధీ సత్యాగ్రహాన్ని గుర్తించారు రొమిల్లా థాపర్. గత కాలపు అనేక సమ్మతి, అసమ్మతుల సంగ్రహ రూపంగా, హిందూత్వ మౌలిక భావనల్ని ప్రశ్నించగల సత్తా కలిగిందిగా ఆమె దీన్ని కనుగొన్నారు. సత్యాగ్రహం పట్ల తన ఆసక్తి గాంధీ మీద కన్నా ప్రజల అధోచేతనలో మిళితమై సత్యాగ్రహాన్ని అంగీకరించిన వారి భావజాలం మీద ఉందంటారు వామపక్ష భావజాలం కలిగిన ఈ చరిత్ర వ్యాఖ్యాత. ఎందువల్ల గాంధీ సత్యాగ్రహానికి అంత ప్రతిస్పందన లభించిందనే ప్రశ్నకు ఉప్పు అత్యంత అవసరమైన ఆహార పదార్థం కావడం వల్లనా, గాంధీ సమ్మోహక శక్తి వల్లనా అంటూ అనేక ప్రశ్నలు వేసుకుంటూ భారతీయ సమాజం యుగాలుగా అసమ్మతిని అంతర్లీన శక్తిగా కలిగి ఉండడమేనంటారు థాపర్.

బ్రాహ్మణ సంప్రదాయం పట్ల శ్రమణులు అసమ్మతి చూపితే వారినుంచి సంత్‌లు, పీర్‌లు ప్రభావానికి లోనైన నేపథ్యంలో గాంధీ ఆ శ్రమణ సంప్రదాయం నుంచి స్ఫూర్తి పొందాడు అంటారీమె. ప్రత్యామ్నాయ సామాజిక వ్యవస్థ హింసాత్మక విప్లవం వల్ల రాదని వారు భావించారు. సామాజిక నీతికి ప్రాధాన్యత నిస్తూ తమకు నచ్చిన ఆరాధనను ఎన్నుకునే స్వేచ్ఛనిచ్చిన ఈ సందర్భం సంత్‌లను, పీర్‌లను నైతిక శక్తితో నింపింది. ప్రజల దృష్టిలో పడిన ఈ నైతిక శక్తే సత్యాగ్రహంలో కీలక పాత్ర వహించింది. పరిత్యాగం అసమ్మతికి ప్రతీకగా ఉంటూ వచ్చింది. సత్యాగ్రహులకు పరిత్యాగులతో పోలికలున్నాయి. సత్యాగ్రహులకు కూడా ఆశ్రమ జీవితం, శిక్షణ, క్రమశిక్షణ నియమావళి ఉన్నాయి. బ్రహ్మచర్యం అనివార్యం చేయబడలేదు కానీ హర్షించదగిన నియమంగా ఉండేది. గాంధీ చర్యలు కొన్ని సంత్‌ల చర్యలతో పోల్చబడ్డాయి. తొలిదశలో ఆయనకు కొన్ని మహత్తులున్నాయని భావించబడింది. వాటితో ఆయన బ్రిటిష్ ప్రభుత్వాన్ని లొంగదీయగలడని అనుకున్నారు. గాంధీ బ్రహ్మచర్యం ఉద్యమానికి గొప్ప నైతిక బలాన్ని ఇచ్చింది. ఆయన చెప్పిన ఆత్మశక్తి మొత్తం సత్యాగ్రహానికి చోదకశక్తిగా పనిచేసింది. గాంధీ తనను 'మహాత్మ' అని పిలవడాన్ని నిరాకరించకపోవడం ఆసక్తికరం. దాన్ని తాను నైతిక బలాన్ని కలిగి ఉండడానికి ప్రతీకగా స్వీకరించినట్లు అనిపిస్తుంది. దాని బలమంతా సమాజానికి నైతికత అవసరమన్న దానిలో ఉంది. దాన్ని తమను నడిపించే నాయకుడికి కట్టబెట్టడంలో ఇమిడి ఉంది. శ్రమణ సంప్రదాయంలో మాదిరిగానే సత్యాగ్రహంలోనూ హింసకు దూరంగా ఉండడం అవసరం. హింస నైతిక బలాన్ని ధ్వంసం చేస్తుంది. సత్యానికీ అహింసకూ కట్టుబడి ఉండడం సహనానికి దారి తీస్తుంది. అధికారంలో ఉన్న వాళ్లకు అది లేకపోవడం వల్లే అనేక అనర్థాలు జరుగుతున్నాయి.

మతం రాజకీయం చేయబడిన వర్తమాన నేపథ్యంలో మతానికి

మనం ఏ రూపం ఇస్తున్నామో పరిశీలించవలసి ఉంది అంటున్న ఈ వ్యాస రచయిత్రి, గత రెండు శతాబ్దాలుగా భారతీయ మతాలు వలసవాద పండితుల జాడలలోనే పునర్నిర్మించబడినాయి అంటారు. ప్రధాన దృష్టి అంతా నమ్మకాలు, కర్మకాండలు, వాచకాల మీదే ఉంది కానీ సామాజిక, రాజకీయ మార్పులలో మతం నిర్వహించిన పాత్ర ప్రజా బాహుళ్యంలో చర్చకు రాలేదంటారామె. ఈ సందర్భంగా ఆమె జాతీయ భావం గురించీ, మతతత్వ రాజకీయ మూలాల గురించీ కొంత చర్చ చేశారు. భారతదేశంలో ప్రధాన స్రవంతి జాతీయ భావం పౌరుల స్వేచ్ఛను నిరాకరించిన రాజకీయ వ్యవస్థను ధిక్కరించింది. పారిశ్రామికీకరణ, మధ్యతరగతి ఆవిర్భావం సమాజానికి కొత్త చూపునిచ్చాయి. జాతీయ భావం ప్రాచీన రాచరిక వ్యవస్థల స్థానంలో స్వతంత్ర జాతీయ రాజ్యాల స్థాపనను ముందుకు తెచ్చింది. ఇది ఒకనాటి పాలితుల స్థానంలోకి పౌరుల్ని తెచ్చింది. ఇది పౌరులకూ, రాజ్యానికీ మధ్య నిరంకుశమూ, విదేశీయమూ కాని ప్రభుత్వాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వం అంటే పౌరుల ప్రతినిధి అనే ఇంతకు ముందు లేని నిర్వచనాన్ని ఇచ్చింది. ఈ వ్యవస్థ పౌరుల హక్కులను కాపాడవలసిన బాధ్యతను రాజ్యం మీద పెట్టింది. పౌరులకూ, రాజ్యానికీ కుదిరిన ఈ ఒప్పందాన్ని రాజ్యాంగం నిక్షిప్తం చేసింది. కాబట్టి జాతీయ భావం అంటే సమాన హోదా, సమాన హక్కులూ ఉన్న ప్రజలందరూ కలిసి స్వతంత్ర జాతీయ రాజ్యాన్ని ఏర్పరచుకోవడం. అందువల్ల మతం, జాతి, భాష ప్రాతిపదికన వారి పట్ల వైమనస్యం చూపడానికి వీల్లేదనీ, ఒక మతం పట్ల అపేక్ష, విమతాల పట్ల వివక్ష జాతీయ భావం కాజాలదనీ అంటున్నారు థాపర్.

మతతత్వ రాజకీయాల మూలాల గురించి ఆమె వివరణ ఇలా ఉంది: సాధారణంగా దేశ విభజనకు దారితీసిన పరిణామాల విశ్లేషణలో బాధ్యతంతా మతతత్వం మీదే వేసి దాని వెనుక ఉన్న వలసవాద ఆలోచనా ముద్రను విస్మరిస్తాం. వలసవాదులు వలస ప్రజల ప్రాచీన చరిత్ర రచనకు పూనుకున్నపుడు వారి దృక్పథమే వలస ప్రజల మూలాలను, అస్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో రూపుదిద్దుకుంది ద్విజాతి సిద్ధాంతం. 1817లో జేమ్స్ మిల్ భారతదేశ చరిత్ర హిందూ, ముస్లిం అనే రెండు జాతుల చరిత్ర అనీ, అవి నిరంతరం సంఘర్షించుకున్నాయనీ ప్రతిపాదించాడు. దేశ చరిత్రని హిందూ, ముస్లిం, బ్రిటిష్ యుగాలుగా విభజించాడు. ఈ దారుణ చారిత్రక విభజన అర్ధ శతాబ్దం క్రితమే ప్రశ్నించబడి, ఖండించబడి, నిరాకరించబడింది. కానీ ఈ ఆలోచనని హిందు, ముస్లిం మతతత్వవాదులు మాత్రం విడిచిపెట్టలేదు. అది ఇస్లామిక్ రాజ్యం, హిందూ రాష్ట్రం అనే భావనలుగా పురివిప్పి, ఒకదానికొకటి ఎదురుగా నిలుస్తూ రెండూ ప్రధాన స్రవంతి జాతీయోద్యమానికి దూరమయ్యాయి. ఈ క్రమంలో ఆయా మతాల్లో ఉన్న అసమ్మతుల్ని ప్రణాళికా బద్ధంగా అణచివేశాయి. హిందూ రాష్ట్ర భావనని బలంగా ముందుకు తేవడానికి హిందుత్వ ప్రణాళికకు అనుగుణంగా చరిత్రను వ్యాఖ్యానించుకున్నారు. హిందూ మత రూపాన్ని, సారాన్ని కూడా మార్చేశారు. దీనికి సమాంతర పరిణామాలు ఇస్లాంలోనూ జరుగుతూ వచ్చాయి. కానీ, ప్రధాన స్రవంతి జాతీయోద్యమం పౌరులందరినీ వారి మూలాలతో సంబంధం లేకుండా ఒకే అస్తిత్వం, సమాన హోదా కలిగిన వారుగా స్వతంత్ర లౌకిక ప్రజాస్వామిక రాజ్యస్థాపనని కాంక్షించే వారిగా పరిగణించింది.

అనాదిగా మొదలైన అసమ్మతి కథనం వర్తమానంలో కూడా కొనసాగుతూ ఉందనీ, అది అత్యంత సమీప గతంలో ప్రతి ధ్వనించిందనీ అంటారు మతతత్వ వాదులకు అనేకసార్లు లక్ష్యం అయిన రొమిల్లా థాపర్. అనేక రకాలుగా అది గాంధీ సత్యాగ్రహానికి కొనసాగింపుగా పేర్కొంటూ ఇటీవల న్యూఢిల్లీ షహీన్‌బాగ్‌లో ప్రారంభమై దేశమంతా విస్తరించిన పౌరసత్వ సవరణ చట్ట, జాతీయ పౌరపట్టిక వ్యతిరేక ఉద్యమాన్ని ఐదవ, ఆఖరి ఉదాహరణగా స్వీకరించారు. దాని విస్తరణ, తీవ్రతల గురించి చెబుతూ కోవిడ్-19 మాత్రమే దాన్ని నిలువరించ గలిగిందంటారు. ఒకరోజు ఇద్దరు మిత్రులతో కలిసి షహీన్‌బాగ్‌ను సందర్శించిన సందర్భాన్ని రొమిల్లా ఇట్లా వివరించారు: "అదొక పెద్ద మహిళల సమూహం. అందులో ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. వారితో మాట్లాడిన తర్వాత తాము నిరసన తెలుపుతున్న దానిపట్ల వారికి స్పష్టత ఉందని నాకు అర్థమైంది. వారి ప్రధానమైన కోరిక ప్రభుత్వం వారి భయాలు తొలగిపోయే విధంగా చర్చలు జరపడం. తమ పౌర హక్కులు రద్దు కాబడవనే హామీ ఇవ్వడం. అంతే. వాళ్లేమీ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడడం లేదు. ఉగ్రవాదులకు సహకరించడం లేదు. అసోంలో సృష్టించబడిన అయోమయం వల్ల కలిగిన సంశయంలోంచి ఉత్పన్నమైన న్యాయమైన కోరిక వాళ్లది. అక్కణ్నుంచి కదిలే సమయానికి నిరసన తెలుపుతున్న మహిళల హుందాతనానికీ, వారి సమస్య తీవ్రతకీ కదలిపోయాను నేను. అది పెద్ద సమూహమే. అయితే ఎంతో క్రమశిక్షణ కలిగి అప్పుడొకటీ అప్పుడొకటీ చొప్పున చిన్న చిన్న ప్రసంగాలూ, అరుదుగా జాతీయ గీతాలాపన, లోగొంతుకలో సాగుతున్న సంభాషణలూ తప్ప ఎంతో ప్రశాంతంగా ఉంది. ఎక్కడా దుర్భాషలు లేవు. ఎవర్నో చంపేయమనే కేకలు లేవు. అది ఒక పరమ అహింసాయుతమైన ఉద్యమం. ఇదంతా ఈ దేశపు అన్ని నేపథ్యాల నుంచీ, ముఖ్యంగా గొంతులు నొక్కబడిన వర్గాల నుంచీ వచ్చిన మహిళలు సాగిస్తున్న ఉద్యమం. ఒక భారతదేశ మహిళగా నా సహవాసుల పట్ల, వారి న్యాయబద్ధమైన నిరసన పట్ల గౌరవమూ, గర్వమూ కలిగాయి" అని అంటూ 'ఒక వ్యక్తి పుట్టుక, పుట్టిన చోటు, పౌరసత్వం గురించి మాట్లాడడానికి మహిళల కన్నా అర్హులెవరుంటారు?' అనే గొప్ప అర్థవంతమైన ప్రశ్నను సంధించారు థాపర్. ఇది లౌకికత్వంతో ముడిపడిన పౌరసత్వానికి సంబంధించిన ఉద్యమం. ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందినవాళ్లు భారతదేశపు సరిహద్దులలోపల జన్మించిన మతాల వారు కాదు కాబట్టి వారిని విదేశీయులంటుంది హిందుత్వ. ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నందుకు దళితులన్నా ఇష్టం లేదు హిందుత్వకు. యువత నుంచి ఉద్యమానికి లభించిన భాగస్వామ్యం చూస్తే భవిష్యత్ పట్ల ఆశ కలుగుతున్నది అని కూడా ఆమె అన్నారు.

ప్రభుత్వాలు ప్రజలందరి హక్కులు కాపాడడానికి నిర్దేశించినవే కానీ, ఏ కొందరివో కాదు. మానవ సమాజాల్లో ప్రభుత్వాలకు ప్రజలందర్నీ సమానంగా చూడగలిగే నైతిక నియమావళి ఉండాలి. అది కేవలం సిద్ధాంతంగా పుస్తకాలకు పరిమితం కాకూడదు. ఆచరింపబడాలి. పౌరస్వరం క్రమంగా అందరికీ వినిపించడమే ఆధునిక యుగ లక్షణం. పౌరులు మాట్లాడినప్పుడు ప్రభుత్వాలు వారి నోళ్లు నొక్కడానికి చేసిన ప్రయత్నాలు విఫలమై, వినడం విధాయకమౌతున్న సందర్భం ఇది. భవిష్యత్ అంతా రాజ్యానికీ, పౌరులకూ ఒకరి పట్ల ఒకరికి ఉన్న హక్కులు, బాధ్యతల పట్ల జరిగే శక్తివంతమైన సంభాషణ మీద ఆధారపడి ఉంటుంది అని ఈ సుదీర్ఘ వ్యాసాన్ని ముగించారు రెండు నెలల క్రితం తొంభయ్యో పడిలో పడిన ప్రొఫెసర్ థాపర్.

(రచయిత రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

మరోసారి మయన్మార్‌లో సైనిక పాలన

సైన్యానికున్న నియంతృత్వ అధికారాలను రాజ్యాంగ సవరణ ద్వారా మార్చాలనే ప్రభుత్వ ఆలోచనను మొగ్గలోనే తుంచివేసి సైన్యం మళ్లీ అధికారాన్ని చేపట్టిందని అంటున్నారు ఎ.నర్సింహారెడ్డి

ఐదు దశాబ్దాలుగా సాగిన సైనిక నియంతృత్వ చీకటి నుండి 2010లో విముక్తి పొందిన మయన్మార్ గత నవంబర్ 8న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం ప్రజా మద్దతుతో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకోబడిన నేషనల్ లీగ్ ఆఫ్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డి) ప్రభుత్వాన్ని మళ్లీ సైనిక కుట్ర ద్వారా జనవరి ఒకటి తెల్లవారిజామున కూల్చివేశారు. మయన్మార్‌లో మరోసారి ప్రజాస్వామ్యాన్ని సైన్యం అపహాస్యం చేసింది. మూడు నెలల క్రితం భారీ మెజారిటీతో ఎన్నికైన ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఒకే ఒక్క సాకుతో కుట్రపూరితంగా కూలదోసి సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. మిలిటరీ ప్రధాన కమాండర్ మిన్ అంగ్ హేలింగ్ అధికారాన్ని చేపట్టారని, ప్రస్తుత ప్రభుత్వంలో మిలిటరీ ప్రతిపాదించిన ఉపాధ్యక్షుడు, మిలిటరీ మాజీ జనరల్ అయిన యుమియింట్ థాన్ ష్వే తాత్కాలిక అధ్యక్షుడుగా ఉంటాడని మిలిటరీ టివి ప్రకటించింది. అధికార నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ(ఎన్ఎల్‌డి) కీలక నేత కౌన్సెలర్ ఆంగ్ సాన్ సూకీ, అధ్యక్షుడు విన్ మింట్ సహా ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులందరినీ సైన్యం నిర్బంధించింది. రాజధాని నేపిడా సహా దేశంలో వివిధ నగరాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను స్తంభింప చేసింది. టెలివిజన్ ప్రసారాలపై ఆంక్షలు విధించింది. విమానాశ్రయాలను మూసివేసింది. దేశం లోపలికి, బయటికి రాకపోకలు నిషేధించారు. గతంలో కూడా ప్రభుత్వ నిర్వహణలోని భజన పత్రిక తప్ప సొంత గొంతుతో నడిచే ఏ ఇతర మీడియా సంస్థ కూడా మనడానికి వీల్లేకుండా సైన్యం ఉక్కు పాదం మోపింది. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి తాండవిస్తుంది. రాజధాని నేపిటా, (పాత రాజధాని ఒకప్పటి రంగూన్) యాంగూన్‌లో సైనిక కవాతులు ప్రతిధ్వనించాయి. ఏడాది పాటు అత్యయిక స్థితి కొనసాగుతుందని, ఆ తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని సైనిక ప్రభుత్వం తెలిపింది.

ప్రస్తుత సైన్యాధిపతి మిన్ అంగ్ హేలింగ్ ఇక నుంచి సర్వాధికారాలు చెలాయించనున్నారు. నవంబర్ ఎన్నికల తర్వాత జనవరి ఒకటిన మయన్మార్ పార్లమెంట్ తొలిసారి సమావేశం కానుండగా.. అదే రోజు సైన్యం తిరుగుబాటు జరగడం గమనార్హం. ప్రస్తుత సైన్యాధినేత మిన్ ఆంగ్ హేలింగ్ పదవీ కాలం వచ్చే జూలైలో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని పొడిగించడానికి సూకీ సుముఖంగా లేరు. ఆయన సైనిక కుట్ర ద్వారా అధికారం కబళిస్తే నిరవధికంగా అధికారంలో కొనసాగవచ్చు. సైనికాధికారిగా తన పదవీ కాలంతో నిమిత్తం లేకుండా మొత్తం అధికారమే తన చేతిలో ఉంటుందని సైన్యాధిపతి ఎత్తుగడ. నిజానికి ఆయనకు మయన్మార్ అధ్యక్ష స్థానం అధిష్టించాలన్న కోరిక ఉంది. అది ఈ రకంగా సైనిక కుట్ర ద్వారా తీర్చుకుంటున్నారు. 2016 మార్చి నుంచి 2021 జనవరి దాకా సూకీ నాయకత్వంలోని పార్టీ, సైన్యం ఉమ్మడిగా అధికారంలో కొనసాగాయి. నిజానికి సంక్లిష్టమైన దేశంలో ఇది ఒక అపూర్వమైన ప్రయోగం. ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేసి, సైన్యం రాజకీయాలకు దూరంగా ఉండే సంస్కృతి మయన్మార్‌లో వేళ్లూనుకోలేదని ఈ సంఘటన తెలియజేస్తున్నది. ప్రజాస్వామ్యంలో సైన్యం రాజకీయాలకు దూరంగా ఉండాలన్నది ప్రజాస్వామ్య నియమైనప్పటికీ అది అమలయ్యే అవకాశం మయన్మార్‌లో మొదటి నుంచీ లేదు.

చరిత్రలో మయన్మార్:

1937లో బ్రిటిష్ ఇండియా నుంచి బర్మాను (మయన్మార్) విడదీశారు. 1942లో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాన్ బర్మాను ఆక్రమించింది. జపాన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువకుడైన అంగ్‌సాన్ 1944లో 'యాంటి ఫాసిస్టు పీపుల్స్ ఫ్రీడమ్ లీగ్' (ఎ.ఎఫ్.పి.ఎఫ్.ఎల్) ఏర్పాటు చేశారు. 1945లో బ్రిటిష్ సైన్యాలు బర్మాలో ప్రవేశించాయి. ఎఎఫ్‌పిఎఫ్ఎల్ సాయుధ దళాల సహాయంతో జపాన్ ఆక్రమణ నుండి బర్మాను బ్రిటన్ విముక్తి చేసింది. జపాన్ సామ్రాజ్యవాదులకు బ్రిటన్ సామ్రాజ్యవాదులకు మధ్య గుణాత్మక తేడా లేదని గమనించిన ఎఎఫ్‌ఎఎఫ్ఎల్ బ్రిటన్‌తో సాయుధ ఘర్షణకు దిగింది. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం దిగివచ్చి అంగ్‌సాన్ ఆయన నలుగురు అనుచరులను గవర్నర్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోకి తీసుకుంది. బ్రిటన్‌లో 1947 జనవరి 27న అట్లీ– అంగ్‌సాన్ మధ్య ఒప్పందం కుదిరింది. 1947 ఏప్రిల్‌లో రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిపింది. బ్రిటిష్ వాళ్లు ఎంత ప్రయత్నించినా రాజ్యాంగ సభకు ఎన్నిక కావల్సిన 240 స్థానాల్లో 194 స్థానాలు ఎఎఫ్‌పిఎఫ్ఎల్‌కు లభించాయి. రాజ్యాంగ పరిషత్ బర్మా సంపూర్ణ స్వతంత్ర ప్రతిపత్తిని బ్రిటన్ గుర్తించాలని తీర్మానించింది. ఈ తీర్మాణం చేసిన కొద్ది రోజుల్లోనే 1947 జూలై 19న ఒక కిరాయి హంతకుల ముఠా అంగ్‌సాన్ మరియు అతని తాత్కాలిక ప్రభుత్వంలోని ఆరుగురు మంత్రులను హత్య చేసింది. దీని వెనుక బ్రిటన్ హస్తముంది. దేశ వ్యాప్తంగా బ్రిటన్ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. ప్రజాందోళనకు తలవొగ్గి బర్మాకు అది వివేశ ప్రతిపత్తిని ప్రసాదించింది. యూన్ నాయకత్వాన 1948 జనవరి 4న బర్మా రిపబ్లిక్‌గా ఏర్పడింది.

1962లో జనరల్ నేవిన్ ఆధ్వర్యంలో సైన్యం తిరుగుబాటు చేసి యూన్‌ను అధికారం నుంచి తొలగించి, సైనిక నియంత అధికారంలోకి వచ్చాడు. జనరల్ నేవిన్ 26 సంవత్సరాలు బర్మాను కర్కశంగా పాలించాడు. అన్ని పార్టీలు నిషేధించబడ్డాయి. 1974లో నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అధికారం సైన్యం నుండి పీపుల్స్ అసెంబ్లీకి బదిలీ అయింది. 1988లో జనరల్ సామాంగ్ నేతృత్వంలో మరోసారి సైనిక తిరుగుబాటు జరిగింది. దివంగత అంగ్‌సాన్ – కుమార్తె

అంగ్‌సాన్ సూకీ 'నేషనల్ డెమోక్రటిక్ లీగ్' పార్టీని 1988లో స్థాపించింది. 1989లో బర్మా పేరును మయన్మార్‌గా, రాజధాని రంగూన్ పేరును యాంగూన్‌గా మార్చారు. సైన్యం సూకీని గృహ నిర్బంధం చేసింది. దాదాపు 30 సంవత్సరాల తర్వాత 1990లో జరిగిన మొదటి ఎన్నికల్లో సూకీ పార్టీ ఎన్ఎల్‌డి 80 శాతం స్థానాల్లో గెలిచింది. మిలిటరీ జుంటా ఫలితాలను గుర్తించ నిరాకరించింది. 2010లో సూకీ ఎన్నికల్లో పాల్గొనకుండా నూతన ఎన్నికల చట్టాన్ని సైన్యం తెచ్చింది. సూకీ నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ(ఎన్ఎల్‌డి) ఎన్నికలు బహిష్కరించింది. మయన్మార్ స్వాతంత్ర్యం పొందాక 1962లో, 1988లో సైనిక కుట్రల పాలబడింది. మూడోసారి జనవరి 1న మళ్లీ కుట్రకు పాల్పడింది. ఎన్ఎల్‌డి నేత సూకీ దాదాపు 20 సంవత్సరాలు జైలు, గృహ నిర్బంధంలో గడిపింది.

2020 నవంబర్ ఎనిమిదవ తేదీన మయన్మార్ ప్రజా ప్రతినిధుల సభలోని 440కి గాను 315, జాతులకు ప్రాతినిధ్యం వహించే ఎగువ సభలోని 224కి గాను 161 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధిక స్థానాలను ఎన్ఎల్‌డి సాధించింది. ప్రజాప్రతినిధుల సభలో 258, జాతుల సభలో 138 సీట్లు పొంది పూర్తి మెజారిటీని సాధించింది. మిలిటరీ మద్దతు ఉన్న డెవలప్‌మెంట్ పార్టీకి ప్రతినిధుల సభకు 26 స్థానాలు జాతుల సభకు 7 స్థానాలు మాత్రమే రాగా మిగిలిన స్థానాలను చిన్న పార్టీలు పొందాయి. రాష్ట్ర ప్రాంతీయ ఎన్నికల్లో కూడా ఎన్ఎల్‌డి ఇదే మాదిరి ఘనవిజయం సాధించింది. 2008లో రాజ్యాంగ సవరణ ప్రకారం ఎన్నికలలో మయన్మార్ పౌరులు మాత్రమే అర్హులు. జాతీయ, రాష్ట్రాల చట్ట సభల్లో మూడోవంతు సీట్లు మిలిటరీకి రిజర్వు చేశారు. ఎన్నికల అనంతరం ఏర్పడే జాతీయ ప్రభుత్వంలో రక్షణ, సరిహద్దులు, హోంశాఖల మంత్రులుగా మిలిటరీ నియమించిన వారే ఉండాలి. కొత్త పార్లమెంట్ కొలువు తీరిన తరువాత అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులను ఎన్నుకొనేందుకు ఎలక్టోరల్ కాలేజీని ఏర్పాటు చేస్తారు. ఉభయ సభల నుంచి, అదేవిధంగా మిలిటరీ నియమించిన సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో కమిటీ నుంచి ఒకరిని ఎన్నుకుంటారు. వారిలో అత్యధిక ఓట్లు వచ్చిన వారిని అధ్యక్షుడిగా, మిగిలిన రెండు కమిటీలలో ఎక్కువ తెచ్చుకున్న ప్రతినిధి తొలి ఉపాధ్యక్షుడుగా, ఆ తర్వాత స్థానంలో ఉన్న వ్యక్తి రెండవ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక అవుతారు.

మయన్మార్ జాతీయులను కాని వారిని వివాహం చేసుకున్న వారు, మయన్మార్ పౌరసత్వం లేని వారి పిల్లలు గానీ ఈ పదవులకు అనర్హులు. ఈ నిబంధన కారణంగా బ్రిటిష్ జాతీయుడిని వివాహం చేసుకున్న అంగ్‌సాన్ సూకీ ఎంపీగా, ఇతర పదవులను మాత్రమే చేపట్టవచ్చు తప్ప దేశ అధ్యక్షురాలయ్యే అవకాశం లేదు. ఆమె పిల్లలకు మయన్మార్ పౌరసత్వం లేనందున వారు కూడా అనర్హులే. ఈ క్రమంలో గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన వారు మార్చి 21న పదవీ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని మిలిటరీ చేసిన సూచనను మెజారిటీ సీట్లు తెచ్చుకున్న ఎన్ఎల్‌డి తిరస్కరించి పార్లమెంట్ సమావేశ నిర్వహణకు పూనుకున్నది. దీంతో కౌన్సెలర్ సూకీ, దేశాధ్యక్షుడు విన్ మింట్ సహా ఆ పార్టీకి చెందిన నాయకులందరిని నిర్బంధించి తాము అధికారాన్ని హస్తగతం చేసుకున్నట్లు మిలిటరీ ప్రకటించింది. మయన్మార్ చరిత్రను చూసినా దాని ప్రస్తుత రాజ్యాంగాన్ని చూసినప్పటికీ మిలిటరీదే పైచేయిగా ఉందని చెప్పవచ్చు.

మయన్మార్ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన పార్టీ వారికి 75 శాతం పదవులు ఇచ్చి ఇరువై ఐదు శాతం పదవులు సైన్యం నియమించిన వారికి ఇస్తారు. ఈ ఎన్నికలలో ఎన్ఎల్‌డి 476 సీట్ల జాతీయ అసెంబ్లీలో అత్యధికంగా 396 సీట్లు గెలిచింది. సైన్యం బలపర్చిన డెవలప్‌మెంట్ పార్టీ కేవలం 33 సీట్లు మాత్రమే గెలిచింది. ఎన్ఎల్‌డి పార్టీకి రాజ్యాంగానికి సవరణలు చేసే మూడింట రెండు వంతుల మెజారిటీ ఉంది. ఈ ఫలితాల వలన సైన్యం ప్రాధాన్యత తగ్గిపోతుందని భావించిన సైన్యం ప్రజాస్వామ్యంపై దాడి చేసింది. గతంలో రాజ్యాంగంలో చేసిన సవరణతో ప్రభుత్వ విధానాల నిర్ణయంలో మిలటరీ జోక్యం చేసుకునే అవకాశం ఉండేది. కొత్త ప్రభుత్వం ఏర్పడితే పాత సవరణను తొలగించేందుకు ఎన్ఎల్‌డి పూనుకుంటుందనే భయం, అనుమానంతో కూడా సైనిక తిరుగుబాటు జరిగి ఉంటుంది. తాజా పరిణామాలు మయన్మార్ ప్రజాస్వామ్య ప్రక్రియకు పెద్ద ఎదురుదెబ్బ.

సుదీర్ఘకాలం ప్రజాస్వామ్యం కోసం పోరాడిన మయన్మార్ ప్రజలు మిలటరీ ఆధిపత్యాన్ని అంగీకరించే అవకాశం ఉండదు. గతంలో దశాబ్దాల తరబడిగా సాగిన సైనిక ఏలుబడిలో మయన్మార్ ప్రజలు సర్వ స్వాతంత్ర్యాలనూ కోల్పోయారు. అంతర్జాతీయ సమాజం మద్దతు మయన్మార్‌కు కొరవడింది. ఆ చీకటిని తలచుకునే వారికెవరికైనా మళ్లీ ఆ రోజులు దాపురించకూడదని అనిపిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో అధికారాన్ని స్వాధీనం చేసుకోవచ్చునన్న రాజ్యాంగ నిబంధనకు అనుగుణంగానే ఈ పని చేశామని సైన్యం ఇస్తున్న సంజాయిషీ రాజ్యాంగ విరుద్ధం. అలాగే ఏడాదిపాటు మాత్రమే పాలిస్తామని, పరిస్థితులు చక్కబడ్డాక మళ్లీ ప్రజా పాలకులకు అధికారం కట్టబెడతామని చెబుతున్న మాట కూడా బూటకమే. నవంబర్ ఎన్నికల్లో తాము సమర్థించినవారు చిత్తుగా ఓడారన్న దుగ్ధతో, తమకు సర్వాధికారాలు కట్టబెడుతున్న రాజ్యాంగాన్ని ఇప్పుడొచ్చిన మెజారిటీతో ఎన్ఎల్‌డి సర్కారు మారుస్తుందనే భయంతో సైన్యం ఈ దారుణానికి తెగించిందని ప్రపంచానికి అర్థమైంది.

మొదటి నుంచి సైన్యానిదే ఆధిపత్యం:

ఇంచుమించు మనతో పాటు బ్రిటిష్ వారి నుంచి విముక్తి పొందిన మయన్మార్‌లో 1948 జనవరి 4వ తేదీ నాటి నుంచీ ప్రజాస్వామ్యం పాదుకొనకుండా మిలిటరీ కండబలం చూపుతూనే ఉన్నది. అప్పటి నుండి అడపా తడపా సైనిక నియంతలు ఎన్నికల తతంగాన్ని నడిపిస్తూనే ఉన్నారు. 1980లో జరిగిన ఎన్నికల్లో ఎన్ఎల్‌డి 80 శాతం స్థానాలు గెల్చుకోగా సైన్యానికి మింగుడుపడక వాటిని రద్దు చేశారు. ఎప్పటి లాగానే సైనిక పాలన కొనసాగింది. అంగ్‌సాన్ హత్య జరిగినప్పుడు రెండేండ్ల చిన్నారి అయిన సూకీ తల్లి సంరక్షణలో విదేశాల్లో గడిపింది. 1988లో స్వదేశానికి తిరిగి వచ్చి ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రాణం పోసి సైనిక పాలనకు వ్యతిరేకంగా గళం విప్పింది. ఒక చిన్న దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి సూకీ అన్ని విధాలా త్యాగానికీ సిద్ధపడ్డారు. సూకీ తండ్రి గతంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన యోధుడు. ఆయన కమ్యూనిస్టు. ఆయన పోరాట వారసత్వాన్ని సూకీ కొనసాగిస్తున్నారు. పౌర, ప్రజాస్వామిక హక్కుల కోసం సూకీ చేసిన శాంతియుత పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా మద్దతు లభించింది. మొక్కవోని దీక్షకు గుర్తింపుగా 1991లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. అంతర్జాతీయ మద్దతుతో స్వదేశంలోని సైనిక నియంతలపై సాగించిన పోరాటంలో సుదీర్ఘ నిర్బంధాన్ని అనుభవించిన మహిళా

నేత ఆంగ్ సాన్ సూకీ.

మయన్మార్ గత చరిత్రను పరిశీలిస్తే ప్రజాస్వామ్యం కోసం అక్కడ అనేక సంవత్సరాల నుంచి పోరాటం జరుగుతూనే ఉన్నది. మయన్మార్‌లో గత ఐదు దశాబ్దాలుగా మిలిటరీ అన్నింటా ఆధిపత్యం నెరపుతున్నది. ప్రజాఉద్యమాలు పెల్లుబికినప్పుడల్లా ఎన్నికలను ఓ తంతుగా జరిపి పాలనాపగ్గాలు తమ చేతుల్లో ఉండే విధంగా వ్యవహరిస్తున్నది. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగటంతో 2010లో మరోసారి తప్పని సరై ఎన్నికలు నిర్వహించారు. మిలిటరీ తీరుకు నిరసనగా సూకీ నేతృత్వంలోని ఎన్ఎల్‌డి 2010 నాటి ఎన్నికలను బహిష్కరించింది. అందులో 80 శాతం ప్రజానీకం సైన్యం ప్రాపకం ఉన్న పార్టీలకే అధికారం కట్టబెట్టారని ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. మిలిటరీ చెప్పుచేతల్లోని యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) అధికారం చేపట్టింది.

ప్రజా ఒత్తిడితో 2015లో సైన్యానికి ఎన్నికల నిర్వహణ తప్పలేదు. చాన్నాళ్ల తర్వాత తొలిసారి అంతర్జాతీయ పర్యవేక్షణలో ఆ ఎన్నికలు జరగటం, అందులో ఎన్ఎల్‌డి ఘన విజయం సాధించటంతో ఇష్టం లేకున్నా సైనిక పాలకులు ఆ పార్టీకి అధికారం అప్పగించారు. అప్పట్లో ఇలా అధికారం అప్పగించడానికి రెండు కారణాలున్నాయి. అందులో మొదటిది పాలనపై తమ పట్టు పూర్తిగా సడలకపోవడం. రెండోది ఆంగ్ సాన్ సూకీ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం. పార్లమెంట్ నుంచి అట్టడుగు ప్రజాస్వామ్య వ్యవస్థల వరకూ అన్నిచోట్లా తమ కోసం 25 శాతం సీట్లు దఖలు పరచుకున్నారు. తమకు ఇష్టమైన వారిని చట్టసభల్లో కూర్చోబెట్టుకుని, ఎన్నికైన ప్రభుత్వం హద్దుమీరకుండా చూశారు. ఎందుకైనా మంచిదని వీటో అధికారాలు సైతం పెట్టుకున్నారు.

గత అయిదేళ్లుగా ఎన్ఎల్‌డి ప్రభుత్వం సైన్యం నిర్దేశించిన హద్దుల్లోనే పాలించింది. మైనారిటీ వర్గమైన రోహింగ్యా ముస్లింలను సైనిక దళాలు కళ్లముందే ఊచకోత కోసినా సూకీ పట్టనట్టే వ్యవహరించారు. పైగా సైన్యాన్నే సమర్థించారు. అందుకు తీవ్ర విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సైనికుల ఆగడాలను సమర్థించడం దారుణమని అనేకులు దుమ్మెత్తి పోశారు. 7 లక్షల 50 వేల మంది రోహింగ్యాలు దేశాన్ని విడిచి బంగ్లాదేశ్‌లో తలదాచుకోవలసి వచ్చింది. ఈ పరిణామం ఆమె సారథ్యానికి మాయని మచ్చను తెచ్చింది. ప్రజాస్వామిక దేశాలనిపించుకుంటున్న చోట కూడా నియంతృత్వ అధికారాలను చెలాయించే పోకడలు తీవ్రరూపం ధరిస్తున్న వర్తమాన ప్రపంచంలో మయన్మార్ మళ్లీ తన ప్రజాస్వామ్య స్వప్నాన్ని ఫలింపజేసుకోడానికి ఎంత కాలం పడుతుందో చెప్పలేము. తాజాగా గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన సూకీని అధికారం చేపట్టకుండా అడ్డగించింది. దేశంలో ప్రజాస్వామ్యం కోసం అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్ సాన్ సూకీకి గట్టి ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఐదు దశాబ్దాల పాటు సైనిక పాలన కొనసాగింది. 2015 నుంచి ప్రజాస్వామ్యం దిశగా అడుగులు పడుతున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ఈ పరిణామం దేశ భవిష్యత్తును మరోసారి ప్రశ్నార్థకంగా మార్చి వేసింది.

సైనిక తిరుగుబాటుకు తక్షణ కారణం:

ప్రజలు ఎన్నుకోవటానికి కేటాయించిన 476 స్థానాల్లో సూకీ పార్టీ 396 (83 శాతం) గెలుచుకొని ఘన విజయం సాధించింది. సైన్యం కనుసన్నల్లో నడిచే యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) కేవలం 33 స్థానాలకే (7శాతం) పరిమితమైంది. సైన్యానికి తోకలా ఉండే మరికొన్ని చిన్న పార్టీలు అంతకన్నా చాలా తక్కువ స్థానాలకు పరిమితమయ్యాయి. పార్లమెంట్‌లో సైన్యం ముందు జాగ్రత్త చర్యగా తనకు తాను కేటాయించుకున్న 166 సీట్ల(25శాతం) కోటా ఉండనే ఉంది. ఇంతచేసినా పార్లమెంట్‌లో సైన్యం కోసం గొంతెత్తే వారు 32 శాతం మించిలేరు. 2015లో ఎన్నికలు నిర్వహించినప్పుడు పరిస్థితి వేరు. తనను కాదని చట్టాలు చేసే పరిస్థితి అప్పుడు ఎన్ఎల్‌డి ప్రభుత్వానికి లేదు. కానీ ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. పైగా సైన్యం అధికారాలను కత్తిరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతున్నదన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఇదంతా మింగుడు పడని సైన్యం పథక రచన చేసి ప్రభుత్వాన్ని కుప్పకూల్చింది. సైనిక కుట్ర జరగొచ్చునన్న కథనాలు ముందుగానే వెలువడ్డాయి. తాము ఆ మాదిరి చర్యకు పాల్పడబోమని సైన్యం చెబుతూ వచ్చింది. కానీ అందుకు భిన్నంగా ప్రవర్తించి సైన్యం తన నైజాన్ని వెల్లడించుకుంది.

రోహింగ్యాల ఊచకోత విషయంలో మిగతా ప్రపంచం బర్మాను తీవ్రంగా తప్పుబడుతుంటే చైనా బలంగా వెనకేసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బర్మాలో జరిగిన దానిని చైనా అధికారిక మీడియా సైనిక కుట్ర అనడం లేదు. సూకీని గద్దెదించేయడం, నిర్బంధించడం, అధికారాన్ని మిలటరీ లాక్కోవడం వంటివన్నీ కేబినెట్ విస్తరణలాగానూ, అధికార పంపకాల్లో స్వల్ప మార్పుచేర్పుల్లాగానూ అభివర్ణిస్తున్నది. సూకీకి విస్తృతాధికారాలేమీ లేవు కానీ, చైనా పెట్టుబడులనుంచి బర్మాను కాపడుకొనేందుకు ప్రయత్నించడంతో ఆమె పట్ల చైనా పాలకులకు ఆగ్రహం కలిగింది. విదేశీ పెట్టుబడుల్లోనూ, వాణిజ్యంలో మూడోవంతు చైనాదే కావడంతో, ఆమె తన దేశం రుణ ఉచ్చులో పడకుండా కొన్ని ప్రాజెక్టులను అడ్డగించారు. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ)లో అంతర్భాగంగా ఉన్న చైనా-మయన్మార్ ఎకనామిక్ కారిడార్(సిఎంఇసి)లో అనేక భారీ ప్రాజెక్టులు చైనా చేపట్టింది. బర్మా మొత్తం రుణభారంలో దాదాపు సగం ఇవే కావడంతో సూకీ కొన్నింటికి కత్తెర వేశారు. మరికొన్నింటిని నత్తనడకన సాగించి, మూడువంతుల ప్రాజెక్టులను కదలనీయకుండా చైనా పాలకులకు మహా చిరాకు కలిగించింది. మరోపక్క భారత్‌తో కలసి హైవే, పోర్టు, ప్రత్యేక ఆర్థికమండలి ఇత్యాదివి సంకల్పించడం కూడా చైనాకు కంటగింపు అయ్యాయి.

మయన్మార్ ప్రభుత్వం చైనా ఆర్థిక సహకారంపై చాలా ఆధారపడి ఉంది. చైనా దృష్టిలో భౌగోళికంగా తను చేపట్టే బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో కీలకపాత్ర పోషిస్తోంది. మయన్మార్‌లోని అరకాన్ రాకైన్ రాష్ట్రంలో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. రాకైన్ రాష్ట్రంలో బర్మాను పాలించిన ఒకప్పటి జనరల్ థాన్‌ష్వే పేరున చాలా మొత్తంలో గ్యాసు నిక్షేపాలున్నాయి. వాటిపై చైనా కన్నేసింది. దీనికి తోడు ముస్లిం రోహింగ్యాలు నివసిస్తున్న రాకైన్ రాష్ట్ర సముద్ర తీర ప్రాంతంలో చమురు, హైడ్రో కార్బన్స్ నిక్షేపాలున్నాయి. మయన్మార్ సైనికాధినేత చైనాలో పర్యటించి రాగానే ఈ సైనిక కుట్ర జరగడం కూడా పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎన్ఎల్‌డి ఆర్థిక విధానాలు ప్రముఖ సైనిక కుటుంబాల

వ్యాపార ప్రయోజనాలకు భంగకరంగా ఉన్నాయి.

ప్రజా ఆందోళనతో రగులుతున్న మయన్మార్:

మయన్మార్‌లో సైనిక తిరుగుబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తూ పూర్వ రాజధాని యాంగూన్‌లో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. మాండలేలో వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి సైనిక తిరుగుబాటుకు వ్యతిరేకంగా నినదించారు. ప్రజలను చెదరగొట్టేందుకు పోలీసు వాటర్ క్యానన్లను ఉపయోగించారు. కొన్నిచోట్ల కాల్పులు జరిపారు. రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. వందలాది మంది గాయపడ్డారు. ఈ నిరసనల్లో విద్యార్థులు, యువత, మహిళలతో పాటు అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు. పోలీసులు నిర్బంధం పెంచుతున్న కొద్దీ ఉద్యమం విస్తృతి చెందుతుంది. బాగో, దావీ. ఉత్తర షాన్ రాష్ట్రాలకు ఉద్యమం విస్తరించింది. ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన సైనిక కుట్రకు వ్యతిరేకంగా ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తించారు. మిలటరీ డిక్టేటర్ ఫెయిల్, ఫెయిల్: డెమొక్రసీ విన్, విన్ (సైనిక నియంతను ఓడిద్దాం-ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం) అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆంగ్‌సాన్ సూకీతో పాటు నిర్బంధించిన నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ(ఎన్ఎల్‌డి) నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎగైనెస్టు మిలటరీ డిక్టేటర్‌షిప్(సైనిక నియంతృత్వాన్ని వ్యతిరేకించండి) అని రాసి ఉన్న బ్యానర్‌తో భారీ ర్యాలీ నిర్వహించారు.

సైనిక ప్రభుత్వం ఆంక్షలు విధించినప్పటికీ పెద్ద ఎత్తున ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'సైబర్‌స్పేస్'లోనూ భారీగా నిరసన వ్యక్తమవుతోంది. 'బ్రదర్‌హుడ్ ఆఫ్ మయన్మార్ హ్యాకర్స్' అనే సంస్థ ఏకంగా ప్రభుత్వ డిజిటల్ న్యూస్ వెబ్‌సైట్‌లో సమచారాన్నే మార్చేసింది. హోంపేజీలో సైనిక తిరుగుబాటుకు వ్యతిరేకంగా సమాచారాన్ని, ఫోటోలను పెట్టింది. యాంగూన్‌లో చైనాను వ్యతిరేకిస్తూ... రాయబార కార్యాలయం ఎదుట ఆందోళనకారులు ప్రదర్శన చేపట్టారు. మిలటరీ పాలనను ప్రోత్సహిస్తోందంటూ చైనాకు వ్యతిరేకంగా నినదించారు. సైన్యంతో సంబంధం ఉన్న అన్ని కార్యకలాపాలనూ తిరస్కరించాలంటూ ఆందోళనకారులు ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనల్లో ప్రభుత్వ సిబ్బంది చురుగ్గా పాల్గొంటుంది. మరోవైపు వేకువజామున 1 నుంచి ఉదయం 9 గంటల వరకు మొబైల్ సర్వీసు ప్రొవైడర్లు ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు రవాణా, సమాచార మంత్రిత్వ శాఖ ఆదేశాలు ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో కనిపించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మయన్మార్‌లో అనేక ప్రాథమిక పౌర స్వేచ్ఛలను రద్దుచేస్తూ సైనిక ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కోర్టు వారెంట్లు లేకుండానే ఎక్కడైనా సోదాలు చేయడానికి, అరెస్టులు చేయడానికి అధికారులకు సైన్యం వీలు కల్పించింది. జైలు నుంచి నేరస్థులను విడిచిపెట్టి సైన్యం హింసను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'మేం స్వతంత్రతను, న్యాయాన్ని కోల్పోయాం. మాకు వెంటనే ప్రజాస్వామ్యం కావాలి. మయన్మార్ ప్రజల ఘోష వినండి' అని నినదించారు. అధికారం నుంచి తొలగించిన ప్రజా ప్రభుత్వానికి తిరిగి అధికారం అప్పగించాలని, నిర్బంధించిన నేతలకు స్వేచ్ఛ కల్పించాలని ఉద్యమకారులు డిమాండు చేస్తున్నారు. ప్రజల ఆందోళనలు పెరుగుతుండడంతో వాటిని అణచివేసేందుకు సైన్యం పలు కుట్రపూరిత చర్యలకు పాల్పడింది. పలుచోట్ల కర్ఫ్యూ విధించారు. నిరసనలు దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా నిలువరించేందుకు సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని మరింత విస్తరింపజేసింది.

సైనిక చర్యను ఖండించిన ప్రపంచ దేశాలు:

ఐక్యరాజ్యసమితి స్పందిస్తూ సైనిక తిరుగుబాటు ఎట్టి పరిస్థితులలో అంగీకరించేది లేదని, ఈ చర్య ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేస్తుందనీ, చట్టబద్ధ పరిపాలనను నీరుకారుస్తున్నదనీ పేర్కొన్నది. రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని పిలుపునిచ్చింది. మయన్మార్‌లో సైనిక కుట్రను జర్మనీ, జపాన్, కెనడా, ఫ్రాన్స్ సహా అన్ని దేశాలూ ఖండించాయి. జి-7 దేశాల కూటమి కూడా ఖండించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైనిక తిరుగుబాటును ఖండించడంతో బాటు ఎన్నికైనా ప్రభుత్వానికి వెంటనే అధికారం అప్పగించాలి. తమ విజ్ఞప్తిని తిరస్కరిస్తే ఆంక్షలు విధించక తప్పదని హెచ్చరించాడు. మయన్మార్‌లో కుట్ర జరిగినప్పటి నుంచి ఆ దేశంపై ఆంక్షలు విధించినా, అంతర్జాతీయంగా ఒత్తిడి తెచ్చినా అక్కడి పరిస్థితి మరింత విషమిస్తుందని చైనా హెచ్చరిస్తూ వస్తోంది. అయితే, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని సైనికాధికారులు కూలదోయడాన్ని ఎవరూ సమర్థించరని వివిధ దేశాలు స్పష్టం చేశాయి. మయన్మార్‌లో సైనిక నియంతల పాలనను చైనా మూడు దశాబ్దాలకు పైగా సమర్థించింది. చైనా అనుసరిస్తున్న ప్రాంతీయ విస్తరణ వాదానికి మయన్మార్, పాకిస్తాన్‌లు మద్దతు ఇస్తున్నాయి. అందువల్ల ఈ రెండు దేశాల్లో ఏం జరిగినా చైనా సమర్థిస్తూ ఉంటుంది.

ముగింపు:

మయన్మార్ విషయంలో భారత్, చైనాలు రెండింటికీ వ్యూహాత్మక ప్రయోజనాలున్నాయి. సైనిక పాలన కాలంలో చైనా ప్రభుత్వం మిలటరీతో సఖ్యత నెరపగా, భారత్ మిలటరీతో మిత్రత్వం సాగిస్తూనే సూకీ ప్రజాస్వామ్య ఉద్యమానికి పరోక్షంగా తోడ్పాటు అందించింది. చొరబాటు గ్రూపుల నుండి తన ఈశాన్య సరిహద్దుల రక్షణలో మయన్మార్ సైన్యం నుండి భారత్ సహాయం పొందుతున్నది. అంతేగాక పలు మౌలిక, అభివృద్ధి ప్రాజెక్టులు నిర్మించింది. ఏసియాన్ దేశాలతో సంబంధాలకు మయన్మార్ ప్రధాన మార్గం కూడా, పశ్చిమ దేశాల్లాగా కఠిన వైఖరి తీసుకుంటే సైన్యం చైనాకు దగ్గరవుతుందన్న ఆందోళన కూడా ఉంది. మరోవైపు అమెరికా సామ్రాజ్యవాదం చైనాకు వ్యతిరేకంగా మయన్మార్‌లో జోక్యం చేసుకుంటుంది. సైనిక కుట్ర విషయంలో భారత్, చైనాల స్పందనను బట్టి బర్మాలో ఎవరి ప్రయోజనాలకు బలం చేకూరిందో అర్థమవుతుంది.

మయన్మార్‌లో సైనిక తిరుగుబాటుపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ నేతల నిర్బంధాన్ని విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించాలని కోరింది. సూకీ సహా నిర్బంధించిన నేతలందరినీ వెంటనే విడుదల చేయాలని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలన్నీ సైన్యంపై ఒత్తిడి తెస్తేనే... అక్కడి ప్రజలకు నైతిక మద్దతునిస్తేనే ప్రజాస్వామ్యం మళ్లీ చిగురిస్తుంది. అందుకోసం అందరూ కృషి చేయాలి. కాబట్టి ఏ దేశ వ్యూహాత్మక ప్రయోజనాలెలా ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అన్ని దేశాలూ తమ వంతు కృషి చేస్తాయని ఆశించుదాం. ముఖ్యంగా మయన్మార్ పయనమెటో చైనా, అమెరికా స్పందనలు, చర్యలను బట్టి ఉంటుంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

వలస రాయలసీమలో మహిళా చైతన్యం-3

బ్రిటిష్ వలస పాలనలో వెలుగుచూడని రాయలసీమ ప్రాంత మహిళల చైతన్యాన్ని సంఘటిత నిర్మాణాలను వివరిస్తున్నారు **డా. షేఖ్. మహబూబ్ బాషా**

స్త్రీ పురుష సమానత్వాన్ని నొక్కి చెప్పడానికై దైవ దృష్టిలో స్త్రీ పురుషులు సమానులు అనే దైవికవాద సమానత్వ సూత్రం పైనే కాకుండా అవకాశం లభించినప్పుడల్లా ప్రతి రంగంలోనూ పురుషులకేమాత్రం తీసిపోకుండా స్త్రీలు రాణించారని చారిత్రకాధారాలు చూపించే చారిత్రకవాదాన్నీ చాకచక్యంగా వాడింది. తనకు పూర్వమూ, తన సమకాలంలోనూ స్త్రీల శక్తి సామర్థ్యాలను నిర్ద్వంద్వంగా నిరూపించడానికి చారిత్రకవాదాన్ని అత్యంత శక్తివంతంగా ఉపయోగించిన అనేక మంది తొలితరం హిందూ స్త్రీవాదుల్లాగానే (భండారు అచ్చమాంబ దీనికి చక్కటి తార్కాణం. ఆమె పుస్తకం అబలా సచ్చరిత్ర రత్నమాలకు రాసిన 'ఉపోద్ఘాతము'లో ఈ దృక్పథం/వ్యూహం విస్పష్టంగా కన్పిస్తుంది. 'స్త్రీలు అబల అనియు, బుద్ధిహీనులనియు, వివేక శూన్యులనియు, సకల దుర్గుణములకు నివాస స్థలమనియు గొందరు నిందింతురు. స్త్రీల పైన మోపబడిన ఈ దోషారోపణ ములన్నియు నబద్ధములనియు, స్త్రీలలో నత్యంత శౌర్య ధైర్యవతులును, అసామాన్య విద్యా విభూషితలును, జ్ఞానవతులును, రాజ్యకార్య ధురంతరత్వము గలవారును, స్వదేశాభిమానినులును, సకల సద్గుణ విభూషితలును, భూర్వముండిరనియు నిప్పుడున్నవారనియు స్థాపించుట నా మొదటి యుద్దేశము...') రామసుబ్బమ్మ కూడా చరిత్రలో వివిధ రంగాల్లో పురుషులతో సమానంగా ప్రతిభ కనబర్చిన 'గొప్ప' స్త్రీల చరిత్రను తడుముతూ ఇలా ప్రశ్నించింది.

'ఇప్పుడు, ప్రాచీన కాలమందును పురుషులతో సమానముగా సభలయందు చర్చించగలిగిన గార్గి, మైత్రేయి, సులభ మున్నగువారు (మా స్త్రీలలో) లేరా? అద్వితీయమైన పాతివ్రత్య ప్రభావము కన్పర్చిన సాధ్వీమ తల్లులెందరు లేరు? రాజ్యములు పాలించి అసమాన పరిపాలనా కౌశల్యము జూపిన రజియా, చాంద్ బీబీ, ఝాన్సీ రాణి మున్నగువారు లేరా? పరిశోధనయందు పేరుగాంచిన మాడం క్యూరి మున్నగువారు లేరా?'

గతకాలపు ఘనకీర్తిని తులుచుకొని చెయ్యెత్తి జై కొట్టమని పురుషులు పిలుపునిచ్చినప్పటికీ వర్తమానంలో స్త్రీలకు వారి హక్కుల్ని వాళ్లకిచ్చే విషయం వచ్చేటప్పటికి ఈ పురుష పుంగవులు స్త్రీల గతకాలపు ఘనకీర్తిని ఏరుదాటాక తెప్పతగిలేసినట్లు తగిలేయగలరని భావించిందో ఏమో రామసుబ్బమ్మ వర్తమానంలోనూ స్త్రీలు సాధిస్తున్న విజయాల్నీ, ముఖ్యంగా దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేస్తున్న బలిదానాల్ని బాగానే గుర్తు చేసింది. అంటే అవకాశాలు కల్పించాలే గానీ స్త్రీలు ఏమాత్రం పురుషులకు తీసిపోరనీ/తీసిపోలేదనీ గతం నుండీ వర్తమానం దాకా ఒక పరంపరగా స్త్రీలు రాజకీయ, సామాజిక, బౌద్ధిక కార్యకలాపాలలో తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి దేశాభివృద్ధికై పాటుపడగల్గుతున్నారనీ, పురుషులు తమ పితృస్వామ్య పసిరిక కళ్లను బాగు చేసుకొని స్త్రీ పురుషుల మధ్య అనివార్యంగా ఏర్పడగల 'సంఘర్షణ'ను నివారించాలనీ పిలుపునిచ్చింది: ఒకవేళ పురుషులు తమ దృక్పథాన్ని మార్చుకోకపోతే 'సంఘర్షణ' తప్పదనీ హెచ్చరించింది.

'నేటి రాజకీయ రంగమున ప్రవేశించి దేశ స్వాతంత్ర్యమునకై అసమాన ధైర్యములను గనపరచి తమ సర్వస్వమును త్యాగము చేసిన సోదరీమణులెందరు లేరు? ఇప్పటికైన స్త్రీల శక్తి సామర్థ్యములను పురుషులు గ్రహించి, స్త్రీ పురుషుల సమానత్వమును ఒప్పుకొని, తమ చర్యలను సవరించుకొని, స్త్రీ పురుషుల మధ్య సంఘర్షణకు అవకాశము కలిగించరని నమ్మెద.'

స్త్రీ పురుష సమానత్వాన్ని బలంగా చారిత్రక, వర్తమాన ఆధారాలతో ప్రతిపాదించిన రామసుబ్బమ్మ పురుషులతో సమానంగా స్త్రీలకూ హక్కులూ, స్వాతంత్ర్యమూ ఉండాలని వాదించింది. స్త్రీ స్వాతంత్ర్యం, సమాన హోదా కల్లోలం సృష్టిస్తుందని పరంపరగా భావిస్తూ వచ్చిన భారతదేశ పితృస్వాములకు రష్యా, టర్కీ చైనాల్లో స్త్రీ స్వాతంత్ర్యం ఆయా దేశాల అభివృద్ధికి ఆటంకం కల్గించకపోగా వాటి పురోభివృద్ధికి ఎలా దోహదకారి అయిందో అంతర్జాతీయ పోలిక దృక్పథంతో నిరూపించి ఏ దేశాభివృద్ధికైనా 'స్త్రీ జన స్వాతంత్ర్యము సర్వశ్రేయోదాయక'మని కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది.

'స్త్రీలకు సాంఘీకముగా, ఆర్థికముగా, రాజకీయముగా స్వాతంత్ర్యముండిన గాని ఏ దేశమును అత్యున్నత పదవినంద జాలదు. స్త్రీలకెక్కువ స్వాతంత్ర్య ముండకూడదనుకొందరు స్వార్థపరాయణుల తలంపొక దురూహ. స్త్రీ స్వాతంత్ర్యము సర్వతోముఖముగ సాగుట బట్టి రష్యా దేశమిప్పుడు అధోగతి పాలైనదని ఎవరు చెప్పగలరు (పితృస్వామ్య మదపిచ్చివాళ్లు తప్ప)? మొన్నటి వరకు పరదాలలో నుండి స్వాతంత్ర్యభేరి మ్రోగించిన స్త్రీ జన మహిమచే టర్కీ దేశమిప్పుడు ప్రపంచమున నొకింత తలయెత్తి తిరుగగల్గినది. స్త్రీ స్వాతంత్ర్య శక్తి మూలముననే కదా, కేవలము దుర్బలయని యనబడుచుండిన చీనా దేశమిప్పుడు జపాను దుర్బల పశుబలమును నెదుర్కొనగలిగినది. కాన స్త్రీజన స్వాతంత్ర్యము సర్వ శ్రేమోదాయకమనుట నిర్వివాదాంశము.'

1940 జనవరిలో ఏలూరులో జరిగిన ఆంధ్ర సేవికల సభలో పురుషుల స్వార్థపరత్వాన్నీ, ఏరుదాటాక తెప్ప తగిలేసే తత్వాన్నీ బట్టబయలు చేస్తూ 'పురుషులు స్త్రీలను సర్వ ప్రయోజనములకై సర్వ విధములా అన్ని శాఖలయందూ ఉపయోగించుకొంటున్నారు. కానీ స్త్రీలకు ప్రాతినిధ్యము ఇచ్చే విషయంలోనూ, వారికి సమానమైన హక్కులు ఇచ్చే విషయంలోనూ పురుషులు స్వార్థపరులుగా ప్రవర్తించారు' అని

విమర్శించింది. స్త్రీల వెనుకబడ్డ తనానికీ, స్వాతంత్ర్య రాహిత్యానికీ, అణచివేతకూ పురుషులను దోషులుగా నిలబెట్టి నిలదీసింది రామసుబ్బమ్మ. తమని తాము 'అధికులమని' భావించి స్త్రీలను 'నీచముగా' చూసే పురుష దురహంకారాన్నీ, స్త్రీల హక్కులకు అడ్డుగోడలుగా తయారైన 'స్వార్థ పరాయణ' తత్వాన్నీ సరిగ్గానే గ్రహించి తూర్పారబెట్టింది.

సంఘంలో స్త్రీల దయనీయ స్థితికి పురుషులను బాధ్యులను చేసి నిలదీసే భావజాలం 1920ల నుండీ వలసాంధ్రలోని స్త్రీలలో కన్పిస్తుంది. క్రమక్రమంగా అది పదునై పితృస్వామ్య వేళ్లను కదిలించే స్థాయి దాకా భావజాల రంగంలో ఎదిగి 'అభ్యుదయవాదు'లైన పురుష పుంగవులను సయితం కలవరపర్చింది. అక్టోబర్ 1929లో ప్రచురితమైన తన 'స్త్రీ స్వాతంత్ర్యము' అనే వ్యాసంలో వి. సరస్వతి పురుష దురహంకారంపై మండిపడింది. 'భారత పురుషుడు మిక్కిలి స్వార్థపరుడు' అని నిర్ద్వంద్వంగా ప్రకటించిన సరస్వతి మాటల్లో –

'మనదేశమునందిప్పుడెల్ల యెడల స్వాతంత్ర్య సంపాదనమునకై ప్రయత్నములు పరుగులు వారుచున్నవి. కాని యవి ఫలసాయుజ్యము నొందుట లేదు. కారణమేమి? భారత జాతిలో సగభాగము ఆక్రమించుచున్న స్త్రీ పరుషునికి బానిసయై యుండియున్నది. బానిసయైయున్న స్త్రీతో కలసిమెలసియుండు భారతీయునకు బానిసత్వము తొలగి స్వాతంత్ర్యము గలుగనేరదు కదా!

స్త్రీ స్వాతంత్ర్య విషయమై చర్చ వచ్చినపుడెల్లా శాస్త్రవిదులు హిందూ ధర్మశాస్త్రమునందెన్నో హక్కులు స్త్రీలకీయబడియున్నవని పెద్ద పెట్టున పేర్కొందురు. కాని పరికించి చూచితిమేని భారత స్త్రీ కిట్టి దాస్యజీవనము తెచ్చిపెట్టినవి మన ధర్మశాస్త్రములేనని నా అభిప్రాయము. మనుధర్మ శాస్త్ర ప్రకారము స్త్రీకి ఆ జన్మాంతము తన దేహము పైననే తనకు స్వాతంత్ర్యము లేదు. చిన్నతనమున తండ్రి, నడిమి కాలమున భర్త, చివరి కాలమున పుత్రుడు – ఆమేకు రక్షకులు. స్త్రీ పరుషులిరువురును మానవ వర్గములో చేరినవారే కదా! అందు ఒకరికి వారి దేహము పైననే స్వాతంత్ర్యము లేదు. ఇక రెండవ వారికి దేశముపై స్వాతంత్ర్యము కావలెనట! ఎంత పొందికలేని మాట!

స్త్రీల పతనావస్థకూ పురుషుల ఆధిపత్యానికీ మూలాల్ని హిందూ ధర్మ శాస్త్రాల్లో చూపెట్టిన సరస్వతి 'పురుషుడు స్వాతంత్ర్యము బడయగోరెనేని ముందు స్త్రీకి స్వాతంత్ర్యమీయవలెను. ఇచ్చునా భగవానుడాతనికి స్వాతంత్ర్యమిచ్చును. ఈ యడా భగవానుడాతనికి స్వాతంత్ర్యమీయడు. ఇది నిశ్చయము' అని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ('భారత పురుషుడు మిక్కిలి స్వార్థపరుడు' అని సరస్వతి చేసిన దాడి సమకాలీనంగా చర్చను లేవదీసింది. బెంగుళూరి నాగరత్నమ్మ సరస్వతిని విమర్శిస్తూ ప్రతి దాడికి పూనుకోవడం విశేషం. 'ప్రస్తుత కాలమున మన స్త్రీలు అభివృద్ధి నందుచున్నారను నాయూహ మీ వ్యాసమును గాంచినతోడనే యంతరించినది' అంటూ భారత పురుషున్ని వెనకేసుకొచ్చింది. 'భారత పురుషుడు తనకాంతను అర్ధాంగిగా మన్నించినాడు; మన్నించుచున్నాడు; మన్నింపగలడు. వేదవాక్యములను తులసీదళములవలెనాతడు తలదాల్చునో అట్టి పురాణములు అతనికి ఇట్లే నడువవలయునని శాసించుచున్నవి. కుటుంబ పోషణమునకు ఆశ్రయింపరాని వారినాశ్రయించి, కొలువరాని వారిని కొలిచి ధనమార్జించి ఇంటిని వస్తు సముదాయముతో పురుషుడు నింపించుచుండ స్త్రీ ఆ ఇంట రాణివలె పరిపాలించుచున్నది కదా! ఇక భారత పురుషుడు స్త్రీకి చేసిన లోటేమి? ఏదియో యొక దుర్మార్గుని మనమునందిడుకొని భారత పురుషులందరిని స్వార్థపరులుగా జమకట్టుట సాహసమేయగును. మగని ప్రయాసము నెరుంగక నూతన వస్త్రాలంకరణముల కొరకాతనిని పీడించి అవి ఆతడు కొనిరానినాడు మొగము గంటువెట్టుకొని పుట్టింటికిపోవు స్త్రీలు కొందరున్నారు. అట్టి వారిని ఉదాహరణముగా తీసికొని భారత స్త్రీలెల్ల నిట్టివారేయనుట లెస్సకాదు. మంచివారు, చెడ్డవారు ఇరు జాతులయందునుగలరు. అట్టిచో ఒక్కరినే దూషించి ఒక్కరినే పొగుడుట ఉచితమైన పద్ధతి కాదు. ఆలోచింపకోరెదను...'

దీనిపట్ల చాలా తీవ్రంగా స్పందించింది సరస్వతి. సుమారు మూడు పుటల తన సమాధానంలో నాగరత్నమ్మ అభిప్రాయాలు బొత్తిగా నిరాధారమైనవని రుజువు పరుస్తూ పురుషులపై మరింత దాడి చేసింది. 'భారత పురుషుడే గాదు, ప్రపంచము నందంతటను పురుషుడు స్వార్థపరుడే' అనీ, 'బ్రాహ్మనేతరులనెట్లు (పూర్వము) బ్రాహ్మణులణగ ద్రొక్కియుండిరో యట్లె స్త్రీలను పురుషులణగద్రొక్కియుండిరి' అనీ, 'హిందూ శాస్త్ర ప్రకారము పురుషుడెన్ని వివాహములైనను చేసికొనవచ్చును. ఎందరి వనితల పొత్తైనను పొందవచ్చును. అది శాస్త్ర విరుద్ధముగాదు. అతడెంత అనాదరణ చేసినను స్త్రీకి మాత్రము మగడే గతి!... ఇట్లు ఒక్క పురుషుల పక్షమునే వహించు శాస్త్రములెంతటి ధర్మశాస్త్రములని నేనాశ్చర్య పడుచున్నాను' అనీ, 'శాస్త్రములు వ్రాసినది పురుషులే కదా! స్త్రీలే శాసనకర్తలై యుండిన ఎడల శాస్త్రములు తారుమారుగనుండుననియే నాయభిప్రాయము' అనీ, 'పురుషులతోడి సమత్వము మనకు లేనేలేదు. పురుషుని గృహమునకు స్త్రీ రాణియనియు, అతని గృహమునకు ఆమె లక్ష్మియనియు రెండు కల్లబొల్లి తీపు మాటలతో నవీన నారీలోకము సమత్వము పొందినట్లుగా తృప్తిపొందజాలదు' అనీ, 'వేద శాస్త్ర పురాణముల నెట్లున్ననేమి? హిందూ సంఘమున మాత్రము స్త్రీలకున్నత స్థానము లేదు. స్త్రీ శిశువు పుట్టుటతోడనే 'ఆడుబిడ్డనా' అనెదరు. ఆ 'నా' దీర్ఘమునందే స్త్రీల దుస్థితి తెలుయుచున్నది' అనీ, 'మనము పాశ్చాత్య సోదరీ రత్నములను మార్గదర్శకులనుగా నుంచుకొనుట మంచిది' అనీ అంటూ నాగరత్నమ్మ వాదనలకు చిల్లులు పెట్టింది).

1933 సెప్టెంబర్ 23న జరిగిన గోదావరి జిల్లా స్త్రీల కాన్ఫరెన్సులో మాట్లాడుతూ సారంగు సీతాదేవి సంఘ సంస్కరణోద్యమం రాజా రాంమోహన్‌రాయ్ కాలం నుండీ కొనసాగుతూండినప్పటికీ ఇప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వకపోవడం పురుషుల ద్వంద్వ ప్రమాణాల వల్లనేననీ, వేదికలెక్కి ఉపన్యాసాలను దంచడంలో చూపించిన శ్రద్ధ కార్యాచరణలో చూపించడం లేదనీ, అందుకే సహృదయులైన కొంతమంది పురుషుల సహకారంతో స్త్రీలే సంఘ సంస్కరణోద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలనీ పిలుపునిచ్చింది. 1939 ఫిబ్రవరిలో ప్రచురితమైన తన వ్యాసంలో 'ఒక అభాగిని' స్వీయానుభవం ఆధారంగా పురుష స్త్రీ విముక్తి వాదుల బండారాన్ని తీక్షణమైన పదజాల ప్రయోగం ద్వారా బయటపెట్టింది స్త్రీ విముక్తి గూర్చీ, స్వాతంత్ర్యం గూర్చీ వేదికలెక్కి ఉపన్యాసాలను దంచే తన సోషలిస్టు అన్నా బాబాయిలు తను ప్రేమించిన కమ్మ కులస్థుడైన అబ్బాయితో వివాహం జరగకుండా ఎలా అడ్డుకున్నారో వివరిస్తూ తీవ్ర నిరసనతో 'ఇదా నవయుగము' అని వ్యంగ్యంగా

ప్రశ్నించింది. 1941 అక్టోబరులో ప్రచురితమైన 'ఇంకెన్నాళ్లు మనకీ బానిసత్వం' అనే వ్యాసంలో 'పురుషులు చేసిన అన్యాయం' అనే ఉపశీర్షికన చెరుకూరు నాగభూషణమ్మ పురుషులు వివిధ మాధ్యమాల ద్వారా ఎంత పకడ్బందీగా స్త్రీలను అణచివేసి బానిసల స్థాయికి దిగజార్చారో కళ్లకు కట్టినట్లు వర్ణించింది. ఆమె మాటల్లో –

'మొదటి నుండీ, అంటే వేదకాలం తర్వాత, పురుషులు స్త్రీలను అణచిపెడుతూ ఉన్నట్లు హైందవ సాహిత్యమంతా, అంటే శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, చివరకు సుమతీ, భాస్కరాది శతకాల వరకూ కూడా స్త్రీలు నీచులు, దాసీలు అనే భావంతోనే ఘోషిస్తూనే ఉన్నారు. బహుకాలం నుంచి వస్తూ ఉన్న ఈ భావం స్త్రీలల్లోనూ, పురుషుల్లోనూ కూడా రక్తంలో జీర్ణించిపోయింది. దానికి ఫలితంగా స్త్రీలకు ఆత్మ గాని, వ్యక్తిత్వం గాని, ఆలోచన గాని ఉన్నట్టుగా కూడా పురుషుల దృష్టిలోనే గాక, స్త్రీల దృష్టిలో కూడా లేకుండబోవడం దుఃఖకరమైన విషయం. ఆర్థిక, సాంఘికాది హక్కులేవీ లేకపోయినా 'లేవే' అనే చింతగూడా నేటి స్త్రీలలో (భారత స్త్రీలల్లో) చాలా తక్కువైపోయింది. తామున్న నీచ స్థితిని కూడా గమనించలేక, పైగా 'ఇంతకంటే ప్రపంచంలో ఇంకేముంటుంది స్త్రీలకూ' అనేటంతటి ఆలోచనలేని పతితావస్థలో ఉన్నారు. ఈ దాస్యభావం ప్రభావం వల్లనే పురుషుని యెదుట నడుచుటకు కాళ్లు ఒనుకుతూ, అడుగులు తడబడుతూ నడుస్తారు... పురుషులు స్త్రీలను తమ చెప్పు చేతల్లో ఉండేటట్లు వేల సంవత్సరాల నుండి వారికి ధర్మాలు, నీతులు, కపటమైనవి కల్పించి, హక్కులు, అధికారాలు ఏ విధమైనవీ లేకుండా జేసి తమ స్వంత పనిముట్ల వలె, తమ దొడ్లో పశువుల వలె వాళ్ల మీద హక్కులు సంపాదించు కున్నారు; బానిసలుగా వినియోగించుకున్నారు; వినియోగించు కుంటున్నారు గూడా'.

ఈ విధంగా తమ అణచివేతకూ, పతనావస్థకూ కారణమైన పురుషుల కుట్రపై స్త్రీలు దాడిచేసినప్పుడల్లా గుమ్మడి కాయల దొంగంటే భుజాలు తడుముకున్నట్లు స్త్రీ అభ్యుదయం కోసం అలమటించిన పురుష సంస్కర్తలు కూడా ఏదో కానిపని జరుగుతోందని కలవరపడుతూ గుండెలు బాదుకోసాగారు. దీనికి చక్కని, చిక్కని తార్కాణం 'గృహలక్ష్మి' స్త్రీల పత్రికా సంపాదకుడైన డాక్టర్ కె.యన్. కేసరి చికాకుతో బొబ్బలు పెట్టడం. 'ఉద్యమాభివృద్ధికి నింద ఎదురు చుక్క' అనే శీర్షికన 1938 మార్చి నాటి 'సంపాదకీయములు'లో కేసరి తన మదిలోని కలవరాన్ని ఈ కింది విధంగా బయటపెట్టారు.

'.... ఒక్కక్కచో ఆంధ్రనారీ రత్నములే తమయభివృద్ధికని (పరుషంగా) పురుష నిందచేయుట తటస్థించుచున్నది. వారలిది యేయుద్దేశముతో చేసినను మంచిదిగాదని ఇదివరకెన్నియోమార్లు గృహలక్ష్మి వాకొన్నది. అదే విషయమును పలుమారు సూచింపవలసి వచ్చినందుకెంతయు విచారము కలుగుచున్నది. ఇటీవల జరిగిన ఒక సమావేశములో డాక్టరు అచ్చమాంబగారు ఉపన్యసించుచు, పురుషులు స్త్రీలను మృగములరీతి దయాదాక్షిణ్యము లేక, హింసకు లోనుజేయుచున్నారనియు, వారిని స్వార్థపరులై దుస్థితి యందుంచి యున్నారనియు నభిప్రాయమును వెల్లడించినటుల వార్తలు దెలుపుచున్నవి. ఇట్టి వార్తలపుడపుడు వినవచ్చుచునేయున్నవి.

తప్పు చేయుట మానవ నైజము. తప్పు చేసినవారికది నెయ్యమున చూపింతుమేని వారని చాలవరకు చక్కదిద్దుకొందురు – తమ యజ్ఞానమునకు, మూర్ఖతకు ఆనందపడు చవటలు తప్ప. అటులగాక తప్పు చేసినారని నిందింతుమేనివారు బాగుపడుటరుదు. పైగా శాంతి వాతావరణమున కేనియు భంగము కలుగును. ఇది వేదాంతము గాదు; నీతి గాదు. ప్రపంచానుభవము....

స్త్రీలను తనతో సమానముగా నాదరింపకపోవుట తనకును తన జాతికిని అభ్యుదయము గాదని పురుషుడెప్పుడు గుర్తెరిగెనో నాటి నుండియే స్త్రీల స్థితి బాగుచేయుటకాతడే ప్రయత్నించుచు వచ్చినాడు. వారియభివృద్ధి మార్గము వారికే నేర్పినాడు. అప్పటి నుండియు స్త్రీ, పురుషులిరువురు ఈ క్షణము వరకు స్త్రీలయభ్యుదయమునకై పాటుపడుచూనేయున్నారు. స్త్రీలకందరికిది నూతనముగాదు.

అట్టిచో పురుషుల తోడ్పాడుతో స్త్రీలు కావలసినయభివృద్ధి పొందగలరు. అదియున నావశ్యకమందురేని తామే స్వంతముగా ప్రత్నింపవచ్చును. ఈ ప్రయత్నములో పురుషులను నిందింపవలసిన యవశ్యకత యెంతమాత్రము లేదని వారెరిగినదే గదా!

నిజమే. ఇదివరకెప్పుడో వారు (పురుషులు) దోషమును చేసిరి. స్త్రీలకు స్వాతంత్ర్యమియ్యక స్వార్థతను గనబరచిరి. అయితే తమ దోషమును వారిప్పుడు గుర్తించిరి. తదేక దృష్టితో దానిని సవరించుకొన ప్రయత్నించు చున్నారు. అంతియగాదు. స్వాతంత్ర్యోద్యమమును ప్రారంభించినది, విడువక సాగించుచున్నది కూడా వారే. అట్టిచో వారిని నిందించిన గలుగుమేలెట్టిది? పరస్పర సహకారముతో నభివృద్ధి పొందుటుత్తమము గాని నిరసనలతో, నిందలతో తమ యుద్యమమును కళంకిత మొనరించుకొనుట మంచిది గాదని మా తలంపు. సోదరీమణు లాలోచింతురుగాక.

కె.యన్. కేసరి లాంటి పురుష పుంగవుడే కాబట్టి ఆంధ్ర పత్రిక సంపాదకుడు కూడా రామసుబ్బమ్మ పురుషులపై ఎక్కుపెట్టిన విమర్శను భరించలేకపోయాడు. ఇంతకూ రామసుబ్బమ్మ ఏమంది? 'ఈ సందర్భమున ఒక విషయము నేను నొక్కి వక్కాణింప వలసియున్నది. పురుషులు స్వార్థపరులై స్త్రీ జనాభ్యుదయమునరికట్ట జూచునంత కాలము కలకంఠికంట కన్నీరొలికిన సిరియింట నుండనొల్లదు సిద్ధము సుమతీ – యన్నట్లు దేశమున సౌభాగ్య సౌఖ్యములు దూరమగును; అట్టి దేశమితర దేశముల కాదర్శప్రాయముగ జేయుట దుస్సాధ్యము.' (ఈ భాగము గృహలక్ష్మిలో ప్రచురింపబడలేదు. రామసుబ్బమ్మ తన ఉపన్యాస వ్రాతపతిని వివిధ పత్రికలకు పంపినట్లుంది: లేదా సమావేశంలో ఉన్న వివిధ పత్రికల ప్రతినిధులు అక్కడే దానిని తీసుకున్నారు. ఈ భాగంతో పాటుగా ఉపన్యాస ప్రారంభంలో రామసుబ్బమ్మ కడప మండల ప్రాశస్త్యాన్ని వివరించిన భాగము కూడా గృహలక్ష్మిలో లేదు; అందుకే ఆంధ్ర పత్రిక నుండి తీసుకున్నాము. కొంతమంది ఈ కాలం నాటి మహిళా నాయకురాల్ల లాగా కాకుండా ఆనాడు స్త్రీలు తమ ప్రసంగ పాఠాలను తయారు చేసుకొని చదివేవారు; వారు ఆశువుగా ప్రసంగించ గల్గినప్పటికీ అలా చేయడం ఉపన్యాసం పట్లా, ఇవ్వబోయే సమాచారం పట్లా వాళ్లకున్న శ్రద్ధను తెలియజేస్తుంది) ఇంతే కాకుండా ఇంతకు ముందు మనం చూసినట్లుగా పురుషుల అహంకారాన్ని తూర్పారబట్టింది. 14వ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభపై రాసిన సంపాదకీయంలో స్త్రీ

జనాభ్యుదయాసక్తి గల 'ఆంధ్ర పత్రిక' సంపాదకుడైన పురుష పుంగవుడు చికాకు పడుతూ ఈ కింది విధంగా అన్నాడు:

స్త్రీని పురుషుడు పైకి రానీయకుండ అణచియుంచుచున్నాడను రోజులు పోయినవనియే చెప్పవచ్చును. స్వాతంత్ర్యమను పదమును స్త్రీ గాని, పురుషుడు గాని సరిగా అర్థముచేసుకున్నపుడట్టి భావము లెవ్వరిలోను గలుగజాలవు. న్యాయశాస్త్రమును, స్త్రీ స్వాతంత్ర్యమును రక్షింపగలదు. భావములు కాలక్రమేణ మారుచుండును. దేశకాలములే మార్పులన్నింటికిని కారణము గాని వ్యక్తులెవ్వరునుగారు. (కాబట్టి విచక్షణారహితంగా పురుషులపై స్త్రీలు నోరుపారేసుకోవడం మంచిది కాదు సుమీ!).

స్త్రీ పురుష సమానత్వ భావనని బలంగా ముందుకు తెచ్చిన రామసుబ్బమ్మ పురుషులతో సమానంగా స్త్రీలకు వారసత్వపు హక్కు ఉండాలని వాదించింది. 1934లో అఖిల భారత మహిళా సభ స్త్రీల విషయంలో ప్రతికూలంగా ఉన్న చట్టాలను పరిశీలించడానికై ఒక అఖిల భారత కమిషన్‌ను ఏర్పాటు చేయవల్సిందిగా కోరింది: ముఖ్యంగా స్త్రీల వారసత్వం, పెళ్లి, రక్షకత్వము మొదలైన విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అభ్యర్థించింది. అఖిల భారత మహిళా సభ కార్యదర్శి అయిన రేణుకారే ద్వారా రచించబడ్డ 'లీగల్ డిసబిలిటీస్ ఆఫ్ ఇండియన్ ఉమెన్: ఎ ప్లీ ఫర్ ఎ కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ' ద్వారా ఈ అభ్యర్థన చేస్తూ కొత్త చట్టాలకై కోరడం జరిగింది. 1937లో జరిగిన ఎన్నికల తర్వాత ఏర్పాటైన నూతన కేంద్ర శాసన సభలో అదే సంవత్సరంలో 'హిందూ స్త్రీల ఆస్తి హక్కు చట్టం, 1937' చేయడం జరిగింది. స్త్రీల ఆస్తి హక్కును కొంతమేర మెరుగుపరిచిన ఈ చట్టం హిందూ వితంతువుల ఆస్తి హక్కుకు మాత్రమే పరిమితమైంది: పురుషుడి ఆస్తికి అతడి వితంతు కోడలు, ముని కోడల్లను వారసులను చేసింది. కానీ కూతుళ్ల విషయంలో మాత్రం అసంతృప్తినే మిగిల్చింది. అందుకే రామసుబ్బమ్మ ఇలా అంది:

'ఇంతవరకు స్త్రీల వారసత్వపు హక్కులు కేవలము అసంతృప్తికరముగా నుండెడివి. దేశ్‌ముఖ్ (ఈ బిల్లును ప్రవేశపెట్టిన జి.వి. దేశ్‌ముఖ్) మొదలగు స్త్రీజన సేవాపరాయణుల కృషివల్ల ఈ హక్కులిపుడొకింత మార్పు జెందినవి. త్వరలో మరొక వారసత్వపు శాసనము వెలువడనున్నది. ఇంతటితో మనము తృప్తి జెందియుండరాదు. పురుషులతో పాటు సమానమగు వారసత్వపు హక్కులు సంపాదించునంతవరకు మనము తీవ్రాందోళన సాగించుచునే యుండవలయును'.

స్త్రీత్వానికి మాయని మచ్చగా భావించబడిన వ్యభిచార వృత్తి నిర్మూలన మహిళోద్యమ అజెండాలోని ఇంకో ప్రధానాంశం. 1909లోనే మైసూరు సంస్థానము దేవదాసీ వ్యవస్థను నిషేధించింది. మద్రాసు శాసన సభలో దేవదాసీ వ్యవస్థను నిషేధించడానికై ముత్తులక్ష్మిరెడ్డి 1927లో ప్రవేశపెట్టిన బిల్లు తర్వాత చట్టరూపం పొందింది. 1931లో ట్రావెన్‌కూరు సంస్థానము దేవదాసీ వ్యవస్థను నిషేధించింది. ఇవన్నీ ఆయా ప్రాంతాలకు మాత్రమే పరిమితమైనవి. అందుకే 'వ్యభిచార నిర్మూలన చట్టములందందు (మాత్రమే) బయలు దేరినవవే గాని యావద్భారత దేశమునకన్వయించు చట్టమింకను వెలువడలేదు. తదర్థమై పుస్తకములు, ఉపన్యాసములు, చలన చిత్రములు మొదలగు వాటి మూలమున ప్రభలాందోళనమును జరుపవలసి యున్నది' అని రామసుబ్బమ్మ మహిళోద్యమ కార్యకర్తలకు పిలుపునిచ్చింది.

కేంద్ర శాసన సభలో శ్రీమతి రాధాబాయి సుబ్బరాయను ప్రవేశపెట్టిన 'బహుపత్నీ నిషేధపు బిల్లు'ను గూర్చి ప్రస్తావిస్తూ 'బహుపత్నీత్వమువలన స్త్రీలకు సంఘటించుచున్న చిక్కులు లోక విదితము. ఈ విషయమున అమోఘకృషి సలుపుచున్న శ్రీ రాధాబాయి సుబ్బరాయను గారి కెంతయు కృతజ్ఞులము. మనమందరము సంపూర్ణ సహకారమొనర్చి వారి కృషిని సఫలీకృత మొనర్చవలసి యున్నది' అని కోరింది. (స్త్రీలకు సంబంధించిన మిగిలిన బిల్లులు/చట్టాల లాగే బహుపత్నీ నిషేధపు బిల్లు గూర్చి కూడా గృహలక్ష్మిలో విస్తృతమైన చర్చ జరిగింది స్త్రీలలో. పలుమంది స్త్రీలు ఈ బిల్లులో ఉన్న లొసుగుల్ని ఎత్తిచూపుతూ సవరణ అవసరమని వాదించారు. ఉదాహరణకు చూడండి: 'శ్రీమతి సుబ్బరాయను గారి బిల్లు', గృహలక్ష్మి, డిసెంబర్ 1938, పు. 715-722. పాలూరి సత్యకుమారి ('పురుషులకే ఉపయోగము'), కాకులపాటి రాధాసుందరమ్మ ('పురుషులకవకాశమీరాదు'), జరుగుమిల్లి రామాబాయమ్మ ('మహోపకారము'), పంగులూరి రాజ్యలక్ష్మమ్మ ('హెచ్చరిక'), డి. భారతీదేవీ ('పురుషులకే వర్తించవలెను'), కందర్వ కమలకుమారి ('సవరించాలి'), భూపతిరాజు వెంకమ్మ('దీర్ఘ రోగములకే వర్తింపవలెను'), పాకల రాజమణెమ్మ ('ఈ చట్టమెలా ఉండాలి?') మొదలైన స్త్రీలు ఈ చర్చలో పాల్గొన్నారు).

స్త్రీల హక్కులకు సంబంధించి కొన్ని విషయాల్లో అభ్యుదయకరంగా ఆలోచించిన రామసుబ్బమ్మ విడాకుల హక్కుల దగ్గరకొచ్చేసరికి మిక్కిలి ఛాందసంగా ఆలోచించింది. బ్రాహ్మ సమాజికులకు మాత్రమే పరిమితమైన ది స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, 1872లో విడాకులకవకాశం కల్పించినప్పటికీ మొత్తం హిందువులకు వర్తించేలాగున 1928లో హరిసింగ్ గౌర్ కేంద్ర శాసన సభలో హిందూ మ్యారేజ్ డిసొల్యూషన్ బిల్‌ని ప్రవేశపెట్టారు. మొదటి నుండీ విడాకుల చట్టానికున్న తీవ్ర విరోధుల కారణంగా గౌర్ ఈ బిల్లును వాపసు తీసుకున్నారు. 1931-33 మధ్య పలుమార్లు మళ్లీ ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ వ్యతిరేకత కారణంగా చట్టరూపం దాల్చలేకపోయింది. తర్వాత జి.వి. దేశ్‌ముఖ్ విడాకుల బిల్లును ప్రవేశపెట్టారు. అప్పటికే, అంటే 1932 లోనే బరోడా స్వదేశీ సంస్థానంలో విడాకుల చట్టమొచ్చేసి ఉంది. దేశ్‌ముఖ్ విడాకుల బిల్లు పట్ల తీవ్ర విముఖతా నిరసనా కనబరిచిన రామసుబ్బమ్మ 'హైందవమత సంప్రదాయము', 'పాతివ్రత్య ధర్మము' మొదలైన సంప్రదాయ పితృస్వామ్య సంకెళ్లలో ఏ విధంగా బందీ అయి ఉండిందో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం:

'శ్రీ దేశ్‌ముఖ్ గారి విడాకుల బిల్లును ఖండింపవలసి వచ్చినందుకు నేనెంతయు విచారించుచున్నాను. హైందవమత సాంప్రదాయమునకు ఈ బిల్లు కేవలము విరుద్ధము. ప్రాచీన హిందూ దేశమున్నచ్చస్థితి నొందియుండెనన్న అందులకు భారత నారీమణుల పాతివ్రత్య ప్రభావమే కదా! పాతివ్రత్యాచరణము సులభ సాధ్యము కానిదయ్యును, హైందవ నారీమణులు యౌదలదాల్చుట వారి పరమధర్మము.

(ఇంకా ఉంది)

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, హిస్టరీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్)

ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

మా పొట్టకొట్టొద్దు, వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు వేలాది మంది ఆందోళనకు దిగారు. జిల్లాల్లో వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డగించినా నాలుగు వేల మందికి పైగా ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తరలివచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ల జెఏసి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని గ్రామీణాభివృద్ధి శాఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాలయాలను ముట్టడించారు. అ ప్రాంతానికి రాకుండా పోలీసులు ముందుగానే బారీకేడ్లు పెట్టారు. జిల్లాల నుండి విడతల వచ్చిన ఫీల్డ్‌అసిస్టెంట్లు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేయడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయిన వక్తలు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం దారుణమని విమర్శించారు. పదిహేనేళ్లుగా ఉపాధి హామి చట్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న ఎఫ్‌ఎలను తొలగించడం అన్యాయమన్నారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

దళిత కుటుంబాల సామాజిక బహిష్కరణ

దళిత కుటుంబాల సామాజిక బహిష్కరణ చేసిన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో దళిత కుటుంబాలకు ఎవరూ సహకరించవద్దని కుల సంఘాల పెద్దలు నిర్ణయిస్తే. మీరేం చేస్తున్నారని సిరిసిల్ల ఎస్‌పిని ప్రశ్నించింది. బాధిత కుటుంబాలు స్థానిక డిఎస్‌పి, సిఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. 130 దళిత కుటుంబాల సామాజిక బహిష్కరణ శీర్షికన ఫిబ్రవరి 1న పత్రికలో వచ్చిన కథనాన్ని సుమోటోగా తీసుకున్న హెచ్ఆర్‌సి ఫిబ్రవరి 4న కేసు నమోదు చేసింది. ఘటనపై ఈ నెల 24లోగా తమకు సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తమను కులం పేరుతో దూషించారంటూ 15 మందిపై దళితులు ఫిర్యాదు చేయగా, దీన్ని మనసులో పెట్టుకొని పలు కుల సంఘాల పెద్దలు గ్రామ కుల పెద్దలు దళిత కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సంస్థ ఉద్యోగులు, కార్మికులు ఫిబ్రవరి 5న ఆందోళనకు దిగారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దంటూ పలు ప్రజా సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు విశాఖపట్నంలోని కూరన్న పాలెంలోని కర్మాగారం నుంచి ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మహా విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వచ్చి మహాధర్నా వేదిక వద్ద నిరసన తెలిపారు. కార్మిక సంఘాలన్నీ ఒక్కటై వేలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. దేశంలోనే నాణ్యమైన ఉత్పత్తులను తయారుచేస్తున్న ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌లకు అప్పగించేందుకు చూస్తుందని ఆరోపించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయజూస్తే ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు.

వ్యవసాయ చట్టాల రద్దు కోరుతూ రహదారుల దిగ్బంధం

కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 6న తెలంగాణలోని జాతీయ రహదారుల దిగ్బంధం కొనసాగింది. అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని పలుచోట్ల రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చక్కా జామ్ జరిగింది. నిజామా బాద్, యాదాద్రి భువనగిరి, ములుగు, వరంగల్ జిల్లా నర్సంపేట, వర్ధన్నపేట, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిర్మల్, సూర్యాపేట, వనపర్తి, గద్వాల తదితర చోట్ల రాస్తారోకోలు జరిగాయి. ఈ ఆందోళనకు సిపిఐ, సిపిఎం, తెలంగాణ జన సమితి, టిడిపి, సంఘీభావం ప్రకటించాయి. కాంగ్రెస్ నగరంలో ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించింది. హయత్‌నగర్‌లోని ఆర్‌టిసి డిపో ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో రహదారిని దిగ్బంధించారు.

అరకు కనుమ దారిలో ప్రమాదం

విశాఖ జిల్లా అరకులోయ నుంచి కిందికి వస్తున్న ఓ టూరిస్టు బస్సు లోయలోకి దూసుకెళ్లడంతో ఓ చిన్నారి సహా నలుగురు చనిపోయారు. 22 మందికి గాయాలయ్యాయి. మృతులు హైదరాబాద్‌లోని షేక్‌పేటకు చెందినవారు. ఈ ఘటన ఫిబ్రవరి 13 రాత్రి బొర్రా, టైడాకు మధ్యన మలుపు వద్ద జరిగింది. బస్సుకు బ్రేకులు ఫెయిల్ కావడంవల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు.

న్యాయవాదుల హత్యకు నిరసన

పోలీసులు, రాజకీయ నాయకులు ఒక్కటై న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణిల హత్యలకు పాల్పడ్డారని హైకోర్టు న్యాయవాదుల జెఏసి ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుండా కాపాడే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. తెలంగాణ కోసం కొట్లాడిన న్యాయవాదులకే రాష్ట్రంలో న్యాయం జరగడం లేదని అన్నారు. న్యాయవాదుల జెఏసి ఆధ్వర్యంలో 'చలో మంథని' కార్యక్రమాన్ని ఫిబ్రవరి 16న నిర్వహించారు. హత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలనీ, స్థానిక సిఐని సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. హత్య కేసుపై సిబిఐతో విచారణ జరిపించాలన్నారు.

ఉద్యోగాలకోసం గళమెత్తిన నిరుద్యోగులు

రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న పలు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ సంయుక్త ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి ఇసిఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

వరవరరావుకు షరతులతో కూడిన బెయిల్

భీమా కోరేగాం కేసులో అరెస్టయిన విప్లవ కవి వరవరరావుకు ముంబై హైకోర్టు ఆరు నెలల పాటు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఫిబ్రవరి 22 మంజూరు చేసింది. ఆయన ఆరోగ్య పరిస్థితిని, వయసును, ఆసుపత్రుల్లోని వసతులలేమిని దృష్టిలో ఉంచుకొని మానవతా దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ ఎస్.ఎస్. షిండే, జస్టిస్ మనీశ్ పటాలేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఎన్ఐఏ దర్యాప్తు చేస్తున్న ఎల్గార్‌పరిషత్ కేసులో అరెస్టై 2018 ఆగస్టు 28 నుంచి కస్టడీలో ఉన్నారు. బెయిల్ గడువు ముగిసేవరకు ముంబైలోని ఎన్ఐఏ కోర్టుపరిధిలోనే ఉండాలని, సహ నిందితులతో మాట్లాడరాదని, కేసుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు ఇవ్వరాదని ధర్మాసనం షరతులు విధించింది.

వీ

పాత్రికేయుల మీద కేసులపై నిరసనలు

ఢిల్లీలో రైతుల ట్రాక్టర్ల ర్యాలీలో జరిగిన హింస ఘటనలో పాత్రికేయులపై కేసులు పెట్టడాన్ని ఎడిటర్స్ గిల్డ్ తీవ్రంగా ఖండించింది. సుమారు 10 చట్టాల కింద ఢిల్లీ, యుపి, మధ్యప్రదేశ్ పోలీసులు పాత్రికేయులపై కేసు నమోదు చేశారు. ఘటనపై తప్పుదోవ పట్టించే ట్వీట్లు పెట్టారనే ఆరోపణతో ఆరుగురు పాత్రికేయులపై కేసులు నమోదు చేశారు. ఇది మీడియాను అణగదొక్కేందుకు, భయపెట్టేందుకు చేసిన ప్రయత్నమేనని ఎడిటర్స్ గిల్డ్ ఆక్షేపించింది. ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ గిల్డ్ డిమాండ్ చేసింది. కార్వాన్ పత్రిక కాంట్రిబ్యూటర్ మణిదీప్ పునియా పైన విద్రోహ చర్యలకు పాల్పడ్డాడంటూ ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన చేసిన నేరమేంటంటే స్థానికుల ముసుగులో గూండాలు సింఘూ బార్డర్‌లోని నిరసన స్థలికి వెళ్లి రైతుల మీద, రైతు నాయకుల మీద రాళ్లు రువ్వారు. ఈ దాడికి పాల్పడిన వారు స్థానికులు కాదు, ఆర్ఎస్ఎస్, బిజెపి పంపిన గూండాలేనన్న సత్యాన్ని పునియా బయటపెట్టినందుకే ఆయన్ను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఢిల్లీలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి ప్రెస్ క్లబ్ వరకు జర్నలిస్టులు జనవరి 31న ర్యాలీ నిర్వహించారు.

భీమా కోరేగాం కేసులోని మేధావులను విడుదల చేయాలి

భీమా కోరేగాం అల్లర్ల కేసులో అరెస్టయిన 16 మంది ఉద్యమకారులు, మేధావులను తక్షణమే విడుదల చేయాలని ఎల్గార్ పరిషత్ డిమాండ్ చేసింది. పుణేలోని గణేష్ కళా క్షేత్రంలో 2021, జనవరి 30న ఎల్గార్ పరిషత్ వార్షిక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో జైలులో ఉన్న ఆనంద్ తెల్తుంబ్డే, సోమాసేన్, హనీబాబు, సుధా భరద్వాజ్, వరవరరావు వంటి 16 మందిని వెంటనే విడుదల చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. 2018లో జరిగిన అల్లర్లతో సంబంధం ఉందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న హిందుత్వ నేతలు శాంభాజీ బిడే, మిలింద్ ఎగ్‌బోటేలను ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడాన్ని ఖండించారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికుల దేశవ్యాప్త నిరసన

కేంద్ర పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2021-22 బడ్జెట్‌లో తెలిపిన ప్రైవేటీకరణ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 3న నిరసన తెలియజేయాలంటూ పది కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక పిలుపునిచ్చింది. కార్మిక స్మృతులను ఉపసంహరించుకునేలా, ఆదాయ, ఆహార మద్దతును అందించేలా కేంద్రం ఒత్తిడి తేవాలని సూచించింది. విద్యుత్తు బిల్లు-2020 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని కార్మిక సంఘాలు, శ్రమ జీవులు నిరసనలో పాల్గొన్నారు.

ప్రజాస్వామిక స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వాలు

ఉత్తరాఖండ్, బిహార్ రాష్ట్రాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు తెలియజేసే నిరసనలు, ర్యాలీల మీద ప్రత్యక్ష ఆంక్షలకు బదులు పరోక్ష నియంత్రణకు సంకల్పించాయి. ప్రభుత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టులు, పెట్రోల్ బంకులు గ్యాస్ ఏజెన్సీల మంజూరు, బ్యాంకు అప్పులు, కాంట్రాక్టు ఉద్యోగాలు తదితర ప్రయోజనాలకు వర్తించే పోలీసు వెరిఫికేషన్ జాబితాను మరింత విస్తరించింది. తమ ధ్రువీకరణ అవసరమని పోలీసులు మరిన్నింటిని నిర్ధారించవచ్చు. రైతులకు మద్దతుగా వేర్వేరు ప్రాంతాల్లో నిరసనలను కూడా ప్రభుత్వాలు జాతివ్యతిరేకత కిందకు తెచ్చే అవకాశం ఉంది. బిహార్ ప్రభుత్వాన్నీ, ముఖ్యమంత్రినీ ఎం.పి, ఎంఎల్ఏలను సామాజిక మాధ్యమాల్లో విమర్శిస్తే దానిని సైబర్ నేరంగా పరిగణించాలని బిహార్ ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది.

దిశా రవి అరెస్టు - బెయిల్

టూల్ కిట్ కేసులో అరెస్టయిన యువ పర్యావరణ కార్యకర్త దిశ రవికి ఢిల్లీలోని పటియాల హౌస్‌లోని ఓ కోర్టు ఫిబ్రవరి 23న బెయిల్ మంజూరు చేసింది. 'పోలీసులు సమర్పించిన ఆధారాలు అరకొరగా ఉన్నాయి. సహేతుకంగా లేవని, ఆమెకు నేర చరిత్ర ఏమీ లేదు. ఖలిస్థాన్ ఉద్యమానికి ఊతమిస్తోందని చెబుతున్న సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) తో సంబంధమున్నట్లు చూసే ప్రత్యక్ష సాక్ష్యాధారాలేవి లేవు, పోయెటిక్ జస్టిస్ ఫౌండేషన్‌తో గానీ, జనవరి 26న చోటుచేసుకున్న హింసతో గానీ ఆమెకు ప్రమేయమున్నట్లు చూపే ఆధారాల్లేవు. హింసను ప్రేరేపించనంతకాలం వాటిని దేశద్రోహం కింద జమకట్టడం సరికాదని అదనపు సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రాణా పేర్కొన్నారు. ఆమెకు బెయిల్ నిరాకరించేందుకు సరైన కారణాలేవీ లేవని లక్ష రూపాయల పూచికత్తుతో బెయిల్ మంజూరు చేశారు. దీంతో దిశ రవి తీహార్ జైలు నుంచి ఫిబ్రవరి 24న విడుదలయ్యారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని ట్రాల్ ప్రాంతంలో జనవరి 29న మిలిటెంట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు చనిపోయారని అధికారులు తెలిపారు.

సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ 'చక్కా జామ్'

కొత్త సాగు చట్టాల రద్దు కోరుతూ జరిగిన 'చెక్కా జామ్' ఉద్యమంభాగంగా ఫిబ్రవరి 6న దేశ వ్యాప్తంగా జరిగింది. పలు జాతీయ, రాష్ట్ర రహదారులు మధ్యాహ్నం మూడు గంటల పాటు స్తంభించాయి. ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ మినహా దేశవ్యాప్తంగా చెక్కా జామ్ నిర్వహించి జాతీయ రహదాలను ర్యాలీలు, ధర్నాలతో దిగ్బంధించారు. కొత్త వ్యవసాయ చట్టాలను రద్దుచేసేవరకు ఢిల్లీ సరిహద్దులను వీడేదిలేదని జాతీయ కిసాన్ యూనియన్ రైతు నేత రాకేశ్ టికాయత్ ప్రకటించారు. సాగు చట్టాల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వానికి అక్టోబర్ 2 వరకు గడువునిస్తున్నట్లు గాజీపూర్ దీక్ష శిబిరం వద్ద విలేకరులతో మాట్లాడారు.

మిజోరాం ప్రభుత్వాన్ని రద్దు చేసిన కేంద్రం

పుదుచ్చేరిలోని నారాయణస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ కూలిపోయింది. అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోలేక నారాయణ స్వామి ప్రజాస్వామ్యాన్ని హత్యచేశారంటూ ఫిబ్రవరి 22న రాజీనామా చేశారు. ఈ ఏడాది కాలంలో రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను పాలనకు అవసరమైన సంఖ్యాబలం లేదంటూ మధ్యప్రదేశ్, మిజోరాం ప్రభుత్వాలను రద్దుచేశారు. రాజస్థాన్‌లో కూడా ఇదే చేశారు కాని సఫలంకాలేదు. ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం గవర్నర్‌ల ద్వారా పాలనాపరమైన సమస్యలు సృష్టించి, ఎంఎల్ఏలను లొంగదీసుకొని ప్రభుత్వాలను కూల్చడం జరుగుతోంది.

వీ

రైతుల ఆందోళనపై ఐరాస మానవహక్కుల సంఘం స్పందన

భారతదేశంలో నూతన వ్యవసాయ చట్టాలకు నిరసనగా ఆందోళన చేస్తున్న రైతులు, భారత ప్రభుత్వం కూడా సంయమనంతో వ్యవహరించాలని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం సూచించింది. అధికారులు, అన్నదాతలు సాధ్యమైనంత వరకు నిగ్రహంతో వ్యవహరించాలని, రైతులు శాంతియుతంగా నిరసన తెలపాలని ఈ సంస్థ ఫిబ్రవరి 5న ట్వీట్ చేసింది. మానవ హక్కులను గౌరవించే విధంగా రెండు పక్షాలూ ఇలా ప్రవర్తించాలని కోరింది. భారత్‌లో రైతుల ఆందోళనపై పాప్ సింగర్ రిహానా, పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ తదితరులతో సహా పలువురు అంతర్జాతీయ సెలబ్రెటీలు అన్నదాతల ఆందోళనకు మద్దతునిస్తూ వ్యాఖ్యలు చేసిన కొన్ని రోజులకే ఐరాస మానవ హక్కుల సంఘం ఈ సూచన చేసింది. అయితే ఇది తమ అంతరంగిక వ్యవహారమని, మా అంతర్గత అంశాల్లో ఇతర దేశాలు, లేదా ఇతరులు జోక్యం చేసుకోజాలరని భారత ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. మా సార్వభౌమాధికారంపై ఇతరులెవరూ దాడి చేయరాదని పేర్కొంది. కాగా ఫిబ్రవరి 6న ఇండియాలో కొన్ని జిల్లాలు మినహా దేశవ్యాప్తంగా రైతులు చక్కా జామ్ ఆందోళన నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటలవరకు అన్ని హైవేలను వారు నిర్బంధించనున్నారు.

మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు

మయన్మార్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తింది. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీతో పాటు ఆ పార్టీకి చెందిన కీలక నేతలను సైన్యం ఫిబ్రవరి 1న గృహనిర్బంధం చేసింది. పాలనను తమ చేతుల్లోకి తీసుకుంటున్నట్లు సైన్యం తమ సొంత మీడియా ద్వారా ప్రకటించింది. దేశంలో ఏడాదిపాటు అత్యవసర పరిస్థితి విధించింది. మయన్మార్ పూర్తిగా ఏడాది పాటు తమ నియంత్రణలోనే ఉంటుందని, ఏడాది తర్వాత ఎన్నికలు నిర్వహించి విజేతకు అధికారాన్ని అప్పగిస్తామని సైన్యం వెల్లడించింది. సైన్యం ప్రధాన నగరాల్లో ఇంటర్నెట్, మొబైల్ సేవలను నిలిపివేసింది. సైన్యం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు, విద్యార్థులు పెద్దఎత్తున యూంగూన్‌లో ఫిబ్రవరి 6న భారీ ప్రదర్శన నిర్వహించారు. మయన్మార్‌లో తిరిగి పౌర పాలన నెలకొనేలా ప్రపంచ దేశాలను ఏకం చేస్తామని ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియా గుటెరస్ తెలిపారు. మయన్మార్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడంతో పాటు, జైలులో ఉన్న వారందరిని విడుదల చేయాలని సూచించారు.

చైనా సరిహద్దు నుంచి వెనుదిరుగుతున్న సైనిక బలగాలు

తూర్పు లదఖ్‌లోని ప్యాంగాంగ్ సరస్సు దక్షిణ ఒడ్డు నుంచి భారత్, చైనా బలగాలు వెనుదిరుగుతున్నాయి. ఈ సరస్సుకు రెండు వైపుల నుండి ఇరు దేశాల బలగాలు వైదొలగుతున్న క్రమానికి సంబంధించి చిత్రాలను, వీడియోలను భారత సైన్య ఫిబ్రవరి 16న విడుదలచేసింది. ఏడాది కాలంగా ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత, ప్రతిష్టంభన నెలకొన్న పరిస్థితుల నుంచి ఇరు పక్షాల బలగాల ఉపసంహరణకు సంబంధించి ఇరుదేశాలు ఒక అంగీకారానికి వచ్చాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఫింగర్ 8కి తూర్పుగా ప్యాంగాంగ్ సరస్సుకు ఉత్తర ఒడున చైనా తన బలగాలను కొనసాగుతాయని, ఫింగర్ 3కి సమీపంలో దాన్‌సింగ్ థాపా వద్ద భారత బలగాలు కూడా శాశ్వత నివాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి.

సిరియాపై ఇజ్రాయిల్ క్షిపణి దాడి

సిరియా రాజధాని డమాస్కస్‌కి సమీపంలో పలు లక్ష్యాలపై ఇజ్రాయిల్ క్షిపణి దాడులు జరిపింది. ఫిబ్రవరి 15 జరిగిన ఈ దాడుల్లో 9 మంది మిలీసియా కార్యకర్తలు మరణించారని సిరియా మానవ హక్కుల పర్యవేక్షక సంస్థ తెలిపింది. డమాస్కస్ చుట్టుపక్కల గల ఆయుధ డిపోలు, క్షిపణి స్టోర్‌లపై దాడులు జరిగాయి. ఫిబ్రవరి 14న అర్ధరాత్రి దాటిన తరువాత ప్రారంభమైన ఈ దాడి గంటన్నరపాటు కొనసాగింది. సిరియా బలగాలు చాలా వరకు క్షిపణులను అడ్డగించాయని, కానీ చాలా క్షిపణులు వాటి లక్ష్యాలపై పడి తీవ్రంగానే నష్టం కలిగించాయని ఆ సంస్థ తెలిపింది.

మోడీ అణచివేత చర్యలను ఖండిస్తూ బైడెన్‌కు లేఖ

భారత్‌లో రైతాంగ పోరాటాన్ని ప్రస్తావిస్తూ దక్షిణాసియా సంతతికి చెందిన 40 మందికి పైగా న్యాయవాదులు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు బహిరంగ లేఖ రాశారు. బారత్‌లో జరుగుతున్న రైతాంగ ఉద్యమాన్ని, దాన్ని అణచివేయడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అమెరికా విదేశాంగ మంత్రి అంటోనీ బ్లింకెన్, ప్రతినిధుల సభ స్పీకర్ తదితరులకు లేఖలు పంపారు. కార్మిక హక్కుల కార్యకర్త నవ్‌దీప్‌కౌర్‌ను జైల్లో వేదింపులకు గురిచేయడం, జనవరి 26న జరిగిన ఆందోళనల్లో రైతు నవ్‌రీత్ మరణించడం, ఆందోళనకారులకు చికిత్సచేసినందుకు డాక్టర్ స్వైమన్ సింగ్‌పై చేయిచేసుకోవడం వంటి మానవహక్కుల ఉల్లంఘన ఉదంతాలను కూడా లేఖలో ప్రస్తావించారు. అమెరికా అధ్యక్ష హోదాలో ఈ చర్యలు ఖండించి, ఐక్యరాజ్య సమితిలో వీటిని లేవనెత్తాల్సిందిగా వారు కోరారు.

జపాన్ తీరంలో తీవ్ర భూకంపం

ఈశాన్య జపాన్ సాగరతీరంలో శనివారం రాత్రి భలమైన భూప్రకంపనలు సంభవించడంతో మళ్లీ సునామీ వస్తుందని ప్రజలు వనికిపోయారు. సముద్ర గర్భాన 60 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నుంచి ఈ ప్రకంపనలు వచ్చినట్లు జపాన్ వాతావరణ సంస్థ (జెఎంఏ) వెల్లడించింది. భూకంప లేఖినిపై మొదట 7.1గా నమోదైన తీవ్రత ఆ తర్వాత 7.3కు పెరిగింది. దీంతో పుకుషిమాలోని దాయ్-ఇచి అణు కర్మాగారాన్ని నిపుణులు అణువణునా పరిశీలిస్తున్నారు. పుకుషిమా, మియాగి తదితర ప్రాంతాలను అవి బలంగానే తాకాయి. టోక్యో నుంచి నైరుతి ప్రాంతం వరకూ వీటి ప్రభావానికి అక్కడక్కడా గోడలు కూలి పలువురు గాయపడ్డట్టు నివేదికలు అందాయని అధికారులు వెల్లడించారు. అర్మేనియా రాజధాని యెరవాన్‌లోనూ శనివారం భూకంపం వచ్చింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 4.7గా నమోదైంది. రాజధానికి 13 కిలోమీటర్ల దూరంలోని కేంద్రం నుంచి ఈ ప్రకంపనలు సంభవించినట్లు ది యూరోపియన్ మెడిటెర్రనీన్ సిస్మోలాజికల్ సెంటర్ వెల్లడించింది.

సాయిబాబాకు మెడికల్ పెరోల్ ఇవ్వాలి

నాగ్‌పూర్ జైలులో ఉన్న ప్రొ. సాయిబాబాకు కరోనా సోకిందని ఫిబ్రవరి 13న బయటపడింది. ఆయన ఇప్పటికే ప్రాణాంతకమైన అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన ఆరోగ్యం ప్రమాదకరమైన పరిస్థితిలో ఉంది కావున దీన్ని పరిగణనలోకి తీసుకొని ఆయనకు మెడికల్ పెరోల్‌పై విడుదల చేసి తగిన వైద్యం అందేలా సహకరించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం. దీర్ఘకాలంగా జైలులో ఉన్నందున ఆరోగ్యం ఐదేళ్ల నుంచి బాగా క్షీణిస్తున్న దృష్ట్యా మెరుగైన వైద్యం అందించాలని లేదా ఆయనకు మెడికల్ బెయిల్ ఇచ్చి సరయిన వైద్యం చేయించుకోవడానికి సహకరించాలని ఇంటర్ నేషనల్ సాలిడారిటీ ఫర్ అకడమిక్ ఫ్రీడం ఇన్ ఇండియా, స్కాలర్స్ అట్ రిస్క్, పెన్ అమెరికా తదితర సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వీ

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 233 - March 2021 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/02/2021 • Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

వీక్షణం రచయితల, అభిమానుల సమావేశం

అందరికీ ఆహ్వానం!

తేది	:	**7 మార్చ్ 2021 ఆదివారం**
సమయం	:	ఉదయం **10** గంటల నుంచి
స్థలం	:	ఎమెస్కో సమావేశ మందిరం, సాధూరాం కంటి ఆస్పత్రి పక్కన, గగన్‌మహల్ రోడ్ లిబర్టీ దగ్గర, దోమల్‌గూడ, హైదరాబాద్.

(భోజన ఏర్పాటు ఉంది)

ప్రాంతీయ, దేశీయ, అంతర్దేశీయ పరిణామాలపై అవగాహనలను, తెలుగు సమాజం తనతో తాను జరుపుతున్న సంభాషణను అక్షరబద్ధం చేస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం ప్రతి సంవత్సరం తన రచయితల మధ్య సంభాషణకు కూడ వేదిక కల్పిస్తున్నది. వీక్షణం అయిదు సంవత్సరాల కింద ఈ వార్షిక రచయితల సమావేశం ప్రారంభించింది. వీక్షణం రచయితలు, పాఠకులు, అభిమానులు, సిబ్బంది కలిసి కూచుని వీక్షణంలో అచ్చవుతున్న రచనల గురించీ, అచ్చు కావలసిన అంశాల గురించీ చర్చించుకోవడానికి, పత్రిక వెలువడుతున్న తీరు గురించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు పంచుకోవడానికి, గతాన్ని సమీక్షించుకుని భవిష్యత్తుకు మార్గాలు వేసుకోవడానికి ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశ పరంపరను మళ్లీ కొనసాగించాలని, మార్చ్ 7 ఆదివారం జరపాలని వీక్షణం కలెక్టివ్ నిర్ణయించింది. ఆరోజు మరే కార్యక్రమాలు పెట్టుకోకుండా హైదరాబాద్‌కు రావలసిందిగా రచయితలకూ, పాఠకులకూ, అభిమానులకూ హృదయపూర్వకమైన విజ్ఞప్తి.

వివరాలకు: కార్యాలయం - 040 6684 3495, (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు)

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.____________________

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao